భారతి

మాసపత్రిక

★

సంపాదకుడు

శివలెంక శంభుప్రసాద్


మార్చి 1963

సంపుటము 40 : : సంచిక 3

విడిపత్రిక వెల ఒక రూపాయి

విషయానుక్రమణిక

మార్చి 1963



డాక్టర్ రాజేంద్రప్రసాద్ అస్తమయం

స్వాతంత్ర్య సమరయోధుడు, అచంచల దేశభక్తుడు, మహాత్మాగాంధి ప్రథమ శిష్యుడు, అజాతశత్రువు, భారత ప్రథమ రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్రప్రసాద్ ఫిబ్రవరి 28 తేదీ రాత్రి పదింబావుకు పాట్నాలోని సదాకత్ ఆశ్రమంలో పరమపదించారు. రాజేంద్రబాబుకు గురువారం మధ్యాహ్నం ఆకస్మికంగా జబ్బు చేసింది. న్యూమోనియా (ఊపిరి తిత్తుల వాపు) వచ్చినట్టు వైద్యులు నిర్ణయించారు. జ్వరం అంతకంతకు అధికమై, శ్వాస ఆడటం కష్టమైపోయింది. అప్పుడే గుండెలో కుడివైపున నొప్పిగా ఉన్నట్టు చెప్పారు. ఆ తర్వాత ముచ్చెమటలు కమ్మటం ఆరంభమై, క్రమేణా పరిస్థితి క్షీణించి, ఆయన కన్ను మూశారు. అవసానదశలో ఆయన పుత్రులు, ఆప్తులు, అంతరంగిక కార్యదర్శి, వైద్యులు

దగ్గర ఉన్నారు. ఇక కొంచెం సేపటికి భౌతికదేహాన్ని చాలిస్తారనగా, రాజేంద్రబాబు తన దగ్గరనేవున్న ప్రముఖ సంస్కృతపండితుడు, జ్యోతిష్కుడు అయిన పండిత విష్ణుకాంత ఝాను చూచి, తమ యజ్ఞోపవీతాన్ని తీసి చెవికి చుట్టవలసిందిగా కోరారు. శ్రీ ఝా సమంత్రకంగా ఆయన అభీష్టాన్ని తీర్చారు. ఆ తర్వాత రాజేంద్ర బాబు కన్ను మూశారు.

పుష్కరంపైగా ఆదర్శ రాష్ట్రపతిగా ఉండిన రాజేన్ బాబు మరణవార్త కొన్ని క్షణాలలోనే దేశమంతటా వ్యాపించింది. రాష్ట్రపతి డాక్టర్ రాధాకృష్ణన్, ప్రధాని శ్రీ నెహ్రూ, శ్రీ చక్రవర్తి రాజగోపాలాచారి, అమెరికా అధ్యక్షుడు శ్రీ కెనడీ ప్రభృతులు తమ ప్రగాఢ సంతాపాన్ని ప్రకటించారు. దేశమంతటా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలకు, విద్యాలయాలకు సెలవు ప్రకటించారు. ప్రభుత్వ భవనాలన్నిటి మీద జాతీయ పతాకను అవనతంగా ఎగురవేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఒక వారం రోజులు "సూతకం" పాటించాయి. ప్రభుత్వం ఆధ్వర్యాన విందులు, వినోదాలు నిలిపివేశారు. దేశం నలుమూలల విచార సూచకంగా హర్తాల్, సంతాప సభలు జరిగాయి. పార్లమెంటు ఉభయ సభలు మాజీ—రాష్ట్రపతికి తమ జోహార్లు అర్పించాయి. అన్ని పక్షాలవారు డాక్టరు రాజేంద్రప్రసాద్ దేశానికి చేసిన సేవను వేనోళ్ల కొనియాడారు. బడ్జెట్టు సమావేశాలలోవున్న రాష్ట్ర శాసన సభలన్నీ సంతాప తీర్మానాలు చేశాయి. రాజేంద్రబాబును రాజర్షిగా, తపస్విగా, పురుషోత్తముడుగా, పరమ కారుణికుడుగా వర్ణించాయి. రాజేంద్రబాబు అస్తమయంతో భారత రాజకీయాలలో గాంధీయుగం అంతమైనదని, స్వాతంత్ర్య సమర సారథుల అండ దండలు తమకు లేకుండా పోయినవని, తాను ఏకాకినైపోయానని శ్రీ ప్రధాని నెహ్రూ చింతించారు.

పాట్నాలో రాజేంద్రబాబు భౌతిక దేహాన్ని తుదిసారిగా సందర్శించడానికి సుమారు రెండు లక్షలమంది ప్రజలు సదాకత్ ఆశ్రమంవద్దకు చేరారు. సరిగా 13 సంవత్సరాలనాడు ఏ మామిడిచెట్ల గుబురుకింద ఆశ్రమవాసులు సమావేశమై, రాష్ట్రపతిగా ఎన్నికైన రాజేంద్రబాబుకు వీడ్కోలు ఇచ్చారో, ఆ గుబురుక్రిందనే పూల సజ్జపై ఆయన భౌతిక దేహాన్ని ఉంచారు. పెక్కుమంది దర్శనానికి వీలుకలిగించారు. ప్రభుత్వ లాంఛనాలతో, లక్షలాది పూల మాలలతో రాజేంద్రబాబు భౌతిక దేహానికి అంత్యక్రియలు జరిగాయి. "రాజేంద్రబాబు అమర్ హై" అనే నినాదాలతో పాట్నా నగరందద్దరిల్లిపోయింది.

రాజేంద్రబాబు అస్తమయంతో భారత రాజకీయ రంగానికి తీరని వెలితి సంభవించింది. అభ్యుదయం అంటే తీవ్రమైన విధానాలను అనుసరించడమని భావించి, వ్యవహరించే ఈ రోజుల్లో భారత ప్రభుత్వ విధానాలను రాష్ట్రపతిగా డాక్టర్ రాజేంద్రప్రసాద్ అభిప్రాయాలు అత్యవసరమైన ప్రభావాన్ని చూపించి, వానిని సమరసమార్గానికి తెచ్చిన సందర్భాలు అనేకం ఉన్నాయి. త్వరపడి, దూరదృష్టి లేకుండా క్లిష్టమైన సాంఘిక, ఆర్థిక శాసనాలు చేసినప్పుడు ప్రజలు పెక్కు రకాలుగా కష్టనష్టాలు అనుభవించగలరని డాక్టరు రాజేంద్రప్రసాద్ నిరంతరం హెచ్చరిస్తూ ఉండేవారు. ప్రజాభిప్రాయానికి ప్రతిబింబమనదగిన తన భావాలను ఎప్పటికప్పుడు ప్రధాని శ్రీ నెహ్రూకు, తదితర కేంద్ర మంత్రులకు తెలియజేస్తూ ఉండేవారు. ప్రజలలోని అన్ని వర్గాల స్వచ్ఛంద సహకారంతో అభ్యుదయమనేది క్రమక్రమంగా సాధించాలని సలహా ఇస్తూ వచ్చారు. ఇందుకు ఉదాహరణగా భూ సంస్కరణల శాసనాలను గురించి, హిందూ ధర్మశాస్త్ర క్రోడీకరణను గురించి, ఆయన చెప్పిన సలహాలను పేర్కొనవచ్చు. ఇలాంటి సలహాలు చెప్పి, దేశ రాజకీయ నాయకత్వాన్ని సక్రమ పద్ధతులలో నడిపించగల దక్షులు భారత రాజకీయరంగంలో ప్రస్తుతానికి లేరనే భావించవచ్చు.

రాష్ట్రపతిగా పన్నెండు సంవత్సరాలు బాధ్యతగల పదవిని డాక్టరు రాజేంద్రప్రసాద్ నిర్వహించినా, భారత రాజ్యాంగ సూత్రాలను, ఆశయాలను కాదని ఆయన వ్యవహరించారన్న సందర్భం ఒకటికూడా లేకపోవడం గమనార్హం. అందుకు ఆయన సౌజన్యమే కారణం. సందర్భాన్నిబట్టి నచ్చజెప్పడానికి సమాధానపరచడానికి ప్రయత్నించేవారు, అవసరమైతే నిర్మొహమాటంగా తన భావాలను ప్రకటించేవారు. రాష్ట్రపతి పదవి, దాని అధికారాలను గురించి పరిశోధనలు జరగాలని ఆయన చేసిన బహిరంగ ప్రకటన దానికి ఉదాహరణగా వుంది.

సమస్యలపట్ల, వ్యక్తులను గురించి భిన్నాభిప్రాయాలు ఉండవచ్చు. దృక్పథాలు వేరు కావచ్చు. కాని, అన్ని వర్గాలతోను సోదర భావ పూర్వకమైన వ్యక్తిగత సంబంధాలను కల్గి ఉండడంవల్లనే రాజేంద్రబాబు "అజాత శత్రువు" అని ప్రసిద్ధి చెందారు. పార్లమెంటరీ ప్రజాస్వామ్యం ప్రవర్ధమానం కావడానికి ఈ లక్షణం అత్యవసరమని నిత్య జీవితంలోను, అధికార హోదాలోను నిరూపించినందునే డాక్టర్ రాజేంద్రప్రసాద్ భారతీయులకు ఆదర్శమూర్తి అయినారు.

అర్థశతాబ్దపు ఆంధ్రకవిత్వము:

ఎంకిపాటలు - కిన్నెరసానిపాటలు

డాక్టర్ శ్రీపాద గోపాలకృష్ణమూర్తి

5

పాటలు బయలుదేరిన కాలంలో అధికార్ల సూర్యనారాయణరావుగారు 'జానకి' అన్న ప్రేయసికీ, ఆమె ప్రియునికీగల అమల ప్రేమను గురించిన ఖండకావ్యాలు 1917 నాటికే రచించి, నండూరి సుబ్బారావుగారికి వినిపించారు. ఆనాటి తెలుగునాటి సాంఘిక పరిస్థితులలో ప్రౌఢ ప్రేయసులు భార్యాభర్తలుకాక, వేరొక జంట ఉండగల అవకాశములులేవు. కనుక శరీరాకర్షణను అతిక్రమించిన ప్రేమను వర్ణించ యత్నించిన అధికార్లవారు జానకినీ, ఆమె భర్తనూ ఎంచుకొని, గీతాలు రచించారు. వీటిలో దాంపత్య ప్రేమ ముగ్ధ మనోహరంగా గోచరిస్తుంది. జానకి చక్కనిది. అయినా నల్లని వరుని పెండ్లాడింది. ఇరుగు పొరుగమ్మలక్కలు అడిగితే 'వలవు నిలిపిన వాడు నలుపైననేమె, నా బాలకృష్ణుండు నలుపైననేమె' అంటుంది. ప్రాణ విభు డెప్పుడో కొంచెము తన ప్రణయాన్ని అలతిచేస్తే, ''అణువు కంటెను అణువుగా నగపడినను, మహితమౌ వానికంటెను మహితమిద్ది'' అంటుందీమె. ఆతడు 'మల్లె నీడలందు ప్రకృతి పరచిన పచ్చికపట్ల మీద విశ్రమింతము జానకీ వెడలి రమ్మం'టాడూ, వియోగ వేళలలో 'మనసు నీ వద్దనే యుండు, తనువె సీతా పోవుచుండె' నంటాడూ, 'పక్షు లెల్ల కులాయముల్ పట్టిపోయి' చల్లగా చందమామ వచ్చినప్పుడు 'ఏమి చేయుచునుండునో యింటిలోన నాదు జానకి నారతనాల బొమ్మ' అనుకుంటాడు. సుందరాంగుల నెందర చూచినా, జానకి ముఖమే అతని మనస్సులో నిలుస్తుంది. 'నానాటి వాక్యంబు గానామృతంబు, నాలేమరాగంబు నా వైభవంబు, నా సీత ప్రణయంబె నాదు ప్రాణంబు' అనుకుంటూ, తిరిగి వస్తాడూ, 'చిరవియోగానలంబున చిత్త మెరియ కనక కనక జానకి నాథుగాంచినపుడు, కనుగొనల బాష్పకణములు గారుచుండ తొగరు పెదవుల చిరునవ్వుతోచు' నతికి. తెలియని ప్రేమయే బలమైనదని చిలుకలు, కనరాని ప్రేమ ఘనమైనదని గాలీ, పాడితే పలుకని ప్రేమయే పావనమని జానకి మనసులో చల్లగా పాడుతుంది. చింత మఱచిన ఈ దంపతులను అధికార్లవారే కాకుండా మనమంతా ఆశీర్వదిస్తాము. రాయప్రోలు, అబ్బూరి కవుల చేతులలో ప్రేమ స్థిరాశ్రయము లేనట్టుగా కొంత కళవిళపడి అధికార్ల చేతిలో స్నిగ్ధమై, దాంపత్య ప్రేమగా నిలిచింది. నండూరివారు అధికార్లకడనే ప్రేమ కవితకు ఓనమాలు నేర్చినారు.

ప్రేమ కవిత్వము చిరకాలంగా పాటలలోనే మెలగినది. హాలుడు ప్రేమపట్ల ప్రాకృతాని కిచ్చిన గౌరవాన్ని పాటకు కూడా పంచవచ్చును. తెలుగు గేయాలు నిన్న మొన్నటివరకూ భక్తికో, ప్రేమకో అంకితాలని మన మందరమూ ఎరుగుదుము. నండూరి సుబ్బారావుగారు తమ ప్రేమ కవితలకు పాటను ఎంచుకోవడము ఇందువల్లనే. విశేషించి జంపెలనే—నాలుగు అయిదక్షరాల ఆవృత్తాల పాదాల—రచనలు ఎక్కువగా వాడడమువల్ల కూడా వారు సంప్రదాయపు ప్రేమ గీతాల దారినే అనుసరించారని చూపిస్తుంది.

గురజాడవారు ముందుకు తెచ్చిన వ్యావహారిక భాషను తెలుగువారు గ్రహించలేకపోయినారు. బసవరాజువారు ఒక్కరు—పద్యాన్నిమించిన ఆవేశాన్ని భరించగలవు కనక— పాటలు స్వీకరించారూ, గురజాడవారిపాటి నియమ పాలనము చేయక 'లోకాని కుత్తుత్త దీపావళీ', 'నట్ట నడి సంద్రాన నావలో వున్నాను' అంటూ మాట్లాడే భాషలో వ్రాశారు. గురజాడవారు స్వగతాలలో 'పంజరంబున నున్న కట్లను పగులదన్నగలేక సుక్కితి' నని విచారించినా, బోధనలో మాత్రము 'పండితుల కష్ట భాషకూ, మాట్లాడుకునే(జీవత్) భాషకూ నడిమి భాషను నిర్మించుకోమనే చెప్పేరుగాని, అచ్చంగా మాట్లాడుకునే భాషనే వాడండి' అని చెప్పలేదు. వారు నీలగిరి పాటలకు వాడుక భాషను వాడలేదు. వారు సంస్కారులు మాత్రమే. విప్లవకారులుకారు. వారి వ్రాతలలోనూ, వ్యాసాలలోనూ, లేని విప్లవాన్ని వారికి నవీనులు అంటగట్టడము స్వార్థము వల్లనే, విస్పష్టిక అవలోకనమువల్ల కా దంటున్నాను. ఈ విప్లవమన్నది గిడుగువారి

వాదాలతోనూ, స్వాతంత్ర్యోద్యమంతోనూ వచ్చింది. గురజాడ వారూ, ఏ బ్రహ్మయ్యశాస్త్రులుగారివంటి పదిమందికో వ్యాకరణ యుక్త భాష వచ్చునన్నారుకాని, గిడుగువారు ఈ పాటికీ ఒప్పుకో లేదు. గురజాడవారు సులభభాషకోసము వాదించారూ, తాము సులభభాష ఇదీ అని వ్రాసి చూపించారు అనేక సాహిత్య శాఖ అలో. గిడుగువారు సారస్వత రచయితలుకారు. వారి భాషా విప్లవ కారులుగనే తీరినారు. 'వారి తప్పు లివి. వీరి తప్పు లివి,' అని మహా సభలలో నిరూపిస్తూ, అందరూ తప్పులు వ్రాశారన్న భావమే వారు నిలిపేరు. అటు రాజకీయరంగంలో 'తెగదెంచం డయ్యా సంకెళ్లను అవియేమైతేనేమి,' అన్న ప్రచారము విజృంభించింది. తెలుగు రచయితలు వ్యాకరణ శృంఖలాలు తెంచే శారు. సహాయ నిరాకరణోద్యమముతో ' మాకొద్దీ తెల్ల దొర తనము' వంటి పాటలు వాడుక భాషలో కుప్పలు తెప్పలుగా వచ్చాయి. పాటలకు మాట్లాడే భాష స్థిరపడిపోయింది. సాహి త్యంలో విప్లవానికి అని మొన అనేటట్లుగా యెంకిపాటలు కర్షకుల పచ్చిభాషలో వచ్చాయి.

బసవరాజువారు 'ఉదాహరణలతో ఖండ కావ్యాన్ని నిర్మించే తంత్రాన్ని' దొంగకృష్ణుడు, వీరుడు, నిరాశ, అధోగతి అన్న ఖండ కావ్యాల్లో సాధించారన్నాను. ఒకటీ, రెండూ మూడు భావాలు పూల రేకులవలె వేరై చుట్టూ అమరితే నాలుగో భావము పూపీఠమై వీటికన్నిటికీ చేరికా భావసుగంధమూకూర్చి, చదువరికి సద్యః పరనిర్వృతి కలిగిస్తుంది. ఈ తంత్రాన్ని నండూరి సుబ్బారావుగారు కూడా ఉపయోగించారు.

చిరంతనమైన పద రచనా పద్ధతీ, ఖండ కావ్య నిర్మాణ తంత్రమూ, దాంపత్య ప్రేమా, కర్షకుల భాషా చేరి నండూరి వారి యెంకిపాటలుగా రూపొందినవి. ఈ పాటల భాష అధికార్ల వారిదికాదు, బసవరాజుదీకాదు. బసవరాజువా రన్నారట యెంకి పాటల భాషను విని, "నీవు నిత్యంవాడే భాష కాదిది. ఈ భాష పాయమున (నీవు) సత్యాన్వేషణ చేయలేవు" అని. కనుక యెంకి పాటల భాష నండూరి సుబ్బారావుగారి స్వంత ఎంపికే. భాష అనగానే మాటలు మాత్రమేకాదుగదా, కర్షకుల వాతావరణము వచ్చిపడింది ఎంకిపాటల్లో. అది కవిగారి కల్పన. యెంకిపాటలు యెంకినాయుడు బావల ప్రణయ లీలలు. జగత్తును నడిపే జ్యోతి—వలపూ, ప్రేమా—ఈ పాటల్ని నడిపింది. యెంకి

కికురింపూ, చేలోరాత్రి ఈ దంపతులూ, యెంకి ముచ్చ ట్లూ, యెంకితో తిరపతీ, ఎంకి మనోరథమూ, నాయుని విర హమూ, యెంకి స్మృతులూ, నాయుని ప్రణయకోపమూ, యెంకి విరహమూ, నాయుని పరిదేవనమూ, భద్రాద్రియాత్రా, నాయుని వూహాగానమూ, కలలూ, ఎంకి వేదనా, తాపమూ, తీర్తమూ, ఎంకికోపమూ, యెంకి విభూతి, యెంకినాయుడు బావల శృంగారమూ, ఇవే, ఇలాటివే యెంకిపాటల వస్తువు. చక్కని (దాంపత్య) ప్రణయాన్ని నిర్దేశించడానికి రచించారీ పాటల్ని. ఈ పాటలు ప్రచురించబడిన కాలానికి వ్యావహారిక భాషను గురించిన వాదోపవాదాలు జోరుగా జరుగుతూండినవి. ఈ పాటలు ఆ భాషలకు లక్ష్యప్రాయములని వాదించి గ్రాంథిక వాదులు సాహిత్య పరిషత్పత్రికలో 'అనర్థక వాఙ్మయము'అని పేరిచ్చి సంతోషించుకున్నారు. ఈ పాటలు గ్రాంథికాంధ్ర మును వెక్కిరించుటకే వ్రాశారన్నట్లుగా చాలామంది జాన పదుల భాషలో తక్కిన పాట లెన్నో వ్రాశారు. రసికాలంకారికులు పంచాగ్నుల ఆదినారాయణశాస్త్రులుగారు వీటిని 'పండిత పామర సాధారణముగా జన సామాన్యము తనిసి'' తనియింపజేయుగల గేయములని ప్రశంసించి పండితుల విమర్శ కెదురొడ్డి నిలి చినారు.

జయదేవుని గీత గోవిందమువంటి దాంపత్య శృంగార జీవన గర్భిత కావ్యములు తెలుగులోలేవు. ప్రబంధాలు పెండ్లిం డ్లతోనూ, వధూవరుల సంధానముతోనూ సరి. జీవిత మన్నదానికా తర్వాతనే ఆరంభమాయెను. ప్రేయసీ ప్రియుల సహజీవన మాధుర్యాన్ని బింబించే కావ్యాలు మనకులేవు. అధికార్ల సూర్య నారాయణరావుగారి ఖండ కావ్యాల అందము దంపతుల ప్రేమే. దాంపత్య జీవనము శారీరక సుఖమాత్రమేకాదనీ, దంపతుల పరస్పరాభిమానము—గృహ జీవనానికి జ్యోతి—శారీరకానంద మును దాటిపోయ్యేటిది అని సూర్యనారాయణ రావుగారు చూపిం చారు. వారు యదాలాభముగా వ్రాస్తూండిన వారుగాని యత్న పూర్వకంగా దాంపత్యజీవనాన్ని అల్లలేదు. బసవరాజువారు 'చిట్టి' ప్రశంసలో పై మాధుర్యాన్ని చూపేరుగాని వారి రచనమూ ప్రయత్న పూర్వకముకాదు. నండూరివారు అటుయెంకి భావాలూ చేష్టలూ, యిటు నాయని చేష్టలూ భావాలూ, వారి విర హాలూ, ప్రణయకోపాలూ, అనురాగమూ, సహజీవనమూ, యాత్రలూ, కలలూ చిత్రించి, దాంపత్యప్రేమకు దేవళాన్ని నిర్మించారు. అప్రాప్త మనోహరుల పరిదేవనమూ, ప్రేమ తపస్సుల గీతాబోధనలూ, దూరానికి నెట్టిన ప్రకృతిసిద్ధమైన దాంపత్యప్రేమ యెంకిపాటల రూపాన్న విరుచుకుపడింది తెలుగు వారిమీద. నండూరి వారివరకూ వరుసగావచ్చిన రాయప్రోలు అబ్బూరి, రామిరెడ్డి, పింగళికాటూరులూ, కృష్ణశాస్త్రి విశ్వ నాథలూ నిసర్గసుందరమైన ఈ అందాన్ని స్పృశించి యుండ లేదు. మీదుమిక్కిలి "ప్రేమనీతోడ నైక్యంబు నొందుకంటె నధిక మధురిమగల దెడబాటునందు"అని ఎడబాటును కీర్తించ

ప్రారంభించినారు కవులు ! పృథివిని పాలించే విష్ణుదేవుని ఊపిరి దాంపత్యప్రేమ. నండూరివారు దానిని పట్టి సానపట్టినారు. దేశమంతటా వ్యాపించాయి యెంకిపాటలు.

యెంకిపాటల వ్యాప్తికదీ కారణము. వాటిభాషలో వింత లేమీలేవు. మొదట అచ్చువేసిన ముప్ఫయిఅయిదు పాటల లోనూ ''కూసింత, పల్లకుందాము, పద్దాక, ఓలెవోపోలి, సూసేతలికి''అన్న ఏ కొద్దిమాటలో మాత్రమేగాని పాటక జనము వాడే జాతీయాలు ఈ పాటల్లోలేవు. భాషమొత్తము మీద నాగరికుల భాషను మార్చి వ్రాసినట్లే ఉన్నది. 'వాన లచ్చిమి, యీశ్వరుడు, సత్తెముగ, కనకాభిసేకాలు, అందాల బరిణె, యీశుడికి, వొన్నెసిన్నెలు, యెంకిపదము, అగపడవ, ఈదినమె'అన్న మాటలే అందుకు ఉదాహరణము, 'దైభము, ఆయింత' అన్నమాటలు మారిపోయిన గ్రాంథికానికి కొండ గుర్తులు. గ్రాంథికము కాకపోవడమువల్ల పండితులూ వ్యాకర ణాభిమానులూ వీటిమీద తిరగబడ్డారుగాని ఈ పాటలలో పాటకజనము భాష ఉద్ధరించ బడిందనికాదు.

పండితులు 'అనర్థక వాఙ్మయము' అని పేరుపెట్టి ఈ పాటలభాషను దుయ్యబట్టినా, సభలలో వీటిప్రచారము ఆగలేదు. యెంకి కులపాలికకాదు స్వైరిణి అని వాదించినా ఆగ లేదు. ''యెంకీనాయుడు బావలకు పెండ్లిఅయిందా ? ఆ ప్రశంస యెక్కడా రాలేదేమి ? తగువోళ్లలో (వారు దంపతులే అయితే) తలవంపులేలా ? యెంకి జామురేతిరియేళ వెళ్లడమేమిచేలోకి? నీతోటె వుంటాను' అంటుందా భార్యఅయితే ?'' అంటూ పరిశోధనలు సాగేయి. యెంకి పాటను సమర్థించినవారు 'వారికి గుళ్లో పెళ్ళయి వుండవచ్చున'నీ 'పెండ్లిమాట లేకుంటేనేమీ' అని వాదించారు. యెంకి వివాహితకాదు, నాయుడికి ఇంకోభార్య లేదు. పాటలలో క్రమంగా వారు దంపతులని తేలిపోతోంది. కనుక యెంకి కులపాలికా ? కాదా ? అన్నది ప్రధానసమస్యకాదు. యెంకి నాయుళ్ల నిసర్గ ప్రణయమే ముఖ్యము. ఆ ప్రణయమే పట్టింది రసిక హృదయాల్ని.

యెంకిపాటలు వచ్చేవరకూ ప్రణయాన్ని ధ్వనించే రచ నలు తెలుగు చదువరులెరుగరు. యెంకి జగన్మోహిని శిష్యురాలు. 'నా కాసి సూస్తాది నవ్వినవ్విస్తాది, యెల్లి మాటాడిస్తె యిసిరికొడతాది' 'కన్ను గిలికిస్తాది నన్ను బులిపిస్తాది' దగ్గిరిన కూర్చుంటె అగ్గిసూస్తాది' 'యెంకిరాలేదని యేటో సూత్తా వుంటె యెనకాలగావచ్చి 'యెవరు' వోరంటాది. నాయుడి మనసుతెలిసి 'నీతోటె వుంటాను నాయుడుబావా, నీ మాటె యింటాను నాయుడుబావా' అంటుంది. నాయుడు వూరువిడిచి వెళ్లినరోజులలో నీళ్లతేబోతూంటే ఆమెకు 'వెనక యెవరో నడిచినట్టుంటుంది. అద్దము చూస్తూంటే ఆమె వెనక యెవరో నవ్వినట్టుంటుంది. ఆమె కళ్లెత్తితేసాలు కనకాభిసేకాలే ! ఆమె సెక్కిట సిన్నిమచ్చ, సెపితే సాలదు లచ్చ. ఒక్క నవ్వే యేలు వొజ్జిర వైడూర్యాలు ! పదిమందిలో నాయుడు యెంకిపాట పాడితే గోడసాటున యెంకి గుటకలేస్తుంది. 'కంటెదర నా కాడ కనిపాపలో నీడ సూసుకొంటూ నొసట సుక్కెట్టుకుం' టుంది. నాయుడు వస్తానన్న వేళకు ఇంటికిరాకపోతే చుక్కని చూస్తుందీ, కొండమలుపు చూస్తుందీ, తోటవెలుపలి గలగల అవుమెడ మువ్వలు మ్రోతావిని ఉలికిపడుతుంది...... యెంకి తనవైపుచూసి నవ్వగానే నాయుడిగుండె గొంతుకలోనకొట్లాడు తుంది. 'రేతిరి పగటేల రెప్పెయ్య కెంకిని సల్లంగ సూడమంటు' సామితో చెప్తాడు నాయుడు. యెంకిదూరాన ఉన్నప్పుడు యెంకి 'తళుకుగేపకాన'నాయుడి తలతిరుగుతుంది. యెంకిమీదనేప్రాణాలు నిలుపుకొని 'అద్దరేతిర్లోనే అడివంత తిరుగుతాడు. 'నా సామ్ము నా గుండెనమిలి మింగినపిల్ల' అని యెంకిని తలుచుకుని విచారిస్తాడు. 'వచ్చినై నే నెటో కొట్లాడుతుంటే, యిరుగమ్మలక్క లతొ నీవా, నా యెంకి, యెక సక్కెమాడుతున్నావా ?'' అని పలవిస్తాడు. యెంకి చుక్కానిపట్టగా తాను గెడవేసి భద్రాద్రి వెళ్లతాడు. 'యెంకి కోపాలొచ్చి యే దేశమో పోయి, కల్లోనా కాపడితె కళ్ళు తెలిసేతలికి తళుకుమని యెంకి వా దరికి రావాలి ! నిదరకాబోసంటు విందలాడాలి !'అని వెర్రి సరదాలు పడతాడు. 'పొరుగమ్మలతో నేను వొరసలాడే యేళ, పాలమెల్లినే పొద్దు పోయి వచ్చేయేళ, సూడాలి నా యెంకిసూపు లాయేళ'అని పాత అనుభవాలు నెమరుకు తెచ్చుకుంటాడు. పీడకలలు కంటాడు యెంకిమీద. జోడావులకు నడుమనిల్చున్నట్లు, రెండు యేళ్లకు నడుమపాలకడవ ఎత్తుకుని వున్నట్లు, పూలు పులుకుతూన్నట్లు, బూరా వాయిస్తున్నట్లు, కొండకోనల నడుమ 'గుడికి దండ మెడు' తున్నట్లు ఊహించుకొంటాడు. యెంకి నాయుళ్ల శంగారము జయదేవుడు రాధాకృష్ణులలో చూపదగినది. 'యెంకి వస్తాదని యెదురూగనేబోయి గట్టుమీదా దానికంటె కాపడగానె కాలు కదపాలేదు నా యెంకి, కరిగి నీరౌతాది నాయెంకి, అటుతిరిగిపడుకున్న యెంకితో అంటాడు నాయుడు : 'ఈ జంట విడిపోయి యే వాడనో తేలి యెంకిపాటిన గానె యెదర నిలిసేదెవరో ? .... నా పక్క తిరిగి మాటాడవా?' అని. 'యెలుగులో నీమీద నిలుపలేనే మనసు, ఆరిపేయవే దీపమూ' అంటాడు. జిమ్ముమని తోట చీకటైపోతే చీకట్లో కళ్లు సిల్లులడ చూడాలిట. అద్ద మెందుకూ అందాలు తెలప డానికీ అవి నాయుడికంటి పాపలో తననీడ చూసుకుంటూ నొసట చుక్కపెట్టుకుంది యెంకి. నండూరి సృష్టించిన సంభోగ శృంగారానికి సూర్యచంద్రులు ఈభావాలు వినండి :

'అద్దములో నా రాజ అంతనీరూపు ! ఇంత ముత్తెములోన ఇమిడె నేలాగు?' అంటుంది ముత్యములో తన నీడ చూసుకునే నాయుడితో యెంకి. నాయుడు జవాబు 'ఎన్ని పొంకాలున్న యెంకివే నీవు! ఇంత నా గుండెలో యిమిడిపోలేదా?' అని. దిలీప మహారాజా సుదక్షిణాదేవీ లేళ్ల కళ్లల్లో ఒకళ్లొకరి కళ్ల సౌందర్యము చూసుకున్నారంటాడు కవి కుల గురువు. మాధవునిచేత 'త్వమసి మమభూషణం త్వమసిమమ జీవనం త్వమసి మమ భవజలధిరత్నం'' అని—మార్ద్వీక మధురమైన శైలిలో అయితేనేం?—వాచ్యంగా చెప్పిస్తాడు జయదేవుడు. పై యూహ తనకు తట్టియుంటే సంతోషించి యుండును ఆ మహాకవి. 'మాట వరస కెపుడైనా అన్నానా' అన్న ఇటీవలి సినీపాటలోనూ, వాచ్య మాధుర్యమూ, చమత్కారమూనే తోస్తున్నాయిగాని, ఈ పాట ఔన్నత్యము కానరాదు.

'యెంకి పాటల గాలి దుమారము'తో యెంకి పాటలు కొంతకాలము ఆగినా, అక్కడా అక్కడా వినవస్తూ 1953 నాటికి మరొక సంపుటంగా వచ్చాయి 'కొత్త పాటలు'. కాలక్రమ రచనను అనుసరించి వ్రాసేటప్పుడు ఈ కొత్త పాటలను గురించిన రాత తరవాత తరవాత చేయవలసినదేకాని, తక్కిన తెలుగు రచనలేవీ ఈ కొత్త పాటల రాకకు కారణముకాక పోవడమువల్ల యెంకి పాటల తరువాయిగావే వీటిని చెప్పవచ్చుననుకున్నాను. తొలి పాటల్లో నండూరి సుబ్బారావుగారు యెంకిని తీర్చి ప్రేమ విద్దెలో ఓనమాలు వర్ణించారు. ఆ పాటలలో యెంకీనాయుళ్ల పరస్పరాశ్రయులే. కొత్త పాటలలో వారు ఇద్దరూ ఇంకా పెరిగేరు. రవల వెలుగుల గంగ రమ్మంటే యెంకి శివమెత్తి తానాలు చేసింది. 'సిరులతో ముత్యాల సరుల చెల్గాటతో సిరిసిరీమువ్వలా చిందులా గంతులా' స్నానాలుచేసి, కాశీదేవుని యెదుట గరవాన నిలిస్తే ఆయన (గంగ తలమీదినుంచి ఎప్పుడు దిగిందీ అని) తల తడుముకొని తానె తబ్బిబ్బులైనాడు. మన యెంకే అని నాయుడున్నూ, చనవులకు పోరాదు. ఆమె యెప్పుడూ కొత్త నవ్వుల కులుకు, కొత్త మెరుపుల తళుకు, 'రెక్కలతో పైకెగిరి సుక్కల్లో దిగు'తుంది. కొండ తిరిగీ, కోన తిరిగీ, గరికపూల కంత మాలకూర్చి, ఆవు నడిగీ, అడివి నడిచీ, గుమ్మపాలూ, కొమ్మతేనె పొందుపరచీ, చాయ వెన్నెలలో లోయ బయళ్లలో పచ్చిక మెత్తల పానుపుపైన 'కోకో' అని అరచి నాయుణ్ణి 'కో' అనమంటుంది. నాయుడి కోపాలకోట రూపుమాపడానికి పూలరంగములో కాలు దువ్వుతుంది. నాయుడు ఏ వూరో పోతే ఎంకే దొరయింట అతని వేషముతో నటిస్తుందట. ఆవుల్ని నాయునివలెనే అదిలిస్తుంది. పసిబాలుణ్ణి అతనివలెనే కసరుతుంది. అయితే, ఈ వింతనుగావి, నాయుడు ఆవంతకంటే నేరమంతా నాయుడిదే పౌరుషము నాయుడిమీదే! ఎంతెంత దూరాన ఎందరిలో నాయుడున్నా మాటిగా అతని వెనక చూసిందా, అతడు తనవైపు తిరగవలసినదే. అయితే యెంకి గర్వపోతుకాదు. రంగుకోక ధరించి రెప్పవాల్చక నిలచి, అలికిడికి వులికిపడి నలుదెసల విరగబడే దీప సుందరి దరిదాపుకు పోలేనని ఆమెకు తెలుసు. ఇక నాయుడో? యెంకి దూరాన ఉన్నప్పుడు ఏటి దరినుండి 'సావాసమింకెవరో సందడెవరో' అనుకుంటాడు. యెంకి అర్థముకాక, ఆమె కళ్లలో చూస్తాడు. కాని, 'ఏకాడొ తలపుంచు' యెంకి పెదవి సివురాకులను కదలింపగోరి అడిగిందె అడుగుతాడు. ఆమె కళ్లను జారు–జంకు కనగోరి పయనాలు నటించి బయలు దేరతాడు. 'ఏ తపసునే జేయవలెనో యెంకితో ఎటుల నేనేక మవగలనో' అని ఆలోచిస్తాడు. 'యిపు డెటులుంటినో చెప్పుకోవోయీ' తని ఆమె అడిగితే 'చిన్నె వన్నెల రామచిలక' లాగున్నావంటాడు. 'ఈ గొంతు పలికేది ఎవరి పదమోయీ' అంటే 'వంక ఒరవులులేని యెంకిదే' పదమంటాడు. వనమంతలో చక్కదన మెవరిదంటే 'పొంకాల పోకిళ్ల ఎంకిదే నిజ'మంటాడు. ఈ పాటలలో తలపోసి, తలపోసి నండూరి సుబ్బారావుగారు యెంకీ నాయుళ్ల అందపు కళలు కలబోసినారు. ఇప్పుడడగండి ''యెంకెవ్వర?''ని. ఆయనే అన్నారు యెంకెవ్వరని లోక మెపుడైన కదిపితే వెలుగు నీడలవైపు వేలు చూపింతు. యెంకి పాటలను ప్రభకట్టి విశ్వ సాహిత్య వీథులుతొక్కి రావచ్చు తెలుగువారు.

ఎరగని ప్రణయపు వెలుగులతోపాటు మనము చూడని మెరుపు టందాలు 'యేటి కడుపున దాగి' నిదరోయేతోటా 'యెలుతురంతా మేసి నెమరేసేయేరూ, యేటి మురగలవలె మరుగు మనసులూ, వీపూదిపెట్టేదీ వీపు తట్టేదీ నీళ్ళు చిలికేది నిలిసి సూసేదీ పడే ఆచ్చెరువూ, యెంకి సరసాలాడ జంకుతావుంటే సూసి, సూడక, కన్నుమూసి తెరిచే గోవు మా లచ్చిమీ, చాటు చూపుల కులికే ఏటి చంద్రుడూ, 'నిలువంత చెవిజేసి పిలుపు వినవోరగిలి కటిబిగించి శిరసు కానిమ్మని విసిరే దీపసుందరీ కానవస్తారు యెంకి పాటలలో. చివరికి ఆటపాటలలోనె మరచిన రాజా చెయ్దములకు కందుటే ఎరుగని తన మనసు గాయము కాగా, అతనికే చేటని కంట నీరు రానీని' యెంకి మ వ మనస్సులో మిగిలిపోతుంది. యెంకి మధురవాణీకాంతల తోబుట్టువు. ఆమెను సృష్టించి మహోజ్జ్వల భావాల్ని నిర్మించి ఆంధ్ర కవిత్వానికి అందపు బరువు చేర్చారు నండూరి సుబ్బారావుగారు. ''ఇంతేనటే సంద్ర మెంతొాయనుకొంటి, మనకు సూరీడుకూ మద్దె నుందేనా?'' అంటుంది యెంకి. ఏమీ అని అడిగితే, ''నా సీతి, నా జాతి నా వారె పోవాడ మరిగి వా మవను సాగరమయ్యె నన్నారు. ఇంతేనటే సంద్రము?'' మెరుపుని వెనక్కి తిప్పి కొట్టారు కవిగారు. యెంకి భావాలకు మణి మకుటమిది.

చూడండి: "నా పేరె నా రాజపాట అమ అపవాదు ఈ జన్మకే కాదు ఎప్పటికిపోదు" సీతమ్మకు సంస్కృత కవులు ఇవ్వలేక పోయిన మధామధుర భావాన్ని ఈ తెలుగుకవి యెంకికి ఇచ్చారు.

యెంకి పాటలకు ప్రారంభములో వాడిన భాషను పరిణతిలో వాడలేదు సుబ్బారావుగారు. మీదు మిక్కిలి బసవరాజువారి శాపము నిజము చేశారా అనిపించేటట్టుగా పచ్చి కర్షక భాషతో ప్రారంభించిన పాటల్ని గ్రాంథిక భాషలో పూర్తి చేశారు. కనుక కర్షక వాతావరణమును స్ఫురింపజేసే ఉద్దేశ్యముతోనే తొలి పాటలలో కర్షకులు వాడే పదాల్ని ప్రయోగించి ఉంటారని ఈ వ్యాసము మొదట్లో అన్నది నిజమే అయిందికదా అంటాను. చివరి పాటలలో యెంకినాయుళ్ళు ప్రేమయోగులు. పరిణతి జెందినవారి మనోరంగాన్ని బొమ్మ కట్టడానికి బరువైన భాష కావలిసి వచ్చిందీ, వాడేరు కవిగారు.

చరణము చరణానికీ, భావము సాంద్రతరముచేస్తూ, చివ్వరిచరణములో వీణ తీగెలమీద గెంతినట్టు జుమ్మనిపించే పాటలే కాకుండా మూడు చరణాల చివరి నాలుగో చరణంతో ఆ మూడు చరణాల భావాల్ని అతికి మొత్తపు ఖండానికి సద్యః పరనిర్వృతీ కావ్యత్వసిద్ధీ చేకూర్చిన రచనలు కూడా ఉన్నాయి ఎంకి పాటల్లో. అందుకే అన్నాను బసవరాజువారి తంత్రము యెంకి పాటల నిర్మాణానికి తోడైంది అని.

శివరాజు సుబ్బారావుగారు అనే బుచ్చిబాబుగారు యెంకిని నాయికనుచేసి, ఒక నాటిక రచించారు. వారి దృష్టికి నాయుడు ప్రేమ యోగానికి ఒక మెట్టు దిగువగా ఉన్నట్టు కనబడింది. యెంకి ప్రేమయోగిని, వివాహము అనే కృతక బంధము ఆమె కిష్టములేదు. నాయుడు ప్రేమికుడే, అయితే సంఘానికి వెరచి పెండ్లి చేసుకుంటే మాత్రమేమి? అని యెంకిని ఒప్పించబోతాడు. ఆమె చిక్కక నిత్య స్వాతంత్ర్య సీమలోనికి—వెలుగు నీడల నడిమికి వెళ్ళిపోతుంది. ఈరచనలో బుచ్చిబాబుగారు యెంకిని పైకెత్తేరు నిజమే. కాని, నాయుణ్ణి జారవిడవడానికి యెంకి పాటలలో కారణము కానరాదే అంటాను.

యెంకిపాటల రచనతో ఆంధ్రకవిత్వము ఆరంభము మంచీ ఆధిష్టించివుంచిన వ్యుత్పత్తిమీదనుండి దిగి ప్రతిభను అధిష్టించిందంటాను. ప్రబంధాల కాలమువరకూ సంస్కృత కావ్యాలూ, పురాణాలూ ఆధారంగా తెలుగులో సాగిన రచన రచయితల పాండిత్యముమీదా, పలుకుబళ్లమీదా సాగిపోయిందిగాని, వారి ప్రతిభను కల్పనా శక్తినీ రేపలేదు. ప్రబంధాలలో ప్రవేశించిన ఉపజ్ఞ కవుల అలంకార కల్పనా శక్తినే పోషించిందిగాని, కథన కౌశలమూ, పాత్ర నిర్మాణశక్తీ పెంచలేదు. పురాణ సామగ్రినే చిట్టు పేకను కలిపినట్లుగా కలుపుతూ, ప్రబంధ కవులు తమ ఇంద్రియాలతోకాక, పూర్వ కవుల కల్పనలు పూర్తిగా కప్పివేసిన భావనతో చూచారు అష్టాదశ వర్ణనా లక్ష్యములను. రాజసభలలో ఆనాడు కవులకు జరిగిన పరీక్షలు వ్యుత్పత్తికే. ఆధునికయుగంలో, అనగా 1910 కి తర్వాత కవుల ప్రతిభకు ఊపిరి తిరిగింది. పూర్వుల కవిత్వములో ప్రతిభ ఏమీ లేదని అనడములేదు నేను. పలుకుబడి వ్యుత్పత్తిది. తుంగభద్రలాగా సెలయేళ్ళలాగా పాండిత్యపు బండల నడుమనుండి ఒదిగి ఒదిగి ఏ కొంచెమో ప్రతిభ ప్రవహించినా, ఉన్నదనడానికేగాని ఊగించడానికి చాలలేదు.—ఆధునికులకు పాండిత్యము తక్కువ. పరిచయమూ ప్రతిభాన్వితమగు ఆంగ్ల కవిత్వముతో. చెప్పిన ఏ కొంచెమైనా చదువరులను పలకరించేది కావలెనని వారి ఆశయము. కనుక సంప్రదాయము మోసుకువచ్చిన నియమాల్ని ఒకటొకటే జారవిడిచారూ, కావ్య రచనను సులభము చేసుకున్నారు. యెంకి పాటలు కొన ఊపిరితో మిగిలివున్న వ్యాకరణ సూత్రాన్ని తెంపేసి రవీంద్రుని ఊర్వశిలాగ ప్రతిభా తరంగ శీర్షముపైన ఒంటికాలుతో నిలబడ్డాయి. ప్రతిభా బలమే యెంకి పాటల జీవము. ప్రతిభ నవనవోన్మేష శాలినియట. యెంకి పాటల ఇతివృత్తము—దాంపత్య జీవనము—తెలుగు కవిత్వానికి కొత్త; భావాలు కొత్త; నాయకీ నాయకులవి, వారి పరిసరాల సౌందర్యానివి, ఆవుని, పూలవి. ప్రకృతి కొత్త: ఏటి నురగలు నాయుడి మనస్సులాగ మరుగుతాయి. ఏటి కడుపులో తోట నిద్ర పోతుందీ, వెన్నెలలో ఏరు రవల వెలుగులు నింపుకుంటుంది. వళ్లంతా చెవి చేసుకుని అలికిడికి ఔనని తల విసురుతుంది దీపశిఖ. ప్రబంధాల వర్ణనలా భావాలా తునకలు వినివిని పండిత కవుల మెదడు పురులు విడదీసి విడదీసి, పద్యగతితో నిస్సహాయంగా ఈడిగిలబడుతూ పోతూండిన తెలుగు చదువరి హృదయానికి చక్కని చల్లని వర్షము యెంకిపాటలు. వీటిలోపద గుంభనపు తాషా మర్పాలూ సమాసాల రామడోళ్ళూ పదాడంబరపు తూతూబాకాలూ వినపడవు. భాషా పాండిత్యపు స్కూ_(స్క్రూవర్కులేని పూరి ఇండ్ల పల్లె ఇది. మోసెనుప్రియురాలు ఆమె వివాహానికి ముందు చెప్పిన అమృతవాక్కులు జ్ఞప్తికి వస్తాయి యెంకిపాటలు తమ సౌందర్యాన్ని గురించి చెప్పుకుంటే. అస్తు. వాటి రచయితకు శుభమగునుగాక.

యెంకిపాటల విజయముతో పాటకు కవిత్వములో చోటు నిలిచింది. పద్యమో పదమో ఏదయితేనేం కవికి? అన్న అమృతవాక్కు అశరీర వాక్కుగా వినబడింది కవులకు. కృష శాస్త్రి గారు "ఆకులో—ఆకునై' అన్న గేయముతో ప్రారంభించారు తన కావ్య రచనను. దువ్వూరి రామిరెడ్డిగారు 'గాలి యడుగుల వెవరి

కోపము ఓ మోహాశీలా' అని అభిసారికను తీర్చిదిద్దేరు. విశ్వనాథ వారు 'ముదురాకు రాలేటి ముదిమి నాళులలోన, తొడిగేటి చివు రాకు తొగరు నంజలలోన ఆకున్నైవా కానుగా, అయినచో సోకేది చిరుగాలి నన్ను' అని పాడుకున్నారు. తురగా వెంకట్రామయ్యగారు 'కష్టాలు వచ్చినా కాలమే తరిమినా కన్నీరు రాల్చకే కలుష మెరుగని చెలీ, ప్రకృతి రంగస్థల ప్రళయ నాటకములో ఆడుటకు జంకేల పాడుటకు భయమేల' నని చెలిని సమాశ్వసించారూ, ''ఈ మాయ లోకమే ఈశ్వరుని రాజ్యమా మాయవాదీ కవీ మాటబొంకోయి; కరకు గత్తులదాల్చు నరహంతకుల ఇంటిబానిసై భూదేవి పడి యుండె నీ వేళ ధనికునకు దైవమే దాసుడయ్యెను జూడు''మని అగ్నికణాలు కురిపించారు. కొడవటిగంటి వెంకట సుబ్బయ్య 'ఆగు మాగుము తెరువరీ ఆయాసభారము నపనయింపుము' అంటూ తమ 'సంధ్యారాగము' సంపుటాన్ని ప్రారంభించారు. గంగి రెద్దు బొంతల సౌందర్యంతోలాగ ఛందోగతి సౌందర్యంతో వూరేగుతూన్న పద్యానికి ధాష్టీకపు పలుకుబడి పోయింది. అంత వరకూ పల్లెపట్టు పదాలను అనుకరించిన వరుసలలో పాటలు వ్రాస్తూండిన కవుకొండలా బాపిరాజా కవులు పాటని అచ్చపు సాహిత్యానికి వాడేరు. గురజాడ కవి సంస్కారరూపంలో ప్రవేశ పెట్టనెంచిన మాత్రాచ్ఛందస్సులూ, వ్యవహార భాషా కవిత్వ సారళ్యమూ అన్నవి ఈ విప్లవంతో వోటు హక్కు సంపాదించు కున్నాయి.

యెంకిపాటలకు వచ్చిన ప్రచారంతో కిన్నెరసాని పాటలు వచ్చాయి. విశ్వనాథవారి పూనికలు పెద్దవి. బైరను పద్ధతినచ్చి కాబోలు ఆంధ్ర పౌరుషం ఖండ కావ్యాలు రచించారు. వాటికి సహాయ నిరాకరణోద్యమ ప్రోద్బలమూ ఉండిందనుకుంటాను. యెంకి పాటల్ని నండూరి సుబ్బారావుగారు సభలలో చక్కగా పాడేవారట. వాటికి వచ్చిన ప్రచారమువల్ల ప్రభావితులై విశ్వనాథవారు కిన్నెరసాని పాటలు రచించారూ, సభలలో పాడేరు. భద్రాచలానికి దిగువన గోదావరిలో దక్షిణపు వైపునుంచి కలిసే ఒక వాగు కిన్నెరసాని. పేరు అతి ఆకర్షవంతంగావుంది. ఈ పేరునుబట్టి కథ అల్లుకుపోయారు సత్యనారాయణగారు. కోడంటి కమును భరించలేక పోయిందట కిన్నెరసాని. ఆమె భర్త తల్లిని యేమనలేకా, కిన్నెరను సముదాయించలేకా, కళవిళ పడ్డాడట. కిన్నెరకు మహాకోపం వచ్చిందట. ఆవేశ హృదయంతో కిన్నెర అడ వులవెంట పరుగెత్తింది. భర్తపోయి ఆమెను పోవద్దని కౌగ లించుకొన్నాడు. ఆమె అతని కౌగిట్లోనే కరిగి నీరై, వాగై ప్రవ హించింది. అతడు శోకించి శోకించి శిల అయినాడు.'' పాట రూపంలో ఈ కథలేదు. ముందుచెప్పేశారు కవిగారు. కావ్యాలక ఈ రీతిగా ముందు కథను చెప్పేసి, తరవాత కావ్య రచన ప్రారం భించడముతో ఖండ కావ్యానికి నిండురూపము రాక, కావ్యఖండము అయిపోతుంది. కళకు ఉపోద్ఘాతము ఎందుకూ?

కిన్నెర నీరైపోయి ప్రవహించి నప్పటినుంచి ఆమె భర్త పడిన పరిదేవనమును 'కిన్నెర పుట్టుక' అనీ, కొంతదూరము 'బిరబిరా నడిచి', 'నడవగా నడవగా' 'పతి రాయివలె మారిపడి యున్న చోటునే విడలేక తిరిగి, జల దేవతలవెంట కిన్నెరసాని సాగిపోవుటను, 'కిన్నెర నడకలు' అనీ, 'కిన్నెర నృత్యము'నూ, 'కిన్నెర సంగీతము'నూ తగని మోహముతో కడలిరాజు పొంగు టనూ 'కిన్నెర దుఃఖము'నూ, 'గోదావరీ సంగమము'నూ పాట లుగా రచించారు కవిగారు. పాటలు మాత్రమే చదివితే అత్తగారి పోరూ, 'అటువంటి కాపురం బిటు చేసికొంటిన'ని కిన్నెర చెందిన వగకు కారణమూ తెలియరావు. పాటలన్నీ జంపె వరుసలలోనే ఉన్నవి. ఈ గుణములో వీటికి యెంకి పాటలతో పోలిక కలదు.

కిన్నెర నీరైపోయినదన్న తర్వాత కవికి, అబ్బూరి రామ కృష్ణారావుగారి నదీసుందరి మనస్సులో మెదిలిలింది కాబోలు. కవేరుడు పెంచిన బిడ్డ కావేరి సహ్యాద్రి నికుంజములో ప్రవే శించి నది యైనది. స్త్రీ రూపంలో వుండినప్పుడున్నూ ఆమె వర్షములో మెదలకే కూర్చోడము వర్ణించి, రామకృష్ణారావు గారు కావ్యార్ధసూచి నమర్చినారు. ఇక్కడ విశ్వనాథవారు కిన్నెర భర్త పరిదేవనములో ''మునుపే నీ కన్నులు గని అనుకొంటిని నీవు నదీవనితవు' అనిపించారూ, ''ఈవు రసాకృతి వగుటను ఈ వైఖరి ప్రవహించితి''వనిపించి శ్లేషించారు. కావేరి సస్య లక్ష్మికి సాయముగా, పాపులకు క్షాళనముగా దేవేరిఅయి వచ్చింది' వనకన్యలు ఆమెకు మంగళ గీతాలు పాడేరు. ఇక్కడ కిన్నెరసానిని పాపము జలదేవతలువచ్చి పదపదమని బలవంతపెట్టి నడిపించారు. కారణము తెలియదుగాని, వనదేవతలూ పూలు కుమ్మరించారు. భూదేవతలు ఎదురుపోయి దీవించారు. వాయు దేవతలు రమ్మని పాట పాడేరు. ఎందుకని? 'ఒయ్యారి నడలతో' వచ్చిందని కాబోలు. కావేరి దేవేరిగా రావడమూ, తరులతాగుల్మములు పూలు జల్లడమూ రమ్యము. కిన్నెర బలవంతపు ద్రవీభవమున కూడ భూదేవతలూ, వాయు దేవతలూ సంతోషించడము రమ్యము కాదంటాను. కిన్నెరసాని పాటలను విశ్వనాథవారు 'ఇదిగో చూడండి నా రచన' అని మనమీద విసరినారా అనిపిస్తుంది. అట్లాటి దానిలో మనకు ఇంపుగూర్చే మెరుగు తక్కువగానే ఉంటుంది, ఆశ్చర్యమేమిటి?

ఉత్తరాల వెనుక

శ్రీ అరిగే రామారావు

అరుణ ఇచ్చిన సర్టిఫికెట్స్, ఎంప్లాయిమెంటు ఎక్స్ఛేంజివాళ్ళ మెమో తీసుకుని, 'కాసేపు వరండాలో కూర్చోండి. మేనేజరుగారు రాగానే పిలుస్తాం,' అన్నాడు ఎకౌంటెంటు.

ఆ కంపెనీలో పనిచేసే ఉద్యోగస్థులు మెల్లగా ఒకళ్ల తర్వాత ఒకళ్లు వస్తున్నారు. వరండాలో కూర్చున్న అరుణను, ఎవరా ఈ కొత్త మొగం అన్నట్లుగా, వింతగా చూస్తూ లోపలికెళ్లుతున్నారు. వీళ్లందరిని ఎంతో కుతూహలంగా పరికిస్తూ, ఎకౌంటెంటు పిలుపుకోసం ఎదురుచూస్తూ కూర్చుంది అరుణ. తనకు కూడ ఈ కంపెనీలో ఉద్యోగంవస్తే తాను కూడ వీళ్లందరిలాగే ఇదే టైంకు రావాలన్నమాట! ఈ కంపెనీలోని టైపిస్టు పోస్టుకు ఎంప్లాయిమెంటు ఎక్స్చేంజివారు తనను డైరక్టు చేశారు. ఈరోజు ఇంటర్వ్యూ. పది గంటలు దాటిపోయినా, ఇంటర్వ్యూ నిమిత్తం వచ్చినది ఇప్పటివరకు తనొకర్తే కనిపిస్తోంది. చూడబోతే పెద్దగా కాంపిటీషను లేనట్లనిపిస్తోందని అనుకుంది. గేటుముందు ఆగిన రిక్షాల్లోంచి దిగి, రిక్షావానికి డబ్బులిస్తున్న యువతిని తన క్లాసుమేటు విజయగా గుర్తించింది అరుణ. విజయ కూడ ఈ కంపెనీలోనే పని చేస్తోందేమో ననుకుంది.

విజయ మెట్లెక్కుతూ, వరండాలో బెంచీమీద కూర్చున్న అరుణను చూచి, గుర్తుపట్టి చిరునవ్వు నవ్వింది. అరుణకు తన స్నేహితురాలిని చూడగానే ప్రాణం లేచివచ్చినంత పనయింది. తనతోపాటు ఫస్టుఫారంనుండి ఎస్సెస్సెల్సీవరకు కలిసి చదువుకున్న తన స్నేహితురాలు విజయ స్కూలు వదిలేసిన రెండు సంవత్సరాల తర్వాత మళ్లీ కనిపించటం, అదే విజయ ఈ కంపెనీలో పని చేస్తుండటం, ఆ కంపెనీలోని ఉద్యోగానికి తను ఇంటర్వ్యూకు రావటం—అరుణ చాల ఆశ్చర్యపడింది—ఆశ్చర్యపడవలసినంత విడ్డూరం ఏమీ లేకపోయినప్పటికి!

కాని, విజయ తనను కౌగలించుకున్నంత పనిచేసి, 'ఎన్ని రోజులకు కలిశాం అరూ! నీవు ఈ కంపెనీలో పని చేస్తున్నావా?' అని అడిగినప్పుడు ఇంకా ఆశ్చర్యపడింది.

ఇలా ఆశ్చర్యంమీద ఆశ్చర్యం వచ్చిపడిన అరుణ ఎలాగో తేరుకుని, 'కాదు, ఈ కంపెనీలో టైపిస్టు పోస్టుకు ఇంటర్వ్యూకు వచ్చాను. మరి నీవు—' అని అడిగిన దానికి—

'నేనూ అంతే'— అని చిరునవ్వుతో సమాధానం ఇచ్చింది విజయ.

"అయితే, ఇంత ఆలస్యం చేశావేం! సర్టిఫికెట్స్ అవి ఎకౌంటెంటుకు యిచ్చిరా. నేను ఇందాకనే ఇచ్చేశాను!"

విజయ, ఆ ఎకౌంటెంటు ఎవడో ఏమిటో నాకు తెలియదు. రావోయ్ ఇద్దరం వెళ్దాం—' అని అరుణను తన కూడ లోపలికి తీసికెళ్ళింది.

హాలులోపలనుండి ఎకౌంటెంటు సీటు దగ్గరకు మెరుపు తీగెల్లాగా నడచిపోతున్న వీళ్లిద్దర్నీ గుమస్తారాయళ్లంతా వళ్లంతా కళ్లు చేసుకుని చూశారు.

'ఈ అమ్మాయిమణుల్లో ఏ మణి మనకు టైపిస్టు కాబోతుందో?', 'ప్రేమారావు' అనబడే రామారావు, తన పక్క సీట్లోని భీమారావునుచూచి అన్నాడు.

భీమారావు ఎకౌంటెంటు టేబులు దగ్గర నిల్చున్న అమ్మాయిల బి. పి. అను (బేక్ పోర్షన్సును) ఒకసారి పరిశీలనా దృష్టితో పరికించి, 'వాలుజడ' అని సీరియస్‌గా అనేసి, మళ్లీ తన ఫైళ్లల్లోకి తలదూర్చాడు.

రామారావు కోపంగా, 'రెండు జడలు—' అన్నాడు.

భీమారావు తల ఎత్తకుండానే, 'వాలుజడ' అని కసిగా అన్నాడు.

'రెండు జడలు'

'వాలుజడ'

'అయితే చిత్తూబోకూ!'

'ఊఁ—చిత్తూబోకూ!'

* * * *

పదకొండున్నర గంటలకు ఇంటర్వ్యూ పూర్తి అయింది. టైపిస్టు వేకెన్సీవుంది ఒకటి. దానికి అరుణ, విజయలు వచ్చారు. ఆ పోస్టు వీళ్లిద్దర్లో ఎవరో ఒకరికి రావటం ఖాయం. పన్నెండో తారీఖు ఉదయం పది గంటలకు ఫలితాలు చెప్తాతాము. ఆరోజు వచ్చి కనిపించండి అన్నారు. మొత్తానికి అరుణ, విజయలు తమకిచ్చిన మేటరును బాగానే టైపు చేశారు. చక్కగా టైపు చేశామనే సంతృప్తి ఇద్దరికీవుంది. మరి ఎవరికి ఆఉద్యోగం ప్రాప్తం ఉన్నదో?

స్నేహితురాళ్ళు ఇద్దరూ స్కూలు సంగతులు, మిగిలిన తమ క్లాసుమేట్సు సంగతులు చెప్పుకుంటూ రోడ్డుమీదకు వచ్చారు.

'మరి నీవు ఎం. బి. బి. యస్. చదివి, డాక్టర్ను అవుతాను అనేదానివిగా విజి!' ప్రక్కగా దూసుకుపోతున్న చిన్న కారును తప్పుకుంటూ అడిగింది అరుణ.

'చదువుదామనే అనుకున్నా. చదివిందిచాలు, కాలేజి చదువులు వద్దేవద్దు' పెళ్లి చేసేయ్యండని అమ్మ గొడవ పెట్టటం మొదలు పెట్టింది. సరే, అమ్మపోరు పడలేక, నాన్నగారు సమ్మంధాలు వెతకటం మొదలుపెట్టారు. లాస్టియర్ జబ్బుచేసి నాన్నగారు పోయారు. ఇప్పుడు మామయ్య సమ్మంధాలు వెతుకుతున్నాడనుకో! ఇంటివద్ద లేజీగా కూర్చోవటమెందుకు—ఈలోపల సరదాగా ఈ ఉద్యోగంవస్తే చేద్దామని వచ్చా. మరి నీ సంగతేమిటోయ్ అరు!' నవ్వుతూ అడిగింది విజయ.

'నా సంగతా? ఏముంది—ఇంట్లో అంతా చదవమన్నారు. కాని, నాకే ఏం చదువులులే అనిపించింది. నో అన్నా. పోనీ, పెళ్ళి చేసికోమన్నారు. నాకే, ఏం పెళ్ళిలెద్దూ అనిపించింది. నవల్సు, పత్రికలూ చదువుతూ కూర్చోటమంటే సరదా. అలా రెండు సంవత్సరాలు గడచిపోయాయి. ఇంట్లో గోళ్లు గిళ్లుకుంటూ, ఆ పుస్తకాలు చదవకపోతే పోని ఏదయినా ఉద్యోగం చెయ్యరాదా అని అన్నయ్య గొడవ. (నవ్వుతూ) ఏం ఉద్యోగంలే అనిపించిందనుకో, అయినా చేసి చూద్దామని, ఉబుసుపోక ఈ ఇంటర్వ్యూకు వచ్చాను.'

'ఊఁ—మొత్తానికి అమ్మాయిగారు వేదాంతంలో పడ్డారన్నమాట. కొంపదీసి ఏం జీవితమో లెద్దూ అని కృష్ణలో దూకేవుసుమా!' చలాకీగా అరుణవీపుమీద చరుస్తూ అంది విజయ.

చురుక్కుమన్న వీపును నిమురుకుంటూ, 'నీవు స్కూలు విజివే! ఏం మార్పులేదు' అంది.

'చాల మార్పు వచ్చిందిగాని, మళ్లీ నిన్ను చూడగానే స్కూలు విజిని అయిపోయా'

విజయ గొంతులో ఏదో క్రొత్తదనం కనిపించిన అరుణ కొంటెగా, 'చాల మారానంటున్నావు. కొంపదీసి అమ్మాయిగారు ప్రే—ప్రే—ప్రే......' అనబోయేదానికి సమాధానంగా—

'ఏయ్—' అంటూ విజయ చేయి పైకెత్తింది.

అలా మాట్లాడుకుంటూ ఇద్దరూ గవర్నరుపేట సెంటరుకు వచ్చారు. అరుణ సత్యనారాయణపురానికెళ్లేమూడో నెంబరు బస్సు, విజయ గుణదలకువెళ్లే రెండోనెంబరు బస్సు కూడబలుక్కున్నట్లు ఎంతసేపటికీ సెంటరువయిపు రాలేదు.

'మీరు నూజివీడునుండి ఎప్పుడు వచ్చేశారు?' విజయ అడిగింది.

'మేమా, మేంవచ్చి సంవత్సరం దాటింది. అన్నయ్యకు ఈ వూరు ట్రాన్స్ఫరయితే అంతా వచ్చేశాం. మరి మీరెప్పుడు వచ్చారు?'

'నాన్నగారు పోయిన తర్వాత, కొన్నాళ్లపాటు వూరు మారితే అమ్మ విచారమన్నా తగ్గుతుందని మామయ్యే ఇక్కడ తనింటికి తీసుకువచ్చాడు'

స్నేహితురాళ్లు ఇద్దరూ ఒకళ్ల అడ్రను ఒకళ్లు తీసుకున్నారు.

'ఎప్పుడయినా మా ఇంటికి రావోయ్ విజి. సరదాగా కబుర్లు చెప్పుకుందాం' అంది అరుణ.

'ఈరోజు ఎనిమిది. పన్నెండో తారీఖున మళ్లీ ఎలాగూ కలుస్తాంగా—'

'కలుస్తాం అనుకో—'

ఇంతలో మూడోనెంబరు బస్సు వచ్చింది. అరుణ బస్సు ఎక్కి వెళ్లిపోయింది. విజయ రెండో నెంబరు బస్సుస్టాపు వయిపు నడిచింది.

మర్నాడు అరుణకు ఒక కవరు వచ్చింది. తనకు ఉత్తరం ఎవరు రాశారా అనుకుంటూ కవరుచింపి ఉత్తరం బయటికి తీసింది.

ప్రియమైన అరూకు!

నిన్న మనం ఇద్దరం కలిసిన తర్వాత, ఇంటికివచ్చి ఈ ఉత్తరం రాస్తున్నాను. ఇప్పుడు నేను రాయబోయే విషయాన్ని నిన్న మనం కలిసినప్పుడు నీతో చెప్పటానికి ఎన్నిసార్లో ప్రయత్నించి చెప్పలేకపోయాను. నోటిదాకవచ్చి ఆగిపోయింది. అర్థంలేని అభిమానం అడ్డువచ్చి పడింది. ఈ అర్థంలేని అభిమానం ఈనాటిదికాదు! స్కూలులో మన స్నేహం మొదలయిననాటినుంచి ఉన్నది. ఈ అభిమానం ఎప్పట్నుంచి ఎలా నాలో తావు జేసుకుందో నాకే తెలియదు. మన ఆడవాళ్లకే ఈ అభిమానాలు ఎక్కువనుకుంటాను.

మన చిన్నప్పుడు, 'పండుగకు మందు సామానులు ఏవేవి కాల్చావు విజి!' అని దీపావళి పండుగ మర్నాడు నీవు అడిగినప్పుడు 'ఏవీ కాలవలేదు—మానాన్న ఏమీ తీసుకురాలేదు. చుట్టుప్రక్క యిళ్లవాళ్ళు కాలుస్తుంటే చూస్తూ కూర్చున్నాను' అని నిజం చెప్పటానికి ఈ అభిమానమే అడ్డు వచ్చేది. 'ఓ! బోలెడు కాల్చాను' అని బొంకేదాన్ని! 'మా నాన్న నా చిన్నప్పుడే చనిపోయాడు. నాన్నవుంటే ఎంత బాగుంటుంది. ఎన్ని

యినా కొనిపెట్టుతాడుకదూ! 'మీ నాన్న మంచివాడేనా, నీకు కొనుక్కోటానికి రోజూ డబ్బు లిస్తాడా?' అని అమాయకంగా నీవు అడిగినప్పుడు—'మానాన్న నాకు డబ్బు లివ్వడు సరికదా నన్ను చూడగానే మండిపోతాడు. రోజూ బాగా త్రాగివచ్చి, మా అమ్మను బండబూతులుతిట్టి, కొట్టి వేధించుకుతింటాడు. మా నాన్ననుచూస్తే నాకు చచ్చే భయం!' అని నిజం చెప్పటానికి ఈపాడు అభిమానమే అడ్డు వచ్చేది. సహజంగా క్రూరుడయిన మా నాన్నను మంచివాడుగా భావించుకుని, మంచి నాన్నలు ఏవేవి చేస్తారో, వాళ్ల పిల్లలను ఎలా చూస్తారో వూహించుకుని, 'మా నాన్న చాల మంచివాడు' నా కవి కొని పెట్టుతాడు—ఇవి కొనిపెట్టుతాడు' అని చెప్పేదాన్ని! తర్వాత అనుకునేదాన్ని—నిజం ఏం చెప్పుతే ప్రాణంపోతుందా? ఎందుకిలా అబద్ధాలు చెప్పటం అని. ఎప్పటికప్పుడు ఇకనయినా నిజం చెప్పాలి అనుకునేదాన్ని. కాని, అదేం ఖర్మో మనం కలుస్తేచాలు గొప్పలు చెప్పుకునేదాన్ని. అందాక ఎందుకు, నిన్నమాత్రం నిన్న నీవు కలిసినప్పుడు, నీవు నా చదువు ప్రసక్తి ఎత్తినప్పుడు నిజం చెప్పుదాం అనుకున్నా. చెప్పలేకపోయాను. మళ్లీ నిన్ను చూడగానే స్కూలు విజీని అయిపోయాను అన్నాను. గుర్తుందా? నా ఈ బలహీనతకు ఏడవాలో, నవ్వాలో నాకే అర్థం కావటం లేదు.

ఇప్పుడుమాత్రం మా యధార్థస్థితి అంతా చెప్పి, నీ సహాయాన్ని అర్థించాలని నిశ్చయించుకునే ఈ ఉత్తరం రాస్తున్నాను. నాకు చిన్నప్పట్నుంచి, నేను డాక్టరుకోర్సు చదివి లేడీ డాక్టరును కావాలని కోరిక ఉండేది. కాని, నాకు ఎస్సెస్సెల్సీ వరకే రాసిపెట్టివుంది. అదిపూర్తి అవటమే గగనమయిపోయింది. అప్పటికే త్రాగుడువల్ల మా నాన్న వళ్లూ, ఇళ్లూ గుల్లయిపోయింది. ఒకసారి వళ్లు తెలియకుండా త్రాగి లారీ కిందపడ్డాడు. వారం రోజులు ఆసుపత్రిలో బాధపడి చనిపోయాడు. నాన్న చనిపోయిన వార్తవిని మామయ్య వచ్చాడు. ఉన్నయిల్లు తెగనమ్మి నాన్న జేసిన అప్పులుతీర్చి అమ్మనూ, నన్నూ తన ఇంటికి తీసుకొచ్చాడు. మేం ఇక్కడకువచ్చి ఆరు నెలలు అయిపోయింది. మామయ్యకూ ఆస్తిపాస్తులు ఏమీ లేవు. ఆయన చేస్తోన్న తొంభై రూపాయల ఉద్యోగమే ఆధారం! చాలీ చాలని జీతం గంపెడు పిల్లలు. దానికితోడు మేం ఇద్దరం వచ్చాం. మామయ్య పిల్లల చాకిరి నేను, ఇంటికి చాకిరి అమ్మ చెయ్యాలి. అత్తయ్య సాధింపులో అమ్మనూ, నన్నూ సూటి పోటి మాటలు అంటుంది. నేను స్కూలుఫైనలు వరకు చదివాను. నాకేదయినా ఉద్యోగంవస్తే మన తిండి మనం తినవచ్చునని అమ్మ ఆశ! మామయ్య మమ్మల్ని ఇక్కడకు తీసికురావటంలో ఉద్దేశం కూడ ఇదే! ఈ పరాయి పంచల బ్రతుకు, మామయ్యకు భారం కావటం, అత్తయ్య ఎత్తి పొడుపు మాటలు, ఈ గొడ్డు చాకిరి——వీటన్నిటిమధ్య మిణుగు మిణుగుమనే ఆశ ఈ ఉద్యోగమే! ఈ వూరు రాగానే ఎంప్లాయిమెంటు ఏక్ఛేంజిలో పేరు రిజిష్టరు చేయించాను. నిన్న ఈ కంపెనీలో టైపిస్టు ఉద్యోగానికి ఇంటర్వ్యూ వచ్చింది. వెయ్యి దేవుళ్లకు మొక్కుకుంటూ, ఈ ఉద్యోగం నాకే రావాలని కోరుకుంటూ వచ్చాను. అంతేగాని, నిన్న నీతో బొంకినట్లు ఇంటివద్ద లేజీగా ఉండట మెందుకని సరదాగా రాలేదు. ఈ ఉద్యోగం కూలిపోయిన మా సంసారాన్ని నిలబెట్టే ఒకే ఒక ఆధారం! మా కడగండ్ల బ్రతుకు కొంచెమయినా మారాలంటే ఈ ఉద్యోగమొక్కటే ఆశ!

ఇదీ నా స్థితి! నీవు నాకంటె ఎంతో అదృష్టవంతురాలివి. అసలు నీకు ఈ దురదృష్టవంతురాలితో పోలిక ఏమిటి? నీవు గొప్పింటి బిడ్డవు. ఏ బాధలులేవు. ఏదో ఉబుసుపోక ఉద్యోగం చెయ్యటానికి వచ్చావు. నీకు ఈ ఉద్యోగం చెయ్యవలసిన ఖర్మలేదు. నా విషయంలో మాత్రం ఇప్పుడీ ఉద్యోగం దొరకకపోతే, మా పరిస్థితి ఎంత విషమంగా పరిణమిస్తుందో నీవే వూహించు. దైవికంగా నా బాల్య స్నేహితురాలివయిన నీవు, ఈ ఉద్యోగపు పోటీలో నాకు ప్రత్యర్థినివిగా నిలబడ్డావు. ఇదీ నా అదృష్టమే అనుకుంటూ. ఎందుకంటే, నీ స్థానంలో వేరే ఇంకొకళ్లువుంటే, వాళ్లను ఇలా అర్థించే అవకాశం నా కుండదు. నీవు ఈ పోటీనుంచి విరమించుకుని, ఒక చితికిపోయిన సంసారాన్ని చక్కపరచిన పుణ్యం కట్టుకో. నీ బాల్య స్నేహితురాలి భవిష్యత్తు అంతా నీ చేతుల్లోనేవుంది. నా కీ సహాయాన్ని తప్పకుండా చేస్తావని నమ్ముతున్నాను. నీ హృదయం నాకు తెలుసు. నీవు తప్పక చేస్తావు. నీవుచేసే ఈ మేలును నా జీవితంలో ఎప్పటికీ మరచిపోను.

మరొకసారి నీ సహాయ సానుభూతులను అతిదీనంగా అర్థిస్తూ— నీ విజి.

* * * *

ఉత్తరం చదవటం పూర్తిఅయేసరికి అరుణ కనుకొలకుల్లో రెండు కన్నీటిబొట్లు నిలిచాయి. భారంగా నిట్టూర్చి విషాదంగా నవ్వుకుంటూ ఆ ఉత్తరాన్ని మడిచింది.

* * * *

'ఏయ్ పెద్దమ్మడు. ఇట్లారావే. నిన్నేనే! ఈ కవరు తీసికెళ్లి ఆ విజయమ్మగారికియ్. ఉత్తరం వచ్చిందని ఇయ్. ఎవరు రాశారా? నాకేం తెలుసు? ఆవిడగారి కెవరున్నారో ఏమో'

సావిట్లోంచి అత్తయ్య అనే మాటలు పూర్తికాకుండానే పెద్దమ్మడు తెచ్చియిచ్చిన కవరు తీసుకుని, వణుకుతున్న చేతు

లతో చింపి, దడదడ కొట్టుకుంటున్న గుండెలతో చదవటం మొదలుపెట్టింది విజయ.

విజీకి—

నిన్ననే కలసి, అంతసేపు అన్ని విషయాలు మాటాడి, మళ్లీ ఇవ్వాళ ఈ ఉత్తరం ఏమిటా అని ఆశ్చర్యపోకు. కొన్ని విషయాలు ముఖతః చెప్పలేక ఇలా ఉత్తరం ద్వారా చెప్పుతున్నాను.

నీకు గుర్తుందా? మనం ఫిప్తుఫారం చతువుకున్నప్పుడు మనస్కూల్లో ఒకసారి 'ఆడవాళ్ల స్నేహాలు' అనే విషయం మీద డిబేటు జరిగింది. ఆ డిబేటులో రాజారావనే స్కూల్ ఫైనల్ స్టూడెంటు మాటాడుతూ.......మగవాళ్లల్లో ఇద్దరు ఫ్రెండ్సు కలిసినప్పుడు ఎంతో సహృదయంతో నిర్మలంగా వున్న సంగతులు ఉన్నట్లుగా మాట్లాడుకుంటారు. అదే ఇద్దరు ఆడవాళ్లు మాటాడుకుంటుంటే వాళ్లమాటల్లో మనకు కనిపించేది గర్వం, డాంబికం, ఒకళ్ల గొప్పలు ఒకళ్లు చెప్పుకోటం — వాళ్ల మాటల్లో 'అతి' మితం లేకుండా ఉంటుంది. ఉదాహరణకి ఒకామె తన స్నేహితురాలు కట్టుకున్న చీరనుచూచి, 'బాగుందోయమ్మ! ఎంతకు కొన్నావ్?' అని అడిగిందనుకోండి. ఆ చీరామె తడుము కోకుండా 'ముప్పైఅయిదు రూపాయిలు' అంటుంది. నిజానికి అది పన్నెండు రూపాయల చీర. పోనీ, అలా అని వూరుకుంటుందా? ఊహుఁ—' అలాటి చీరలు ఇప్పుడు ఎక్కడా దొరకటం లేదు. మద్రాసులోనే ఉంటాయిట. ఇప్పుడు అక్కడా దొరకటం లేదుట. అమధ్య మా నాన్నగారు మద్రాసు వెళ్ళినప్పుడు ఒక కొట్లో చూశారట. ఆ కొట్లో ఇలాటివి రెండు అంటె రెండే ఉన్నాయట. నా కొకటి, మా అక్కయ్య కొకటి అని తీసికొచ్చారు. ఈ చీరలుచూచి, మా వదినె చెల్లెలు వాళ్ల అన్నయ్య మద్రాసు వెళ్తున్నప్పుడు ఇలాటివే తీసుకురమ్మందిట. టాక్సీ మీద వూరంతా తిరిగినా ఎక్కడా దొరకలేదట......' ఇలా చెప్పుకుపోతారు. నిజానికి అది అసలు ఏ వేలంపాట బావలో అయివుంటుంది. మరి ఎందుకు ఆడవాళ్లు ఇలా గొప్పలు చెప్పుకుంటారో అర్థం కాకుండావుంది......అని, అతను అన్నప్పుడు మనమంతా అతణ్ణి తిట్టిపోశాం. కాని, అతను అన్న మాటల్లో నిజంలేకపోలేదని ఇప్పుడనిపిస్తుంది. మన ఆడవాళ్లు ఎందుకు గొప్పలు చెప్పుకుంటారో నాకూ అర్థం కావటంలేదు. ఎవరోదాక ఎందుకు. నా విషయం తీసికో. నామటుకు నాకు చిన్నతనంనుంచి ఇలా గొప్పలు చెప్పుకోటం అలవాటయిపోయింది. మనస్సువిప్పి వున్న యదార్థాన్ని ఎవరికీ చెప్ప బుద్ధేయదు. అందులోనూ, ముఖ్యంగా మన స్నేహితురాళ్ల దగ్గర, ఎవరోదాక ఎందుకు—అన్ని సంవత్సరాలు నీతో కలిసి మెలిసి చదువుకుని ఒకే బెంచిమీద ప్రక్క ప్రక్కన కూర్చుని, స్కూలులో ఉన్నంతసేపు ఒక్కక్షణమయినా ఒకళ్లను ఒకళ్లు విడవకుండా ఉంటూ కూడ, ఏనాడూ నీతో నా యథార్థస్థితి చెప్పలేదు. నేను చెప్పేమాటలనుబట్టి, మా దొక రాయల్ ఫామిలీ అనుకొన్నావుకదూ! అవును పాపం, నేను ఏది చెప్పితే అది నమ్మేదానివి. మాది పెద్ద బంగళా—మాకు కారువుంది—ఇంటినిండా సోఫాలు, కుర్చీలు, బొమ్మలు ఉన్నాయని చెప్పే దాన్నికదూ! నీవు అవన్నీ నిజమే అనుకుని, 'మీఇంటికి నన్నొకసారి తీసికెళ్లవోయ్!' అని అమాయకంగా అడిగేదానివి! నిన్ను మా ఇంటికి తీసికెళ్ళితే, ఎక్కడ మా రంగు బయటపడుతుందోనని ఎప్పటి కప్పుడు ఏదో సాకులు చెప్పేదాన్ని. మాదొక రాయల్ ఫామిలి అనే భ్రాంతిని నీకు కలిగించేదాన్ని. నిజానికి మాది ఒక చితికిపోయిన మధ్యతరగతి కుటుంబం. మా నాన్న నా ఎనిమిదోయేట పోయాడు. ఉన్న రెండు ఎకరాలు అన్నయ్య చదువుకు, నా చదువుకు హరించుకుపోయాయి. ఇప్పుడు అన్నయ్యకు వంద రూపాయల జీతం. ఇందులోనే ముప్ఫై రూపాయల ఇంటి అద్దె ఇస్తూ, ఈ విజయవాడ మహానగరంలో అన్నయ్య, వదినె, అమ్మ, నేను, చెల్లెలు, దాని తర్వాత తమ్ముడు బ్రతకాలి. ఎలా బ్రతకాలో నీవే ఆలోచించు!

నిన్న నీ దగ్గర కోసినట్లు నన్ను ఎవరూ కాలేజి చదువులు చదువ మనలేదు. పెళ్ళి చేసుకోమనలేదు—నేను వద్దు వద్దు అని అనాలేదు. రోజా గడవటమే కష్టమయిపోతుంటే ఇంక పెళ్లేమిటి నా మొగం.......ఎస్సెస్సెల్సీవరకు చదివానుకదా, ఏదయినా ఉద్యోగంచేసి అన్నయ్యకు సహాయంగా ఉందామని ఎంప్లాయిమెంటు ఎక్ఛేంజిలో పేరు రిజిస్టరు చేయించి, టైపు నేర్చుకున్నాను. నిన్న ఇంటర్వ్యూ వచ్చింది. నీవు కలిశావు. నీవు ఇంటివద్ద లేజీగా ఉండటం దేనికని ఈ ఉద్యోగం వస్తే చేయటానికి వచ్చావు. కాని, నేను నా ఆశలు, మా కుటుంబపు భవిష్యత్తు అన్నీ దీనిమీదే నిలుపుకుని వచ్చాను.

నీవు పెట్టి పుట్టిన దానవు. నీకు ఏ చీకూ, చింతాలేదు. అన్ని విధాల ఆదుకోగలిగిన మీ మామయ్య ఉన్నాడు. నీవు ఈ ఉద్యోగమే చేయాలనిలేదు. నీవు ఈ కాంపిటీషనునుండి విరమించుకుంటె నాకీ ఉద్యోగం వస్తుంది. నీ చిన్ననాటి స్నేహితురాలకు ఈమాత్రం సహాయం చెయ్యలేవా? చేస్తావు. తప్పకుండా చేస్తావు. నీ మనసు నాకు తెలుసు.

సిగ్గువిడిచి నీకు ఇంకో విషయం చెప్పుతున్నాను. మేము ఉంటున్న వీథిలో ఒక మిల్లు యజమాని ఉన్నాడు. వాడికి వాణ్ణి

తగలేసేంత డబ్బువుంది. వాడు నామీద కన్నేశాడు. నేను ఏ వైపు ఇనిస్టిట్యూటుకు పోవాలంటె వాడి ఇంటిముందు నుంచే పోవాలి. వచ్చేటప్పుడు, పోయేటప్పుడు నా వంక కళ్లతో త్రాగేసేటట్లుగా చూస్తాడు. మా బీదస్థితి అంతా తెలుసుకుని, ఒకసారి ఒక ముసలమ్మతో—నేను వాడికోర్కె తీరిస్తే, నేను కోరినంత డబ్బు ఇస్తానని కబురు పంపాడు. ఆ కబురు తెచ్చిన ముసలిదాన్ని నేను నానా తిట్లు తిట్టి, ఈ తడవ మళ్లీ ఇలాటి కబుర్లుతెస్తే మా అన్నయ్యతోచెప్పి ప్రాణం తీయిస్తాను అని బెదిరించాను. చూడు విజీ! మేం బీదవాళ్లమనేగా ఆ వెధవ, నేను డబ్బుకు కక్కుర్తి పడ్తాను అని అంత ధైర్యంగా కబురు పంపాడు!

ఈ బాధలు చాలవన్నట్లుగా అమ్మకు ఈమధ్య టి. బి. వచ్చింది. వదినెకు వంట్లో బలం చాలక, బలహీనంవల్ల కడుపు తర్వాత కడుపుపోతోంది. రోజు రోజుకు దిగజారుతున్న మా కుటుంబంకోసం, ఆఖరుకు ఆ మిల్లు యజమానిగాడు చూపిన ఆశకు కక్కుర్తి పడవలసిన రోజు వస్తుందేమోననిపిస్తోంది విజీ! వద్దు విజీ......వద్దు......అలాటిరోజు రావద్దు. నా కీ ఉద్యోగంవుంటె మాకు ఇంకే బాధ ఉండదు. నాకీ విపత్కర పరిస్థితుల్లో సహాయపడలేవా? నన్ను ఆ హీనస్థితికి దిగజారనీయకు విజీ! ఇంతకంటె ఎక్కువ ఇంకేం రాయను? ఉన్నది ఉన్నట్లు రాశాను. ఆ తర్వాత నీ యిష్టం.

ఇక ఉంటాను.

నీ అరూ.

*　　*　　*　　*

పన్నెండవతేది వచ్చింది. కాని, అరుణ, విజయలు ఇద్దరూ ఆ కంపెనీకి రాలేదు. ఇద్దరు దగ్గర్నుంచి కంపెనీ మేనేజరుకు ఉత్తరాలు వచ్చాయి. నాకీ ఉద్యోగం అక్కర్లేదు, రెండవ ఆమెకు ఇవ్వగుని. ఆ రెండు ఉత్తరాలుచూచి అందరూ ఆశ్చర్యపోయారు. ఆఫీసులోని యువక కారంతా నీళ్లు కారిపోయారు. 'ప్రేమా రావు' కసిగా, 'నే నప్పుడే అనుకున్నా—ఇవి ఉద్యోగాలుచేసే ముఖాలు కావని—' అన్నాడు.

కాని ఆ ఉత్తరాల వెనుక ఏముందో వీళ్లందరికి ఏం తెలుసు?

మన దృఢ నిశ్చయాన్ని మరియొక పర్యాయం ధృవపరచడానికి మంచి తరుణం ఇదే

దురాక్రమణదారులను ప్రతిఘటించడానికి మన దృఢ నిశ్చయాన్ని ఈనాడు మరియొక పర్యాయం ధృవపరచుదాం. మీ అప్రమత్తతను, దృఢ నిశ్చయాన్ని సడలనీయకండి — ఏమంటే ఇది **మహా యుద్ధం.** సత్వర చర్యకు **ఇప్పుడే** నడుం కట్టండి. దేశ సేవకు జాతీయ సేవా సంస్థలలో ఐచ్ఛికముగా చేరండి ● అనవసరపు ఖర్చులను తగ్గించి, దుబారామీద దండెత్తండి ● ఆహారం, దుస్తులూ అమూల్యమైనవి. వాటిని పాడుచేయకండి ● కాలమూ అమూల్యమైనదే. ఎన్ని గంటలు పని చేశాం అని లెక్కపెట్టకుండా ఏమి సాధించాం అనే ప్రశ్నించుకోండి ● మీ బాధ్యతలను మీరు నిర్వర్తించండి. **అన్ని** విషయాలలోనూ, ఎల్లవేళలా క్రమశిక్షణతో వర్తించండి.

అప్రమత్తతతో వుండండి—

దేశ రక్షణ సన్నాహములో పాల్గొనండి



కాటయవేముని అన్నవరదానశాసనము - కొన్ని చరిత్రాంశములు

శ్రీ తురగా కృష్ణమూర్తి

(గతసంచిక తరువాయి)

కాటయవేమారెడ్డికి భార్యలెందఱు?

ప్రభువులకు బహుభార్యాత్వము నిషేధముకాదు. అది ధర్మ సమ్మతమే! రాజకీయ ప్రాధాన్యతనుగూడ కలిగియున్నది. కాటయవేమునకు ముప్వురు భార్యలున్నట్లు యిప్పటివరకు లభ్యములైన సాధనసామగ్రి వలన చారిత్రక పరిశోధకులంద రిచే నంగీకరింపబడియున్నదే! తొత్తరమూడి శాసనమునుబట్టి "మల్లాంబ" లేక "మల్లసానమ్మ", కలువచేరు శాసనమునుబట్టి "దొడ్డాంబిక", అహోబల శాసనమునుబట్టి "తల్లాంబిక"లు కాటయవేముని భార్యలని స్పష్టమైనది. ఇప్పుడు పలబ్ధమైన అన్నవరదాన శాసనమునుబట్టి "అన్యమ"కూడ కాటయవేముని పత్నిగా తేలిపోయినది. ఇందు "మల్లాంబ" ముక్కంటిరాయుని సోదరి, కన్నిభరాయుని కూతురనియు, "అన్యమ" కుమారగిరి సోదరి, అనవోతు కూతురనియు శాసనాద్యా ధారముల వలన రూఢియైనది. ఇంక "దొడ్డాంబిక" జననీ, జనకుల నామ ధేయము లెవ్వియో యింతవరకుఁ దెలియరాలేదు. "తల్లాం బిక" విషయమైగూడ నంతియే! "దొడ్డాంబిక" అన్యమ సోదరియని సాధింప యీ వ్యాసములోనే వేరొక యెడ ప్రయ త్నించితిని. అయ్యదియే నిజమగునేని "దొడ్డాంబిక" కూడ కుమారగిరి సోదరి, అనవోతు కూతురు నగును. ఇక మిగిలినది "తల్లాంబ".

అన్నవరదాన శాసనముఁ బ్రచురించుచు శ్రీ హర్ష వర్ధనశర్మగారు "ఈమె (అన్యమ) గాక మరి ముగ్గురు కాటయవేముని భార్యల పేర్లు తల్లాంబిక, దొడ్డాంబిక, మల్లాంబిక యని గాన్పించుచున్నవి. అందు మల్లాంబిక కన్నిభ రాయుని కుమార్తె, ముక్కంటిరాయుని సోదరి యని పైన గుర్తించబడినది. విజయనగరరాజగు హరిహరరాయల కుమార్తె గూడ కాటయవేముని రాణి యని తెలియుచున్నది. ఈమె పేరు గూడ స్పష్టముగ తెలియదు. బహుశః కుమారగిరి సోదరియగు అన్యమాంబనే దొడ్డాంబ యని వ్యవహరించెడి వారేమో తెలియదు. అట్లైన తల్లాంబిక విజయనగర హరి హరరాయల కుమార్తెగా వచ్చును", అని తల్లాంబిక హ హరరాయల కుమార్తెగా యూహ చేసినారు. వారి యూహ యెంతవరకు సమంజసమో విచారింతము.

సుప్రసిద్ధ చారిత్రక పరిశోధకులు శ్రీ మల్లంపల్లి సోమశేఖర శర్మగారు తమ "History of the Reddi Kingdoms" అను గ్రంథములో "When there was civil war in the Kingdom, Harihara II, king of Vizianagara, marched as far as Tripurantakam and captured that strong. hold......King Kumaragiri soon after the conclusion of the civil war, sent his generalissimo Katayavema Reddy with a large army against Harihara II to recover the Tripurantakam and Srisailam districts. Katayavema succeeded in inflicting a severe defeat on the Vizianagara forces... He (Harihara II) therefore realised the necessity of maintaining friendly relations with the neighbouring Reddi Kings in order to strengthen himself against the growing power of the Bahamanı Sultans and of the Recerla kings. Hence he thought it prudent to come to terms with Kumaragiri. Katayavema also was anxions to come to an agreement with the Vizianagara king as it would be to the advantage of Kondavidu to have the Vizianagara Power on its side against both its external and internal enemies...The marriage alliance allnded to in the Vemavaram plates (Ep. Land. Vol. XIII. V. 22-P. 242) of Allaya Vema Reddi refers to this period. Harihara II Cemented this political alliance by givin[g]

his daughter Hariharamba in marriage to Katayavema himself", అని వ్రాసియున్నారు.[6]

శ్రీయుతులు ఖండవల్లి లక్ష్మీరంజనం, శ్రీ బాలేందు శేఖరంగార్లు తమ "ఆంధ్రుల చరిత్ర—సంస్కృతి" యను గ్రంథములో "క్రీ. శ. 1386—90 నడుమ కాటయ వేముడు రెడ్డిరాజ్యముపై దండెత్తివచ్చిన విజయనగరరాజు రెండవ హరిహరరాయుని సేనల నోడించెను. అంతట నా రాజు రెడ్డిరాజ్యముయొక్క బలిమిని గుర్తించి కాటయవేమునకు తన కుమార్తె 'హరిహరాంబ' నిచ్చి వివాహము చేసెను", (పే. 287) అని యొక చోటను, "రెండవ హరిహరరాయలు (1377—1404) కాలమునందు కొండవీడున కుమార గిరిరెడ్డియు, రాజ మహేంద్రవరమున కాటయ వేమారెడ్డియు పాలనము చేసిరి. రెడ్డిరాజులు రెండవ హరిహరరాయనికి సామంతులుగ నుండలేదు. రాయలురెడ్డి ప్రభువుల బలిమిని గుర్తించి, తన కుమార్తె యగు 'హరిహరాంబ' ను కాటయ వేమారెడ్డి కిచ్చి వివాహము చేసెను", (పే. 319) అని వ్రాసియున్నారు.[7]

ఈపై రెండు వ్రాతలనుబట్టి విజయనగరరాజు హరి హరరాయలు II యొక్క కుమార్తె "హరిహరాంబ" యనియు, ఆమెను హరిహరరాయలు కాటయవేమున కిచ్చి పెండ్లిచేసె ననియు తేలుచున్నది. అందువలన శ్రీ హర్షవర్ధన శర్మగా రభిప్రాయపడినట్లు కాటయవేముని భార్య, విజయ నగరరాజుల కుమార్తె "తల్లాంబిక" గాక "హరిహరాంబ" యగుచున్నది. అట్లగుట కాటయవేమునకు అయిదుగురు భార్య లుండినట్లు రూఢియగుచున్నది.[8]

"హరిహరాంబ" కాటయవేముని కుమార్తెయా? కాటప్రభుని కుమార్తెయా?

అల్లాడరెడ్డి వేమవరం శాసనము ననుసరించి, విజయ నగర ప్రభువు హరిహరరాయల కుమార్తె "హరిహరాంబ" కాటయవేముని అర్ధాంగి యని శ్రీ మల్లంపల్లి సోమశేఖరశర్మ, శ్రీ ఖండవల్లి లక్ష్మీరంజనం, శ్రీ బాలేందు శేఖరంగార లభిప్రాయ పడిరనియు నది పొరబాటని శ్రీ హర్షవర్ధనశర్మగారు వాదించు చున్నా రనియు నింతకుముందే తెల్పబడినది. "హరిహరాంబ" విజయనగర ప్రభువు హరిహరరాయల "దౌహిత్రి" గాని "దుహిత" గాదనియు, నామె అల్లాడ వేమారెడ్డి యర్ధాంగియు, కాటయవేముని కుమార్తెయు నని శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి, శ్రీ హర్షవర్ధనశర్మ, శ్రీ చిలుకూరి పాపయ్యశాస్త్రి గార లుట్టంకించుచుండ, తద్భిన్నముగా నూత్న సిద్ధాంతముల నుపపాదించుచుఁ గొంతమంది పండితులు వివదించుచున్నారు. అట్టి వివాదను రేపిన శ్లోక పాఠ మిది :—

పౌత్రీం కాటయవేమయ క్షితిపతేః పుత్రంచకాటప్రభోః
దౌహిత్రం చతురర్ణవీం హరిహర క్షోణిపతే శ్శాసితుః
తన్నామ్నా విదితాహ్వయాం హరిహరాం బాంచారుమగ్రాహయ
త్ప్రాణో వేమ మహీశ మల్ల నృపతిస్సాంద్రామ్రాజ్యలక్ష్మ్యైనమం॥

ఈశాసన పాఠమును యథాతథముగ నామోదించి, తొలుత ప్రచురించిన దొరగారు "The Vemavaram plates of Allayavema, which will be mentioned in the next paragraph, refer to Kata Prabhu who was the son of Katayavema and who married the daughter of Harihara evidently of the Vizianagara King Harihara II (Annual Report on Epigraphy 1906–Para 63), అని వ్రాయుచు, విజయనగర హరిహర రాయల కుమార్తెను కాటయవేముని కుమారుడు కాటప్రభువు పరిణయమాడెనని అభిప్రాయ మిచ్చియున్నారు. దీనినిబట్టి కాటయవేమునకు కాటప్రభువను నొక కుమారు డున్నట్లు నాతని కుమార్తెయే "హరిహరాంబ" యైనట్లును, ఆమెనే అల్లాడ వేమారెడ్డి యుద్వాహ మాడినట్లును తెలియనగుచున్నది. కాన్ది యీ శ్లోక పాఠమున తప్పు లున్నవనియు, "పౌత్రీం కాటయవేమ యక్షితిపతేః పుత్రంచకాట ప్రభోః", యనునది అపపాఠమనియు, నద్దానిని సవరించి, "పుత్రీం కాటయవేమ యక్షితిపతేః పౌత్రీంకాటప్రభోః", యని చదువుకొనవలె ననియు శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు నిర్ణయించినారు.

---

6. శ్రీ మల్లంపల్లి సోమశేఖరశర్మగారి యీ వ్రాత తప్పని శ్రీ హర్షవర్ధనశర్మగా రిట్లు నుడువుచున్నారు :— 'బ్రహ్మశ్రీ మల్లంపల్లి సోమశేఖరశర్మగారు "**Hariharamba in marriage to Katayavema himself**" అని వ్రాయుట పొరబాటుగాని లేక ముద్రణాస్ఖాలిత్యమనిగానియై యుండవలెనని నా తలంపు. వారు అల్లాడరెడ్డి వేమవర శాసన మును ప్రస్తావించి, దాని ఆధారముగా హరిహరరాయల కుమార్తెయగు హరిహరాంబ కాటయవేముని భార్య అని వ్రాసిరి. హరిహరరాయల మనుమరాలు (కూతురు కూతురు) హరిహరాంబగాని కూతురు హరిహరాంబ గాదు. తల్లి కూతుళ్ల కిరువురకును హరిహరాంబ నామధేయ ముండకూడదా ? యన్న అది వేరు విషయము. హరిహరరాయల మనుమరాలు అల్లాడ వేమారెడ్డి భార్యపేరు మాత్రమే "హరిహరాంబ" యని వేమ వర శాసనమునుబట్టి తెలియును; కాని—హరిహరరాయల కుమార్తె పే రింతవరకు మనకు తెలియరాలేదు. అందులకే నేను "తల్లాంబ" యౌనా ? అని శంకించితిని', అని వ్రాసి నారు.

7. వారి వ్రాతను శ్రీ సోమశేఖర శర్మగారి వ్రాతను బట్టియే వ్రాసియుందురని శ్రీ హర్షవర్ధనశర్మగారి దృఢాభి ప్రాయము. అట్లగునా ?

8. శ్రీ హర్షవర్ధనశర్మగారి వాదనాసరణినిబట్టి "హరిహ రాంబ" అల్లాడ వేమారెడ్డి భార్య యనియు, కాటయవేముని కుమార్తె యనియు, హరిహరరాయల మనుమరాలు (కూతురు కూతురు) అనియు స్పష్టపడుచున్నది. కాని పై వ్రాతలు "హరిహరాంబ" కాటయవేముని భార్య యని వక్కాణించు చున్నవి. శ్రీ మల్లంపల్లి సోమశేఖరశర్మగారి వ్రాత భ్రమ ప్రమాదజనిత మమకొందునా ?

ప్రకారము "హరిహరాంబ" కాటయవేముని కుమార్తెయు, కాటప్రభుని పౌత్రియునగుచున్నది. ఆమెను అల్లాడ వేమారెడ్డి పరిణయమాడెను. ఈవిధముగా నొకే శాసనములోని యొకే శ్లోకము వలన ద్వివిధములగు సిద్ధాంతము లుత్పన్నమగు పరిస్థితి ఏర్పడినది. ఈ విషయమును గమనించియో లేక గమనించకనో చరిత్ర చతురాననులు కీ. శే. శ్రీ చిలుకూరి వీరభద్రరావు పంతులుగారు "మురారీ తృతీయ పంథాః" యను రీతిని తమ "ఆంధ్రుల చరిత్ర" లో "కాటయ వేమారెడ్డి ప్రబలుడనియు, కుమారగిరిరెడ్డికి మంత్రియు సేనాపతి యనియు, రాజమహేంద్రవర రాజ్యమున కధిపతియునై యున్నవాడని యెరింగి యాతనితో మైత్రిగ నున్న యెడల గజపతుల వలననే హానియుఁ దన సామ్రాజ్యమునకు సంభవింప దని తలంచి, రాజాధిరాజ, రాజపరమేశ్వరుండను బిరుదాభిధానముగల హరిహర దేవరాయలు తన కొమార్తె 'హరిహరాంబ' యను వామెను కాటయ వేమారెడ్డి పుత్రుడగు కాటయ ప్రభున కిచ్చి వివాహము చేసెను. ఈ వివాహ విషయము అల్లాడరెడ్డి కోరుమిల్లి శాసనములో వక్కాణింపబడినది", (పేజి. 194) అని యుట్టంకించి యున్నారు. శ్రీ వీరభద్రరావుపంతులుగారి వ్రాతనుబట్టి "హరిహరాంబ" కాటయ వేముని కుమార్తెగాని, మనుమరాలుగాని గాక కోడలే యగుచున్నది! హరిహరరాయలకు దౌహిత్రి గాక దుహితయే యగుచున్నది. ఈ సంబంధమునే యాధారమును పురస్కరించుకొని శ్రీ పంతులుగారు నిశ్చయించిరో దురూహ్యముగా నున్నది!

వేమవర శాసనములోని శ్లోకమును యధాతథముగ నుంచితిమేని కాటయవేమునకు "హరిహరాంబ" మనుమరాలై (కొడుకు కూతురు) కాట ప్రభువునకు కుమార్తె యగుచున్నది. కీ. శే. వేటూరి ప్రభాకరశాస్త్రులవారి సవరణ ననుసరించి యామె కాట ప్రభువు పౌత్రి, కాటయవేముని పుత్రి యగుచున్నది! ఇందేది యదార్థము?

యథామాతృకముగా శ్లోకార్థమును స్వీకరించి "రెడ్డి రాజులు" అను తమ గ్రంథములో శ్రీ బుర్రా వేంకట నాంచారయ్యగారు "వీరభద్రారెడ్డి యన్నగారగు వేమన కాటయ వేమన పౌత్రి (కాటయ పుత్రి) హరిహరాంబను పరిణయమాడెను", (పే. 89) యని తెల్పినారు.

కోరుమిల్లి శాసనములోని అసలు శ్లోక పాఠములో తప్పున్నదన్న శ్రీ శాస్త్రిగారి వాదనతోనే నేకీభవించుచు, దాని సవరణావసరమును గూడ గుర్తించుచు శ్రీ చాగంటి శేషయ్యగారు శ్రీ శాస్త్రిగారి సవరణ సమంజసము గాదని "పై శ్లోకములో రెండు తప్పు లున్నవి. 'పుత్రం' అను శబ్దమును "పుత్రీం" అనియును 'దౌహిత్రం' అను శబ్దమును 'దౌహిత్రీం' అనియును, చదువవలసి యున్నది. లేనిచో నన్వయము కుదరక యర్థశూన్య మగును. కావున నా శబ్దములను సవరించుటలోఁ దప్పులేదు. ఈ మార్పును చేయకుండ శ్రీ చిలుకూరి వీరభద్రరావుగారి శ్లోకము నుదహరించుటయే గాక పై శ్లోకము నిట్లు వ్రాసియున్నా"రని (పైన యుదహరించిన దానినే వ్రాసి), "యిది పొరబాటు" అని వక్కాణించినారు. అంతతో తృప్తి సనక శ్రీ శేషయ్యగారు 'హరిహరాంబ' హరిహరరాయల కుమార్తె గాదు దౌహిత్రి. కాట ప్రభునకు భార్యయు గాదు. కుమార్తె. బ్ర. శ్రీ. వీరేశలింగం పంతులుగారు 'కాటయ వేమారెడ్డి 1419 వ సంవత్సర ప్రాంతమును గాలధర్మము నొందెను. ఈతని జీవిత కాలము లోనే యాతని పుత్రుడును, హరిహరరాయని యల్లుడు నైన కాటయరెడ్డి మరణము నందెను. ఈ వివాహమును గూర్చి యల్లాడరెడ్డి కోరుమిల్లి శాసనములో నిట్లున్నది' అని పైన దెల్పిన శ్లోకమును దప్పులు సవరింపకుండ నుదహరించి యున్నారు. ఇదియును పొరబాటే", యని నిష్కర్షచేయుచు శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు వెలువరించిన ఆక్షేపణలకు తగు సమాధానముల నొసంగి, వారి నిర్ణయములను త్రోసిరాజని "హరిహరాంబ" కాటయవేముని కుమారుడు కాట ప్రభుని కుమార్తె అనియు, అల్లాడరెడ్డి వేమారెడ్డి హరిహరాంబ భర్త యగుట నిజమనియు నందుచే నల్లాడ వేమారెడ్డి కాటయవేముని కల్లుడు గాడనియు, మనుమరాలి భర్త యనియు హరిహరరాయలకు అల్లుడు కాట ప్రభువు కాని కాటయవేముడు గాడనియు, అల్లాడరెడ్డి కాటయవేముని కుమార్తె "అనితల్లి" ని తన రెండవ కుమారునకు, మనుమరాలు "హరిహరాంబ" ను తన పెద్ద కుమారునకు రెండవ భార్యగను జేసికొని, అన్నదమ్ములలో నంతఃకలహములు లేకుండ వారించి, బాంధవ్యమును దృఢపరచెనని నిర్ధరించియున్నారు.[9]

అల్లాడ వేమారెడ్డి కోరుమిల్లి శాసన పాఠమును చారిత్రక పరిశోధకులు మూడు విధములుగా సవరించి, సమన్వయపరచి, వేరువేరు నిర్ణయములు చేయుట సంభవించినది.

"There is a reason to believe from the Vemavaram grant of Allada Vema Reddi that a daughter of the Vizianagara King Harihara II was also one of the Queens of Katayavema Reddi It is also interesting to note that Allada Reddi got his son Vema wedded to Hariharamba the daughter of Kataya Vema Reddi together with the fortune of his (Katayavema's) Kingdom. The original plates of this grant are now in the possession of the British Museum, but I happend to check the reading carefully from the impressions that were received in the office of the Government Epigraphist for India sometime back. The language of the verse as also of the next clearly

---

9. వేమవర శాసనములోని అసలు శ్లోకపాఠముగాని, శ్రీ శేషయ్యగారి సవరణను గాని ఆమోదింపనివారిలో శ్రీ హర్షవర్ధన శర్మగారొకరు. శ్రీ ప్రభాకరశాస్త్రిగారి సవరణయే సరియైనదని వీరి అభిప్రాయము. ఈ విషయమై శ్రీ శర్మగారు తమ అభిప్రాయము నిట్లు తెలియజేయుచున్నారు.

indicates that the composer of the charter speaks of the two daughters respectively of Katayavema Reddi only. It is obvious that he had altered the readings "Pautri" and "Putri" in a confusion. It definetly needs the amendation suggested by the late Sri V. Prabhakara Sastry Garu".

ఆ నిర్ణయములు పరస్పర విరుద్ధము లగుటచే విరుద్ధ సిద్ధాంతములు తలలెత్త సంభవించినది. కోరుమిల్లి శాసనములో నీ విషయమై ప్రస్తావించు శాసన శ్లోక మూలపాఠ మిది:

పౌత్రీం కాటయ వేమయ క్షితిపతేః పుత్రంచ కాటప్రభోః
దౌహిత్రం చతురర్ణవీం హరిహర క్షోణిపతేశ్శాసితుః
తన్నామ్నా విదితాహ్వయాం హరిహరాం బాంచారుమగ్రాహయ
త్ప్రాణౌ వేమ మహీశ మల్ల నృపతిస్సాంమ్రాజ్యలక్ష్మ్యా
సమం॥

ఈ పాఠము సరిగాదని కీ. శే. వేటూరి ప్రభాకరశాస్త్రిగారు తప్పును సవరించి పాఠక్రమ మిట్లుండవలెనని నిర్ణయించినారు.

పుత్రీం కాటయ వేమయ క్షితిపతేః పౌత్రీంచకాట ప్రభో
శ్దౌహిత్రీం చతురర్ణవీం హరిహర క్షోణిపతేశ్శాసితుః
తన్నామ్నా విదితా హ్వయాం హరిహరాం బాంచారుమగ్రాహయ
త్ప్రాణౌవేమ మహీశ మల్ల నృపతి స్సాంమ్రాజ్యలక్ష్మ్యా సమం॥

శ్రీ శాస్త్రిగారి సవరణ గూడ సరిగాదని కీ. శే. చాగంటి శేషయ్యగారు యీ శ్లోకములో "పుత్త్రం" అను శబ్దమును "పుత్త్రీం" అనియును "దౌహిత్రం" అను శబ్దమును "దౌహిత్రీం" అనియును సవరించవలెననియు, లేనిచో నన్వయము గుదరక యర్థశూన్యమగునని తెలుపుచు నిర్దుష్ట పాఠముగా నీ క్రింది శ్లోకము నిచ్చినారు.

పౌత్రీం కాటయవేమయ క్షితిపతేః పుత్రీంచకాట ప్రభోః
దౌహిత్రీం చతురర్ణవీం హరిహర క్షోణీ పతేశ్శాసితుః
తన్నామ్నా విదితాహ్వయాం హరిహరాం బాంచారుమగ్రాహయ
త్ప్రాణౌవేమ మహీశ మల్ల నృపతి స్సాంమ్రాజ్యలక్ష్మ్యాసమం॥

శ్రీ శేషయ్యగారి సవరణతో మూడు విధములగు సవరణలు చేయబడినవి. ఈ మూడు సవరణల వలన యుత్పన్నమైన సమస్యల స్వరూప స్వభావాదుల నిందు చర్చించుటావశ్యకము.

శాసనములోని మూలపాఠమువలన అల్లాడరెడ్డి పెద్ద కుమారుడగు వేమారెడ్డికి హరిహరాంబయనునామె భార్య యనియు నా హరిహరాంబ కాటయవేమునకుఁ గొడుకు కూతురు అనియు, కాటయకు గూతురనియు, చతుస్సముద్రముల నేలుచున్న హరిహర క్షోణిపతికి కూతురు కూతురనియు తేలుచున్నది. శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగా రుపపాదించిన సవరణవలన కాటయవేముని పుత్రియు, కాటప్రభుని పౌత్రియు హరిహర క్షోణిపతి దౌహిత్రియునగు హరిహరాంబను అల్లాడ వేమారెడ్డి పరిణయ మాడెనని తేలుచున్నది. శాసనములోని మూలపాఠము, శ్రీ చాగంటి శేషయ్యగారి సవరణ పాఠము నొకే యర్థ మిచ్చుచున్నవి. కాని శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారి సవరణ మొత్తముగా వంశవృక్షమునే మార్చివైచి "కాటప్రభుని తనయ హరిహరాంబ" యను విషయమునకే ప్రమాదము తెచ్చిపెట్టుచున్నది. ఈ యూహ శ్రీ శాస్త్రిగారికి కలుగుటకు ముఖ్య కారణము వారి వ్రాతలోనే స్ఫురించుచున్నది. "కాటయవేమునకుఁ గాటయ యను కొమరు డున్నట్లుగా నేశాసనమునందు గాని, ఏ గ్రంథమునందు గాని కానరాదు. ఆతడేమో బాల్యముననే చనిపోయి యుండవచ్చు ననుటకును గుదరదు. ఆతడు హరిహరరాయని అల్లుడట! హరిహరాంబ యను కూతుఁగనెనట! ....." యను ధోరణిలో నడచిన శ్రీ శాస్త్రిగారి యూహయే వారిచే నీ శాసన పాఠ సవరణ నా తీరునఁ జేయ ప్రోత్సహించి, యట్టి వ్రాతల వ్రాయించియుండు ననుకొనుటకు తావొసంగుచున్నది!

హరిహరాంబ కాటయవేముని కుమార్తెగాని పౌత్రి గాదను వాదమును నిర్ధారించుటకు శ్రీ హర్షవర్ధనశర్మగారు వేరొక తీరున ప్రయత్నించినారు. "ఈ శాసనములో 'అల్ల నృపతిః వేమం హరిహరాంబాం సామ్రాజ్యలక్ష్మ్యా సమం అగ్రాహయత్' అను అన్వయము కడు ముఖ్యమైనది. 'సామ్రాజ్య లక్ష్మితో హరిహరాంబను గ్రహింపజేసెను' అను అర్థమును ముఖ్యముగా గ్రహింపవలసి యున్నది. అట్లే 'అన్ని తల్యాంస్య ధత్త' అను పదప్రయోగములోని యర్థము గూడ ముఖ్యమని నా యూహ. అని వా రిరువురును కాటయవేముని పుత్రికలు కానినాడు అసంభవము. కాటయవేముని కొడుకుకూతురైన పక్షమున ఆ విశేషణము అనవసరము", అని శ్రీ శర్మగారు హరిహరరాంబ కాటయవేముని కూతురని నిర్ణయించుట కొప పత్తికముగా నీ విషయములను నుద్ఘాటించినారు. శ్రీ శాస్త్రిగారు కాటప్రభుని యునికిని సందేహించి శ్లోకములో మార్పు చేయగా శ్రీ శర్మగారు శ్లోకములోని పదప్రయోగమునకే ప్రాధాన్యమిచ్చి, శ్రీ శాస్త్రిగారి నిర్ణయమును వేరొక విధమున సమర్థింప జూచిరి. కాటయవేమునకు కాటప్రభువను కుమారు డుండెనా? యను విషయ విమర్శ ప్రస్తుతమునకు విరమించి శ్రీ శర్మగారి అభిప్రాయములనుగూర్చి విమర్శింతము.

శ్రీ శర్మగారి అభిప్రాయములో అల్లాడరెడ్డి "సామ్రాజ్య లక్ష్మితో హరిహరాంబను తన కుమారుడగు వేమారెడ్డిచే గ్రహింపజేయుట హరిహరాంబ కాటయవేముని కుమార్తె అయిననాడే పొసగును గాని అన్య విధముననైనచో సాధ్యపడదు". "రాజమహేంద్రవర రాజ్యము కాటయవేముని స్వాస్థ్యముగాన ఆతని యనంతర మా రాజ్య మాతని కుమార్తెలకే సంక్రమించవలసి యున్నది. అందుచేత 'అనితల్లి' 'హరిహరాంబ'లు కాటయవేమునకు కుమార్తెలైననే గాని యా 'సామ్రాజ్యలక్ష్మి' వారికి సంక్రమించదు. కావున 'హరిహరాంబ' తప్పక కాటయవేముని కుమార్తెయై తీరవలయును. ఆ దృష్టితో చూచిన శ్రీ వేటూరి ప్రభాకర శాస్త్రిగారి సవరణ అవసరమును, అర్థవంతమును", అని శ్రీ శర్మగారి వాదన.

ఈ వాదనకీ క్రింది సమాధానమునిచ్చి "హరిహరాంబ" సామ్రాజ్యలక్ష్మితో కూడుకొనుట కామె కాటప్రభుని పుత్రిక

య్యైనప్పుడే పొసగును కాని, కాటయవేముని పుత్రిక య్యైనచో గాదని నిరూపింప యత్నింతును.

కాటయవేముని కుమారుడు కొమరగిరి యనంతరము రాజమహేంద్రవర రాజ్యముపై అనితల్లికే హక్కు గలదనియు, అందులకు కారణ మా రాజ్యము అనితల్లి మాతామహార్జితము అయియుండుటయే యనియు, న్యాయముగా అనితల్లికి సంక్రమించవలసిన రాజ్యమును అల్లాడ భూపతి దురితరహిత చిత్తుడై అనితల్లికి సంక్రమింపజేసెననియు నింతవరకు ప్రామాణిక చరిత్రకారు లందరును ముక్తకంఠముగ చాటి యున్నారు. అట్టి సందర్భములో "సామ్రాజ్యలక్ష్మి" తో కూడుకొన్నది "అనితల్లి" గాని "హరిహరాంబ" కాదుగదా! హరిహరాంబ కాటయవేముని కూతురై నను (వాదన కొర కంగీకరించిన) రాజమహేంద్రవర రాజ్యమున కుత్తరాధికారిణి యగుటలేదు. ఆ రాజ్య మామెకు మాతామహార్జితముగాదు. కావున హరిహరాంబకు "సామ్రాజ్యలక్ష్మి" తో కూడుకొనుట పొసగని విషయము. కాని శ్రీ శర్మగా రనినట్లు "హరిహరాంబాం సామ్రాజ్యలక్ష్మ్యా సమం అగ్రాహయత్" యనుదానికి అన్వయము కుదరవలెనన్న ఆమెకు గూడ రాజమహేంద్రవర రాజ్యముపై "ననితల్లి" కి యెట్టి హక్కు గలదో యట్టి హక్కే కలిగియుండవలెను. అదెట్టులో వివరింపవలసి యున్నది.

కాటయవేముడు మరణించునప్పటి కాతనికి మిగిలిన పుత్రుడు కొమరగిరి. కాటప్రభువు తండ్రి జీవితకాలము లోనే మరణించియున్నాడు (ఈ విషయమును శ్రీ శాస్త్రిగా రొప్పుకొనలేదు. శ్రీ శర్మగా రొప్పుకొందురో? లేదో?). కావున రాజమహేంద్రవర రాజ్యమునకు కాటయవేముని యనంతరము కొమరగిరి ఉత్తరాధికారి యగుట సహజము. కాట ప్రభువే బ్రతికియున్నచో నాతడే రాజ్యము నాక్రమించి, రాజ్యపాలనాధికారము కలిగియుండెడివాడు. ఆ పరిస్థితిలో కాట ప్రభువు అనంతరము కుమారగిరి రాజ్యమునకు వచ్చియుండవలసి యుండును. అట్లుగాక—కాట ప్రభువు తండ్రికంటె ముందుగా దివంగతుడైనందున కాటయవేముని తరువాత కొమరగిరి రాజగుట తటస్థించినది. కొమరగిరికి సంతానము లేకపోవుటచే నాతని సోదరుడు కాటప్రభువు పుత్రిక "హరిహరాంబ" రాజమహేంద్రవర సింహాసనము నధిష్ఠింప నర్హురాలైనది. కాని —రాజమహేంద్రవర రాజ్యము "అనితల్లి" మాతామహార్జిత మైనందునను, కొమరగిరికి సంతానము లేనందునను, తల్లిదండ్రులంబట్టి చూచిన "అనితల్లి" ని రాజమహేంద్రవర సింహాసనమునకు సన్నిహిత వారసురాలుగా గణుతింపవలసిన పరిస్థితి యేర్పడినది. న్యాయతః తండ్రి తరువాత పుత్రికకు రావలసిన యక్కర "హరిహరాంబ" యందు ప్రబద్ధమై యుండ, మాతామహార్జితముగా "అనితల్లి" కి రాజ్యముపై హక్కు యేర్పడినది. అందుచేతనే "హరిహరాంబ" సామ్రాజ్యలక్ష్మితో కూడుకొనిన దైనది. ఈ వివాదను విస్మృతము కానిచ్చినచో సామ్రాజ్య స్థితికి భంగము వాటిల్లునని గ్రహించిన అల్లాడ భూపతి వయోభేదముల ననుసరించి "అనితల్లి" ని వీరభద్రునకు, "హరిహరాంబ" ను వేమ ప్రభువునకు ధర్మపత్నులుగా స్వీకరింపజేసి, యిరువురకును రాజమహేంద్రవర రాజ్యముపై గల హక్కులకు సంఘర్షణ (Conflict) కలుగకుండ వారించి, రాజ్య సుస్థిరతను తన రాజకీయ చతురతతో, దూరదృష్టితో, పరిజ్ఞానముతో నిబ్బరించినాడు. ఈ సమన్వయమార్గ మవలంబించుటలో నిరువురకు సింహాసనముపై గల హక్కులు త్రోసిపుచ్చబడలేదు! అట్లు కాదేని —"హరిహరాంబ" యే విజయనగర రాజుల దౌహిత్రియు, కాటయవేముని దుహితయు నైననాడు "అనితల్లి" తోబాటు సమానహక్కు గలదిగా నగుచున్నది. ఆ పరిస్థితిలో మాతామహార్జిత ప్రసక్తికంత బలముండక, బలముగలవానిదే రాజ్యము అను పరిస్థితి కలిగియుండెడిది. మహా బలవంతులగు విజయనగర ప్రభువులు తమ పౌత్రియగు హరిహరాంబ పక్షముపూని "అనితల్లి" పక్షమును క్రిందుచేసి యుండెడివారు! కుమారగిరి సోదరి య్యైనంతమాత్రమున "అనితల్లి" కి వేరు ప్రత్యేకమైన హక్కుగాని, అధికారముగాని సంక్రమించి యుండదుగదా! కావున హరిహరాంబకు రాజమహేంద్రవర రాజ్యముపై గల హక్కు నేను పేర్కొన్న విధమున సంక్రమించుటచే, అల్లాడ రెడ్డి యొనర్చిన వైవాహిక విధు లుభయతారకములుగా నుండి, కుటుంబ కలహమును వారించి, సంఘర్షణను వారింప సమర్థవంతములై యున్నందున విజయనగర ప్రభువులు అట్టి అధికార నిరూపణ ప్రయత్నమున నిపుణులు కాలేదు. ఇంక నొక విశేష మున్నది. "అనితల్లి" కలువచేరు శాసనములో రాజమహేంద్రవర రాజ్యము కాటయవేముని కుమారుడు కొమరగిరి మరణానంతరము కొంతకాలము రాజకీయ కల్లోలమునకు అగ్గమై, స్వామిద్రోహ పరాయణులగు కున్నపతుల దుష్టచింతలం జిక్కి అటమటించినట్లు సూచింపబడినది. ఈసూచన నేనుపైన వివరించినవివాదకు సంబంధించినదై కూడనుండవచ్చును.

ఈవిధముగా శ్రీ శర్మగారి అభిప్రాయమున కనుగుణముగా "హరిహరాంబ" కు సామ్రాజ్యలక్ష్మి చెప్పడిన విధానము వివరింపబడినది గాన శాసన శ్లోకములో నుదహరింపబడిన "సామ్రాజ్య లక్ష్మ్యాసమం" యను విశేషము "హరిహరాంబ" కాట ప్రభువు కుమార్తె య్యైననాడే యర్థవంతమగు చుండుటచే "హరిహరాంబ" కాటయవేమునకు కుమార్తె య్యైననాడే "సామ్రాజ్య లక్ష్మ్యాసమం" యను పద ప్రయోగము సార్థక మగుననియు లేనిచో కాదను శ్రీ శర్మగారి వాదనకు వ్యాఘాత మేర్పడుచున్నది. అందుచే "హరిహరాంబ" కాటయవేముని పౌత్రి, కాట ప్రభుని పుత్రి యను యర్థము వచ్చు సవరణతో నున్న శ్లోక పాఠమే సరియగునని యెంచుకోవలసి యుండును. అందుచే శ్రీ శివయ్యగారి సవరణ సమంజసమే యని స్పష్టమగుచున్నది. ఆ విధిని కాటయవేమునకు కాట ప్రభువను కొమరగిరి కంటె ముందే యుండెననుట స్పష్టమగుచున్నది! ఈ సిద్ధాంతము నొప్పుకొన నిచ్చగింపని శ్రీ శాస్త్రిగారు శాసన శ్లోకములో తప్పు లున్నవని, వారి యూహకు సరిపోవు తెరంగున శాసన పాఠమును సవరించి అయోమయ స్థితి కల్పించినారు! కాటయవేముని మనుమరాలగు "హరిహరాంబ"నుఆతని కుమార్తెగా నిర్ణయింప సాహసించినారు!

విజయలక్ష్మి

కీ. శే. చిలకమర్తి లక్ష్మీనరసింహకవి

'విజయలక్ష్మి', లక్ష్మీనరసింహకవి చరమదశలో వ్రాయ నారంభించి పూర్తిచేయని నవల. అయినప్పటికీ, తెలుగు ప్రజకు తెలియవలసినది. ఈ నవలను మాకు ప్రకటించుట కిచ్చిన వారిఅల్లుడు శ్రీ పి. వి. దీక్షితులుగారికి మా వందనములు. భా. సం.]

పూర్వము గోదావరీ మండలములో చేరినదియై ప్రస్తుతము పశ్చిమ గోదావరి మండలములో చేరినదియై, నరసాపురమను చిన్న పట్టణము గలదు. ఇది పశ్చిమ గోదావరీ మండలములో దక్షిణ దిగ్భాగమున బంగాళాఖాతమను పేరుగల తూర్పు సముద్రమునకు మూడు క్రోసుల దూరములో నున్నది. దీని ప్రక్కనే గోదావరీ నదీ శాఖయైన వశిష్ఠనది పారుచున్నది. ఇది యంతర్వేది వద్ద సముద్రములో గలియుచున్నది. సముద్రమున కంత దగ్గరగా నుండుటచే గోదావరీ జలము పానయోగ్యముగాక నుప్పగా నుండును. పండుగలు పర్వములు వచ్చినప్పుడు పురజనులు చుట్టుప్రక్కల గ్రామముల జనులు వచ్చి పుణ్యము నిమిత్తమై యందు స్నానము చేయుచుందురు. ఊరు ప్రక్కనే నది యుండినను పురజనులకు మంచినీటి సౌకర్యములేదు. ఆ గ్రామవాసులకు మంచినీళ్లకు కాలువయే యాధారము. రాజమహేంద్రవరము గోదావరి నుండి నరసాపురము వరకు గోదావరిమీద ఆనకట్ట కట్టిన కాటను దొరగారు పెద్ద కాలువను త్రవ్వించిరి. ఈ కాలువ నరసాపురమునుండి మొగలితుర్తి వరకు ప్రవహించుచున్నది. ఈ కాలువవల్ల ఎన్ని వేల ఎకరముల భూమియో సాగు చేయబడుచున్నది. ఈ మంచినీటి కాలువవల్ల నరసాపురము తాలూకాలోని చవిటిపర్తిలుగ నున్న భూములు సారవంతములై తెగి పండుచున్నవి. ఈ కాలువయే నరసాపురవాసుల మంచినీళ్లకు ముఖ్యాధారము. నరసాపురములో మంచినీళ్ల చెరువులు లేవు. మంచినీళ్ల నూతులు సకృతుగా నచ్చటచ్చట నున్నవి. సామాన్యముగ దొడ్లలో నున్న నూతులలోని నీరుప్పగానే యుండును. పురవాసులు వేసవికాలములో కాలువ కట్టివేయబడినప్పుడు మంచినీళ్ల నూతులలోని నీరు దెప్పించుకొని వాడుకొందురు. ఈ కాలువమీద రాజమహేంద్రవరము నుండి బాటసారుల యుపయోగము కొరకు రహదారి పడవలు నరసాపురము వరకు వచ్చుచుండును. ఈ పడవలు బాటసారుల నెక్కించుకొని పోవుటయేగాక ధాన్యము మొదలైన సరుకులను గొనిపోవుచుండుటచే వాణిజ్యమునకు మిక్కిలి యుపకరించుచున్నవి. పడమటి గోదావరీ మండలములో వాణిజ్యమునకు ముఖ్య స్థానమైన పాలకొల్లు నరసాపురమునకు మూడు క్రోసుల దూరములో నున్నది. పాలకొల్లు నుండి నరసాపురమునకును నరసాపురమునుండి మొగలితుర్తినకును డింగీలను పేరుగలిగిన చిన్న నావలు బాటసారులను సరకులను తీసుకొని పోవుచుండును. నరసాపురమునకు మొగలితుర్తి మూడు క్రోసుల దూరము. అది కలిదిండివారను యింటి పేరు గల క్షత్రియ ప్రభువుల యధికారము క్రింద నుండెను. ఈ కలిదిండి రాజులు మొగలితుర్తి రాజధానిగ జేసికొని, నరసాపురము, తణుకు, భీమవరము మొదలగు తాలూకాలను చాలకాలము పరిపాలించి యంతర్వేది మొదలగు స్థలములలో దేవాలయములను గట్టించి పండితులను పోషించి యనేక బ్రాహ్మణులకు, మాన్యములిచ్చి ప్రఖ్యాతి గాంచిరి. ఉత్తర సర్కారులలో విజయనగరమున శ్రీ పూసపాటి రాజులును పెద్దాపురమున వత్సవాయి వంశస్థులయిన ప్రభువులును మొగలితుర్తిలో కలిదిండి వంశస్థులైన రాజులును గొప్ప సంస్థానాధిపతులై యుండిరి. కాలవశమున మొగలితుర్తి సంస్థానమును దొరతనమువారు తమ రాజ్యములో గలుపుకొని యా రాజులకు ప్రస్తుతము పింఛను నిచ్చుచున్నారు. మొగలితుర్తిలో గొప్ప మట్టికోట యున్నది. అది ప్రస్తుతము శిథిలావస్థలో నున్నది. అయినను జూచువారికి దాని పూర్వపు ఠీవి తెలియకపోదు.

గోదావరికి పడమటివైపున నరసాపుర మున్నది. తూర్పుదెసను సివకోడు, తాటిపాక, రాజోలు మొదలగు ప్రదేశము లున్నవి. పూర్వ మీ ప్రదేశములు నరసాపురము తాలూకాలోనివే గాని సౌకర్యము నిమిత్తము దొరతనమువారు నరసాపురము తాలూకాలోనుండి వీటిని తీసివేసి అమలాపురము

తాలూకాలోని కొన్ని గ్రామములు గలిపి రాజోలు తాలూకా నేర్పాటు చేసిరి. అందుచేతనే పూర్వము నరసాపురము తాలూకాలో చేరిన యంతర్వేది ప్రస్తుతము రాజోలు తాలూకాలో నున్నది. గోదావరిమీద నంతర్వేది మొదలు నటు రాజోలు వరకు నావలు స్వేచ్ఛగ తిరిగి బాటసారుల ప్రయాణములకును, సరుకుల ఎగుమతి దిగుమతులకును నుపకరించుచున్నవి. ఇటీవల గవర్నమెంటువా రొక పొగ నావను గూడ వేసిరి.

అంతర్వేదిలో ప్రతి సంవత్సరము మాఘ శుద్ధ దశమినాడును యేకాదశినాడును యచటి ప్రధాన దైవతమైన శ్రీ నరసింహస్వామివారికి మిక్కిలి వైభవముతో కళ్యాణాది మహోత్సవములు జరుగుచుండును. ఆ తిరునాళ్లకు వేల కొలది జనులు పలు తావుల నుండి వచ్చి స్వామిని సేవింతురు. నరసాపురము చెన్నపట్టణము కంటె మిక్కిలి చిన్న పట్టణమైనను యిది చరిత్రాత్మకమైన పట్టణమె! ఏలయన నరసాపురములో గోదావరీ తీరమందు మాధవాయిపాలెమను చిన్న పేట గలదు. అది పూర్వము కంటె నిపుడు మిక్కిలి చిన్నదిగ నున్నది. ఏమన నది చాలవరకు నదీపాతమై పోయినది. అది యుచ్ఛదశలో నున్నప్పుడు విశేషముగ నచట బట్టల నేత జరుగుచుండెడిది. కుంభిని యను పేరుగల తూర్పు ఇండియా కంపెనీవారు వర్తకము నిమిత్తము హిందూదేశము వచ్చి తూర్పు సముద్ర తీరమున చెన్నపట్టణము, మచిలీపట్టణము, విశాఖ పట్టణము మొదలగు స్థలములలో వర్తకశాలలు నిర్మించుకొని బాహుళ్యముగ వ్యాపారము చేయుచున్న రోజులలో మాధవాయిపాలెములో గూడ నొక వర్తకశాలను నిర్మించుకొని వ్యాపారమును విరివిగ జేయుచుండెడివారు. నరసాపురములో గొంత భాగము ప్రాత యూరుగ నున్నది. దానింజేర్చి కాలువయొడ్డున స్మైలరు దొరగారి పేర నొక పేట కట్టబడెను. దానింజేరియె మాధవాయిపాలెముండెను. నరసాపురములో పూర్వము సబు కలెక్టరుగారి కచేరీ యుండెడిది. కొంతకాలమైన తరువాత దానిని సబు కలెక్టరు స్థానముగ దీసివేసి డిప్యూటీ కలెక్టరు స్థానముగ జేసి నరసాపురము, భీమవరము తాలూకా లాడెప్యూటీ కలెక్టరు యధికారములో బెట్టిరి.

1905 సంవత్సరమున జిల్లాల మార్పు జరిగినపుడు డెప్యూటీ కలక్టరు స్థానముగ దీసివేసి మరల సబు కలక్టరు స్థానముగ జేసి నరసాపురము, తణుకు తాలూకాలు రెంటిని సబు కలెక్టరుగారి యధికారమున నుంచిరి.

నరసాపురములో స్మైలరు హైస్కూలను నొక యున్నత పాఠశాల గలదు. ఈ పాఠశాలా భవనమును, మరి కొన్ని భవనములును వర్తకము నిమిత్తమై ఇచటికి వచ్చిన డచ్చివారి భవనములని జనులు చెప్పుదురు. ఈ పేటలో పర్కారు స్థాపించిన వైద్యశాల యొకటి గలదు. పై పాఠశాలతోబాటు మిషనువారు స్థాపించిన యున్నత పాఠశాల గూడ నుండెడిది. ఆ పాఠశాలకు పూర్వము జాన్ విలియమ్ బీరు దొరగారని పేరుగల క్రైస్తవమత బోధకుడా కాలమున ప్రధానాచార్యుడుగ నుండి మిక్కిలి సామర్థ్యముతో నడుపుచుండెను. నరసాపురములో మొదటినుండియు జిల్లా మునసబుకోర్టుండెను. దాని నాశ్రయించుకొని న్యాయవాదు లనేకులు స్మైలరు పేటలో నివసించుచుండిరి. నరసాపురము నివాసయోగ్యమైన గ్రామము. ప్రతిదినము సమీపమున నున్న రుస్తుంబాదాయను గ్రామమునుండియు చుట్టుప్రక్కల గ్రామములనుండియు కూరలు విరివిగ వచ్చుచుండెను. అక్కడ నొక బజారు గూడ గలదు. ఇటీవల నిడదవోలు నుండి నరసాపురమునకు ఇనుపదారి వేయబడెను. ప్రతిదినము రైలుబండ్లు వచ్చుచు పోవుచుండును. కాబట్టి ప్రయాణము చేయువారి కిందువలన నధిక సౌకర్యములు గలిగినవి.

రెండవ ప్రకరణము

నరసాపురము కోర్టులో బనిచేయు న్యాయవాదు లనేకులు గలరు. వారిలో ముఖ్యుడు 1860 సంవత్సర ప్రాంతమున నొకడు గలడు. ఆచంట రామేశమని యాతనిపేరు. మొట్టమొదట రామేశముగారి నివాసస్థానము నరసాపురము తాలూకాలో చేరిన యాచంట గ్రామము. ఆచంటలో దేవునిపేరు రామేశ్వరస్వామి యగుటచే యచటి నివాసులు తరుచుగ తమ కుమాళ్లకు రామేశమని, రామేశ్వరుడని పేరు పెట్టుకొనుచుందురు. రామేశముగారి తండ్రిపేరు నాగభూషణముగారు. తండ్రిగారు పూర్వాచార పరాయణు డగుటచే రామేశముగారు గూడ పూర్వాచార సంప్రదాయములోనే పెరిగి భారత, భాగవతములు చదువనేర్చి యోగ్యమైన వైదిక సాంప్రదాయములో పెరిగినందున చిన్నతనమునందు తండ్రిగారి ప్రోత్సాహముమీద నమక చమకములు, దశ శాంతులు, పురుష సూక్తము, మంత్రపుష్పము మొదలగువాటిని నేర్చుకుని శుద్ధవైదికునివలె నుండెడివాడు. తండ్రిగారు తక్కిన నియోగుల వలె మీసములు పెంచుకొనక తీయించివేసి యనుదినమును ప్రాతఃకాలమున స్నానముచేసి విభూతి పెండికట్లు పెట్టుకొని సంధ్యావందనమునుజేసికొని బ్రహ్మయజ్ఞము, పితృతర్పణము జేసికొని, పార్థివపూజ జేసుకొని రెండు ఝాములవేళ భోజనము చేయుదురు. రామేశముగారికి గూడ తండ్రిగారి యలవాటులే యబ్బెను.

ఇరువది సంవత్సరములు వచ్చిన తరువాత రామేశముగారు న్యాయవాది వృత్తిలో ప్రవేశింపదలచి రాజమహేంద్రవరము వెళ్లి యచ్చట జిల్లా కోర్టులో పనిచేయుచున్న నొక న్యాయవాది యొద్ద జేరి పని నేర్చుకొని తెనుగులో ప్లీడరు పరీక్షయందు కృతార్థుడై యచటి మండల న్యాయాధిపతి యొద్ద ప్లీడరు పట్టా పుచ్చుకొని పిమ్మట నరసాపురము వెళ్లి యచట న్యాయవాదిగ పనిచేయ జొచ్చెను.

రామేశముగారు మిక్కిలి గడుసువారు. బ్రతుకుతెరు వెరిగినవారు. తండ్రిగారివలె నీయనగూడ ప్రాతఃకాలమున కాలువలో స్నానముచేసి విభూతి ధరించి, సంధ్యావందనము చేసికొని ప్లీడరుగ రికి తగినట్లు ఒక తివాచీమీద గూర్చుండి సందుగపెట్టె ముందు పెట్టుకొని గుమాస్తాను ఎడమ ప్రక్కను గూర్చుండపెట్టుకొని కోర్టు పనిమీద వచ్చిన పెద్ద మనుష్యులతోను, సాక్షులతోను వారి మనసు రంజిల్లునట్లు మాట్లాడుచుందురు. రామేశముగారు స్వలాభ పరాయణుడు. న్యాయవాద వృత్తిలో దనకు మిక్కిలి ఉన్నత పదవి గలుగుటకు నేయే యుపాయములు గావలెనో, నేయే పన్నుగడలు పన్నవలెనో నవి యెల్ల బాగుగా నెరుగును. నరసాపురము కోర్టువారి యధికారము క్రింద నరసాపురము, భీమవరము తాలూకాలు రెండు నుండెడివి. వేసవికాలములోను, శీత కాలములోను కోర్టు కట్టివేసినపుడు రామేశముగా రింటివద్ద వృధాగా కూర్చుండక రెండు తాలూకాలలోను గల ముఖ్య ప్రదేశములకు వెళ్లి యచట నున్న పెద్ద మనుష్యులను జూచి ఏవో కొన్ని కోతలుకోసి శుష్కప్రియములు జెప్పి వారికి తన మీద నభిమానము గలుగునట్లు వ్యాజ్యములు తన వద్దకే పంపునట్లు గట్టి పని చేసి వచ్చుచుండును. ప్రతి పెద్ద గ్రామమునందు తన పక్షమున పనిచేయునట్టి ఏజంటుల నేర్పాటు చేయుచుండును. ఎవరైన వ్యాజ్యము దాఖలు చేయుటకు తన యొద్దకు వచ్చి ఫీజు నిర్ణయించుకున్న పక్షమున "సరి సరి, మీయొద్ద ఫీజు ఖండించి పుచ్చుకొందునా ? మీకును మాకును గల స్నేహము నిన్నటిదా ? మొన్నటిదా ? మీరు వకాల్తానామా వ్రాసియిచ్చి కాగితములు గుమాస్తా చేతికిచ్చి వెళ్లుడు. అపై పని నేను చూచుకొందును. ప్రతివాదుల యొద్ద నుండి మీ ఖర్చులు వసూలైన తరువాత ఫీజు మాట చూడవచ్చును. నేనే మగుదును. మీరేమగుదురు" అని తాత్కాలిక ప్రియములు గొన్ని చెప్పి వారిని పంపుచుండును. ఫీజు సైతము ఇంత యని కోరని న్యాయవాది రామేశముగారు తప్ప నెవ్వరు నుండరనియు, దమ కాయన మిక్కిలి యాప్తమిత్రుడనియు భావించుకొనుచు వారు వెళ్లుచుందురు. సాక్షులు వచ్చినప్పుడు వారిలో నెవ్వ రెవ్వ రేమేమి చెప్పవలెనో యా విషయము లన్నియు వారిచేత గట్టిగా పలికించి వల్లింప జేసి రామేశముగారు పాఠశాలలో నుపాధ్యాయుడు పిల్లలకు బోధించినట్లు బోధించుచుండును. కాబట్టి తీయనీటికి చేప లెక్కినట్లు రామేశముగారి యొద్దకు మిక్కిలి యిష్టముతో పార్టీలు వచ్చుచుందురు. కాలదోషము పట్టిన ప్రామిశరీ నోట్లున్న పక్షమున వీలైనట్లు వాటిని సవరించి తారీఖులు దిద్ది కాలదోషము బాధ లేకుండ వానిని దాఖలు చేయుచుండును.

దీనికొక ఉదాహరణము చెప్పవచ్చును. ఒక పెద్ద మనుష్యుడు కాలదోషము పట్టిన నోటు దీసికొని వచ్చి "దీని కేమి యుపాయమండి ? పంతులుగారు!" అని యడిగెను. వెంటనే రామేశముగారు గుమాస్తాను పిలిచి నోటు వ్రాసిన తారీఖుమీద ఇంత సిరాను బోసి తన్నితే పడినట్లు నోటు మీద నాలుగైదు చోట్ల సిరా ఓందులు వేయుమని యాజ్ఞాపించెను. గుమాస్తా చిరకాలమునుండి రామేశముగారి యొద్ద మాయలన్నియు నేర్చుకున్నవాడే గనుక వెంటనే యాపని జేసెను. కాగితము గొంతసేపు రామేశముగా రెండలో బెట్టించి సిరా ఎండిపోయిన తరువాత కాగితము కోర్టుకు దీసికొని వెళ్లి వ్యాజ్యము దాఖలు జేపిరి. ప్రతివాది యా నోటు కాలదోషము పట్టినదని వాదించెను. రామేశముగారు కోర్టువారితో నిట్లు మనవి చేసుకొనిరి. "ఏలినవా రీ విషయమున న్యాయము చిత్తగించవలెను. ఈ నోటు సొమ్ము హరింపవలెనని దురుద్దేశ్యముతో తారీఖుమీద ప్రమాదమున సిరా బడి యది కనబడుటలేదు. గనుక ప్రతివాది కాలదోషము పట్టినదని దొంగ వాదన చేయుచున్నాడు" అని చెప్పి కూర్చుండిరి. మునసబుగారంతఃకరణశుద్ధిగల మనుష్యు డగుటచే నది కాలదోషము పట్టిన దన్నచో వాది కపకారము జరుగును, పట్టలేదన్నచో ప్రతివాది కపకారము జరుగును. ఏమి చేయుదునని విచారించుచు దీని సత్య మేలాగున తేలునండీ యని న్యాయవాదుల నడిగెను. అప్పుడు ప్రతివాది పక్షమున వాదించుచున్న న్యాయవాది నిలుచుండి కోర్టువారితో నిట్లు మనవి చేసెను.

"నోటు కాగితము వెనుకప్రక్కనుండి చిత్తగింపుడు. దాని సత్యము దేలును" అని చెప్పగావే మునసబుగారా కాగితమును తిరుగవేసి వెనుకనుండి తారీఖు చూచెను. ఆప్రక్క సిరా బడినప్పటికి చూచువారికి రెండవ ప్రక్కనుండి నిజమైన తేదీ కనబడుచుండెను. మునసబుగారా కాగితము తక్కిన న్యాయవాదులకు గూడ జూపెను. ఆ తారీఖు ప్రతివాది చెప్పినట్లు కాలదోషము పట్టెను. అప్పుడు మునసబుగారు చేతి

తోని కలము బల్లమీద బడవైచి యిట్లనిరి. "రామేశము గారూ ! మీరు న్యాయవాదులమని పేరు పెట్టుకున్నందుకు న్యాయము బలికి, న్యాయమే వాదించి, కోర్టువారికి సహాయము చేయవలెను గాని యీవిధముగా న్యాయ విచారణ కర్తల కండ్లలో దుమ్ము పోసి, మాచే తప్పు తీర్పు లిప్పించి, మమ్ము లను నరకకూపములో బడద్రోయ యత్నించుట ధర్మమా! మాతా శిశువు లుండగ మధ్య మంత్రసాని గండ మన్నట్లు పార్టీలు ప్లీడర్లు నుండగ మధ్య మేమా నరకమునకు బోవల సిన వారము ?" అని కోర్టువారు కొంచము కఠినముగ మంద లింపగ రామేశముగారు "నారాయణ ! నారాయణ, యిందు నేనేదోషము నెరుగనండి. పిల్లవాడు సిరాబుడ్డి చూడక తన్నగా నోటుమీద సిరా బడినదని తెచ్చి పార్టీ నా కిచ్చినాడండి. యతనిమాట నమ్మి నేను దాఖలు చేసినాను. ఇంతకంటే నేనేపాపము నెరుగను. గాయత్రి సాక్షి ! నే వెరిగిన పక్షమున నిటువంటి పాడుపని ఏలినవారి యొద్దనే జేయుదునా ? న్యాయవాది పార్టీ యేది జెప్పిన నది నమ్మి పనిజేయవలసిన వాడే గాని లోపల దూరి ఇటువంటి మాయలుదెలుసుకొన గలడా ?"

ఆ మాటలు విని మరి యేమియు ననక మునసబు గారు ప్రతివాది పక్షమునః దీర్పు నిచ్చిరి. రామేశముగారు ద్రవ్యమే ప్రధానముగ జూచుకొనెడి మనుష్యుడు గావున ఎటు వంటి నిరాధారమైన వ్యాజ్యము తన దగ్గరకు వచ్చినను నది లాభములేని దని పార్టీతో జెప్పక "యిది నెగ్గ వచ్చును" అని చెప్పి కోర్టులో దాఖలు చేయుచుందురు. తనకు వకాల్తానామా నిచ్చినవాడు చెడిపోయిన పక్షమున, మున సబుగారు మట్టి తలవాడు. నేను చేసిన వాద నాయన కర్థము కాలేదనియో, మునసబుగారు లంచము పుచ్చుకున్నారనియో లేక సిఫార్సు విన్నారనియో, ఏవో వంకలు చెప్పి పార్టీ మనస్సు శాంతింపజేయుచుందురు. రామేశముగారు ఫీజు పార్టీల యొద్ద మొదట నిర్ణయించుకొనకపోయినను చిట్టచివ రకు రావలసిన ఫీజు కంటె నెక్కువగానే లాగుచుండును. వ్యాజ్యము నెగ్గినపుడు, నేను కష్టపడి పని చేసినాను. నా కిందులోః గొంత బహుమానము రావలయును. మారు మాట చెప్పక నేదో గొంత సొమ్ము నీయుమని లాగుచుందురు. రామేశముగారు పూర్వాచార కవచము వేసికొన్నారు. కనుక దాని కనుగుణముగ శ్రీరామనవమికి వసంతనవరాత్రులనియు, విజయదశమికి దేవీ నవరాత్రులనియు సంవత్సరమునకు రెం డుత్సవములు చేయుచుందురు. ఇందుకై రామేశముగారు సొంత సొమ్ము ఖర్చుపెట్టరు. ఈ యుత్సవములు రాకమున్నె రామేశముగారు భాగ్యవంతులైన పార్టీల నాహ్వానింతురు. వారు వచ్చినపుడు రిక్త హస్తములతో రాక ఏవో కొన్ని సరకులను దీసికొని వత్తురు. ఒకరు నేయి బంపుదురు, ఒకరు పాలు బంపుదురు, ఒకరు పెరుగు బంపుదురు, ఒకరు కందులు బంపుదురు, మరియొకడు మినుగులు బంపును, వేరొకడు పెసలు సమర్పించును, మరికొందరు కాయకూరలు, అరటి యాకులు బంపుదురు. ఈవిధముగా రామేశముగారు దన చేతి డబ్బు రూపాయైనను పడకుండ తొమ్మిది రోజులు బ్రాహ్మ ణులకు మంచిమంచి పిండివంటలతో గూడ భోజనము పెట్టి పూర్వాచార పరాయణులలో రామేశముగారి వంటివాడు లేడని ప్రఖ్యాతి పొందుచుండును. సంతర్పణములు చేయుటలో రామే శముగారి యొద్ద నొక విధమైన లక్షణము గలదు. రేపు సంతర్పణ మనగ వెనుకటి రాత్రి యే వంట బ్రాహ్మణులను తనయింట పండుకొన బెట్టుకొని తెల్లవారుజామున లేపి, తెల్ల వారు నప్పటికే వంటలు చేయించును. రామేశముగారియింట నెప్పుడు సంతర్పణమైనను నుదయమున పదిగంటలలోపు ననే వంటలుగావలెను. ఎంతెంత సంతర్పణములైనను రామే శముగారు కచేరీ కాలస్యముగ వెళ్లరు. ఆయన భోజనముచేసి తాంబూలము వేసుకొని కోర్టు తీయువేళకు నందరికంటె ముందుగవెళ్లి కోర్టులో గూర్చుందురు. ఈ ఏర్పాటుజూచి తక్కిన న్యాయవాదులు పురజనులు మిక్కిలి యాశ్చర్య పడుచుం దురు. ఆయన సంతర్పణముల నింకొక గొప్పతనముగూడ గలదు. లోకములోజరుగు సంతర్పణములలో సామాన్యముగ రెండుకూరలు, పప్పు, పులుసు, నేదో పిండివంటయును నుండును. రామేశముగారింటి సంతర్పణములలో పదికూరలు, పప్పుదప్పళము కొన్ని పచ్చళ్లు, పిండివంటలునుండును. కలుపు కొనుటకు స్థలములేనట్లు విస్తరినిండ లెక్కలేనన్ని వస్తువులు వడ్డింతురు. పార్టీలకు సుఖకరమైన మరియొక లక్షణము రామేశముగారియొద్ద గలదు.

ఆయన తెల్లవారు జామునలేచి కాల్యకృత్యములను దీర్చుకొని విభూతిపెట్టుకొని యిల్లువెడలి స్వగ్రామమున నా దిన మున నెవరి వ్యాజ్యములు విచారణ జరుగునో వారియిండ్లకు బోయి వారినిలేపి "అయ్యా ! నేడు మీ వ్యాజ్యము విచారణ జరుగును. మీరు పెందలకడె సాక్షులను వెంటబెట్టుకుని మా ఇంటికిరండు." అని వారలను హెచ్చరించుచుండును. అందుచేత పార్టీలు మనపని రామేశముగారు స్వంతపనిలాగున జూచుకొని ఎంతో శ్రద్ధచేయుదురు, అనిమురియుచుందురు. ఈ కారణముచేతనే కోర్టు పనియున్న నెక్కువమంది తమ వకాల్తానామాలు రామేశముగారికే ఇచ్చుచుందురు. రామేశము

గారికి న్యాయవాదివృత్తివల్ల ధనమెక్కువగా దొరుకుచుండును. లంచములు పుచ్చుకొను మునసబులువచ్చినపక్షమున దానే వారికి లంచము లిప్పించును. అందువలన కొంతలాభము తనకు గల్గును. ఆ దినములలో భూములు మిక్కిలి చౌకగా దొరుకుచుండెను, గావున రామేశముగారేటేట రెండెకరములో, మూడెకరములో భూములు కొనుచుండిరి. అదిగాక నాజరు స్నేహముచేసి వారికి ఏదో ముట్టజెప్పి, కోర్టువారివల్ల జప్తు చేయబడి వేలమునకు వచ్చిన భూములు నాజరు వేలమువేయునపుడు కొనువారెవ్వరు లేకుండగాజేసి, చౌకగా తనకు చేలోకువగానున్న వారిపేర వేలము పాడించి పిమ్మట తనపేరనే వ్రాయించుకొనుచుందురు. పార్టీలు సాక్షులబత్తెములు కట్టునపుడు కొలదిమందికి మాత్రమే సమనులుచేయించి తక్కినసొమ్ము పెట్టెలో వేసుకొనును. సాక్షులకు సరిగా సమను లందలేదేమని పార్టీలు అడిగినపుడు కోర్టుగుమాస్తాలు సమనులసొమ్ము హరింతురు, వారు సర్కారు నౌకర్లు, గట్టిగానడుగుటకు వీలులేదు, నిలువదీసి యడిగినపక్షమున వారు మనపనులు చెడగొట్టుదురు. తన తాబేదారులను నొక్కి యడిగినపక్షమున మునసబుగారికి గూడ మనమీద కోపమువచ్చును. అందుచేత నోరెత్తుటకు వీలులేదు, అని సమాధానముచెప్పుదురు. ఎక్కువ వెలయిచ్చి భూములు కొన్నప్పుడు భాగ్యవంతులైన పార్టీలయొద్దకు తన గుమాస్తానుబంపి, రెండువందలో, మూడువందలో బదులు తెప్పింతురు. రామేశముగారు బదులుతీర్చిన పాపమునపోరు. వారి వ్యవహారములు తనకడకు వచ్చినప్పుడు తనకు రావలసిన ఫీజు క్రిందనో, బహుమానముక్రిందనో, ఇతర వ్యయములక్రిందనో ఖర్చువ్రాసి చిల్లిగవ్వయైన వారికీయకుండ దాటిపోవుచుందురు.

సంతర్పణముల నిమిత్తము పార్టీలు బంపిన సరకులు కందులు, పెసలు, మినుములు, బెల్లము, మొదలైనవి సంతర్పణముచేయగా సంవత్సరమునకు సరిపోవునవి మిగులును. అదిగాక నడుమనడుమ పార్టీలు వచ్చినపుడు కొబ్బరికాయలు, నేయి బంపుమని చెప్పుచుందురు. అందుచేత రామేశముగారింట నెల్లసరకులు పుష్కలముగా నుండును. ఒకప్పుడు రామేశముగారు చిన్న తమాషా చేయుచుందురు. పార్టీ ఎవ్వరైన తను యొద్దకువచ్చి, మీ గుమాస్తాగారు మా పని ఆలస్యముగా చేయుచున్నారని చెప్పినపుడు లేనికోపము తెచ్చుకొని మండిపడి చివాట్లుపెట్టి కొట్టినంతపనిచేసి ఇట్లనును. "ఏమయ్యో! గుమాస్తా, నాకీ పార్టీముఖ్యుడు, ఆయనపని ఆలస్యముచేసితివా నిన్ను పనిలోనుండి తీసివేసెదను. ఎవ్వరివిషయమైన తప్పుచేసినను క్షమింతును గాని, వీరి విషయములో తప్పుచేసిన పక్షమున నిన్ను క్షమించను." ఈ కేకలువిని తన్నిమిత్తమై రామేశముగారు మోమోటములేక గుమాస్తాను చివాట్లుపెట్టినా రనియు వారికి తనయెడల మిక్కిలి ప్రేమయు గౌరవమును కలవనియు సంతోషించి వెళ్లుచుందురు. పార్టీ వెళ్లిన తరువాత గుమాస్తాను బిలిచి 'అయ్యా ? మీరు మనసులో నేమియు అనుకొనకండి. పార్టీలను సంతోషపెట్టుటకై నే నట్లంటినిగాని నాకు మీమీద నిజముగా కోపములేదు.' అని రామేశముగారప్పుడప్పుడు చిన్న నాటక మాడుచుందురు. ఇవియన్నియు రామేశముగారి వృద్ధికి హేతువులు.

మూవడ ప్రకరణము

రామేశముగారి సంసారస్థితి కొంత చెప్పవలయును కుమారుడు ప్లీడరు వృత్తికిరాకమునుపే నాలుగైదేళ్ల క్రిందట నాగభూషణముగారు కుమారునకు వివాహప్రయత్నము చేయజొచ్చిరి. నాగభూషణముగారు మంచి సాంప్రదాయములోని వారు గనుకను రమారమి పదిఎకరములు భూమిగలవారు గనుకను చాలామంది తమతమ కన్యలనిచ్చెదమని వచ్చిరి. పిల్లచక్కగా లేదని కొన్ని సంబంధములును, సాంప్రదాయము మంచిదికాదని కొన్ని సంబంధములును,వరదక్షణ తగినంతలేదని కొన్ని సంబంధములను సతీపతులాలోచించి నిరాకరించిరి. ఎట్టకేలకు దొడ్డిపట్ల నివాసులైన తల్లాప్రగడ రామచంద్రయ్యగారి కుమార్తెయైన కనకదుర్గమ్మను వివాహముచేయుటకై నాగభూషణముగారు నిశ్చయించిరి. ఈ సంబంధము నాగభూషణముగారి భార్యయైన రత్నమ్మగారి కంతయిష్టముగాలేదు. కనకదుర్గమ్మకు మెల్లకన్ను, కాని నాగభూషణముగారి కాసంబంధం మిక్కిలి యిష్టము. కారణమేమన నాగభూషణముగారు మిక్కిలి గడుసువారు. రామచంద్రయ్యగారికి పుత్రసంతానములేదు. కనకదుర్గమ్మయొక్కర్తెయే రామచంద్రయ్యగారి సంతానము. విశేషించి రామచంద్రయ్యగార్కి దొడ్డిపట్లలో రమారమి పుట్టెడుభూమియున్నది. అందుకొంత కొబ్బరితోట, తక్కిన భూమి ధాన్యముపండునది. రామచంద్రయ్యగారి అనంతరమున భూమియంతయు తనకోడలికే వచ్చునని యాశపడి నాగభూషణముగారు మెల్లకన్నున్నదన్నమాట లెక్కసేయక, నది యదృష్టపు మెల్లయని భార్యకు నచ్చచెప్పి యామెను నొడంబరచి యా సంబంధము నిశ్చయించెను. రామచంద్రయ్యగారు పెండ్లికుమారునిజూచికొని సంబంధము మంచిదేనని సంతసించిరి. ఆ సంవత్సరము మాఘమాసములో వివాహము జరిగించుటకు నిశ్చయించుకొని తాంబూలములు పుచ్చుకొనిరి. నిశ్చయింపబడిన ముహూర్తమునాటికి రామచంద్రయ్యగారి కెక్కడనుండియో పురుడు వచ్చుటచేత వివాహము ఆగిపోయి ఫాల్గుణశుద్ధమందు అయ్యెను. రత్నమ్మ

గారి పుట్టినింటివారు చాలామంది వచ్చిరి. నాగభూషణముగారి జ్ఞాతులైన ఆచంటవారుగూడ పలువురు వివాహమునకు వచ్చిరి. రత్నమ్మగారు మొదటినుండియు తన యన్నగారి కుమార్తెయైన త్రిపురసుందరమ్మను తన కుమారునకు చేసుకొనవలెనని సంకల్పించినది. కానివారు భూమి కట్నముగా నీయలేనివారగుటచే నాగభూషణముగా రా సంబంధము నిరాకరించిరి. రత్నమ్మగారి పుట్టినింటివారింటిపేరు గాదెవారు. వారిది మంచిలి నివాసస్థానము. తన మేనకోడలిని జేసికొనననందుకు రత్నమ్మగారు వివాహము జరిగిన నైదు దినములు మొగము చిన్నబుచ్చుకొని యుండెనేగాని, నాగభూషణముగారివలె మిక్కిలి యుత్సాహముతో లేదు. కాని యామె గంభీరమైన స్వభావముగలది గనుక మనోవిచారము పైకి ప్రతిఫలించకుండ మిక్కిలి జాగ్రత్తగనే వర్తించెను. నాగభూషణముగారు సదస్యమునాడు సంస్కారులకు రెక్కచాపులిచ్చిరి. కొందరు పండితులకు తలకొక రూపాయనిచ్చిరి. దొడ్డిమీద పెద్దవారికి తలకొక యర్ధరూపాయయు చిన్నలకు తలకొక పావలాయు సంభావనలిచ్చిరి. నాగభూషణముగారు వివాహముచాలా బాగుగా చేసిరని వాడుకపడెను. రామచంద్రయ్యగారును పెండ్లివారిని మిక్కిలి గౌరవించి, అయిదు దినములు వచ్చిన బ్రాహ్మణులకు పిండివంటలతో మృష్టాన్నము పెట్టిరి. నాగభూషణముగారు కోడలికి రమారమి ఎనిమిది వందలరూపాయల నగలును, మంచి పట్టుచీరయు పెట్టిరి. రామచంద్రయ్యగారు తమయల్లున కలుకపొన్నుమీద నొక కాశ్మీరు శాలువ తెప్పించి గప్పిరి. అదిగాక మగపెండ్లివారితో వచ్చిన బందుగుల కందరకు వస్త్రములనిచ్చిరి. పెండ్లివారు చాల సంతసించిరి. మనుగుడుపులుగూడ నుభయుల గృహములలో నభిప్రాయభేధములు లేకుండ సలక్షణముగా జరిగెను. వివాహమైన రెండుసంవత్సరాలకే రామేశముగారు రాజమహేంద్రవరమువెళ్ళి గొప్ప న్యాయవాదియొద్ద పనినేర్చుకొని తరువాత ప్లీడరు పరీక్షయందు కృతార్థుడయ్యెను. వివాహమైన మూడు సంవత్సరములకు కనకదుర్గమ్మ పెద్దదియై కాపురమునకు వచ్చెను. వచ్చినతరువాత నామె చిన్నపిల్ల, యిల్లుసరిగ దిద్దుకొనలేదని నాగభూషణముగారు, వితంతువై తన ఇంటనున్న రాజమ్మయను తన చెల్లెలిని రామేశముగారికి భార్యకును నుపచారము చేయుటకు పంపెను. రాజమ్మ రెండుసారులు వంటచేసిపెట్టి, చక్కగా వంటచేయుట కనకదుర్గమ్మకు నేర్పి ఒక సంవత్సరముండి వెళ్లిపోయెను. కనకదుర్గమ్మ సరిగా వంటచేయుట నేర్చుకొని, భర్తృసేవయందు మిక్కిలి జాగరూకత కల్గి, మగని మనసు రంజింపచేయుచు నిరుగుపొరుగు పడతులచేత దుర్గమ్మ చాల మంచియిల్లాలని పేరుపొందునట్లు కాపురము చేయుచుండెను. ఆరంభములో రామేశముగారికి న్యాయవాదవృత్తిలో దన కుటుంబమునకు గావలసినసొమ్ము దొరకకపోవుటచేత నాగభూషణముగారు నడుమ నడుమ నరసాపురమువచ్చి చూచి, యింటికి వెళ్లి నెలనెలకు గావలసిన బియ్యము, కందులు మొదలైన సరకులును, వారమునకొక అరవీశ నేయియు బంపుచుండిరి. అందుచేత రామేశముగారు తనవృత్తిలో తగినసొమ్ము దొరుకు వరకు వొకరివద్దకు బదులునకు బోవక నిర్విచారముగా గాలక్షేపము చేయుచుండిరి. రామచంద్రయ్యగారు గూడ తన కుమార్తెకు గావలసిన చీరలు, రవికెలు, దుప్పట్లు, వాడుకొనుటకు కొంతసొమ్ము నిచ్చుచుండిరి. కాబట్టి కనకదుర్గమ్మ తనకు కావలసిన పువ్వులు, పండ్లు మొదలైనవి గొనుటకు మగనిని పీడించక యథేచ్ఛముగా తండ్రియిచ్చినసొమ్ము వాడుకొనుచుండెను.

రామచంద్రయ్యగారు పుత్రికను, జామాతను చూచుటకు పలుమార్లు నరసాపురము వచ్చుచుండిరి. కాని రామేశముగారి యింట నెన్నడు భోజనముచేయుటలేదు. మరియొక బంధువుల ఇంటనో, మిత్రుల గృహమందో, పూటకూళ్ల ఇంటనో భుజించి పోవుచుండిరి. ఊరులో స్వపుత్రియుండగ, వారింటికి వెళ్లక మరియొకచోట యేల భోజనముచేయుచున్నారని ఎవరోయడుగగా, రామచంద్రయ్యగారిట్లు ప్రత్యుత్తరమిచ్చిరి, "కూతునకు సంతానము, ముఖ్యముగా పుత్రసంతానము కలిగినదాక జామాత గృహమున మామగారు భోజనముచేయుట పెద్దల సంప్రదాయముకాదు. ఆ శిష్టాచారము ననుసరించియే నేను మా పిల్లగారింట భోజనముచేయుటలేదు. కాని పిల్లమీదగాని యల్లునిమీదగాని కోపముచేతగాదు." తండ్రిగారు వచ్చినపుడు కనకదుర్గమ్మ "బాబయ్యా, నరసాపురములో కూరలు మొదలైన సమస్త వస్తువులు దొరకుచున్నవి గాని మజ్జిగ మంచిది దొరుకుటలేదు, గొల్లమజ్జిగ వాసన, అదిమిక్కిలి పుల్లగానుండును. గొల్లలు మేకపాలో గొఱ్ఱెపాలో తోడుపెట్టి తెచ్చెదరు" అని ప్రసంగవశమున నొకసారి యనగా, మా యింట రెండుగేదెలు, రెండావులునున్నవి. గేదెనో, యావునో మీకు బంపుదునా యని యల్లునడిగెను. గేదెను పట్టణములో మేపుట కష్టమని, మంచియావునే బంపుడని రామేశముగారు కోరిరి. రామచంద్రయ్యగారు దొడ్డిపట్ల వెళ్లి పూటకు మానెడు పాలిచ్చునట్టి మంచియావును తనపాలేరు ద్వారా బంపిరి. అది పోటులు తన్నులులేని గంగిగోవు. వియ్యంకుడు తన కుమారున కావును తోలి పెట్టినాడని నాగభూషణముగారు బండెడు వట్టిగడ్డి బంపిరి. రామేశముగారుకూడ పచ్చిగడ్డి, చిట్టు, తవుడు మొదలైనవిపెట్టి యావును జాగ్రత్తగా రక్షించుచుండిరి. కనకదుర్గమ్మయు రామేశముగారును

చిక్కనిమజ్జిగ నొకపూటను, పెరుగొకపూటను బోసికొని హాయిగా భుజించుచుండిరి. తండ్రిగారు పంపినగడ్డి అయిపోయిన తరువాత రామేశముగారు తనకు పరిచయమున్న పెద్దరైతుల పేరవ్రాసి సంవత్సరము పొడుగునా గడ్డి తెప్పించుకొనుచుండిరి. అందుచేత గోవు మంచిమేతకల్గి చెడిపోక చక్కగానుండెను.

రామేశముగారు క్రమముగ మంచికాతాలు సంపాదించిరి. పాలకొల్లులోనున్న గొప్పకోమట్ల గుమాస్తాలయొద్దకు తన గుమాస్తాను బంపి వారియజమానుల కాతాలు తనయొద్ద బెట్టించుమని కోరిరి. కొందరు పూర్వపు న్యాయవాదుల వలన నేరమేమియు లేనపుడు తమకాతాలను వారివద్దనుండి ఇతరుల కేలయీయవలెనని రామేశముగారి కోరిక నిరాకరించిరి. క్రొత్తయొక వింతయగుటచే గొందరు తమ కాతాలను రామేశముగారికిచ్చిరి. సంబలదీవిలో మిక్కిలి గొప్పగృహస్థులైన చెన్నాప్రగడవారి కాతాలు రామేశముగారి వశమైపోయెను. ఈ విధముగానే తాటిపాక, నగరము, శివకోడు మొదలగుచోటులలోనున్న గొప్ప గృహస్థుల నాశ్రయించి రామేశముగారు వారికాతాలు గూడ తమకడకు దెప్పించుకొనిరి. మొత్తముమీద రామేశముగారి వల్లమునుపటి న్యాయవాదులకు కొంతరాబడి తగ్గిపోయెను. ఆ కారణమున వారిలో అనేకులకు రామేశముగారిమీద నయిష్టము గలిగెను. పైకిమాటలాడుచున్నను వారి కందరకు మనసులో నసూయ గలిగెను. వృత్తిలో దెలివితేటలవల్లగాక మాయోపాయములవల్ల రామేశముగారు వృద్ధిలోకి వచ్చుచుండుటచే ఆయనకంత మంచిపేరు లేకపోయెను.

ఆ కాలమున నిప్పటివలె లారిపోర్టులు లేవు. ఉన్నను న్యాయవాదులని పేరుపెట్టుకున్న వారెవ్వరికి నింగ్లీషురాదు. కనుక వానింజూచి వాదనచేయువారెవ్వరులేరు. ఇంగ్లీషు ప్లీడర్లకురాదు, మునసబులకురాదు. వకీళ్లవాదనలు తెనుగులోనే. మునసబులతీర్పు తెనుగులోనే. మునసబు కోర్టుమాట లెక్కయేమి, జిల్లాకోర్టులో న్యాయాధిపతి దొరగారైనను వకీళ్ల వాదనలు సాక్షుల సాక్ష్యములు తెలుగులోనే జరుగుచుండెడివి. అట్లయిన దొరగారికి వీరివాదనలు దెలియుటెట్లందురేమో ? దొరగారి మాటలు సాక్షులకు న్యాయవాదులకు చెప్పుటకును న్యాయవాదుల యొక్కయు, సాక్షులయొక్కయు మాటలు దొరగారికి చెప్పుటకును "దుబాసి, అనగ" ట్రాన్సులేటరు" యొకడుండెడివాడు. అందుచేత వ్యవహారము సరళముగా నడిచిపోవుచుండెడిది. అక్కడ గవర్నమెంటు ప్లీడరుగూడ దెనుగులోనే వాదముచేసెడివాడు. కొందరు న్యాయాధిపతులకు తెనుగుతో కొంత ప్రవేశముండెడిది. కుమారుడు న్యాయవాదిగ నుండి పేరు సంపాదించుచున్నపుడు కన్నులారాజూచి యానందింపవలెనని రామేశముగారి తల్లియైన రత్నమ్మగారికి వేడుక గలుగ ఆమె యొకసారి నరసాపురమువచ్చి కొడుకుదగ్గర నెలదినములుండెను. ఆ దినములలో నాగభూషణముగారి సంరక్షణము చెల్లెలైన రాజమ్మ చేయుచుండెను. అత్తగార్కి వినయవిధేయతలుగల్గి కనకదుర్గమ్మ శ్రద్ధాభక్తులతో నుపచారము చేసెను. తనయన్నకుమార్తెను దనకుమారునకిచ్చి పెండ్లిచేసుకొను భాగ్యము గలుగలేదని రత్నమ్మగారు మొదటగొంత విచారించినను, కోడలియొక్క భక్తి ప్రపత్తులు చూచిన తరువాత మనసులో నెట్టి విచారమునులేక కోడలిని తనకూతురు వలెనే జూచుకొనసాగెను. అత్తకోడండ్రకు మనసులో నేవిధమైన స్పర్ధలు పుట్టలేదు. అత్తగారికేమిలోపము జరుగునోయని కోడలు మనసులో భయపడుచు నుపచారము చేసెను. కోడలేమి కష్టపడునోయని శంకించుచు నామెకు శ్రమయగు పనులు చెప్పక అత్తగారు కాలక్షేపము చేయుచుండెను. తనతల్లియు, భార్యయు నైకమత్యముగల్గి గృహకృత్యముల నెరవేర్చుకొనుట జూచి రామేశముగారు తల్లి స్వగ్రామము వెళ్లదలుచుకొన్నపుడు, మంచిమంచి చీరలు గొనియిచ్చి యామెకు పదిరూపాయలు రొక్కమిచ్చి గౌరవించి పంపెను. కొడుకును కోడలునుచేసిన మర్యాదకు రత్నమ్మగారు మిక్కిలి సంతోషించి ఆచంట వెళ్లినతరువాత బందుగులతోను, నిరుగుపొరుగు అమ్మలక్కలతోను, తనకోడలి సుగుణములు చెప్పుచు వచ్చెను. సుపుత్రులగన్న తల్లుల యానంద మిట్టిదేగదా ?

కాల మొక్కరీతి గడువదుగదా ? రత్నమ్మగారు స్వగ్రామము వెళ్లిన నెలదినములకు నాగభూషణముగారికి జబ్బుచేసెను. ఇరువది దినములు ఆయనకు జ్వరముకాసెను. అప్పటికాయన కరువది సంవత్సరములు వయసుదాటుటచే మందులు సరిగా పనిచేయలేదు రామేశముగారికి దల్లి వర్తమాన మంపుటచే రామేశముగారు భార్యను వెంటబెట్టుకొని యాచంట వెళ్లిరి. పుత్రుడు వెళ్లునప్పటికి జనకుని స్థితి మారిపోయెను. జ్వరముచేత నాగభూషణముగారికి సంధించెను. కొడుకువచ్చిన సంగతియే ఆయన యెరుగడు. మంచముమీదనుండి లేచి పరుగెత్తసాగెను. పట్టుకొనుట మిక్కిలి కష్టమాయెను. ఆయన జబ్బుమాటవిని, మంచిలినుండి రత్నమ్మగారి అన్నదమ్ములు వచ్చిరి. జ్వరముకాయ నారంభించిన నిరువదియైదవ దినమున నాగభూషణముగారు పరమపదించిరి. రామేశముగారు జనకుని నిర్యాణమునకు మిక్కిలి విచారించి యధావిధిగా నుత్తర క్రియలు చేసిరి. గోదానము మొదలగు దశదానములు చేసిరి. **[సశేషం]**

కోణార్క

శ్రీ బొడ్డు బాపిరాజు

[కోణార్కలోని సూర్యదేవాలయము కళింగశిల్పుల కళాప్రతిభకు కన్నాకు. గాంగవంశీకుడైన మొదటి నరసింహదేవుడు 13వ శతాబ్దిలో దండెత్తిన మహమ్మదీయరాజును మార్కొని జయించి విజయాంకముగా దీనిని నిర్మించినాడు. రాజభోగముల రాణించిన ఈదేవమందిరము నేడు స్వామి శూన్యమై భగ్నావశిష్టమైయుండియు దేశదేశాల కళాయాత్రికులను తన శిల్పసౌందర్యముతో ముగ్ధులనుచేయుచున్నది.]

విపుల బలగర్వితుడు మ్లేచ్ఛ విభుని వీర
పారసిచమూ ధ్వాంతముల్ పారద్రోలి
ప్రబలు నరసింహ రాజమార్తాండునకును
జగదపూర్వ దిగ్విజయాంక మగుచు నిచట
చిందెనే ఉత్కళ కళారవిందమధువు!

వీరశ్రీ నరసింహదేవుని యశోవిభ్రాంతి గేహమ్ము, ప్రా
క్తీరాంభోనిధి దర్పణోత్కళపురంధ్రీఫాల విన్యస్త క
స్తూరీరేఖ, అనల్ప శిల్పమణి పాథోరాశి, భాస్వద్రథా
కారంబై చెలువారు సౌధమిది యర్కస్వామి యాస్థానమా!

ప్లుతగతితో పదాతిదళముల్ మునుముందుగ సాహిణీలు రా
హుతులును మావతుల్ మదగజోత్కరముల్ పరివారకొల్ల రా
నతివలతోడ వచ్చి నరనాథుడు తద్రథ సప్తమీ మహా
వ్రత మొనరించి పాయసము పంచిన పుణ్యవసుంధరాంకముల్

ఇవి తురంగములు కా వింద్ర ధనుష్కాంతు
లేడు వారము లందగించెగాక
అవి రథాంగములు కా వల సితాసితపక్ష
ముల శరన్మాసముల్ పొలిచెగాక

ఇవి పత్రములు కావు దివసాబ్జదళములు
జాములెన్మిదియు పొసంగెగాక
అవి గోపురములు కావభ్రంకషములైన
ఉదయాస్తగిరులు చెల్వొందెగాక
అసమచతురశ్రకోణ విన్యాసశోభ
నా పదాంచలశిఖర శిల్పాంతర మిది
మందిరము కాదు దినకరస్యందనంబు
ఏ మహాశిల్పి స్వప్న సరోమరాళి!

మత్తగజమ్ములో సమరమార్గతురంగములో విలాసినీ
నృత్తములో మృదంగతరుణీ మురళీ మృదుపాణులో లతా
వృత్తములో సమస్తమొక విభ్రమమున్ కలిగించునిట్టి లో
కోత్తర శిల్పకావ్యరసికుండు నృపుండతడెంత ధన్యుడో!

పలికింతువే ముగ్ధభావగీతము లోక-
ఘణితి వీణా పాణివైన తన్వి?
ఏ మనోహరునకై యీ కింశుకచ్ఛాయ
నిలిచి నిరీక్షింతు వలరుబోణి?
నీ మృదంగ ప్రశావ్య నినదమ్ము లే విలా
సిని లాస్యవేళ ప్రమోగినవి రమణి?
అభిసరత్త్వరను పాదాంగదం బూడెనో
సవరించుకొనుచుంటి వవనతాక్షి?
ప్రియుని మెప్పించుకై నేత వెలయు పొంపు
కేల నద్దమ్ముగొని చూతువే లతాంగి?
మా స్థపతులే మహాయోగ మహిమ మిమ్ము
మలచిరో శిల్పము లనంగ మనసురాదు!

మదగజములార! రణజయోన్మాద కేళి
శత్రువీరుని హస్తపాశమున మెలిచి
చంపనుంకింతురే చాలు సంగరమున
చిత్తుగా నోడి రిపులు పర్వెత్తినారు.

కోణార్క

బాణ తూణీర సంబద్ధ పార్శ్వయుగము
యీ సుసజ్జిత జవనాశ్వమే తురుష్క
గర్వ నిర్వాపణార్థమ్ము కదలునోయి
సాహిణీ! పల్కవది రహస్యంబా ఏమొ?

చనవున ప్రాక్పయోనిధి యజస్ర సహస్రతరంగ కంఠని
స్వనముల సుప్రభాతములు పల్కగ, గాంగనరేంద్ర సుందరీ
జన నయనాబ్జమాలికలు స్వామికి పూవుల శాటిగాగ వా
ల్గిన యలనాటిగాథ లెరిగింపరె కుడ్య శిలావిలాసినుల్!
మలచిన పద్మరాగమణి మంజరులౌచు ప్రభాత భాస్కరో
జ్వల కిరణమ్ము లయ్యుదయ వార్ధి తరంగ తురంగ వాహన
మ్ములు దిగివచ్చి స్వామిగుడిమోసల సాగిలి పోవునంట, ఆ
చెంగవము లిప్పుడున్ గలవె జీర్ణదశా ప్రభుశూన్యమూర్తికిన్?

సేవాభావ సమాగతోత్కళ సతీసీమంత కాశ్మీర రే
ఖావర్ణాంకిత పాదపంకజ రుచి క్రాంతంబు; ప్రత్యూష పూ
జా విశ్రాంత శుభస్వనంబునగు ఛాయాదేవి శుద్ధాంత మ
ద్ధా విద్ధంబయి చూచుమిన్నుల పునస్తా దృష్టిన ప్రాప్తికై.

లీల మృణాల సూత్ర నిభ రేఖల శిల్ప నిచోళ మీ చతు
శ్శాలిక హావభావరస సంపద నుత్కళ రాజనర్తకీ
జాల మనన్యమా ప్రతిభ చాటిన చోటిది భగ్నశీర్షమై
నేలుచునో పురాస్మృతులు భీకర కాల మహాధ్వరమ్మునన్.

మూడు ప్రొద్దుల పచ్చకప్పురపు తావు
లమర స్వామికి నిత్యభోగములు కూర్చు
ఈ మహానస మవని పర్యంకమందు
కుములుచున్నది అస్థిభారముగ మిగిలి.

లోగొనునో మిమున్ సకలలోక శుభాశుభయోగ నిర్ణయో
ద్యోగుల దుర్దశాఫలము లోగ్రహదేవతలార! పాప మా
భోగములెల్ల పోయినవి పో గ్రహనాయకుడే ప్రవాసియై
యేగెను; దిక్కుమొక్కు కలదించుక మీ పనియే నయమ్ములే!

గంధగజకుంభ విదళనో గ్రాత్ములగుచు
ద్వారరక్షకులౌ మృగేంద్రమ్ములార!
మమ్ము తప్పించుకొనుచు పాదమ్ము మోపె
నిచట దురదృష్ట మెట్లు—నిద్రించి నారె?

అనఘుం డా మతమత్తు డెవ్వడో కుఠారాగ్రమ్ములన్ శిల్ప నం
దనమందారము సూర్యమందిరము భగ్నప్రాయముం జేసియున్
చనడో; ఏ యపరాధముల్ సలిపె నీ శైలాంగనా శ్రేణి? కాం
చన హార స్తన హస్త మస్తక శిరోజశ్రీ విలుంటాకమున్
బొనరింపన్; చమరించు కన్నులసహిష్ణు క్రౌర్య మూహించినన్.

కలవు కథలెన్నొ కృష్ణయ్య కన్నకొడుకు
సాంబుడు తపస్వియై రుజావిముక్తి
గాంచి, యాదిత్యునిట ప్రతిష్ఠించె నంట
ఏ యుగమునాటి మాటలో యివి యటంచు
పరిహసింపకుమీ యవిశ్వాస బుద్ధి!

పొరపడెనంటపో స్థపతి పుంగవుడే గుణకారమందో, గో
పురము ఘటింపగాక, మరి భూపతి యేమనునో యటంచులో
వెరపున నుండ లెక్క సరిపెట్టి యమర్చిన బాలశిల్పి త
ద్వర సుతుడంట విశ్రుత కథాంశము లెంత మనోహరమ్ములో!

మతహంకారులు మ్లేచ్ఛభూపతుల యున్మాద క్రుధాజ్వాల కా
హుతులై పోయెను సుందరాలయములెన్నో;—దేవతల్ లోకవం
దితులవ్వారి మసీదు వాకిళుల ఖైదీలైరిపో భారత
క్షితియం దెల్లెడ నిల్లై, చక్కదనమే చేటయ్యెనో ఏటికిన్!

నిలిపె తొలుదొల్తను కళింగనేత గాంగ
కులుడు దేవేంద్రవర్మ మా తెలుగుసీమ
నరస వెల్లి నాదిత్యుని, అతడు కూడ
మ్లేచ్ఛరాహుకరాళ దంష్ట్రికలలోన
నలిగి, తలదాగి, వెలిగె పునః ప్రశస్తి
కలదొ కోణార్క! నీ జాతకమున శుభము.

రసికుడు రాజశేఖరుని రంజనకో, వారి దర్శనార్థి మా
నస పరిశుద్ధ భావతులనమ్మనకో, మరిదృష్టి దోషమున్
పోసగక యుంటకో, అసలు పుట్టిన బుద్ధియె నీకు శిల్పి! తా
మసగుణ మగ్గలింప ప్రతపమాలియు నేగతి గండరించి నా
వసదు లనంగ సంగర రహః కృతు లివ్వి సుధార సంబులో
విసములు—త్వద్యశో భువన విస్తృత గీతి కపశ్రుతుల్ సుమీ.

కమనీయ నిర్మాణగతి విలక్షణముగా తరళించు వాస్తు సౌందర్యమునకు
గోపురాంతరసీమ చూపుల విందుగా ప్రత్యక్ష మగు సాలభంజికలకు.
అంగుళం బెడమీక యలవోక నతిలోక కల్పనల్ చూపించు శిల్పములకు
వాతాతప విరోధి ఘాతమ్ములకు సైచి చెలువేదు భగ్నావశేషములకు

ఒకటి కాదని యొకటి వేరొకటి గాగ
చూచినదె చూచి సంభ్రమ వీచి మునిగి
తీరని పిపాస చూపుతో తిరుగు మనసు
అంబుజాగ్ర భ్రమద్భంభరంబు వోలె.

మాణిక్య కేయూరమకుటకుండల శోభ
మందస్మితాస్య సంపద వహింప
రమ్యమౌక్తికహార రత్నసూత్ర శ్రీలు
విపులవక్షస్సీమ విందు సేయ
ఖండితాబ్జమృణాల కలిత శుభాంగుళీ
వరదముద్రాంకిత కరములలర
కనక కాంచీదామ ఘటిత కౌశేయమ్ము
ఆజాను కటిభోగమై చెలంగ

శ్రీ చరణ పీఠికను సమాసీనుడైన
అరుణసారథి తోడ సప్తాశ్వ దివ్య
రథముపై నిల్చి సూర్యనారాయణుండు
సతులమువ్వురిగూడి సాక్షాత్కరించు
నిలయ పశ్చిమ దిక్ఛిత్తి నిందుకరుణ!

క్షేమేంద్రుని దేశోపదేశము

శ్రీ పమిడిపాటి వెంకటరమణ

క్షేమేంద్రుడనసరికి భారతీయ సాహిత్య పరిచయమున్న వారందరికీ అతని ఔచిత్య విచారచర్చ వెంటనే స్ఫురణకు వచ్చును. కావ్యాత్మ స్వరూపచర్చా మహోద్యమచరిత్రలో ఔచిత్య ప్రస్థానమున కతడాచార్యపీఠము. అట్లని అతడు కావ్యతత్త్వ ద్రష్టయైన ఆలంకారికుడు మాత్రముకాదు రమ్యకవిత్వ స్రష్టయును. సమకాలిక సమాజరక్తనాడులలో చొచ్చుకొనిపోయి అందలి విషవ్యాప్తి నిర్మూలనకు అమృత తుందిల రచనా నిర్మాణముతో అతడు నాటి సాహిత్యముననేకాదు భారతీయ సాంఘిక పరిణామావసరమున వెలయు సాహిత్యమునందంతటను విశిష్టస్థాన మధిష్ఠించినాడు. ఆ సమాజపు విశ్వరూపమును నిండు కళ్ళతో దర్శించి లేఖినీ ముఖమున దానిని గంభీరముగా పునర్భవ పునీతమొనర్చిన వాడతడు.

సరస్వతీ దరహాస చాలనములకు ఆ కరమైన కాశ్మీర సీమలో క్రీ. శ. 990—1065 సం. ల నడుమ అభినవ గుప్తపాదుని శిష్యుడుగా అనంతదేవ భూపాల సమ్మానితుడునై వాసికెక్కినవాడు క్షేమేంద్రుడు. అతఃపూర్వమున్న సంస్కృత వాఙ్మయమును పూర్తిగాజుర్రి సువిశాలమైన సాహిత్యానుభవమును గడించినాడు. అంతేకాదు. లోకముయొక్క మంచి చెడ్డలను లోతుగా పరిశీలించినాడు. ఆ శారదా పీఠప్రాంగణ రంగ వల్లికలుగా విషయ వైవిధ్యముతో ముప్పది గ్రంథములు రచించినాడు. అందు సంస్కృతమున అధిక్షేప వాఙ్మయమునకు అధ్యక్షస్థాపన మలంకరించు కావ్యములొకటికాదు రెండుకాదు అయిదున్నవి. అవి దర్పదళనము, కళావిలాసము, సమయమాతృక, నర్మమాల, దేశోపదేశము. ఈ కావ్యములలో సంఘములోని కుళ్ళునంతటిని జలకడిగి విడిచినాడు. లోకమునెడ అతని చూపు సింహావలోకనము. పోల్లుంతన మతనివాక్కు రామ బాణము. అతని విమర్శ అధిక్షేప కేవలము, తర్కకర్కశమును అగుటకాదది హితోపదేశపేశలమును. అది మానవ స్వభావమును మూలనుంట స్పృశించినదగుట కవిక్రాంత దర్శనుడగుట, తద్దేశ పరిమితమును తాత్కాలికమునుగాక సార్వదేశిక సార్వకాలిక ప్రతిపత్తియు కలిగియున్నది. అందుకొన్ని తాత్కాలికాచార పరిమితములైన ప్రకరణములున్నను అటనతడు మానసిక ప్రవృత్తిని విశాల దృష్టితో చిత్రించిన వాడగుట అవి అభిప్రాయ నిరపేక్షముగా ఆస్వాదనీయములే. ఔచిత్య విచార రూపమగు ప్రజ్ఞ అతనికి సంస్కారసిద్ధము వివేచనా బద్ధమును ఐనది. అది యెంతటి నిశిత విమర్శకునను నికషరేఖ.

ప్రకృత మాతని దేశోపదేశము.

అది

ఇత్యుద్దేశ నిర్దేశనేన వివిధం యత్కించి దుక్తం మయా
తత్సర్వం స్మితకారణం సహృదయాః శృణ్వన్తు సంతఃక్షణమ్
క్షేమేంద్రః ప్రణితం కరోతి నపటు శ్లోకోప హాసేష్వలం
కింత్వే షవ్యపదేశతః ప్రతిపదం దేశోపదేశః కృతః

అభిప్రాయములు, వానికి తగిన నిదర్శనములతో వర్ణింపబడినదిది. అన సంస్కరణ కవసరమైన ఆచారముల, నమ్య గభిప్రాయముల నిరూపించి, నిదర్శన పూర్వకముగ నిరసింతునని చెప్పుకొనుట. అవి అన్నియు సహృదయులచే నవ్వదగినవి అని, అట్లని కేవలము లోకముచే నవ్వబడుటకు మాత్రమే కాదు అందలి ప్రతిపదమును ఉపదేశ వ్యపదేశమైనదే. అట్టి దేశోపదేశమును క్షేమేంద్రుడు రచించినాడు. లోకమున కుపదేశదృష్టి ప్రధానమగుట దానిపేరే దిగంబరముగ చెప్పుచున్నది. ఆది ప్రముఖము. అనుషంగికము, రచనావసరమున ఉల్లిసహల్లినకముగ హృదయమాగి ఉపదేశోపచయమున కుపకరణము హాస్యము. ఇది నేరుగా సాంఘిక విమర్శగాని వ్యక్తి విమర్శగాని చేయుటకు ప్రతి రచయితయు గ్రహించు ఉపకరణమే. అయితే ఏ రచయిత అయినను కొంతవివేచన కలవాడయిన ఉపదేశములకేమి తెగచేయవచ్చును. తాను ఆచరించు విషయ మెట్లున్నను ఇతరులను ఆచరింపచేయునట్లున్న కాని ఉద్దిష్ట ప్రయోజనము పండుపండదు. అట్టిరచనవలన ఉపదేశమునకును బరువు, సూక్ష్మత, నిశితత్వములు అలవడును. అన ఉపదేశోపయుతమైన రచనచేయుట అతిసామాన్య విషయమే కాని అది కవితాస్థాయి నందుకొనుటకు— అవ పతిత్ప హృదయగ్రాహకమగుట— కవిరచనా వైదగ్ధ్యము వ్యంగ్య వైచిత్రిచిత్రతమైన రమ్యభావన. ఇలాఇలా కవికి కావలసిన సర్వ లక్షణాలు ఉండవలయును. వ్యంగ్య ప్రధానమై ఉపదేశ బోధకమగుటకు రచనలో హాస్యమవసరమేకాని పర్యవసానములో కరుణమున్నకాని ఆహాస్యము అనుకున్నంతగా ఉపదేశమును వాట లేదు. ఆ విషయమును గుర్తించినవాడే క్షేమేంద్రుడు. కాని

ముఖ్యముగా ప్రయోజనములు హాస్యము ఉపదేశములు అనియే పరిపరి చెప్పును.

దేశోపదేశ ప్రారంభముననే రమ్యకల్పనతో రచన ఉద్దేశమును, మార్గమును, ఫలమును నిర్దేశించినాడు. జయజయ నినాదములతో కావ్య నాయికా నాయకులకు సుస్వాగతము చెప్పినాడు.

జయంతి వేశ్యా వ్యసనాభ్రవిద్యుతో
జయంతి కౌటిల్యకలా నటావిటాః
జయంత్యజస్రం జనవృక్షపాతినీ
ప్రకృష్ట మాయాతటినీచ కుట్టనీ.

వ్యసనమను ఆకాశమునకు సౌదామిని అయిన వేశ్యకు, కుటిల కళానటుడు విటునకు, ఎల్లప్పుడూ జనులను వృక్షములను కూల్చునట్టి పూచి వంటి బిడ్డయిన కుట్టనికిని జయము. ఆ పాత్రలను వర్ష సంబంధి వస్తు సంచయముతో పోల్చి వర్ష వర్ణన కూడ గ్రంథారంభమున చేయుట చక్కని అర్థస్ఫూర్తి, భావ వికసన, కవిసమయ సంయోజన అంత కన్నిటికీ మించి ఆత్మప్రయోజనము వ్యంగ్య మర్యాదతో చెప్పుట అనునవి అన్నియు రమ్య మాధుర్యముతో గూడు కట్టినవి. వర్ష ప్రయోజనము కశ్మలక్షాళన, స్వాదు సస్యావాపన, సంవర్ధనములు మూడును ఈ గ్రంథమువలన సఫలములని సూచన. వేశ్యాదుల దురాచార ఫలితమైన సమాజ సంకటములను వర్షము కశ్మలము నెట్లు కడిగివేయునో ఇది అట్లు తుడిచివేయును. ఆ సమాజము నిర్మలమైన పిదపనే నవ్య సస్యములనాటి వానికి సదాచార దోహద క్రియలతో నిర్మల సమాజ నిర్మాణమునకు ఈ గ్రంథ ముపకరణ మనుట సూచన. వినాశమార్గానుయాయిమైన రచనే కాక నిర్మాణక్షమమైన ఉద్దేశములతో కూడినదని తాత్పర్యము. ఆ వర్ష వర్ణనతోనే కవిత్వము పుష్పవతి యైనది. అట్లు ప్రయోజనమును రమ్య వర్ణనతో సూచించి పిదప స్పష్టముగా

యేదంబ మాయామయ దోష లేశ లిప్తాన మేతాన్ప్రతి కోపి యత్నః
కిం త్వేష హాసవ్యపదేశ యుక్త్యా దేశోపదేశః క్రియతే మయాద్య
హాసేన లజ్జితోఽత్యన్తమ్ సదోషేషుప్రవర్తతే
జనస్తదుపకారాయ మమాయం స్వయ ముద్యమః.

అని చెప్పినాడు. తమ తప్పులకు లజ్జించి సరిదిద్దుకొనవలయునని దృష్టి. పైన పేర్కొనబడిన వ్యభిచార మూలక పాత్రలే కాక నాటి అతిబాల్య వృద్ధ వివాహముల వంటి ఆచారములు, ఖలుడు కదర్యుడు వంటి సమాజ కంటకులు, అధ్యయనము పేరున దూరదేశములనుండి వచ్చిన విద్యార్థులు చేయు దుండగములు మొదలగు వారిదురాచార పరంపరా వ్యాప్తిసరణి నిశితముగ నిరసించినాడు. అటువిటే అయిన ఒక రచన నర్మమాలలో

హాసాయాతీత కాయస్థ చరితం కర్తు మీరితః
కరోతి తత్ప్రసంగేన దురాచార విడంబనమ్.

(ప్రథమ పరిహాసము. 6)

అనియు,

సుజన వినోదాయోంచితా హాస్య సిద్ధయా
కథయతి ఫలభూతం సర్వ లోకోపదేశమ్.

(తృతీయ పరిహాసము. 214)

అనియు చెప్పినాడు. హాస్యము సుజనుల కొరకు, విమర్శన, ఉపదేశములు దుర్జనులకు అట. సుజనుల హాసమువలన లజ్జితులై జనులు దోషమున ప్రవర్తింపకుండుటవలన జనులందర కుపకారమునకు తాను రచించితినని పై శ్లోక విషయమిట సమన్వయము చేయవలయును. నర్మమాల కూడ నిట్టి రచనమే కాని అట ప్రముఖముగ సమాజ కంటకులైన కాయస్థుల నిరసనమే అగుట దురాచార విడంబనము తత్ప్రసంగమున జరిగినదిగాని ఈ రచనలో అట్లుకాక ఉన్న ఎనిమిది ఉపదేశములలో నేడు దుర్జన విషయ విన్యాసితములును చివరది మిగిలిన దుర్ముఖుల ప్రకీర్ణ మగుట దురాచార నిరసన ప్రస్తుతముగను ప్రసంగవశముసను సాగినది.

నాటి సంఘమున పెరిగిన ముళ్లను, వానిని దులిపివేయు టకు క్షేమేంద్రుని ప్రయత్నములను తెలిసికొనుట కొక్కొక్క ఉపదేశమును చెప్పిన విషయములు క్లుప్త వివేచనతో—

మొట్టమొదటి ఉపదేశము సర్వ వ్యాపకమైన ఖల స్వభావ సమున్మీలన, సముత్పాటనలు. ఖల స్వభావము సర్వ దురాచారముల బీజ భూతముగ వ్యాపించి యుండుటచే దానిని ప్రప్రథమమున చెప్పుటయు పిదప ఒక్కొక్కరే లోక కంటకుల చెప్పుటయు చివర మిగిలినవారి నందర గుచ్చెత్తుటలో మొత్తము గ్రంథమునకు సక్రమానుక్రమణిక ఏర్పడినది. ఖల స్వభావమును సర్వ వ్యాపక మనుటకు చూడుడు భగవద్గీతలో ప్రసిద్ధమైన భగవత్సర్వాంతర్యామిత్వమును చెప్పు,

సర్వతః పాణిపాదం తత్సర్వతోఽక్షి శిరోముఖం
సర్వతశ్శ్రుతి మల్లోకే సర్వ మావృత్య తిష్ఠతి

(13:14)

అను శ్లోక భాగమును గ్రహించి

క్షేమేంద్రుని దేశోపదేశము

ఖలః సుజనపైశున్యే సర్వతోఽక్షి శిరోముఖః
సర్వతః శ్రుతిమాంల్లోకే సర్వ మావృత్య తిష్ఠతి

అని అంటించినాడు. ఎంతో గొప్ప విషయములను అత్యల్పమైన విషయములతో పోల్చి వాని అల్పత్వమును సుస్పష్టముగ చూడగలుగునట్లు చేయుట వ్యంగ్య విమర్శలో ఒక పద్ధతి.

ఖల శబ్దమునకు క్షేమేంద్రుడొక క్రొత్త వ్యుత్పత్తిని చూపించినాడు. 'ఖ' అన ఖఛిద్రమును 'ల' అన లఘువును చెప్పునట. అన లఘువు అయికూడ మహాత్ముల మధ్యలో ఘుణమువలె నిముషములో కొండెము పుట్టించి వ్యాపింపచేయుటయందు మాయావి అగుట అతడు ఖలుడాయెనట. (1:16) ఎత్తుగడలోనే ఉలూఖలము (ఱోలు) వంటి ఖలునకు నమస్కారమని వ్యంగ్యముగ ప్రారంభించినాడు. ఉలూఖ సంబంధి విషయములతో పోల్చి వాని కర్కశత్వ నిరూపణమే కాక, వందనసమర్పణ ఖలునకు ఉలూఖమునకు కూడ చేయుట ఈతడు ప్రతి ఉపదేశమునను అనుసరించిన రమ్య వ్యంగ్య మర్యాదకు ప్రారంభము. ఇక ఆ ఖలుడు శత్రుమిత్రుల యెడ సమవర్తి. మానావమానములలో నిశ్చలుడు, వృత్తిచ్ఛేదనములో అభ్యాసము కలవాడు అయిన నిర్వాణదీక్షితుని వంటి అద్వంద్వుడని శ్లేషయుతముగ విమర్శించినాడు. ఖల స్వభావ విమర్శనలో చాలవరకు వీని అల్పత్వమును స్పష్టపరచుటకు ఉత్తమ విషయములతో గాని, ప్రసిద్ధ విషయములతో గాని శ్లేషను సంఘటించి విమర్శించినాడు. అతడు అశని (పిడుగు) అయి కూడ శని ఆయెనట. అతడు స్వగుణోదరణమున శేషుడు పరనిందలో వాక్పతి. ఇక జఘనముతోవానిని పోల్చి,

లజ్జావ్యసన సమ్మోహ హేతునా కామకారిణా
కోనామ జఘనే నైవ ఖలేన నఖలీకృతః

అని నిర్లజ్జను సిగ్గు వచ్చునట్లు చెప్పుట రమ్యము. సిగ్గు విషయముననే జఘనములో పోలిక అతని ఔచిత్య విచారమునకు చక్కని సంచారము. ఆఖలులయందును మూర్ఖ ఖలునకు పండితఖలునకు ఉపమాన ప్రయోగములో తారతమ్య నిరూపణ చూడుడు.

భగ్నదంత ఇవవ్యాలః శ్రేయాన్ మూర్ఖ ఖలోవరమ్
పక్షవానివ కృష్ణాహిర్నత్యేవ ఖల పండితః.

పండ్లూడిన వ్యాలమువలె మూర్ఖఖలుడు శ్రేయుడే అయినను పండితఖలుడు రెక్కలువచ్చిన నల్లత్రాచు వంటివాడట. దుర్జనత్వము సమర్థమైననే లోకకంటక మనుట. ఇతని స్వభావమును సమాహారముచేసి చివర

భృకుటి కుటిల దృష్టిర్ధాతు రన్యైవసృష్టి
ర్దన లవమదలిప్తః ప్రౌఢవాదాను లిప్తః
సదసి కుటిలదోష్మై ర్దుర్జనః సజ్జనానామ్
మలినయతి యశాంసి స్ఫార కైలాస భాంసి.

అని చెప్పినాడు.

రెండవ ఉపదేశము లోభి విషయము. ఇతడును నవ ప్రక్రియా పురస్కృతుడు. వ్యక్తుల విమర్శన చేయుటలో వారు సంఘముమీద చూపు ప్రభావమునకు కారణమైనవారి మనస్తత్వమును ప్రభావ సంబంధము లేనిదానిని కూడ స్పష్టముగ అర్థము చేసుకొనవలయును. దానికి కవిత్వాపాదనకు చక్కని ఉపమాన ప్రయోగము అవసరము. లోభిట 'విముఖాః సతతమ్ యాంతి శ్మశానాదివ బాంధవః' అట. వాడు బాంధవ్యులకు విముఖత వలన శ్మశానమట. శ్మశానమువలె చొరరానివాడు, చొర సాహసించినను నిష్ఫలమైనవాడు అని. లోభి అనగనే ధనసంచయనము వాని జీవిత లక్ష్యమని కదా. వానికి ధన, భూమి, దార, గృహములు జన్మ సంచితములట.

ధనం భూమి గృహం దారాః సర్వథా జన్మ సంచితమ్
పరార్థమేవ పర్యంతే కదర్యస్య జినస్యచ.''

అన్నిటినీ జన్మసంచితములవలె చూచుటచే వానికి వేనిమీదను ప్రేమ లేదనుట దానిచే అతడు జినతుల్యుడట. ఇక ఎత్తిపొడుపుగా ''కోఽన్య సదృశోదాతా'' అనినాడు. వాని లోభమెంతవరకు పోయినదన చివరకు బట్టకట్టుకొనుటకును ఇష్టపడక చర్మవసనుడే ఆయెనట. అన దిగంబరుడే అని (చర్మవసనత్వముతో శివునకు శ్లేష చేయబడినది.) ఇక వాని వాలకము అతిథులు ఇంటికి వచ్చినప్పుడే చూడవలె. ఎన్ని లబ్బులను ఎంత చక్కగ వర్ణించెనో. యాదృచ్ఛికముగ వచ్చిన స్వజనులను చూచి భార్యతో కలహించి ఆ సాకుతో అనశన వ్రతమును పూనుటతో ఎంత సిగ్గులేనివాడు కూడ ఆ ఇంట్లో ఉండడుగా

కదర్యః స్వజనం దృష్ట్వా యదృచ్ఛోపన తం గృహే
కరోతిదార కలహ వ్యాజే నా నశన వ్రతమ్.

ఆ వచ్చినవారిని కుశలప్రశ్న వేయకుండుటే కాదు, వారు పలుకరించినను వినడుట. ఎక్కడ పలుకరించిన ఆరోజుకు తన యింట్లో తడియు పెట్టుదురేమో అని భయము. వాని ఇంటికి నిర్వచనము

అచుల్లిపాక మస్మేర మసుఖం నిర్జనంచ యత్
యదుత్సవ కథాహీనం తత్కదర్య గృహం విదుః.

మొదట ఇల్లుచూచి తర్వాత ఇంట్లోవారిని చూడమనినట్లు మరి వారిని చూడకయే పోవచ్చునవి. వానికి శ్రాద్ధ

విషయముగాని, ఉత్సవ విషయముగాని వచ్చినపుడు ఏ సూతక మంటుకొనినదనియో, ఏ రోగము తగులుకొనె ననియో సాకు చెప్పి ఖర్చు మానునట. ఇక అటువంటి వాని రసికత విషయము నాన్యతోదర్శము. సంగీతమునకు నాట్యమునకు అది చచ్చిన శవము. సొంత గాదెలలో ధాన్యము ముక్కిపోయినను అమ్మక ఎప్పుడెప్పుడు కరవు వచ్చునా అని నిరీక్షించు చుండునట అట్టి లోభము వానికే కాక సంఘమునకు నష్టమని మాన వలెనని.

మొన్న మొన్నటి వరకు బహిరంగ రహస్యముగ వ్యవస్థా వ్యవసాయమున సాగుచుండిన వ్యభిచార కూలంకషల వేశ్యల ప్రవర్తన సామాన్యముగ పలువురు రచయితలచే తూర్పార పట్టబడినది. అదేమి దాని మూల బలమో గాని దాదాపు అది మొదలుపెట్టినప్పటినుండి ఇప్పటివరకు దానిని నిరసించువారు కలరు కాని మొన్న వరకు దాని పెచ్చు రేగినట్లు కన్పించదు. ఇక దానికి మన రచయితల కున్న సంబంధము చెప్పుకొనవలెనన్న, వారి రచన, పతితకు దానిపై అసహ్యము పుట్టించునట్లుండవలయును గాని ఆ గ్రంథమును చదివిన వేశ్య నాశించునట్లుండరాదు. అట్లయిన ఉద్దేశించిన ప్రయోజనము సాధింపబడకపోగా పైపెచ్చు ఆ రగులుచున్న మంటలో మరొక కట్టె పెట్టినట్లు, మహానుభావులు కొందరు రచయితలు ఏ కాముకతాప్రకోపము పైకి తట్టినదో అట్టి రచనలు విమర్శల పేరిట చేసినవారున్నారు. ఇక మన క్షేమేంద్రుడు ఏ విషయమును పట్టుకొనినను తన ఔచిత్య ప్రస్థానమునకు కంటకము లైనను లెక్కింపక ఆటనట ఆశ్లీలములు వాడినను తన అసలు ప్రయోజనము మాత్రము దెబ్బతినకుండ సాంఘిక వ్యవస్థకే చీడపురుగులైన వేశ్యలను నిరసించినాడు. సామాన్యముగా ప్రాచీనుల రచనలలో వేశ్యా నిరసన చేసిరన్న ఆట దుష్ట వేశ్యలు పరామర్శింపబడి రనవలయునే కాని వారు వేశ్యా వ్యవస్థనే నిందించినవారుకారు. నేడు వేశ్యా నిరసన చేయుట అసలు వ్యవస్థ మీదనే. వేశ్యకు ఆదిలో నమస్కారము.

అర్థలుబ్ధా మతిప్రౌఢాం చిత్రాలంకార హారిణీమ్
ప్రౌఢాం వాణీ మివకవేః స్వచ్ఛందాంబంధకీం నుమః.

అని ప్రణమిల్లినాడు సరిగా కవితావాణి లక్షణము లన్నియు నిరికించి శ్లేషలో. అర్థలోభము, ప్రౌఢి రచన, చిత్రాలంకారాలు కలది, స్వేచ్ఛ కలది అయిన కవివాణి వంటిదట వేశ్య. అట్టి వేశ్యకు ఎవ్వనిమీద కూడ అనురాగ ముండ దనుటకు యోగినితో శ్లేషించి,

స్పృహారాగ వినిర్ముక్తా నిష్కామా కామచారిణీ
స్వధ్యానశీలా గణికా యోగినీవ గుణోంఖితా.

అనురాగమును వదలివేసినది, కామములేనిది, ఇచ్చ వచ్చి నట్లు తిరుగునది, ఆత్మధ్యాన స్వభావము కలది అయిన గణిక యోగినివలె గుణయుత. ఆమె ధనార్జనకు చేయు దుష్ప్రవర్తనను అబ్బో ఎన్ని గుణములని చేయు వెటకారము నేరుగా విమర్శించిన దానికంటె గుండెకు చుర కత్తిపోటువలె తగులును. ఇక పుష్పాపచయమువలె వీరు రక్తాపచయమును చేయుట, మృత్యుబుద్ధివలె కుర్రలనుండి ముది వగ్గుల వరకు ఎట్టి పక్షపాతములేక ఆదరింతురట. అప్పుడును యంత్రములచే నటించు బొమ్మ లుండెనేమో, అట్లు ఆ యంత్ర పుత్రికలవలె వీరును నటించుదురట. ఇక వారు చేయు మోసములా అనుస్యూతములు. ఈమె ప్రథమ పుష్పిణి నీకే మొదట దక్కినదని ప్రాత పరిచారాలను కూడ పంపుచున్నారట. రసాభాసకు వేశ్య ప్రథమ లక్ష్యము. ఆమె బహుసక్తిని పలువురు కవులు ఎంతో అసహ్యముగ వర్ణించిరి కాని క్షేమేంద్రుని మెరుగు చూపినవా రరుదు. వేశ్యట ఓ వంద మంది విటులను కటికి కట్టివేసుకొని, దారినబోయే ప్రతి దానయ్యచేత పిల్చబడిన వారు కలదై, ఓ వెయ్యి మందిచే మర్దింపబడిన స్తనాల కలిగిఉన్నదట.

కటీర్విట శతైర్ధృష్టా పాంథపీతోజ్ఝితం ముఖం
స్తనౌ సహస్రమృదితౌ యస్యాః కస్యాస్తు సానిజా.

ఆమె అందము కొరకు పడు తాపత్రయము చక్కగ చురకవలె విమర్శించినాడు. దానిని కాపాడుకొనుటకు తెగ మంచి తిండి తినుటయే కాక ఎవరి దిష్టి తగులకుండుటకు నూటఒక్క ఆభరణాలు ధరించునట. అసలు ముసలితొత్తర అయినను కుర్రవలె ప్రవర్తించునట. ఇట్లు అది వేయు వేషాలు ఎన్ని ఉన్నవో అన్నిటిని దుయ్యబట్టినాడు. వేశ్యా విషయములో విశేషాంశములు లేకపోయినను విశిష్ట వ్యంగ్య రచనారీతి సునిశిత పరశుప్రాయ నిరసన ఉన్నవి.

తరువాతి ఉపదేశము ఆ వేశ్యలకు రాయబారి అయిన కుట్టనీ విషయ విన్యస్తము. ఆమె అసహ్య స్వరూపము, ప్రజల మోసగించి ఆ రొంపిలోనికి దించు నేర్పు, ఉద్దేశ నిర్దేశాలతో వర్ణింపబడినది. ఆనాటి ప్రజలకు కుట్టనీపీడ వేశ్యాపీడ వలెనే విపరీతముగ నుండినట్లు తోచును. దామోదర మిత్రుడు కూడ కుట్టనీ మతమని ఒక ప్రత్యేక గ్రంథమును రచించెను. అయితే అది శాస్త్రమాత్ర కథనము, ఇది అస్త్రప్రాయ రచన, ఆమెట దేవేంద్రుని రాజ్యము నపహరించుటకును దక్ష, బ్రహ్మ హత్యవలె శివునకును భయము కలిగించు నంతటిది. ఆ రాముడు ఆ కృష్ణుడు ఓ ఇద్దరు స్త్రీలను చంపినారుగాని విశ్వకంటకి అయిన కుట్టని నెందుకు వధించరనుకొనినాడు. ఇక ఆమె

క్షేమేంద్రుని దేశోపదేశము

నిత్యకర్మలో జాంబవంతునకు జ్యేష్ఠ అట. అన జాంబవంతుడు ఒక్క రామాయణమునే చూచిన ఈమె రామాయణ సహస్రాణాం సాక్షిణీ. కథమన్యథా' అనినాడు ఇక నేటి కొందఱ వలె నాడు కుట్టనులు పుణ్యతీర్థ సేవ పేరిట నిధులు ప్రోగు చేసి చివరకు ఏ ప్రక్క వూరికో వెళ్లివచ్చి ఆ పుణ్యతీర్థము పోయి వచ్చితిమని మోసగించుచుండిరట. దినచర్య రామాయణ మహాకాండలో సవత్నులమధ్య పోరుపెట్టుటవంటివి ఆమె అలవాట్లు అనంతములు. అప్పటినుండి ఇంచుమించు వేశ్య ఉన్న గ్రంథములం దంతట ఆమెగాని, ఆమెకు మారుగ వేశ్యమాత గాని వాకిలి ముంగిట సాక్షాత్కరింతురు.

పిదప ఉపదేశము స్వైర విహారధీరులగు విటుల కలాప ఖండనముగ మూర్తి కట్టినది. విటులను మర్కటములతో కపట నటులతో, యోగులతో, శకటముతో, గ్రహ గమనముతో పోల్చి అవగుణాలన్నిటినీ వ్యక్తీకరించినాడు. వారు దెబ్బలు తిన్నను పోని కుక్కలవలె వేశ్య ఇంటి చూరు దొరకినను పట్టి వ్రేలాడుచు, అవకాశము దొరికిన పునః ప్రవేశము చేయుచుండిరట ఒక వరుసలో. ఇక వాని ఆకార వికారాలు విపులముగ అన్ని వాలకములతో వర్ణింపబడినవి. సొంత తల్లిని మానధనులైన ఆ విటు లట కుంభదాసి యని చెప్పికొనిరట.

" . . . . . సజినే సజినీం పురః
మమేయం కుంభదాసీతి వక్తి మానధనోవిటః."

ఆ విటపండితులు అప్పుచేసి నేయి త్రాగు పద్ధతిలో ఇంట భార్యల బాధించి విదేశాలకు పోవుచుండిరట.

అట్లా బహిరంగ వ్యాపారాలను ఖండించి తరువాత విద్యార్థులై కాశ్మీరదేశ విశ్వవిద్యాలయమునకు వచ్చిన గౌడులను వారి ప్రవర్తనను నిశితముగ పరామర్శించినాడు. వారు స్వదేశమునుండి వచ్చునపుడు కాల కంకాళములవలె నున్నవారు అక్కడి వాతావరణమునకు తెగ బలిసి భయంకరులగు చుండిరట. ఆ దైశికులు వ్రతభ్రష్టులై వ్యసనము లలవాటు చేయుచుండిరని,

'భాటీః పృచ్ఛతి వేశ్యానామ్ ద్యూతమ్ పృచ్ఛతి నిర్జితమ్
మాంసం సంపృచ్ఛతి భోజ్యే వ్రతభిన్నేషు దైశికః.'

ఇక వారి చదువు. ఓంకార స్వస్తి శబ్దములు సరిగా పలుకుట రాకయే పతంజలి మహాభాష్యమును తర్క మీమాంస శాస్త్రాధ్యయనము ప్రారంభించుచుండిరట. మొలకు చురకత్తి తగిలించి కిర్రు చెప్పులు శబ్దము చేయుచుండ నడచి పోయెడివారట. పేలగా చేత పట్టుకొని లతను త్రిప్పుచు వానా వికారము లోడుచూ సాయం సమయములందు వేశ్యా గృహములకు దాపున ఉన్న వీథులలో 'బీట్' తిరిగేవారట. ఇది ఇట్లుండ వూరుమీద పడి రండ లెచట నున్నారో వెతకి వెతకి వారి తండ్రిపేరు కనుగొని ఇల్లుచేరి సత్రభోజన విశేషములను ముగ్ధులవలె ఆ పరస్త్రీలకు చెప్పి నవ్వించుచు దగ్గర విశ్వాసము కుదురునట్లు సేవించుచున్నారట. సత్రపు పిండి వంటలను నెమ్మది నెమ్మదిగా అనుపుదేవతలైన వేశ్యలకు నైవేద్య మర్పించు చుండిరట. వారి దగ్గరనుండి డబ్బు లాగుటకు భట్టాజులవంటి కవులు వారి గొప్పలను కీర్తింతురు. వారు అధికారులమని పేరుతో వణిజులకడ కొద్ది డబ్బుకు ఎక్కువ వస్తువు కావలెనని బాధ పెట్టుచున్నారట. అప్పటికే కావలసినంత కశ్మలము విద్యార్థులలోను విద్యాభ్యాసములోను ఏర్పడినది. ఇంత నిశితముగ గ్రంథముల కెక్కుటకు అప్పటి ఆ బ్రహ్మచారుల ప్రవర్తన పట్టణముల కెంత గగ్గోలు పుట్టించినదో. ఆ తరువాత 16, 17 శతాబ్దములలోను విద్యాధ్యయనములోని చీడను వేంకటాధ్వరి కూడ నిశితముగ నిరసించినాడు విశ్వగుణాదర్శములో. అప్పటినుండి ఇప్పటివరకు మన విశ్వవిద్యాలయ విద్యార్థుల ప్రవర్తనలో ఎంత ఉన్నతముగ చెప్పుకొన జూచినను కరుడుకంపు కావలసినంత లేకపోలేదు.

ఏడవ ఉపదేశము అతి బాల్య వృద్ధ వివాహమునకు సంబంధించిన ఒక చక్కని ప్రహసనప్రాయ కావ్యరచన. ముసలి వయసులో యౌవనశాలిని, అనాఘ్రాత పుష్పమూ అయిన కన్యను వివాహమాడి దాని ప్రవర్తనకు రేగిన సుళ్లలో గిలగిల కొట్టుకొన్న ఒక వృద్ధుని మానసిక పరివర్తన రమ్య భణితమైనది. అతడు వివాహమైన వనితను చూడుడు.

మమః పుష్పవతీం కాంతాం యౌవన శాలినీమ్
పురుష స్పర్శరహితాం శ్వభ్రజాతాం లతామివ.

ఇక వాడామెను లోభి సంపదవలె, ఆశించుచుండెనట. జనులు నవ్వి పరలోకార్థము వివాహము చేసికొనుచున్నాడని వ్యంగ్యముగ వ్యాఖ్యానించిరి. (వివాహం పరలోకార్థం కరోత్యేష విచక్షణః) ఆ పిల్లను ఇంత ముదుసలికా ఇచ్చుట అని ఇంట్లో పేచీ పెట్టినట్లున్నది. ఆ పిల్లయు ఏడ్చుచు నిలబడి సమాశ్వసించుచు ఆమె తండ్రి అన్నాడుట అకాలముగ వచ్చిన ముసలితనమే కాని మరొకటి కాదు. పెళ్లికొడుకు చాల డబ్బు కలవాడు అని ఆశలు పెట్టుచు,

అకాలే జరయా పుత్రి వ్యాప్తోఽయం ధనినాంవరః
ఇతివృద్ధః పితాబ్రూతే తనయా మశ్రువర్షిణీమ్.

వివాహము నిర్ణయమైనది.. ఆ ముసలినే చేసికొనక తప్పినది కాదు. పండువంటి ఆమెను కోతిలా పరిగ్రహించు చున్నాడని వివాహ సందర్భములో క్షేమేంద్రుని ఆశీర్వచన స్వస్తివాక్యము

ఆలంబ్య కన్యా మంజర్యా వివాహేపాణి పల్లవమ్
వృద్ధః కుచఫల న్యస్తవదనో వానరాయతే.

వివాహములో మంజరి వంటి కన్య యొక్క పాణి పల్లవమును ఆలంబనముగ పై కుచఫలాల కొరకు ఆశించు చున్నదట ఆ వృద్ధ వానరము. వీని బాధ ఇట్లుండ ఆమెయో వీని ప్రక్క చూడకపోయిన పోయె మొదటలోనే ఆ పెళ్లికి వచ్చిన కుర్రకారు మీదనే చూపు లగించినదట. వీనితో ఆమెకు సుఖము మానె అతని శయ్య వధ్య శిలవలె నుండెనట.

వధూర్వరోత్సవాయాత తరుణన్యస్తలోచనా
నోప సర్పతి వృద్ధస్య శయ్యాం వధ్య శిలామివ.

ఇక అబ్బ అతని శృంగారము ఆలాలాపూర్ణ వదనముతో ఆ కర్మకాండ ఎంత అసహ్యముగ నుండెనో సుభగముగ వర్ణించి నాడు. ఆ ముసలిత్వక్కుతో నుండుటకు సిగ్గుపడి ఆమె మొదటి నుండియేక్షాంతోపీవలె తయారైనది. నీవు నాకు తండ్రి తాతవు కావలసినవానివి. ఎందుకు సిగ్గుపడవని ముఖముమీదనే అడిగివేసిన దట. అట్లనుచున్నప్పటికీ వూడిన దంతాలతో చొల్లు కార్చుచు ఆమెను శయనానికి యాచించుచున్నాడుట. పాముకాటుకు దెబ్బతిన్నవాడివలె ఆమె ఆ యింటికి ఈ ఇంటికి పరుగిడు చుండ మరల బంధువులు తెచ్చి వానికి అప్పగించుటయు ఆమె ఛండాలునియొక్క స్పర్శవలె భయపడుచు తనను రక్షించుకొనుచున్నది. ఇక ఆమె వ్యభిచారకాండ అనాహతము. వాని మనస్తత్వము ఆ సందర్భములో బాగుగా చిత్రింప బడినవి. ఈమెను సంతృప్తిపరచుటకు వాడు అనేక బాధలకు లోనైనాడు. శక్తిని పుంజించుకొనుటకు ఆసవాదులను సేవించు చున్నాడు. శక్తికొరకు వాజీకరణ యోగము చేసిన అది అతి సారరోగమునకు దారితీసినది. వీని పరిస్థితి ఇట్లుండ ఆమె ఉన్నట్లుండి అతని దగ్గర చేరినదట. దానికి కారణము.

గర్భిణీ పరబీజేన వృద్ధస్యోత్సవకారిణః
దదాత్యనుజ్ఞాం సతతం పాద సంవాహనే వధూః.

ఆ పరబీజమువలన ఓ బిడ్డపుట్టిన ఆ పుత్రుని మంత్రణోత్సవములో స్త్రీలు నృత్యము చేయుచు ఇట్లు పాడు చున్నారట. ఘుణముచే తొలవబడిన తరువునకు కూడ మరల అంకురము కలిగినదని వక్రరచనలో పాడిరి.

ఘుణజగ్ధస్య దగ్ధస్య తరోర్జాతోయ మంకురః
ఇతిబ్రువాణా వృద్ధస్య ప్రనృత్యంత్యుత్సవేస్త్రియః.

ఇట్టి అతని అవసానకాలము ఆమెకు సుఖప్రదమే అయి ఆమె పెట్టు బాధలకు, బందిపోటువలె ధనముకై ఆమె పీడించుట లివి అన్నియు వానికి కలిగించిన బాధను స్పష్ట వ్యక్తితో యువతిని చేసుకొనిన ముసలికి సిగ్గు వచ్చునట్లు రచించినాడు. ఈరీతిగ ఒక కథను చెప్పినట్లు చెప్పి చివరకు అతి బాల్యవృద్ధ వివాహమువలన వృద్ధుని బాధను ఇట్లు మనవి చేసినాడు.

విరత సురత శక్తిః స్పర్శమాత్రైకభక్తిః
నిశినిశిత వచోభిర్భర్త్స్యమానో గృహిణ్యా
భుజ భుజగ నిబద్ధం స్వక్షయే వృద్ధయక్షః
సుభగభగ నిధానం రక్షతిన్యస్తహస్తః.

అని కొంత అసహ్యముగనే చెప్పినను సిగ్గు వచ్చునట్లు చెప్పినాడు. దానివలన ఫలితములను చూచి చీదరించుకొని సంస్కరణాభిలాషతో రచించిన ఈ ఖండిక రమ్యముగ సాగినది. ఈ దురాచారము నాటినుండియు మొన్న మొన్నటివరకు విపరీతముగ వీరవిహారము చేసినది. ఇక ఆ వస్తువును గ్రహించి రచించుటలో క్రొత్తదనమును చూపుటయే కాక క్షేమేంద్రుడు దానికి తన కవితాపీయూష పోసి చక్కని ఖండికగా చించినాడు. వా రిద్దరకు పేర్లు పెట్టి రచించిన అది జరిగిన ఒక చిన్న కథ అయిఉండెడిది. ఆ రచనలోను వివాహ నిశ్చయమాది చివర వరకు అటు ముసలివానికి ఇటు యువతికి జరుగుచు వచ్చిన మానసిక పరివర్తన, వారి తాపత్రయములను సహజ రమ్యముగ వర్ణించినాడు. గ్రంథమువ నితర ఖండిక' లొక యెత్తు మానసిక పరామర్శలోనిది యొక ఎత్తు. దానికి తోడు అతని వ్యంగ్య వ్యాఖ్యానము సంస్కరణోన్ముఖమైనది.

తుది ఉపదేశము 'ఏకత్ర సంక్షిప్తధియా ప్రకీర్ణ జనవర్ణనమ్' ఇందులో లోక కంటకులైన వ్యక్తుల ప్రవర్తన మనో ప్రవృత్తి డాంబికము మొదలగువానిని చెలగినాడు. అందు గురువు, దివిరుడు, గురుసురతముతో పవిత్రమైన కుల వధువు, భట్టుడు, వణిజుడు, కవి, ధాతువాది, ద్యూతకరుడు, బుద్ధిహీనుడు, గురుభక్తుడు, వైణికుడు, వైద్యుడు, నిరుటుడు, పండితుడు, లేఖకుడు, శివయోగి, రండలు ఉన్నారు. వీరన్న వీరునాటి సంఘములో ముక్కిన పురుగులు. వారి విషయము లన్నియు లఘు వివేచనకు అధికప్రసంగము లగుట రమ్య రచితములగు ఒక రిద్దరి విషయము మాత్రము చెప్పుట వసరము.

వా రందరు గురువుగారి కడకు వచ్చి తమ అభిప్రాయములు వెళ్లబుచ్చి ఆయనవలన తగు దీక్షితులై చనిరట. అప్పటి దొంగ గురువుల వ్యవహారమును ఖండించినాడు. ఒక కావ్య హేవాకి కొంచెము సంస్కారము కలవాడై కూడ సారస్వత మంత్రార్థియై గురువును దర్శించెనట. ఆ కవి,

అజ్ఞాత ధాతులింగం ముఖకూణన ముల్బణ మపశ్వన్
అజ్వరమివ వమతి కవిః శ్లోకం కృచ్ఛాత్సహ ప్రాణైః.

అట్టికు కవుల నిరసించినాడు, ఇక హృదయహీనులైన ధూర్తులు వైద్యులై పిడుగులవలె నిధానములమీద పడుచున్నారట. వాక్య సమన్వయహీనులు, లింగమును మరచి మాట్లాడుటచే నపుంసక ప్రకృతులు అయిన పండితులు దూషింపబడిరి. దొంగలెక్కలు చూపి గ్రామాలను మ్రింగ ప్రయత్నించుచుండిన దివిరులు, గురువుగారి సంసేవనలో ఆత్మ పవిత్ర్యమును పొందిన రండలు, వేషాడంబరములో లోకుల మోసగించు శైవకాపాలికాదులు విమర్శింపబడిరి.

మొత్తముమీద ఇంతమందిని దుయ్యబట్టుటయే కాక ఆ తిట్టిన తిట్లను క్రమ పద్ధతిలో ఆనుపూర్వితో తిట్టినాడు. కేవల ముపదేశమే కాక కావ్యత్వదృష్టి కూడ కలదన్న మాట.

గ్రంథమునకు కావ్యత్వ ప్రతిపాదకములు అందలి చక్కని ధ్వని, రచన, ఉపమాన పురస్సరమగు కవితా స్ఫురణ, హాస కుసుమ వికస్వరము, వానికి చక్కని శైలీ సంయోజన మొదలగునవి. అందు వ్యంగ్య రచనలో చమత్కార చంద్రికా కిరణ సంయోజన కన్పించును. అతడు,తన కవి కంఠాభరణములో (4 వ అధ్యాయము) చెప్పుకొనిన దశవిధ చమత్కారములను ఇందు నిరూపింప వచ్చును. (అవిచారిత రమణీయ విచారిత రమణీయః, సమస్త సూక్త వ్యాప్తి, సూక్త్యైకదేశ దృక్ శబ్దగతః శబ్దార్థగతః, అలంకారగతః రసగతః ప్రఖ్యాత వృత్తగతశ్చ) అయితే అందు శబ్దార్థగత ప్రధానములైన శ్లేషధ్వనులే విశేష ముపయుక్తమైనవి. అవీ హాస్య రసాది గత చమత్కారములును గ్రంథోత్కృష్టతకు కారణములు. వృద్ధుని పుత్ర నిమంత్రణోత్సవములో స్త్రీలు నాట్యము చేయుచు గానము చేసిన వ్యంగ్య వాక్యము, కురుసేనతో కుట్టనిని పోల్చి చెప్పిన పద్యము, విటుని పాపగ్రహములతో పోల్చి చెప్పిన శ్లోకము, వివాహం పరలోకార్థం కరోత్యేష విచక్షణః అన్నమాట ఉదాహరణీయములు. మృదువైన హాస్యమునకు అల్పత్వ నిరూపణకు ఉత్తములతో అల్పులను పోల్చుటయు, భగవద్గీతాది ప్రసిద్ధ శ్లోకములను సందర్భానుసారముగ అతుకుటయు క్షేమేంద్రుని వ్యంగ్య రచనా ప్రక్రియలో ప్రత్యేకతలు. భగవద్గీత శ్లోకమును కొంచెము మార్చి ఖలునకు సర్వాంతర్యామిత్వము నంటగట్టునది పైన ఉక్తము. అట్టిదే మరియొకటి. లోభి రాత్రి ధనభయము వలన నిద్రించకయు దానిచే పగలు నిద్రించునను విషయమును సంయమిని గూర్చి భగవద్గీతలో చెప్పిన,

యా నిశా సర్వభూతానాం తస్యాం జాగర్తి సంయమీ
యస్యాం జాగ్రతి భూతాని సా నిశాపశ్యతో మునేః
(2:69)

అను శ్లోకమును ఇట తెచ్చి అతికించినాడు. ఇట్లు శ్లోకములకు శ్లోకములు తెచ్చుట అటుంచి అనేక భావములను ప్రసిద్ధములను సమయానుగుణముగ సంఘటించును. ఇక ఒక అల్ప విషయమునుగాని, అసహ్య విషయమును గాని, ఏదో ఒక పెద్ద సద్విషయమును నిర్వచించినట్లు చేయబూనుకొన్న ఒక రకమైన హాస్యమునకు కారణమగును. అట్టి రచనమును చేసినాడు క్షేమేంద్రుడు లోభి గృహము మొదలగువానిని నిర్వచించుటలో.

అల్పత్వస్ఫూర్తికి వ్యంగ్య మెంత సాయము చేయునో ఉపమా ప్రయోగమును మరియొక విధముగ అంత సాయమును చేయును. అది కవితా బీజమయము, మృదుభావన. రమ్య కల్పనకు ప్రాణము. ఇట్టి రచన గ్రంథ మంతట విశేషము కలదు. మూర్ఖఖలుడు కోరలు తీసిన పాము, పండిత ఖలుడు రెక్కలు వచ్చిన కృష్ణసర్పము అనుట చక్కని ఉదాహరణ. ముసలి భర్తతోడి శయ్య వధ్యశిల వంటిదట. ఆ యువతిని గూర్చి చెప్పుచు,

పీనస్తనోరు జఘనా జీర్ణవీణోప మాకృతిః
తరుణీం సంస్పృశన్వృద్ధః శుష్యేప్యాయాతి
శుష్కతామ్.

భావ ప్రభావితములే కాక ప్రాచీన ప్రసిద్ధాంశములనం అంగాంగీ సమన్వయముతో నుపమించుట వంటిది కురు సైన్యముతో కుట్టనిని పోల్చుట మొదువానియందు చూడ నగును.

ఇట్టి వ్యంగ్య హాస్యము సుజనుల కెట్లు హృద్యమై కుజనాల కుపదేశోపయుక్తమగుచున్నదనినాడో అత డనలేదు గాని కరుణమును అంతటి ప్రయోజనమును సాధించును. కుజనుల దృష్టియం దుంచుకొని రచించిన, అసలు హాస్యము కంటె కూడ కరుణ మెక్కువ ఉపయోగపడగలదు. విరసింపబడువాని పరిణామములో చివర కాతడు విషాదాంతమును పొందె

ననుట అటు ఉపదేశము హృదయగత మగుటయు ఇటు ఉత్కృష్ట కావ్యత్వ స్థితియు రెండును సమకూరును. ఆ స్ఫూర్తిని గమనించినవాడే క్షేమేంద్రుడు. వృద్ధ భార్యా వర్ణనలో వృద్ధుని పరిణామము విషాదాంత మయినది. ముఖ్యముగ సార్వకాలిక దుర్విషయ ఖండనము కంటె ఇది సామాజిక దురాచార నిర్మూలన విషయములో బాగుగ పనిచేయును. పలువురు, ఇతర కవులు హాస్యమునకు పరిమితము చేసికొనిరి. కాన అవి కుజనుల మనమును కదలింపలేక పోయినవి. వృద్ధుని చివరకు,

క్వ కియత్కిం తవాస్తీతి కంఠప్రాప్తార్థ జీవితమ్
వృద్ధం చౌరమివా భృత్యధనం పృచ్ఛతి గేహినీ.

వరకు తీసికొనివెళ్లి ఆ పరిస్థితిలోను పీడింపబడినట్లు చేసినాడు. ఇక ప్రతి ఉపదేశమునందును అనుషంగికముగ ఆ దుర్జనులవలన వారికే కలుగు నష్టములను స్పష్టము చేయుచుండును. తమ ప్రవర్తనమువలన సంఘమునకు నష్టమనిన వినుటకంటె తనకే నష్టమనిన వినుటయు దానివలన ఫలితము కొంత ఎక్కువగ నుండవచ్చును. అందు మనస్తత్వ నిరూపణశక్తి అధికముగ నుండవలయును అది పటువుగ నున్న వాడే క్షేమేంద్రుడు.

వీని అన్నిటికి తోడు రమ్యశైలీ సంయోజన, ప్రసిద్ధ పదములనే చమత్కారముగ వాడుట కాక అవసరమునకు తాత్కాలికముగ దేశ పదములను కూడ వాడినాడు. అట్లని అతడే "దేశభాషాపదైర్మిశ్ర మధునా క్రియతేమయా" అని చెప్పుకొనినాడు. అయితే ఆ పదములు ఆ కాశ్మీరదేశ సంబంధులే అయినను తదితరులు చదువునప్పుడు బాధ కలిగించునవి మాత్రము కావు. దివిరుడు వంటివి ఉన్నను అవి సందర్భ సంవాదు లగుట తేలికగ అవగతము లగును.

అటనట అనుప్రాసయుతమైన శైలిని వాడినను అది తాత్కాలికము అటనట ప్రయోజనోద్దిష్టమును. గ్రంథమంతయు సరళముగా, సున్నితముగా సాగిపోయినది. ఏ భావమును వ్యక్తీకరించుటకును అన్వయ క్లిష్టతే లేని అతని పద సంయోజన సమర్థమైనది. అతని అలంకారముల వాడకమును ఔచిత్యయుతమైనది. గ్రంథమంతట వ్యాపించిన అతని ఆత్మ ఔచిత్యము అటనట అశ్లీలయుతమైనను మొక్కవోయినది కాదు. ఆ పదముల మార్పిడి బాగుండును గాని అవి కొన్ని చోట్ల శ్లేషలో మరుగుపడినవి.. మరికొన్నిచోట్ల అసహ్య స్ఫూర్తికి ఆకరము లైనవి అగుట ఫరవాలేదు. అట్టి రచన వలన అసహ్యము పుట్టునట్లున్న మంచిదే కాని ఆకర్షణ మాత్రము జరుగరాదు. పతిత నారొంపిలోనికి దించిన అసలు ప్రయోజనము భ్రష్టమైనట్లే. అటనట నర్మవాలలో ఈ దోషము కొంత స్ఫుటమైన దనవచ్చునేమో గాని ఇట మాత్రము ఔచిత్యయుతమే అనవలయును.

మొత్తముమీద, సంఘ దృష్టి కొరవడిన కాలములో కేవల మూహా జగత్తులో నాయికా నాయకుల భైరవ తంత్ర వర్ణనలో, కవులు ధ్యానము నిల్పిన కాలములో, ఇక కొంత కాలమునకు సంస్కృత వాఙ్మయ ప్రభ వాలిపోవునన్న కాలములో, సంఘ మనేక దురాచార పరంపరాస్థితికి మూలమై జిడ్డుదేరి అసహ్యమగుచుండిన కాలములో ఆ లోపముల నన్నిటికి గొడ్డలిపెట్టు పెట్టుచు హృద్య కవిత్వశాద్వలముగ వెలసిన క్షేమేంద్రుని, ఇట్టి నాలుగు కావ్యములలో నీ దేశోపదేశము సుకృతి.

విశ్వకవి వివేకానందుడు

శ్రీ యస్వీ జోగారావు

[వివేకానందు డొక మహా ప్రవక్తగా జగద్విశ్రుతుడు. కాని యొక కవిగా అత డింకను తగినంతగ లోకముచే గుర్తింపబడినట్లు లేదు. ఎందరో మహానుభావు లాతని ఘనత వెలుగెత్తి చాటుచున్నారు. కవు లాతని చరిత్రమును, పద్యములు, పాటలును గట్టి పాడుచున్నారు. పత్రికలు వ్యాసములు పరశ్శతముగా ప్రచురించుచున్నవి. ఎన్నో విశేషములను గొంతు చించుకొని ఘోషించుచున్న దాకాశవాణి. కాని యెవ్వరు నాతని కవిత్వపు టుబు సెత్తుకొన్నట్లు కానరాదు. అది గమనించిన నా హృదయము పొందిన నిర్వేదమే యీ వ్యాసావతరణమునకు కారణము.]

కవి యనగా సామాన్యపు కవి కాడు వివేకానందుడు. సువిశాల విశ్వకావ్య సృష్టికర్తయై, తన సృష్టినే తన తల్లిగ, తన శక్తినే ప్రియవల్లభగా భావించి పరవశుడైన పరమేశ్వరుని హృదయ మధుకోశమున మధురస్పందనములు పొంది భక్తి ప్రణయ భావసౌరభ మానంద మరందముగా పరివర్తన చెందినవేళ అం దనువణువున కూటస్థమగు స్వాదాత్మ నాత్మసాక్షిగ భావించి అనుభవించి వాగ్రూపమున బాహిరించిన మహాకవి యతడు. అతని ప్రతి శ్లోకము జననాంతర సౌహృద పరిపాకము. ప్రతి గీతిక ప్రాజ్ఞ హృదయ ప్రియదూతిక. ప్రతి పద్యము సద్యోహృద్యము, సహృదయ నైవేద్యము.

"The cloud puts forth its deluge strength
When Lightning clears its breast;
When the Soul is stirred to its inmost depth
Great ones unfold their best"

అని యొకచో స్వామి వక్కాణ. మెఱుపువచ్చి తన గుండెను తాకినపుడు మేఘు డమోఘశక్తి ప్రదర్శించును. అట్టడుగున మట్టుదాక ఆత్మానుభవము మథింపబడినపుడు మహాత్ములు వేదశిఖల వంటి భావములు వెల్వరింతురు. అట్లు వెల్వడినదే వివేకానందుని కవిత. ఆ కవితలో అతని అనుభవ రసాయన పరిమళమే అతని వాక్కు. ఆ పరిమళముయొక్క చిక్కణ పాకమే పాఠకుని యనుభవము.

ప్రాక్పశ్చిమ ప్రాచీన నవీన సంస్కృతి ప్రస్థానము లందు సౌహృద సేతువులు నిర్మించుటకై తూర్పున ఉదయించిన మహానుభావు డతడు.

పాశ్చాత్యులకు భారతీయమైన ఆధ్యాత్మిక సందేశము వినిపించుటకై అవతరించిన ఆదిశంకరుడని యొక అభియుక్తుని వక్కాణ.

ఒక పరమహంస దర్శనమునకు వ్యాఖ్యాన మతని జీవితము.

విశ్వకవి రవీంద్రుని గీతాంజలి కంటె ముందుగా పాశ్చాత్య ప్రపంచమునకు ఔపనిషదమైన భారతీయ కావ్యవాణిని శ్రావ్యముగా వినిపించిన దాతని లేఖిని.

విశ్వవీణా శుభశ్రుతులలో ప్రతిధ్వనించిన దతని కవిత.

మహర్షుల కవిత్వమునకును, మహాకవుల ఋషిత్వమునకును మధ్య సేతు వాతని భావన.

అత డెన్నో వ్యాసములు వ్రాసెను, ఉపన్యాసము లొసగెను; కాని అన్నిటికన్న మిన్న కాంతాసమ్మితమైన కావ్యోపదేశము.

నరేంద్రు డన్నది దేహప్రదాతలగు జననీ జనకులు చేసిన నామకరణము. వివేకానందు డన్నది ఆధ్యాత్మిక దర్శన ప్రదాతయగు గురుదేవుడు పెట్టిన పేరు. ఆ పేరే అతనికి పేరుతెచ్చినది, అతని నాశ్రయించి తా నన్వర్థ మైనది. మేధోపపన్నమైన వివేకముతో బాహిరిల్లి హృదయ గమ్యమైన ఆనందముగా పర్యవసించునదే ఉత్తమమైన కవిత్వమైనా, ఉన్నతమైన తత్త్వమైనా. అట్టి కవిత్వ తత్త్వము తాత్త్విక కవిత్వము ఉభయకూలములుగా సాగిపోయిన దతని భావ కూలంకష. ఒక్కొక్కచో ఆ కవిత్వము, తత్త్వము విడదీయరాని పొత్తు గలిగి త్వమేవాఽహ మనుకొన్నవి.

అతని కవిత యంతయు అరువదియైదు పుటల గ్రంథము. ముప్పది మూడు ఖండికలు. రెండు మాత్ర మనువాదములు. ఎనిమిది ఆయన మాతృభాషయైన వంగమున, నాలుగు సంస్కృతమున, ఒకటి హిందీలో, కడమ వన్నియు ఆంగ్లమునను రచింపబడినవి. ఆ నాలుగు భాషలు నాయనకు కరబదరములు. గ్రంథ పరిమాణ మతి స్వల్పమైనది కాని కవిత దొడ్డది. దానికేగాని తగిన సంస్కృతపు వాలకము వేసితిమేని ఏ ఉపనిషత్తులలో నుండియో ఒక ఆర్షహృదయము తొంగిచూచు చున్నట్లుండును. అన్నియు ముక్తప్రాయ రచనములే కాని అన్నింటిని వెన్నంటియున్న ఆధ్యాత్మికమగు నొక భావధార వాని కేక సూత్రతను ఘటించుచున్నది.

భక్తియు తత్త్వము నొంట బట్టిన మహాభాగులు కవిత్వము చెప్పునప్పుడు తామే సద్యః పర నిర్వృతి నందుట తటస్థించు చుండును. అట్టిచో పాఠకులకు వారి వాక్కొక మహోపదేశమువలె భాసించును. భవ్య కవితావేశముతో వారు తత్త్వమును భావించి చెప్పునపు డది సహృదయులకు సద్యః పర నిర్వృతి గల్గించుచుండును. ఇది **Mystic poetry** ని హృదయదఘ్నముగా అనుభవించినవారి కెల్ల సువిదితము. కబీరు, మీరాబాయి, తులసీదాస్, తుకారామ్, అన్నమయ్య, త్యాగయ్య, సూఫీ కవులు మొదలగువారి కవిత యీ కోవకు చెందునట్టిది. నా మట్టుకు నాకు వివేకానందుని ది ఖలీల్ జిబ్రాన్ కవితా తత్త్వమునకు సన్నిహితమైనదిగా తోచును. పరమార్థమున భగవంతుని ప్రియబంధువులగు వీ యందరి కవిత యందును నే కొంతయో సాదృశ్యము గోచరించుచునే యుండును. కాని యది ఒకరిని చూచి యొక రనుకరించుటవల్ల నేర్పడినది కాదు. అందరి కవితలును స్వగతములే, వేని కవి స్వతంత్రములే. అందరు నేకైక దివ్యధామ తీర్థయాత్రికు లగుటయే ఆ సాదృశ్యమునకు కారణము.

"కావ్యం యశసే అర్థకృతే వ్యవహారవిదే శివేతరక్షతయే
సద్యఃపర నిర్వృతయే కాంతా సమ్మిత తయోప దేశయుజే."

అని మమ్మటుడు కావ్య ప్రయోజనములను దెల్పినాడు. ఈ పరిగణనమున ఆతడు ప్రాధాన్యాత్పృథమమ్మను క్రమమును పాటించినట్లు తోచదు. కావ్యమును సంత వస్తువు చేయ దలచుకొన్న వారికా క్రమమే ఉపాదేయము కావచ్చును కాని ఆలంకారిక దృష్టితో చూచిన సద్యఃపర నిర్వృతిని ప్రధాన ఫలముగా చెప్పవలెను. ఆర్షదృష్టితో చూచిన అటునుండి యిటా క్రమ మంతయు తిరుగబడును. అట్టిచో కాంతా సమ్మితమైన యుపదేశము ప్రధాన ఫలమగును. మన స్వామి కవిత ఆ ఫల స్వామ్యమును డక్కగొన్నది.

ప్రకృతమా మహానుభావుని కవిత నంతంత మాత్రముగ నా చేతనైనంత సమీక్షింతును. కవిత్వమును సమీక్షించుట యనగా ఆ కవి భావమును అనుభవమును మనదిగా చేసికొనుటకు ప్రయత్నించుటయే.

ఆయన పట్టుబట్టి కవితా లతాంగితో చెయిముట్టు సరసము చేయువాడు కాడు. ఆమెయే తన్ను వలచి అల వోకగా ఆగమేఘాలపై వచ్చినచో మరి యాగడు. ఒకపరి 1895 సం. న న్యూయార్కులో సహస్రద్వీపోద్యానములో తన ఆధ్యాత్మిక శిక్షణ శిబిరములో స్వామి యొకనాడు శిష్యులకు సన్యాసాశ్రమ ప్రాశస్త్యము గూర్చి అందలి ఆనందానుభవమును గూర్చి ఉపన్యాస మిచ్చుచుండెను. ఉపన్యసించుచున్నవాడు హఠాత్తుగ లేచి యొక్కడు నెక్కడికో వెడలిపోయెను. ఒకించుకసేపైనదో లేదో ఒక ఉజ్జ్వల సంగీతక మాతనికి లేఖినీముఖ వినిస్సృతమైనది. అదే "ఓం తత్ సత్" అను మకుటముతో వెలసిన 'సన్యాసి పాట.' అందలి కొన్ని పంక్తులు :

"Wake up the note! the Song that had its birth
For off, where worldly taint could never reach;
In mountain caves, and glades of forest deep,
Whose calm no sigh for lust or wealth or fame
Could ever dare to break; where rolled the Stream
Of knowledge, truth, and bliss that follows both.
Sing high that note, Sanyasin bold! Say "Om Tat Sat Om!"...

మేలుకొలుపు మా పాటను! లోకపు వాసన తాకజాలని
కామార్థ యశః కాంక్షల యూర్పుల నడి వినిపించని
సచ్చిదానంద త్రివేణీ సంగమ తీరమందలి
ఏ దూర దూర గిరి గహ్వరమో, ఏ మహా గహన గర్భమో ప్రసవించిన పాటను
తారస్థాయి నాలపింపుము ధీరసన్యాసి ! ఓం తత్సదోమ్మని
తారస్థాయి నాలపింపుము ధీరసన్యాసి ! ......

ఈ పాట పుట్టుపూర్వోత్తరములను గమనించితిమేని యిది స్వామియొక్క అంతరస్నాయువులలోని అనుభవపు టాక

ప్మిక వికస్వరతయే. కర్మక్షయమై శాశ్వతముగా ఆత్మ,బంధ మోచనము పొందినపుడు దాని స్థితి యెట్లుండునో విశదీక రించుచు—"The 'I' has All become, the All is 'I' and Bliss; know thou art that..." అని 'సర్వం ఖల్విదం బ్రహ్మ, ఆనందో బ్రహ్మేతి, అహం బ్రహ్మాస్మి,తత్త్వమసి" అను మహావాక్యముల పరమార్థము మన మహర్షుల జీవన సూక్త మునకు వ్యాఖ్యాన మనిపించునట్లు రచించినా డీ పాటను.

'కాళీమాత' యన్న కవితా ఖండమును కాశ్మీర యాత్రలో రచించినాడు. విశ్వముయొక్క విశాలత్వమును మన చర్మ చక్షువులకే గోచరింపజేయునట్టి మహిమాలయము హిమాలయము.. ఆ మహీధర మధ్యప్రదేశమున ప్రకృతి రమణీ రమణీయ రంగస్థలమువలె నున్నది కదా కాశ్మీరము. అచట పరాశక్తి సర్వాంగీణ దివ్య పరిష్వంగమున తా నొక పసిపాపడై పోయి ఆమె మాతృత్వ మాధుర్యమును చూరగొని కొట్టిన కేరింతయే ఆ గీతము :

రమ్మా తల్లీ రమ్మా, రావమ్మ తల్లీ !
చుక్కలు నురిగెను, మబ్బులు క్రమ్మెను
గీపెట్టెను చీకటి కీకారణ్యము !
గర్జించిన సుడిగాలి లోపల
ఘోషించెను వెఱ్ఱి యాత్మలు వేవేలు
వేళ్లతో పెల్లగిలి ఊళ్ల నూడ్చెను వృక్షాలు !
అడుగో సాగరుడు కొండ పొడువున లేచి
కెరటాల కేలుసాచి ఆకస మంటగ నారాటంపడు!
అదిగో ఒక వికారపు మెఱుపు జాడలో
వేనవేలు మృత్యువు క్రీనీడలు తారాడును! రమ్మా.
భయము నీ పేరు లయము నిశ్వాసమ్మా
అటు కదలిన నిటు కదలిన నీ యడుగది
ప్రపంచమున కొక ప్రళయము
కాలస్వరూపిణీ ! సర్వోపశమనీ ! రమ్మా.

అని యుల్లాసమె నావాహనచేసి చివరికి—"ఎవడు క్లేశమును ప్రేమించునో, చావును కావిలించుకొనునో, ప్రళయ లయతో నర్తించునో వాని కడకు వచ్చును తల్లి" అని తీర్మానించును. కాళి యనగా ఆతని యుద్దేశమున ఎక్కడో దక్షిణేశ్వరమున నున్న మూ డడుగుల మూాల విగ్రహము కాదు. ముల్లోక ముల తల్లియైన మూలశక్తి మాహేశ్వరి. ఆమెను "కాలమా" యని సంబోధించుట సాభిప్రాయము. ఆమె పేరి కదొక వ్యాఖ్యా నము. ఈ జగన్మాతృదర్శన మాయనకు గురుప్రసాదము. ఈ గీతము వ్రాయునపు డాతని యావేశము పరకోటి ముట్టి పరవశుడై క్రింద పడిపోయెనని కాశ్మీరయాత్రలో ఆతని ననుస రించిన సోదరి నివేదిత వ్రాకుచ్చినది. ఆ జగజ్జనని విశ్వలీల నభివర్ణించుచు స్వామి మరియొక గీతమున—

"Perchance that Shining Sage
Saw more than he could tell;
Who knows, what soul and when
The Mother makes Her throne?"

అని యన్న మాటలు స్వామికిని వర్తించును. అవును ఆ తల్లి యెప్పు డెప్పు డే యాత్మను తన సింహాసనముగా చేసికొనునో ఎవరి కెరుక ! వివేకానందుని దర్శనము విశాలమైనది. ఎంత విశాలమైన దనగా ఆతడు చెప్పగలిగిన దానికంటె నెక్కు వైనది. ఆత డెన్నో విషయములు మనకు చెప్పినాడు. కతి పయ పద్యముల నతిశయార్థముగా కవిత చెప్పినాడు. అయి నను అంతకంటె అతని దర్శనమే ఘనమైన దనగా విశ్వాం చలమును దాటిపోయిన దాయన భావనా విహంగము.

. ఆత్మ తత్త్వము గూర్చి ఆత్మ సాక్షాత్కారము పొందిన మహాయోగి అతని ప్రవచన మెట్లుండునో చూడుడు :

Before the Sun, the moon, the earth
Before the Stars or comets free,
Before e'en Time had its birth
I was, I am and I will be.

ఆత్మయొక్క నిత్యత్వము నాత్మప్రత్యయముతో, ఆత్మానుభవ ముతో నెంత పొందికగా చెప్పినాడు ! ఇట్లే "The song of the Free" అను నా గీతమంతట ఆ భావనయు సముద్రమును జేరు మహానదివలె, పరమాత్మను జేరుట కారటపడు జీవాత్మవలె పరువులెత్తినది. ఆ భావనతో శైలిపందెము చఱచినది. మాయా స్వరూపమునుగూర్చి చెప్పుచు స్వామి—"This mystery, My Shadow cannot grighten me! know once forall that I am He" అని అవిద్యావరణమును తన క్రీడగా గుర్తించి 'అహంబ్రహ్మాస్మి' యని నిక్కచ్చిగా వక్కాణించిన స్వామి విశ్వాసము ప్రశంసనీయమైనది. ఇట్టి సూత్రప్రాయమైన సూక్త రచన మతని జిహ్వాకు నైసర్గికగుణము.

ప్రబుద్ధ భారత మనుగీతమున "Once more awake! For sleep it was, not death, to bri g thee life anew, and visb lotus-eyes for visions daring yet..." అని యుట్లు ప్రబోధాత్మ కముగ వెల్వడిన అవధులులేని దేశభక్త్యావేశవశంవదమైన ఆతనివాణి తదుపరి మన జాతీయోద్యమమున ప్రతిధ్వనించినది. అయితే పక్షపాత ప్రహతముగాని దాయన చూపది విశ్వవిశాలమైనది. "The One in All —అనగా అనేక

త్వమున ఏకత్వమును, ఈ విశ్వవైవిధ్య పరిణామమున కూటస్థము నేకైకమువగు ఆత్మరూపమును గుర్తించినట్టిది.

ఒక గీతమున—

"These are His manifold forms before thee,
Rejecting them, where seekest thou for God?
Who loves all beings, without distinction,
He indeed is worshipping best his God'.

అని సర్వభూతాంత రాత్ముడగు పరమేశ్వరుని స్వరూపమును దర్శించినాడు స్వామి. మరియొక గీతమున అజ్ఞానుల నుద్దేశించి—

"Ye fools! Who neglect the living God,
And His inprints reflections with which the world is full,
While Ye run after imaginary shadows,
That lead alone to fights and quarrels,
Him worship, the only Visible!
Break all other idols!

అని జీవుడే దేవుడను తన ప్రగాఢ విశ్వాసమును పునరుద్ఘాటించినాడు. ఎక్కడపట్టిన నక్కడ అతని కవిత ఆత్మాశ్రయ ఫక్కికమై అందలి సంగీత మద్వైత భావధారాపాతమాపాత మధురమై మనగుండెలు తాకుచుండును. ఈ మహాసిద్ధి పొందుట కాయన యెన్నిపాట్లు పడినాడని !

"Pledging even life for gaining Knowledge,
I have devoted half my days on earth
For the sake of love, ev'n as one insane'
I have often clutched at Shadows Lifeless;
For religion, many creeds have I Sought
Lived in mountain-Caves, on Cremation-grounds;
By the Ganges and other Sacrd Streams,
And howmany days have I passed on alms!
Friendless, clad in rags, with no possession,
Feeding from door to door on what Chance would bring,
The frame broken under Tapasay's weight;

ఇట్లు జ్ఞానముకోసము తన బ్రతుకునే పణమొడ్డి ప్రేమకోసము పిచ్చివానివలె నిర్జీవపు నీడలలో తారాడి, విశ్వాసముకోసము వివిధ మతపీఠములలో కొండగుహలలో శ్మశాన స్థండిలములలో భాగీరథీ ప్రముఖ పుణ్యనదీ తీరములలో వెదుకాడి, వాడవాడల నొకబిచ్చగాడై పలుకరించు దిక్కులేక చేతపైసాలేక చింపిరి బట్టలతో ఎక్కుగువమ్మము దిగు గుమ్మముగా తిరుగులాడి తిరిపమెత్తి కాసంత యదృష్టము తెచ్చిపెట్టు నొక కవళముతినుచు, తన కఠోరసాధనలో దేహయష్టి విరుగుచూపినను నరకుసేయక ఆయన సాధించిన సంపద యేమిటి ? మనకిచ్చిన సందేశమేమిటి ?

"Listen, friend, I will speak my heart to thee,
I have found in my life this truth supreme.
Buffcted by waves, in this whirl of life
There is one ferry that takes across the Sea.
Formulas of worship control of breath.
Science, philosophy, Systems varied.
Relinqushment, posession, and the like
All these are delusions of the mind.
Love Love-that's the one thing, the sole tresure.

"అవధారు మిత్రమా అవధారు. నా మనసులోని మాట చెప్పెదను. ఇది యీ జీవితమున నా కంతుపట్టిన యొక పరమసత్యము. భంగాకులమైన భయంకర జీవితావర్తమున ఒకే యొక నావ భవసాగర తారకమైనది గలదు. వివిధ పూజా విధానములు, ప్రాణాయామము, శాస్త్రములు, వేదాంతము, త్యాగము, సంపన్నత మున్నగున వన్నియు చిత్తవిభ్రాంతులు మాత్రము. ప్రేమ యన్న దొక్కటే తారకమంత్రము. అదే మన ఏకైక సంపద."— ఇదే వివేకానందుడుగాని వెనుకటి మహర్షులుగాని సాధించిన దాని సారాంశము, మన కందజేసిన దివ్య సందేశము.

శిష్యులయెడ స్వామి చిత్త మెట్లుండునో చూడుడు. సోదరి నివేదిత నాశీర్వదించుచు—"తల్లి హృదయము, వీరుని

సంకల్పము, దక్షిణానిల సౌగంధ్యము, ఆర్య యజ్ఞ వేదికలందలి పావిత్ర్యము, శక్తి—ఇవి యన్నియు నీవి. ఇవేకాదు కడచన్న మహోమభావులు కలలో గూడ ఎరుగని వెన్నెన్నో నీవి కాగలవు. నీవు భావి భారత పుత్రునకు అనుగు చెలికత్తె వగుదువు" అని వ్రాకుచ్చినాడు. మరియొక శిష్యురాలు ఒక అమెరికా అమ్మాయికి జాబు వ్రాయుచు ఆమె నుద్దేశించియే "To an Early violet" అను పేర మూడు పద్యములు వ్రాసి పంపినాడు—"పేరిన మంచునేల నీ పానుపుగానీ, వలి గాడుపు నీ మేలి ముసుగవనీ, నిను పలుకరించుట కొక నేస్తము లేకపోనీ, నీ పరిమళము నిరర్థకముగానీ, ప్రేమే భంగ పడనీ, చెడే జయించనీ, నీ సుకుమార సుమ స్వభావము వీడకు, అప్రార్థితముగ, అసీమముగ నీ సౌరభమును ప్రసరింపుము" అని. చిత్తగించితిరా ఇట తత్త్వము కవిత్వము నెట్లు పెనవైచుకొన్నవో ! ఇట్లే "My play is done," "A Song I sing to Thee", "And let Shyama Dance there" అను గీతములందును అద్భుతముగ అతని కవితాత్మ ప్రతిధ్వనించినది. అందు మూడవదానినుండి కొన్ని పంక్తు లనువదింతును చూడుడు :

అవి పూవు, లాముని వలపుటావిరి వావిరి మధువులు!
అవి తుమ్మెదల రొదలు, కమ్మ తేనెలు దిమ్మ త్రావి దిగంత గగన
వీథుల నవి త్రేచిన దివ్య గాంధర్వము త్రేనుపులు !
అవి వెన్నెల, లమృతాంధసులు పుడమి నడికొప్పుపయి
చిలుకరించిన చిర్నగవు సోనలు !
అవి కమ్మ తెమ్మెరలు, తనువు సోకిన, యంత ముడుతవారిన
పురాస్మృతుల నపుడ కనుల కట్టెదుట నిలబెట్టు
తెరలు !
అవి సెలయేటి గలగల, లహరుల గుసగుసలు !
అవి సరసు, లమల కమలాననాలోకనకుతూహల దోహల
భ్రమద్భ్రమరకుల సంకులములు !
అవి ఝరీపాతము, లాపాత మధుర సంగీతములు
గిరిదరీకుహర ప్రతిధ్వనిత స్వరసంహితలు !
అవి కోయిలల తీయతీయని పాటలు,
వనరమా వసంతుల శోభనపు వాయనములు!
అవిగవిగో రవి కిరణమ్ములు, దివ్య చైత్రికు డొకడు దిగ్దిగంతముల
ప్రాగద్రిశిఖర ప్రాంగణమ్మున నుండి రచి
యించినట్టివి రంగవల్లికలు !
ఆహా! ప్రకృతి యొక్క చిత్రశాల !
ప్రకటీకృత భావశీల !

* * * *

అంబరమున పాదవి, మేఘాడంబరమున పాదరి
అభ్రంకషమై, కువలయ కూలంకషమై
ఆశావకాశ సర్వంకషమై

Statement about ownership and other particulars about newspaper

BHARATI

1. Place of Publication :
   6&7 Thambu Chetty St. Madras-1.
2. Periodicity of its publication :
   7th of Every Month
3. Printer's Name : Sri S. Radhakrishna
   Nationality: Indian
   Address: 6&7, Thambu Chetty Street, Madras-1.
4. Publisher's Name : Sri S. Radhakrishna
   Nationality: Indian
   Address : (As above)
5. Editor's Name; Sri S. Sambhu Prasad
   Nationality Indian
   Address 29, Chamier's Road Adyar Madras-28.
6. Names and addresses of individuals who own the newspaper and partners or share-holders holding more than one per cent of the total capital.

NAMES	ADDRESSES
1. Mr. S. Sambhu Prasad	29, Chamier's Road, Adyar, Madras-28.
2. Mrs. S. Kamakshamma	Do
3. Mr. S. Nageswara Rao	Do
4. Mr. S. Radhakrishna	6 & 7, Thambu Chetty Street, Madras-1.

I, S. Radhakrishna, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

S. RADHAKRISHNA,
1-3.1963 Signature of Publisher.

ఆదిగో అశనిపాత నిర్ఘోషము !
పరాభూత పంచభూత
సంఘర్షణ పరివేషము !

ఆదిగో ఆకాశపు రాకాసి
కారు మొయిలు నల్ల ద్రావి గ్రక్కిన
కాలకూట విష కషాయమ్ము చీకటి !

ఆదిగో ప్రళయ ఝంఝా ప్రభంజనస్వామి
కాలమేఘపు మీసమ్ము దువ్వి
చేసిన వికటాట్టహాసము శంపాలత !

అవి కడలి తరగలు,
మరుగులు గ్రక్కుచు నుఱకలువేయుచునుప్పరమంటి
యుఱుకులు ప్రసవించిన కెరటమ్ముల కేరింతలు!

గడగడ వడకెను దడదడ లాడెను
ఫెళ్ళున విరిగెను పెళ్ళలు రేగెను
కొండలు గ్రుంగెను కోనలు గ్రుంగెను
లోలో గ్రుంగెను భూలోకం
నేలను దొలుచుక జ్వాలలు రేగెను
హోహో ! ప్రకృతి యొక నాట్యశాల !
ప్రకటీకృత ప్రళయవేళ !
కాళి తాండవ కరాళ !

* * * *

ఈ గీతమున జగజ్జనని నృత్యమునకు భక్తుడు చేయు రంగస్థల సజ్జీకరణము విషయము. సృష్టికగలవైన అవస్థ లందలి ప్రధాన ద్వైవిధ్యమును ప్రతియోగి సంఘటనము ద్వారా నిసర్గ రమణీయముగా నిరూపించినాడు విశ్వకవి. ఈ గీత మున వాగర్థములకు పట్టిన యోగమది యొక గొప్ప అద్వైత సిద్ధి. ఆ శబ్దములు కచ్ఛపీశ్రుతులు, భావములు బ్రహ్మను భవములు.

ఇక స్వామి రచన సంస్కృతమున నెట్లు సాగినదో యొక మెతుకు పట్టిచూతము :

గురుదేవుడు శ్రీ రామకృష్ణ పరమహంసను గూర్చి—

"స్తబ్ధీకృత్య ప్రళయకలితం వాహవోత్థం మహాన్తమ్
హత్వారాత్రిం ప్రకృతి సహజా మన్ధ తామిస్రమిశ్రామ్
గీతం శాంతం మధురమపి య సింహనాదం జగర్జ
సోఽయం జాతః ప్రథిత పురుషో రామకృష్ణ
స్త్విదానీమ్"

అనగా నాడు కురుక్షేత్ర రణరంగ ప్రళయ ఘోషలను స్తబ్ధ మొనర్చి, అవిద్యాంధకారము నణచి, ప్రశాంత మధురముగ గీతాశ్రుతి నుద్ఘోషించిన జగద్గురుడు శ్రీకృష్ణుడే నేడు శ్రీరామ కృష్ణు డైనాడట ! నిజముగా పరమహంస దొడ్డవాడే. వివేకా నందుని గురుభక్తి మరీ దొడ్డది. ఈ మందాక్రాంత రచ నయు మిక్కిలి చక్కనిది. అసలు స్వామి వ్యాసంగము విశాల మైనది. గీర్వాణవాణి కతని రసనాగ్ర మొక రంగస్థలము.

అతని అనువాదముల నొకపరి పలుకరింతము :

1. శంకరుని నిర్వాణ షట్కము నుండి :

"మనోబుద్ధ్యహఙ్కార చిత్తాని నాహమ్
న శ్రోత్రం న జిహ్వా నచ ఘ్రాణనేత్రమ్
న చ వ్యోమ భూమిర్నతేజో న వాయు
శ్చిదానందరూప శ్శివోఽహం శివోఽహమ్."

అనువాదము :

"I am neither the mind, nor the intellect, nor the ego· nor the mind-stuff,
I am neither the body, Nor the Changes of the body.
I am neither the senses of hearing, taste, smells or sight.
Nor am I the ether. the earth, the fire the air.
Exicstence Absolute, Knowledge Absolute and Bliss Absolute,
I am He, I am He.

2. నాసదీయ సూక్తమునుండి (ఋగ్వేద. మం.X సూ. 129):

"నా సదాసీన్నో సదాసీ త్తదానీమ్
నా సీద్రజో నో వ్యోమా పరోయత్
కి మావరీవః కుహకస్య శర్మ
న్నంభః కిమాసీ ద్గహనం గభీరమ్."

అనువాదము :

"Existence was not then, nor non-existence.
The world was not, the Sky beyond was neither.
What covered the mist ? of whom was that ?
What was in the depths of darkness thick?

సంస్కృతాంగ్లములు రెండింటను స్వతంత్రముగ కవిత చెప్పగలవాడు వివేకానందుడు. తన మనసులో పై రెండు

రచనల ప్రతిబింబములను చూచినాడు. ఆమూల తత్త్వము నామూల చూడము తరచినవాడు. అతని యనువాద మనవద్య ముగా చతురస్రముగా సాగుటలో నాశ్చర్య మేముండును? ఆ యనువాద మనువాద మనిపింపదు. అతని శైలి యెప్పట్టున అప్రయత్న మనోజ్ఞముగా నుండును. అది భవ్య భావాశ్వమునకు కశాచాలనము, చాపల్యమునకు ఖలీనము.

వివేకానందు డనగా వట్టి తాత్త్వికుడు కాడు. ఉత్తమ తపస్వి. నిర్వికల్పసమాధినిష్ఠుడై "రవిలేని శశిలేని రాకాసి రాత్రిలో విశ్వబింబచ్ఛాయను, అహం ప్రత్యయమున వికసించిన ఆకాశమును, శూన్యమున శూన్యము లీనమైన అనిర్వచనీయ స్థితిని" దర్శించిన ద్రష్ట. అవాఙ్మానసగోచరమగు ఆద్యమగు అవ్యక్తావస్థను దర్శించిన యొక మహర్షి ప్రవచించిన నాసదీయ సూక్తముతోపాటు తన సొంత గొంతుకతో నొక సృష్టి సూక్తమును పఠించినవాడు. సృష్టి కవతల నున్న నిత్య సూర్యోదయమును కనుగొన్నవాడు.

ఎవడు విశ్వశ్రేయఃకాముడై విశ్వవీణా గానమున తన కంఠశ్రుతి మేళవించునో, ఎవని భావన లోకమును లోగొని ఆకసపుటంచున కేకినలు గొట్టునో, ఎవడీ విశ్వ వృక్షమున ఆత్మబీజమును దాని శక్తిని దర్శింపగలడో, ఎవని కవితకు కాల దోషము పట్టదో వాడు విశ్వకవి. వివేకానందు డచ్చముగా నొక విశ్వకవి.

ఆ విశ్వకవి పఠించిన శాంతి సూక్తముతో నీ వ్యాసమునకు స్వస్తి చెప్పెదను—

"ఆహా! మహాంధకారమున
నది యొక మహాస్ఫురము!
మిరుమిట్లు గొలుపు మెఱపున
మనలేడి క్రీనీడ యది!
అది సుఖముకాదు, కాదు దుఃఖము
ఆ మధ్యస్థ మవస్థ!
అది రేయికాదు పవలు కాదు
రెండింటికి పన్నిన సూత్రము!
అది మధుర సంగీతము మధ్య విరామము
చూడని సౌందర్యము, పాడని సంగీతము
నిండు జన్మలు రెండింటి నడిమి పెన్నిద్దుర యది
రెండు మహా వర్తముల మధ్య నిండిన నిస్తబ్ధత
అటు నిటు సృష్టికి అంచులు సవరించిన అవ్యక్తస్థితి
చిత్త నిత్య స్థిత నిశ్చలకాంతి
చింతా నిరంతర జీవితాధ్వ విశ్రాంతి
అది యేమిటి? అది యేమిటి?
శాంతికదా! శాంతి కదా!
సిద్ధిర్భవతుమే సదా!
ఓం తత్సత్

ముగ్ధ శైశవము

శ్రీ టి. బి. యం. అయ్యవారు

తెలి కన్నుంగవ మూసి లేనిదుర చాంద్రదీస్నిగ్ధగండస్థం
మ్ములఁ గ్రొందళ్కు-లు లాస్యమాడ చిఱునవ్వుల్ నవ్వెదేలా శిశూ!
పులకించెన్ దనువెల్ల నీ నగవు సొంపుల్ జూడ—నిద్రించు వ
న్నెల జాబిల్లివి-నిన్ను పాసి చనలేనే లేను వ్యోమాకృతిన్.

షాత్రిలిలో స్మిత ప్రసవముల్ విరబూచెడి కల్పవల్లి! నిన్
మెత్తని పూలతేరిపయి నిర్జరబృందము త్రిప్పెనా!- ప్రియో
దాత్త రసార్ద్ర గీతికలఁ దన్పుదురా సురరామ లింపు త
ళ్కొత్తగ వేల్పుమ్రాకుల సుమోజ్జ్వల వాసన వీచునా! కలన్.

చివురుం జేతుల నెత్తి పిల్తువుకదా! స్నేహమ్ముతో నిత్యమున్
నవశీతాంశు మయూఖ కందళములన్-నవ్యప్రసూనచ్ఛటా
నవపానాగత చంచరీకముల-భూజాగ్రమ్ములందాడు ప
క్షి వితానమ్ముల—వచ్చెనా యవి కలన్ క్రీడింప నీతో నిటన్.

నీవు చూచు చిత్రమ్ముల-నీవు వినెడి
దివ్యగీతమ్ములను నేను తేవలఁతినె
మత్క-విత్వాధ్వమున కెట్లు? మధుర పైక
రావరుచి తీవ్ర ఝంఝానిలముల కబ్బు.

ధవళ దుకూలపల్లవగతంబయి లోలపదాబ్జ కింకిణీ
రవమయి-మందహాస రుచిరంబగు నీ సుకుమారమూర్తివై
భవమిది-మా కిటన్ గల శవార్ధిశయాను నొయారమున్-దృగు
త్సవముగఁ దెచ్చెడిన్ స్మృతిపథంబున కన్వహమో స్తనంధయా!

ముళ్లకిరీటం

'హవీస్'

మాధవరావు ఫైళ్లు మూసి, లేచి నిలబడ్డాడు.

ఉదయం తొమ్మిదిన్నర ఐంది. మరో అరగంటలో ఆఫీసుకి పోవాలి. క్రితంరోజు సాయంత్రం ఐదింటివరకూ ఇంటర్వ్యూ పని సరిపోయింది. ఆ పూట సంతకాలు చెయ్యవలసిన కాయితాలూ, ఇంటర్వ్యూ చేసినవారి తాలూకు రిపోర్టూ—అది ఈరోజు పూర్తిచేయాలి. మాధవరావుకు ఆ ఇంటర్వ్యూ తల్చుకుంటే చిన్నగా నవ్వు వచ్చింది.

కొద్దిగా విచారం కలిగింది కూడా.

చదువుకుంటున్నన్నాళ్ళూ ప్రతివాడికీ భువి బంగారు మలామా వేసిన పూలబాటలాగా కనిపిస్తుంది—డిగ్రీ చేతికి రావటం తరువాయి ఉద్యోగాలు వెతుక్కుంటూ వస్తాయనే భ్రమతో. ఆ తరువాత కథ ప్రారంభమైనాక, నిరాశ నిస్పృహ కలగటం ప్రారంభిస్తాయి. సాధారణంగా అవి ఉండవలసిన (లేక ఉండదగిన) దానికంటె ఎక్కువ మోతాదులో ఉంటాయి. ఖాయంగా జరుగుతుందన్న పని కాకపోవటంవల్ల కలిగే నిరాశ, ఆ నమ్మకం లేకుండా చేసిందానివల్ల కలిగే దానికన్నా, ఎక్కువకదా!

మాధవరావుకి పదేళ్ళక్రితం తన జీవితం గుర్తుకొచ్చింది. అప్పుడు తాను పట్టె బి. కాం. అదైనా డింకీలు పల్లకీలతో ఐందనిపించాడు. అంటే దండయాత్రలవల్లకాదు. ముందు చూపుకన్నా, వర్తమాన సుఖాలమీదే ధ్యాస ఎక్కువ ఉండే తండ్రికిపుట్టే తనయుడి బాధ అది. యాచనచేతకాక, అది లేక గడవక, ఆత్మ విశ్వాసం చావక, అది అహంకారంగా ఇతరులచేత అనిపించుకో బడటంలో ఉన్న తమాషా అది. తమాషాయే మరి. తన చదువు అలాగే సాగింది. ఐతే అందులో—తన విషయంలో ఒక్క సుగుణం ఏమిటీ అంటే తన తల్లి భీరువు కాదు. తనను అలా కానివ్వలేదు.

ఆ తరువాత ఉద్యోగాన్వేషణా ప్రకరణం ప్రారంభమైంది. తనకు ఎలాంటి సిఫార్సులూలేవు. ఉద్యోగార్హతలలో అతి ముఖ్యమైన ఆ క్వాలిఫికేషన్ తనకు లేకపోవడం సమస్యను మరింత భయంకరం చేసింది. చివరికి కేవలం అదృష్టవశాత్తూ ఒక బ్రిటిష్ కంపెనీలో గుమాస్తా ఉద్యోగం దొరికింది.

ఆ తర్వాత పెళ్లైంది. జీవితం కొంత సాఫీగానే నడుస్తున్నా, ఆఫీసులో గొడవలు మనసును కల్లోలం చేసేవి. అంతా కట్‌త్రోట్ కాంపిటీషన్. ఎవరికివారు పై అధికారి ప్రాపకం సంపాదించి, పెద్దపీటకోసం ఆరాటపడడం. ఆ ప్రయత్నంలో ఇతరులమీద లేనిపోని చాడీలు. నిజానికి అవన్నీ పట్టించుకోవలసిన అవసరం తనకేమీలేదు. తను పట్టించుకునేవాడుకాదు కూడా. ఐతేనేం? అందరిచేతా వంగి వంగి సలాములు చేయించుకుంటున్న ఆఫీసరుకి తాను ముభావంగా ఉండటం నచ్చిందికాదు. ఏదో రకంగా 'పగ తీర్చుకునే ప్రయత్నం చేసేవాడు. అప్పుడూ అదృష్టమే తనను కాపాడింది. హెడ్ ఆఫీసు మరీ అంత తెలివి తక్కువదికాదు. రాబర్ట్‌సన్ దొర మానేజింగ్ డైరెక్టర్—తనంటే ఎందుకో అభిమానం చూపించేవాడు. ఆయన చలవవల్లనే తన శ్రమ ఫలించి ఈనాడు బ్రాంచి మానేజరైనాడు. అందుకు ఎన్ని విమర్శలు? ఎదురుగా అనకపోయినా చాటున 'మూల విరాట్టునే పట్టాడు గురూ' లాంటి మాటలు అనుకునేవారు తమ ప్రయత్నం ఫలించకపోయిన వారందరూ. తనకు వారందరిమీదా జాలివేసేది. తాను జీవితంలో నేర్చుకున్నది, అమ్మ నేర్పింది ఒక్కటే పాఠం. ఆనందానికి, విజయానికి 'షార్ట్‌కట్'లు లేవు.

అందుకే తనకు ఈ హోదా రాగానే ఒక్కటే నిశ్చయం చేసుకున్నాడు. నిజంగా అర్హతఉన్నవారికి తనతోచిన సహాయం చేయాలి. ఆ సంగతి విన్న అమ్మా, కమలా చాలా ఆనందించారు. కమల అన్నది కూడా 'అందరూ మీలాంటివారే ఐతే దేశం ఎంత బాగుపడిపోను?' అని. తాను గర్వించాడు. తనకు లోటే లేదని ఆనందించాడు.

''ఏమిటి ఆలోచిస్తూ నుంచున్నారు? భోజనానికి రారా?'' అన్న భార్య మాట విని వెనక్కు తిరిగాడు మాధవరావు. కమల మాధవరావు నిలుచున్నచోటికి వెనగ్గా ఉన్న గోడమీది ఫోటోను చూసి, ''ఏమిటో పెళ్ళి ఫోటో పరిశీలిస్తున్నారు?'' అన్నది సగం సిగ్గుతో, సగం కొంటెగా.

మాధవరావు నవ్వి, ''మధుర స్మృతులు'' అన్నాడు ఆమెను దగ్గరకు తీసుకుంటూ.

''ఇవాళ ఆఫీసు లేదేమిటి?'' అన్నది కమల.

మాధవరావు ఉలిక్కిపడ్డట్టు, ''ఔనౌను. తొందరగా వడ్డించమను అమ్మని'' అన్నాడు స్టాండుమీద తువాల అందుకుంటూ.

''అంతా సిద్ధంగానేఉంది. మీరు రావటమే తరువాయి.''

భోజనం చేస్తుండగా పార్వతమ్మ అన్నది: ''మీ మామయ్య, అబ్బాయీ సాయంకాలమే వెళ్ళిపోతారుట నాయనా! అబ్బాయి ఉద్యోగం సంగతి ఏం చేశావు?'' అని. మాధవరావు నోటి దగ్గర చెయ్యి ఒక్కక్షణం ఆగింది. ఆ తర్వాత అతనా ముద్ద మింగి ''ఇవాళ ఉత్తరం రాస్తున్నాను'' అన్నాడు క్రీగంట కమలవంక చూస్తూ.

''ఏదో వాళ్ళు మీమీద ఆశ పెట్టుకు వచ్చారా? అతనూ పరాయివాడుకాదు. స్వయానా కమల పినతండ్రి. ఐనవాళ్ళం ఒకళ్ల కొకళ్లం చేసుకోకపోతే ఎవరు చేస్తారు?''

మాధవరావు తటపటాయింపులో పడ్డాడు. అతనికి చెప్పాలని ఉన్న నిజం ఆడవాళ్లిద్దరికీ నచ్చకపోవచ్చు.

కొడుకు సందేహం గమనించలేదు పార్వతమ్మగారు. ''అబ్బాయి బుద్ధిమంతుళ్లాగే ఉన్నాడు. ఆ ఉద్యోగం కాస్తా దొరికితే వో ఇంటివాడౌతాడు'' అన్నది.

'దొరక్కపోతే కాడా?' అనుకున్నాడు మాధవరావు. అమాటే పైకి అందామనుకుని 'ఎందుకొచ్చిన రభస?' అని మానేశాడు. తన పినమామగారు పేదరికంతో అల్లాడిపోవటం లేదు. లక్షలకి లక్షలు లేకపోవచ్చునుగాని, జాగ్రత్తగా చూసుకుంటే రెండు తరాలకి సరిపోయే ఆస్తి ఉన్నది. ఒక్కడే కొడుకు. అతనూ అంత వయసుమీరిపోయినవాడేమీకాదు. ఈ ఉద్యోగం రాకపోయినా అతనికి పెద్ద ఇబ్బంది కలుగదు.

''ఆ అబ్బాయికి ఇమ్మని రాస్తున్నావుగా?'' అన్నది పార్వతమ్మగారు తిరిగి.

''అలా రాయటానికి వీల్లేదమ్మా. వచ్చిన వాళ్లందర్నీ ప్రశ్నలు అడిగాంకదా? వాటినిబట్టి మార్కులు వేశాం. ఆపైన వాళ్ల క్వాలిఫికేషన్సూ, నడవడి సర్టిఫికెట్లూ ఉంటాయికదా? అవన్నీ హెడ్ ఆఫీసుకి పంపిస్తున్నానివాళ. వాళ్లు ఎవర్ని తీసుకోమంటే వాళ్లని తీసుకుంటాను' అన్నాడు.

''నీ చేతిలో ఏమీ లేదన్నమాట?'' అన్నది పార్వతమ్మగారు కించిత్ నిరాశగా.

''అదేగా చెప్పేది!'' అన్నాడు మాధవరావు చేతులు కడుక్కుంటూ.

గదిలో కోటు తొడుక్కుండుండగా లోపలకు వచ్చింది కమల వక్కపొడి డబ్బా తీసుకుని. మాధవరావుకి ఆమెవంక చూసే ధైర్యం లేకపోయింది. వక్కపొడి ఎటోచూస్తూ అందుకుని, బల్లమీది ఫైళ్లు తీసుకున్నాడు. గబగబా బైటకి రాబోయి, ''చూడండి'' అన్న కమల పిలుపుతో గుమ్మం దగ్గర ఆగిపోయాడు.

''ఐతే సుందరానికిఆ ఉద్యోగం రాదన్నమాటేగా?'' అన్నదామె. ఆమె గొంతులో మార్దవమూ, లాలనా లేవు. చాలా పొడిగా ఉన్నది.

''ఆ మాట నేననలేదు'' అన్నాడు మాధవరావు పిరికిగా.

''ఈ మాత్రందానికి ఎవరు అబద్ధా లాడమన్నారు? మీ రాబర్ట్సన్........''

మాధవరావు కీ సారి మాట ధాటిగానే వచ్చింది. ''రాబర్ట్సన్‌గారు కాదిప్పుడు జనరల్ మానేజరు. ఆయన ఆర్నెల్ల కిందటే రిటైరైనాడు'' అన్నాడు.

కమల ఒక్కక్షణం ఏమీ అనలేదు. ఆ తర్వాత, ''సరే! మీరు అధికారులు. బాబాయితోటి ఈ సంగతి చెప్పమన్నారా?'' అన్నది.

మాధవరావు గడియారంవంక చూసి, ''నాకు టైమౌతోంది'' అని జవాబివ్వకుండా వీథిలోకి వచ్చేశాడు.

రిక్షాఎక్కి కూచున్న తర్వాత మాధవరావుకి కించిత్ పశ్చాత్తాపం లాంటిది కలిగింది. కమలతో తాను మొరటుగా ప్రవర్తించాడు. తన వాళ్లకి సాయం చెయ్యలేదన్న బాధతో ఆమె కొంత కటువుగా మాట్లాడితే మాట్లాడి ఉండవచ్చుగాక. అందుకు తానలా ప్రవర్తించటం ఏమంత మంచిది? మాధవరావు మరో ఆలోచనరాగా తనను తాను వోదార్చుకున్నాడు. సాయంత్రం ఇంటికివెళ్ళి క్షమాపణ కోరుకుంటే సరిపోతుంది. కమల చాలా మంచిది!

రిక్షా ఆఫీసు దగ్గర ఆగింది. మాధవరావును చూసి బైట నిలబడి కబుర్లాడుకుంటూన్న గుమాస్తాలంతా నిశ్శబ్దంగా లోపలకు వెళ్ళిపోయారు. మాధవరావు, మౌనంగా లోపలికి పోయాడు. తన సీటులో కూచున్నాక ప్యూన్‌ని పిలిచి ''రామారావుగార్నిలా రమ్మను'' అన్నాడు. రెండు నిమిషాల తర్వాత రామారావు లోపలకు వచ్చాడు.

''రెండు ఉత్తరాలు చెబుతాను. వ్రాసుకోండి'' అన్నాడు.

రామారావు తలవూపి కలమూ, కాయితం అందుకున్నాడు.

ఉత్తరాలు చెప్పటం అయింతర్వాత ''రంగారావుగారు పూర్నించి వచ్చినట్టున్నాడే?'' అన్నాడు మాధవరావు.

రామారావు చిన్నగా నవ్వి, ''నిన్న సాయంత్రం వచ్చాడు'' అన్నాడు.

''ఏమిటి విశేషాలు?''

రామారావు మాధవరావు భావం అర్థం చేసుకుని ''హెడ్ ఆఫీసులో మీ గురించి ఏవో గుస గుసలు ప్రారంభమైనాయట. ట్రాన్సఫర్ అలాంటి దేదో జరుగుతుం దనుకుంటున్నారుట'' అన్నాడు.

''ఎవరు చెప్పార్ట?''

''అతనోత్తి ఎవరు చెబుతారండి?'' అన్నాడు రామారావు నవ్వి.

మాధవరావు నవ్వి వూరు కున్నాడు.

ఉత్తరాలు టైప్ చెయ్యటం ఐపోయాక రామారావు వెళ్ళిపోయాడు. వారం రోజుల్నుంచీ టైపిస్టు సెలవులో ఉన్నది. ఆఫీసులో రహస్యాలు కాపాడగలవాడు రామారావు ఒక్కడేనని నమ్మకం ఉండటంచేత, అతనిచేత ఉత్తరాలు టైప్ చేయిస్తున్నాడు మాధవరావు. 'ఈ కాస్త దానికి ఎంత రభస?' అనుకున్నాడు మాధవరావు. ఆ రంగారావుకి తన సొమ్మేదో పోయినట్లు బెంగ. అందుకే సెలవు పెడతానంటే వెంటనే శాంక్షన్ చేశాడు తను. అతను హెడ్ ఆఫీస్‌కి పోయివచ్చాడు!

ఉత్తరాలు సరిచూసి, సంతకాలు పెడుతూండగా బంట్రోతు లోపలకువచ్చి, ''సుదర్శనంగారట మీ కోసం వచ్చారయ్యా'' అన్నాడు. మాధవరావు తలెత్తి ''రమ్మను'' అన్నాడు.

నిముషం తర్వాత సుదర్శనంగారు లోపలకు వచ్చారు. కూచుంటూనే, ''ఔనుగానీ, ఇంత పెద్ద ఆఫీసు, కనీసం నీ రూమైనా ఏర్ కండిషన్ చేయించలేదేమోయ్?'' అన్నాడు.

''నా ఒంటికి పడదండి. అందుకని నేనే వద్దన్నాను'' అని ఆయన అవస్థచూసి తానే ఫాను వేశాడు మాధవరావు.

కాస్త ప్రాణం తెప్పరిల్లాక, ''అన్నట్టు బైట కారు లేదు. ఇంటికి పంపించారా?'' అన్నాడు సుదర్శనంగారు తిరిగి.

''గారేజ్ కి పంపించాను. చిన్న రిపేరొచ్చింది''

సుదర్శనంగారు ఒక్క క్షణం వూరుకుని, ''నిన్ను చూస్తూ ఉంటే చాలా సంతోషంగా ఉంటుందోయ్ మాధవరావూ! కష్టపడ్డావు. పైకొచ్చావు. ఐతే ఒకటి. కష్టపడ్డవారంతా పైకొస్తున్నారా? నీ మంచితనం, పరోపకారబుద్ధీ నిన్ను పైకి తెచ్చాయి. ఏమంటావు?'' అన్నాడు.

''అంతా మీ చలవ''

''అదేమన్నమాట? ఆ మాటకొస్తే నేను చేసిన సాయం ఏవుంది? వేలిచ్చానా? లక్షలిచ్చానా?'' మాధవరావు చిన్నగా నవ్వి వూరుకున్నాడు.

''నీ సంగతి అప్పుడప్పుడు మా ఇంటిది కూడా అంటూ ఉంటుంది. పొద్దున్నే నీ సంగతి వచ్చింది. నిన్న ఇంటర్వ్యూకి నా మేనల్లుడు కూడా వచ్చాడుగా? వాడికి నువ్వు ఉద్యోగం ఇస్తావో లేదోనని తాపత్రయం. అతనంత కృతఘ్నుడు కాడులే అని వూరుకోబెట్టాను. పోనీ వాడైనా వాజ అయితే నువ్వు అనుమానిస్తావు, నిక్షేపంగా బి. యే. పాసయ్యాడు. తెలివి గలవాడు. ఏమంటావ్?''

మాధవరావు ఏమీ అనలేదు.

సుదర్శనంగారు బల్లమీదఉన్న ఉత్తరాలవంక క్రీగంట చూస్తూ, ''హెడ్ ఆఫీస్ కన్ఫర్మేషను ఎప్పుడొస్తుందో?'' అన్నాడు.

''వారం రోజులైనా పడుతుంది'' అన్నాడు మాధవరావు.

''అబ్బా? ఐతే వారంవరకూ మావాడు గోళ్లు గిళ్లుకుంటూ కూచోవలసిందేనంటావు? అన్నట్టు అడగటం మరచాను. జీతం ఎంతుంటుంది?''

''అర్హతానర్హతల్ని బట్టి ఉంటుంది''

సుదర్శనంగారి కనుబొమలు ముడిపడ్డాయి. ''అంటే?'' అన్నాడు.

''క్వాలిఫికేషన్లూ అదీ చూస్తారుగదా? నిన్నటి ఇంటర్వ్యూ మార్కులు చూస్తారు. దాన్నిబట్టి జీతం నిర్ణయిస్తారు''

''అలాగా?'' అన్నా డాయన గంభీరంగా.

మాధవరావు ఆయనలో కలిగిన మార్పు నర్థం చేసుకున్నాడు. నిజానికి తను ఎవర్ని సెలెక్ట్ చేశాడో, చెప్పవలసిన అగత్యంలేదు. చెప్పకూడదు కూడా. ఆమాట మొహాన కొట్టినట్టు చెప్పటం తన చాత కావటంలేదు. సుదర్శనంగారు తన చదువుకి కొంత సాయం చేశాడు. ఆ సాయం ఏ పరిస్థితుల్లో చేశాడో అని తర్కించటం అనవసరం. వ్యాపారం చేసుకునే వాడికి లక్ష వ్యావర్తులుంటాయి. అందువల్ల విసుగుదల కలగటం కూడా సహజమే. పైగా బిచ్చగాడికి ఎంచే హక్కులేదు.

సుదర్శనంగారు లేచి నిలబడి, ''వస్తాను మాధవరావు. పాపం నీకు లక్ష పనులుంటాయి. ఇదివరకిటివాడివికాదుగా? ఆఫీసరువాయె. ఎంతమందితోనో మొహమాటాలు, ఘనులు ఉంటాయి. వస్తాను'' అన్నాడు.

మాధవరావు లేని నవ్వు తెచ్చుకుని, లేచి నిలబడి ''మంచిది ఉంటాను'' అన్నాడు చేతులు జోడిస్తూ.

తుమ్మల్లో పొద్దూకినట్లుగా ఐన మొహంతో సుదర్శనంగారు వెళ్ళిపోయాడు. మాధవరావు కుర్చీలో కూలబడ్డాడు. ప్యూన్ టపా తీసుకొచ్చి బల్లమీద పెట్టి వెళ్లిపోయాడు. ఒక్కొక్కటి తీసి చదువుతూ మనఃక్లేశాన్ని దూరం చేసుకో యత్నించసాగాడు మాధవరావు. అన్నీ ఎక్కడెక్కటినుంచో వచ్చిన ఆర్డర్లు. అన్నింటినీ పరిశీలించిన తరువాత చివరి కవరు చింపాడు మాధవరావు. అది తనకు వ్యక్తిగతంగా వ్రాసింది. రాజమండ్రినుంచి వచ్చింది. మాధవరావుకు ఆ ఉత్తరంలోని దస్తూరి పరిచితమే. అందులో ఏమంటుందో అతనికి తెలుసు. ఐనా చదివాడు.

ప్రియమైన మాధవరావుకు,

ఇక్కడ మేమంతా క్షేమం. నువ్వూ, కమలా, వదినా కులాసా అనుకుంటాను. వారం రోజులక్రితం నీ కొక ఉత్తరం వ్రాశాను. దానికి జవాబు రాలేదు. బహుశా పని ఒత్తిడి మూలాన రాసిఉండవనుకుంటున్నాను.

మావాడు అక్కడికి ఇంటర్వ్యూకి వచ్చిన సంగతి నీకు తెలుసుగదా? వాడు స్వతహాగా భిడియస్తుడు. నలుగురితో కలిసి మెలిసి తిరగలేనివాడు. అందుచేత మీ ఇంటో ఒక్కపూటైనా భోంచేయకుండా తిరిగి వచ్చేశాడు. నువ్వు దానికి బాధపడకు. కమలనీ, వదిన్నీ బాధ పడవద్దని చెప్పు. ఏడాదిపాటు మా ఇంటో మీ రిద్దరూ ఉన్నారు. అలాంటిది ఒక్కపూట మా వాడికి నువ్వు భోజనం పెట్టనంటావా?

మావాడు ఇంటర్వ్యూ సంగతేమీ (ఎలా జరిగిందో ఏమిటో) నాతో చెప్పలేదు. ఎలా సమాధానాలు చెప్పాడో ఏమో? చెపితినికదా భిడియస్తుడని? నాకైతే బెంగలేదు. ఎలాగూ అపాయింటింగ్ అథారిటీ నువ్వేకదా?

పిన్ని నిన్ను అడిగానని చెప్పమన్నది. పిల్లలంతా కులాసా. నీ క్షేమం తెలియపరుస్తూ ఉత్తరం వ్రాయి.

ఆశీస్సులతో

నీ బాబాయి రమణమూర్తి

మాధవరావు 'బావుంది' అనుకున్నాడు.

అంతా ఆలోచిస్తుంటే నవ్వాలో ఏడవాలో తోచకుండా ఉన్నది తనకి. అందరికీ ఆ ఉద్యోగం కావాలి. అందరూ కాస్తో కూస్తో వెనకాలవున్న వాళ్లు. తల్చుకుంటే మరో ఉద్యోగం సంపాయించుకోగలరు. ఆ తల్చుకోవటమే ఎందుకు శరీరాయాసం హాయిగా మన వాడుండగా? అని కాబోలు ఉద్దేశ్యం!

బాబాయి వ్రాసిన ఉత్తరంలో 'భిడియస్తు' డన్నమాట నవ్వు తెప్పించింది మాధవరావుకి. ఎవరి పిల్లలు వారికి ముద్దు. అడిగిన ప్రశ్నల్లో నూటికి పదింటికి జవాబుచెప్పి ఆ పదింటిలో ఎనిమిదింటిని బొంగితోనే కైలాసం పంపించిన 'భిడియస్తుణ్ణి'

ఎలాగ ఉద్యోగంలో తీసుకోవటం? మాట్లాడిన ప్రతి ఇంగ్లీషు వాక్యంలోనూ ఆ భాషమీద గౌరవం ఉన్నవార్ని నూతిలో దూకి చావాలనిపించే వైదుష్యమే. డిగ్రీ అంటూ ఉంటుంది. అత్తెసరు మార్కులుకన్నా ఎక్కువే వస్తాయి కూడా. నిజ స్వరూపం మాత్రం అలా ఉంటుంది.

ఇంటర్వ్యూలో వేసే ప్రశ్నలూ అంతంత మాత్రంగానే ఉంటాయి. ఐతే వాటి వెనకాతలిది అభివృద్ధి ప్రెజెన్స్ ఆఫ్ మైండ్‌నీ, చురుకుదనాన్ని పరీక్షించాలన్న ఆశయమే. ఒకానొక కంపెనీలో గుమాస్తా పని చెయ్య దల్చుకున్నవాడికి 'సహారా అనేది టిబెట్టులోని యాత్రా స్థలం' అని తెలిస్తే ప్రమాదం ఏమీ లేదేమోకానీ, అంతచక్కగా పాఠాలు వంటబట్టించుకున్నవాడు ఈనాడు చేయవలసినపనిమీద ధ్యాస ఉంచుతాడని నమ్మటం ఎలాగ? డిగ్రీలు, మార్కులుకన్నా చురుకుదనం ముఖ్యమనుకునే కంపెనీ తమది. అలాంటి పుంభావ సరస్వతులకి జాగా ఉవ్వ లేకపోవటం తన తప్పా?

మాధవరావుకి ఆ కుర్రవాడు గుర్తుకొచ్చాడు. అతని పేరు సుందర శివరావుట. వయసులో చాలా పిన్నవాడులా కనిపించాడు. స్కూలు ఫైనల్ పాసయి టైప్‌రైటింగ్, షార్ట్‌హాండూ పాసైనాడు. చాలా చురుగ్గా చూడంగానే ఆకర్షించే వాడిలాగా కనిపించాడు. బి. యే. లూ, బి. కాం. లూ చెప్పలేకపోయిన ప్రశ్నల్లో చాలావాటికి సమాధానాలు చెప్పాడు. అతను పేదవాడన్నది స్పష్టం. అంత చిన్న వయస్సులోనే పొట్ట పోషించుకునే ప్రయత్నం చేయవలసి వచ్చినందుకు అతనేమీ బాధపడినట్టు కనిపించలేదు. జీవితంలోని ఒడుదుడుకులను ఒడ్డునుంచి చూడగల ఆత్మ విశ్వాసం గోచరించింది అతనిలో. అన్నింటికిమించి అతను ఎవరి సిఫార్సులూ తీసుకురాలేదు.

అతని హావ భావాలూ, ఆకర్షణా తనని మోసగించకుండా చాలా జాగ్రత్త పడ్డాడు మాధవరావు. మొహం రాయిలా చేసేసి ప్రశ్న లడిగాడు. అతనూ రిజర్వ్‌డుగానే సమాధానాలు చెప్పాడు. మరీ లేత కుర్రాడని తప్ప, అతన్ని ఉద్యోగంలోకి తీసుకోకపోవటానికి కారణం ఏమీ కన్పించలేదు మాధవరావుకి.

టెలిఫోన్ మోత మాధవరావు ఆలోచనలకి అంతరాయం కలిగించింది. రిసీవర్ అందుకుని, "హలో" అన్నాడు మాధవరావు.

అవతలి గొంతు ఎవరిదో గుర్తించడం అసాధ్యమేమీ కాలేదు మాధవరావుకి. చైర్మన్ మల్లపరాజుగారు. ఈయన కాండిడేటు కూడా ఉన్నాడా? అనుకున్నాడు మాధవరావు. ఆ అనుమానంతో మరో శంక కూడా కలిగింది. మల్లపరాజుగారు తనను ఎన్నో విధాల ఆదుకున్నాడు. తను ఈ కంపెనీలో చేరటానికి సాయం చేసింది కూడా ఆయనే. ఆయనమాట కాదనవలసి వస్తుందా? తన నిర్ణయం తప్పు చేయబడి మరో క్షణంలో టపాకి పోనున్నది. ఐనా గొంతు తడి చేసుకుని, "నమస్కారమండీ" అన్నాడు.

"ఆ! ఏమీలేదోయ్! మొన్న నువ్వు పంపించిన వాటికి బిల్లు రాలేదు. డబ్బు పంపిద్దామని ఫోన్ చేశాను" అన్నాడాయన.

బతుకుజీవుడా అనుకున్నాడు మాధవరావు. "దాని దేముందిలెండి? సాయంత్రం అటు వచ్చినప్పుడు తెస్తాను" అన్నాడు.

"సరేలే!.......ఏమిటి విశేషాలు? నిన్న నేవో ఇంటర్వ్యూలు జరిగాయటగా?"

"ఔనండీ"

"మా వాళ్లకుర్రాడొకడున్నాళ్లే. మంచివాడు. నిన్న ఇంటర్వ్యూ కొచ్చాడు. వాడు చెబితే తెలిసింది........ ఉంటాను" అని ఫోన్ పెట్టేశాడాయన.

ఈ వార్త మరింత బాధాకరంగాఉంది అనుకున్నాడు మాధవరావు. అయితే ఆయన తాలూకు వాడెవడో ఉన్నాడన్న మాట. ఎవరో తెలిస్తే బాగుండును. తెలిస్తేమాత్రం తానిప్పు డేం చేస్తాడు? చేసిన నిర్ణయం మార్చటం సాధ్యమా? మరి తన అభివృద్ధికి కారకుడైన వ్యక్తి మాట నిలబెట్టొద్దా? తన అధికారంలో వేలు పెట్టడం ఇష్టం లేకనే, మల్లపరాజుగారు అలా నిర్లిప్తంగా ఉన్నా డన్నది స్పష్టం. అందుకు తాను బదులేం చేశాడు?

మాధవరావుకి తాను ఉద్యోగంలో చేరనున్న రోజు గుర్తుకొచ్చింది. తాను ఇంటర్వ్యూలో నెగ్గుతాననే ధైర్యంగా ఉన్నాడు. మల్లపరాజుగార్ని తాను ఏ సహాయమూ అర్థించలేదు. అమ్మమాత్రం ఏదో మాటల సందర్భంలో ఆయనతో అన్నదిట. బంధువైనందుకు ఆయన సాయంచేయతలపెట్టాడు. కాని, ఆయనకూ ఒకరిదగ్గర చేయి చాచే అలవాటు లేదు. అందుకోసం ఏం చేశాడు? ఆరోజు తనను ఇంటికి పిలిపించి తన సత్తా ఏదో మాటల సందర్భం అన్నట్టుగా పరీక్ష చేశాడు. ఆ తర్వాత ఆయనకు అంతకుముందే పరిచయమున్న కంపెనీ మానేజర్‌తో మాట్లాడాడు. ఏం మాట్లాడాడో ఐతే తనకు తెలీదు. ఉద్యోగం వచ్చింతరువాత 'ఇదంతా మీ చలవే' నని నమస్కరించబోతే 'అదేం లేదేయ్! ఆయనే నిన్ను సెలెక్టు చేశాడు' అన్నాడు.

అలాంటివాడు మల్లపరాజుగారు. మరి ఆయనకు కృతజ్ఞత తెల్పుకోవటం తన విధికదా? తన అభిప్రాయం మార్చుకుంటే...

మాధవరావు ఏ నిర్ణయానికి రాలేకపోయాడు. ఆలోచనలు మార్చుకునేందుకు కొంతసేపు ఫైళ్లు తిరగేశాడు. వచ్చిన ఆర్డర్లను డిస్పాచింగ్ క్లర్కుకు పంపించాడు. అదంతా అయేసరికి లంచ్ టైమైంది. మాధవరావు మామూలు ప్రకారం టీ తెప్పించుకు తాగి తన రూమ్‌లోనుంచి బైటికి వచ్చాడు. ఆఫీసరు అనే గౌరవంతో అంతా మాటలు ఆపేసి తమ పనులు తాము చూసుకోసాగారు. ఒక్కసారి ఆఫీసంతా కలయ దిరిగి, తిరిగి తనసీటుకొచ్చి కూచున్నాడు మాధవరావు. మనసు కాస్తంత తేలిక పడినట్లైంది.

మరో గంట గడిచింది.

పని చూసుకుంటున్నాడన్న మాటేగాని మాధవరావు మనసంతా మల్లపరాజుగారి తరపు కుర్రవాడిమీదికే లాగపాగింది. అత నెవరై ఉంటాడో అతని వూహ కందటంలేదు. ఉన్న ఒక్క ఉద్యోగానికే డజనుమంది వచ్చారు. ఆ డజనుమందీ తాను ఏరినవాళ్ళు. అందులో ఆ సుందర శివరావు ఒక్కడుతప్ప మిగతా వారందరూ అనర్హులుగానే కనిపించారు తనకి. ఒక వేళ అతనే మల్లపరాజుగారి తాలూకేమో? అలాఐతే ఇహ తనకు ఏ బెంగాలేదు. కాని, అతనని ఎలా? మిగతా వాళ్లల్లో ఎవరై ఉంటారు అని కొంతసేపు ఆలోచించాడు. వాళ్లల్లో ఇద్దరు ముగ్గురు తప్ప అందరికీ ఏవో సిఫార్సు లున్నాయి. లేని ముగ్గుర్లో ఆ కుర్రవాడుపోతే మిగిలిన ఇద్దరూ ఈ వూరివారుకాదు. వాళ్లలోనే ఒకడై ఉంటాడా?

మాధవరావు నుదుట పట్టిన చెమట తుడుచుకుంటుండగా బంట్రోతు లోపలకొచ్చి, "మీ మామయ్యగారట వచ్చారుసార్" అన్నాడు మాధవరావుకి మొదట ఆ మాట అర్థం కాలేదు. "ఎవరూ?" అన్నాడు.

"మీ మామయ్యగారట"

మాధవరావు 'చిత్రంగానే ఉందే! ఈయనింకా వూరు పోలేదా?' అనుకుని, "రమ్మను" అన్నాడు ఫైలు మూస్తూ.

రాజారావుగారు లోపలకువచ్చి "పాపం నిన్ను డిస్టర్బ్ చేసినట్టున్నానే?" అన్నాడు నవ్వుతూ.

మాధవరావు పినమామగారి మొహం ఉషారుగానే ఉండటం గమనించి, "అదేంలేదు. ఏమిటిలా వచ్చారు?" అన్నాడు.

రాజారావుగారు కూచుని, "ఏంలేదు. సాయంత్రం అయిదింటి బండికి వెళ్ళిపోతున్నాను. చెప్పిపోదామని వచ్చాను" అన్నాడు.

మాధవరావు తలవంచుకుని, "క్షమించండి మావయ్యా! మీకు సాయం చెయ్యలేకపోయాను" అన్నాడు.

రాజారావుగారు నవ్వి, "అలాగంటా వేమిటోయ్! నే నందుకేమీ బాధపడటంలేదు. కాని, నీ మనసులోని మాట నా దగ్గర కూడా దాచుకున్నావే అని బాధపడుతున్నాను. మనలో మనకి రహస్యాలైతే ఎలాగ?" అన్నాడు.

మాధవరావుకి పినమామగారి మాటలు అబ్బురంగా తోచినై. తనింతవరకూ ఆయన్ని అపార్థం చేసుకున్నాడా? ఈమాత్రం విశాల హృదయం లేకపోయిందా కమలకి?

"ఇందాక ఆ రంగారావుగారు కనిపించాడు. అతని మామగారు ద్వారా అతను నాకు కాస్త పరిచయం. అతనే చెప్పాడు అసలు సంగతి." అని జేబులోంచి అయిదు వందనోట్లు తీశాడు రాజారావుగారు. "ఓ స్నేహితుడుంటే అడిగి పట్టుకొచ్చాను. ఇంద. ఇది తీసుకుని ఆ ట్రాన్సిస్టర్ రేడియో కొనుక్కో. చైర్మన్ గారికేం? పదవిలో ఉన్నవాడు. ఎవడి కాళ్ళో పట్టుకుని ఉద్యోగం వేయించుకోగలడు" అన్నాడు. మాధవరావుకి ఆయన చెబుతున్నదంతా అయోమయంగానే ఉన్నది. కొద్ది క్షణాలదాకా అతనినోట మాట రాలేదు. ఆ తర్వాత "ఎందుకీ డబ్బు?" అన్నాడు.

"ట్రాన్సిస్టరు కావాలనుకుంటున్నావుటగా?"

"ఎవరు చెప్పారు?"

"అతనేనోయ్! రంగారావని ఇక్కడ పని చేయటంలా? అతను?"

గుమాస్తా రంగారావు. తాను ట్రాన్సిస్టరు కొనుకుందామనుకుంటున్నట్లు, ఆయనతో చెప్పటం ఏమిటో అర్థం కాలేదు మొదట మాధవరావుకి. అర్థం ఐనాక శరీరమంతా కోపంతో అసహ్యంతో దహించుకుపోయింది. "గుడ్ గాడ్!" అన్నాడు కోపావేశంవల్ల కలిగిన దిగ్భ్రమతో.

రాజారావుగారు నోట్లు బల్లమీద పెట్టబోయాడు.

మాధవరావు వాటివంకా, ఆయనవంకా నిరసనగా చూసి, "దయచేసి మీరు వెళ్లండి" అన్నాడు.

రాజారావుగారులేచి, "అలాగే. పాపం నువ్వు ఎంత పని చూసుకోవాలో........వస్తాను" అన్నాడు కదలబోతూ.

"ఆ డబ్బు కూడా తీసుకువెళ్లండి" అన్నాడు మాధవరావు కర్కశంగానే.

"అదేం?"

"ప్రశ్న లడక్క ముందు తీసుకు వెళ్లండి" అన్నాడు మాధవరావు మరింత కఠినంగా.

రాజారావు తెల్లబోయాడు. ముఖం పాలిపోయింది. విధిలేక డబ్బు తీసుకు వెళ్ళిపోయాడు.

మాధవరావు నిస్సత్తువగా కుర్చీలో చేరగిలబడిపోయాడు. అతనికి రంగారావుమీదా, పినమామమీదా పట్టరాని క్రోధం కలుగుతున్నది. ఎంత రాస్కెల్సు వీళ్లు! ఏం చెయ్యాలి వీళ్లని? మామగారి అభిప్రాయంలోని నైచ్యం ఎంత జుగుప్సాకరం? ఛీ! ఛీ!

ఆ షాక్‌నించి స్థిమితపడటానికి చాలాసేపు పట్టింది మాధవరావుకి. అతని జీవితంలో అతను ఘోరావమానం పొందినట్లుగా బాధపడటం అదే మొదటిసారి. నాగరిక జీవితంలో కరడు కట్టుకుపోయిన మోసం, కుత్సితం అతని స్వప్న జగత్తు

[illegible]నాథులనే కదిలించి వేసింది. అన్నింటిమీదా, అందరిమీదా పట్టరాని కసి పెల్లుబక సాగింది.

బంట్రోతు లోపలకొచ్చి డిస్పాచింగ్ క్లర్కు పంపిన ఇన్‌వాయిస్‌లు బల్లమీదపెట్టి "అన్నీ టైపు చేసేశారుసార్!" అన్నప్పుడు ఇహలోకంలోకి వచ్చాడు మాధవరావు.

ఒకటి, రెండు చూసి మూడోది తీసుకున్న మాధవరావు కళ్ళకి అందులోని తప్పులు భూతాల్లాగా కనిపించాయి. "ఆయన్ని రమ్మను" అన్నాడు.

బంట్రోతువెళ్ళి ఆ గుమాస్తాను పిల్చుకొచ్చాడు.

"ఏమిటండీ ఈ యిన్‌వాయిస్‌లు! ఒళ్లు దగ్గర పెట్టుకునే కొడుతున్నారా?"

ఆ గుమాస్తా మాధవరావు మాటల్లో క్రొత్తదనానికి చకితుడై, "తప్పులున్నాయాసార్?" అన్నాడు.

"లేకపోతే సరసాలాడుతున్నానా? మందమతిగా పన్లు చేసే బదులు మానుకుంటే మంచిది"

"మళ్లీ కొడతానులెండి"

"మళ్లీ కొట్టట మేమిటండీ మళ్లీ? ఇదేం ఆఫీసా? మార్కెట్టా?"

గుమాస్తా కీసారి కష్టం వేసింది.

"ఎందుకుసార్ అలా మాట్లాడుతారు?"

మాధవరావు ఇన్‌వాయిస్‌లు అతని ముఖాన విసిరికొట్టి, "యూ మీన్ టు ఆర్గ్యూ విత్‌మీ? గెటౌట్!" అన్నాడు తార స్థాయిలో.

గుమాస్తా తను చేసిన కాస్తంత తప్పుకి, ఏనాడూ మాట్లాడని మనేజర్‌గారు ఎందుకింత రెచ్చిపోయాడో అర్థం గాక, నేలమీద చిందర వందరగా పడిఉన్న ఇన్‌వాయిస్‌లను ఏరుకుని వెర్రి మొహంతో స్వింగ్‌డోర్ తలుపు తెరిచి, అక్కడ నిలబడిఉన్న వ్యక్తినిచూసి మరింత కంగారు పడిపోయి "గుడ్ మార్నింగ్‌సార్" అన్నాడు ఆయనవంకా, మానేజర్‌గారివంకా చూస్తూ.

ఆయన లోపలకొచ్చి "మీ రిక వెళ్లండి" అన్నాడు ఇంగ్లీషులో.

గుమాస్తా వెళ్ళిపోయాడు.

మాధవరావు ఆయన్ను చూడగానే నిర్ఘాంతపోయి లేచి నిలుచున్నాడు. వందల మైళ్ల దూరంలోఉన్న జనరల్ మానేజరు ముందుగా తెలియబరచకుండా హఠాత్తుగా రావటం అతనికి అగమ్యగోచరం అనిపించింది.

జనరల్ మానేజర్‌గారుమాత్రం "గుడ్‌మార్నింగ్ మిస్టర్ మాధవరావ్" అన్నాడు చిరునవ్వు ముఖంతో. అప్పటికి తేరుకున్న మాధవరావు "రండి రండి" అన్నాడు సగౌరవంగా

ఆయనవచ్చి కుర్చీలో కూచున్నాడు. కొద్ది క్షణాల దాకా ఇద్దర్లో ఎవరూ ఏమీ మాట్లాడలేదు. మాధవరావుకి ఆయనెందుకు ఉన్నట్టుండి వూడిపడ్డాడో ఎంత ఆలోచించినా అర్థం కావటంలేదు.

"ఏమిటి హటాత్తుగా వచ్చారు?" అన్నాడు చివరికి.

నవ్వి, " అలా వద్దామనే" అని, "ఎలా ఉంది ఆఫీసు వర్కు? ఈనెల సేల్సు ఫిగర్ ఎంత?" అన్నా డాయన.

మాధవరావు ఫైలు తీసి ఆయనముందు పడేసి లెడ్జర్ తెప్పించి చూపించాడు. ఆయన మౌనంగా పరిశీలించటం ముగించి, "వెరీగుడ్ ప్రోగ్రెస్" అన్నాడు.

ప్యూను లెడ్జర్‌లు తీసుకు వెళ్ళిపోయారు.

నిన్నటి ఇంటర్వ్యూ రిపోర్టు తయారు చేశారా?" అన్నా డాయన తిరిగి.

"చేశాను" అని రిపోర్టు ఆయనముందు పెట్టాడు మాధవరావు.

ఆయనది తీసుకుని ఒక్కక్షణం మౌనంగా కూచుండి పోయాడు. ఆ తర్వాత "మీ కొక విషయం చెప్పవలసి వచ్చి నందుకు చాలా విచారిస్తున్నాను మాధవరావు! మీమీద ఈమధ్య హెడ్ ఆఫీస్‌కి చాలా రిపోర్టు లొచ్చాయి. సబార్డినేట్స్‌ని చాలా అవమానకరంగా చూస్తున్నారుట. మీరు రాబర్ట్‌సన్‌గారి అభిమానం సంపాదించుకున్నవారు. వారి కీ విషయం తెలిస్తే ఎంత బాధ పడతారు. ఆయన మీమీద ఉంచిన నమ్మకాన్ని మీరు వమ్ము చెయ్యకూడదు. పైగా అది మన కంపెనీ గౌరవ ప్రతిష్ఠలకు భంగకరం" అన్నాడు గంభీరంగా.

మాధవరావు ముఖం పాలిపోయింది.

జనరల్ మానేజర్‌గారు రిపోర్టు ఆమూలాగ్రం చదివి, "ఐతే మీరు ఎన్.,సుందర శివరావు అనే అతన్ని సెలెక్టు చేశారన్నమాట?" అన్నాడు.

"ఔనండి."

"మిగతా వారిలో కామర్స్ గ్రాడ్యుయేట్లు కూడా ఉన్నట్టున్నారు?

"ఇంటర్వ్యూలో వారెవరూ నెగ్గలేదు"

"అంతేనా? ఈ కుర్ర వాడికి ఎవరిదైనా ఘాటైన రికమెండేషన్ ఉన్నదా?"

ముళ్ళ కిరీటం

మాధవరావు నీరుకారిపోయాడు. ప్రొద్దుటినుంచీ జరుగుతున్న సంఘర్షణకి పరాకాష్ఠ యిది. జనరల్ మానేజర్‌గారు యూరోపియన్. కటువుగా, మూర్ఖంగా మాట్లాడే రకంకాదు. అలాంటివాడు అంతటిమాట అనటం అతనికి తల కొట్టేసినట్టుగా ఉన్నది. మనసు విరిగిపోయింది. అతనికి ఈ ఉత్తరాల వెనకనున్న ఆసామీ తెలియకపోలేదు. అతన్ని ఏమీ అనుకోలేకపోయాడు.

"ఏమిటి ఆలోచిస్తున్నారు?" అన్నా డాయన తిరిగి.

"ఏమీలేదు........అత నొక్కడేనండి రికమెండేషన్‌లేని వాడు" అన్నాడు మాధవరావు.

ఆయన మాధవరావువంక సూటిగాచూసి, "నిజంగా లేదా?" అన్నాడు.

"లేదు" అన్నాడు మాధవరావు ధృఢంగా.

ఆయన ఒక్కక్షణం వూరుకుని, "చూడండి మిస్టర్ మాధవరావు! సిఫార్సులతో ఉద్యోగా లివ్వటం మన ఆచారం కాదు. అతని కెవరి సిఫార్సూ లేదంటున్నారు. నా కది రుజావు కావాలి" అన్నాడు.

"ఏం చెయ్యమంటారు?" అన్నాడు మాధవరావు.

ఆయన ఒక్క నిముషం ఆలోచించి, "అతని కీ వూళ్లో తెలిసిన గొప్ప వాళ్ళెవరైనా ఉన్నారా?" అన్నాడు.

"నాకు తెలియదు"

జనరల్ మానేజర్‌గారు ఆలోచనలో పడ్డాడు. ఆయనకి పైవారి తాఖీదు కనక ఈ ప్రశ్నలన్నీ అడగక తప్పటంలేదు. కాని ఇంతవరకూ వచ్చాక వెనక్కి తిరిగిపోవటం ఎలాగ?

రెండు నిమిషాలు గడిచాయి.

ఫోను గణగణ మోగింది. మాధవరావు అందుకోబోతుండగా జనరల్ మానేజరే అందుకుని, "హలో" అన్నాడు.

అవతలినించి మల్లపరాజుగారి గొంతు వినిపించింది. "నేనోయ్ మల్లపరాజును. సాయంత్రం ఒకసారి మా ఇంటికి రాగలవా?" అన్నాడు.

జనరల్ మానేజర్‌గారు మౌత్ పీస్ మూసి, "మల్లపరాజు గారంటే ఎవరు?" అన్నాడు.

"ఈ వూరి చైర్మన్‌గారు" అన్నాడు.

"అలాగా?" అని రిసీవర్ అందించా డాయన మాధవ రావుకి.

మాధవరావు, "హలో! ఏమిటండీ!" అన్నాడు.

మల్లపరాజుగారు ఇందాక అన్నదే తిరిగి చెప్పి, "ఎ రెవ రన్నా ఉన్నారా అక్కడ" అన్నాడు.

జనరల్ మానేజర్‌గారని చెప్పాడు మాధవరావు.

మల్లపరాజుగారు "అలాగా?" అన్నాడు.

మాధవరావు "ఉంటానండీ" అని ఫోన్ పెట్టెయ్యబోయి, జనరల్ మానేజర్‌గారి సైగ చూసి, "ఏమిటి?" అన్నాడు.

"ఆయన తరపున కుర్రవా డెవరైనా వచ్చారేమో అడుగు?"

"వచ్చాడు" అన్నాడు మాధవరావు.

"అతని పేరేమిటి?"

మాధవరావు ఫోనులో అదే ప్రశ్న అడిగాడు.

మల్లపరాజుగారు ఒక్కక్షణం తటపటాయించి చివరికి చెప్పాడు: "అతనిపేరు ఎస్. సుందర శివరావోయ్" అని.

ఆంధ్రయక్షగాన వాఙ్మయచరిత్ర

శ్రీ రాధాకృష్ణశర్మ

సర్ రఘుపతి వెంకటరత్నం పరిశోధన పద కాంకితము, ఆంధ్ర విశ్వ కళాపరిషత్ప్రకాశితమునగు నీ పరిశోధన గ్రంథమును రచియించినవారు డా. యస్వీ జోగారావుగారు. ఇది రెండు భాగముల బృహద్గ్రంథము. 372 పుటలుగల మొదటి భాగమునందు యక్షగానోత్పత్తియు, అది క్రమ క్రమముగ పరిణతి చెందిన రీతియు తెలుపబడినవి. రెండవ భాగమున 502 పుటలు గలవు. యక్షగాన కవులను గురించియు, వారి రచనలను గురించియు ఈ భాగమున చెప్పబడినది. కాగా, ఆంధ్ర యక్షగాన వాఙ్మయ చరిత్రమునకు సంబంధించిన వివరములను తెలిసికొనుట కీ గ్రంథము తోడ్పడు ననుటలో సందేహములేదు. బహు గ్రంథములు, పత్రికలను పరిశీలించి, ఆ యా వివరములను సేకరించి, వానిని గ్రంథస్థము చేసిన రచయిత కృషిని కొనియాడ నగును. కాని, యక్షగాన వాఙ్మయమునందలి భాషా విశేషములు మొదలగువానిని తెలిసికొనుట కీ బృహద్గ్రంథము అంతగా తోడ్పడదని పేర్కొనుటకు విచారించుచున్నాను. యక్షగాన వాఙ్మయ చరిత్రతోపాటు, ఆ వాఙ్మయమునందలి విశేషములను కూడ తెలిపియున్నచో ఈ గ్రంథమునకు విలువ మరింత కలిగి యుండెడిది. ఈ ప్రయత్నము కొంతవరకు అయిదవ, ఆరవ యనుబంధములలో చేయబడినది. ఈ రెండేకాక, మిగిలిన యనుబంధములు కూడ ఈ గ్రంథమున కలంకార ప్రాయములై యున్నవని నుడువ నగును.

శ్రీయుతులు పంచాగ్నుల ఆదినారాయణశాస్త్రి, వేటూరి ప్రభాకరశాస్త్రి ప్రభృతులు యక్షగానమునకు సంబంధించిన పెక్కు నూతనాంశములు తెలియజేసి పరిశోధకులకు మహోపకార మొనర్చిన విషయము సాహిత్య జిజ్ఞాసువులకు తెలిసినదే. కాని, పర్యాప్త మగు పరిశీలనము మాత్రము జరగలేదు. పాలకురికి సోమనాథుడు, శ్రీనాథుడు మున్నగువారు ఇతరసాహిత్య ప్రక్రియలతోపాటు యక్షగానమును కూడ ఉదహరించుటచే, యక్షగానము ప్రాచీన మయిన దనుట నిర్వివాదము. కాని, ఆ నాళ్లలో యక్షగానమును ఏ యర్థమున వారు వ్యవహరించిరో మనకు స్పష్టముగ తెలియరాలేదు.

క్రీ. శ. 15 వ శతాబ్దమున జీవించిన ప్రోలుగంటి చెన్నశౌరి ప్రథమాంధ్ర యక్షగానకవియనియు, అతని సౌభర చరితము ప్రప్రథమ యక్షగానమనియు మన పండితులు పేర్కొనుచున్నారు. కాని సౌభర చరితమును తిలకించు నదృష్టము మాత్రము మనకు నేటికిని కలుగలేదు. చక్రపురి రాఘవార్యుని విప్రనారాయణ చరిత్ర తెనుగున వెలసిన రెండవ యక్షగానమని శ్రీ జోగారావు ఊహించుచున్నారు. ఇది తాళదళ గ్రంథము. మదరాసు ప్రాచ్య లిఖిత పుస్తక భాండాగారమున గలదు. దీని నెంబరు 1939. దీనిని గురించి భాండాగారమువారి కేటలాగులో ఇట్లు వ్రాయబడినది. (Vol VIII 1940) "The name of the author is not found in this; but it is made out that he was a disciple, of Kondala Doddayacharya." గ్రంథకర్త కొన్ని యుపపత్తులు చూపి ఈ యక్షగానము చక్రపురి రాఘవార్యుని కృతమై యుండునని తలచుచున్నారు. కాని, "........దొడ్డయాచార్యు నాదేశ ప్రకారమే రాఘవాచార్యు డా కథ నీ యక్షగాన రూపమున వెలయించియుండెనేమో! ఇవి యన్నియు నిర్ణయములుకావు" అని గ్రంథకర్తయే నుడువుటచే, తగినంత సాక్ష్యము లభించునంతవరకు ఈ యూహ ఊహగానే పరిగణింపబడును. కనుక మనకు తెలియవచ్చినంతవరకు కందుకూరి రుద్రకవి సంతరించిన సుగ్రీవ విజయమే తొలి తెలుగు యక్షగానము.

రుద్రకవి "క్రీ. శ. 1568 ప్రాంతముల వాడేని, కొంత తర్వాతి వాడేని కాగలడు" అని పండిత ప్రభాకరులు వేటూరివారు సెలవిచ్చినారు. కాని, రుద్రకవి అష్టదిగ్గజములలో ఒకడని శ్రీ నిడుదవోలు వేంకటరావుగారు విశ్వసించుచున్నారు. (చూడుడు: ఆంధ్రపత్రిక మన్మథ సంవత్సరాది సంచిక, పుటలు 73—79). యక్షగానములు నన్నయాదుల కాలమున ఉన్నవనుటకు ప్రబలాధారములు కానరావనియు, కురవంజి అను నొక దేశి నృత్య విశేషము యక్షగానమునకు మాతృక అనియు వేటూరివారి యభిప్రాయము. పంచాగ్నులవారేమో జక్కులవారి పాటలు యక్షగానము లనిరి. బొమ్మలాటల పరిణామమే యక్షగానమని డా. నేలటూరి వేంకట రమణయ్యగారి యభిప్రాయము. యక్షగాన మనగా హరికథయని కొందరు పేర్కొనిరి. ఇటుల ఈ విషయమై పండితులలో అభిప్రాయ భేదములు గలవు. కనుకనే కాబోలు శ్రీ జోగారావుగారు యక్షగాన మనగా ఇదమిత్థమని పేర్కొనలేక, "స్థూలముగా యక్షగానము నీ నా డిట్లు నిర్వచింపవచ్చు" ననుచు ఇటుల నిర్వచించిరి.

"యక్షగానము నం దితి వృత్త మెట్టిదైనం గావచ్చును. రచనాప్రక్రియ శ్రవ్యముగాని దృశ్యముగాని కావచ్చును. ఏ ప్రక్రియయందైన గీతిధర్మము విహితము. అందు రాగ తాళములలో నొక దానికిఁగాని రెండింటికిఁగాని తగు ప్రాధాన్యముగల రచనా విశేషములు (రేకు, దరువు, పదము, కీర్తన మొ.) ద్విపద (మంజరియును), పద్యములు (జాత్యుపజాతి వృత్తములు, అర్థ

పద్యములు, సం. శ్లోకములును), వచనము (సంధి ప్రయోజనాత్మకముగాని సంవాదాత్మకముగాని, వర్ణనాత్మకమైనను గాఁదగును. చూర్ణికలు, విన్నపములు మొ. గద్య ప్రభేదములు) నుండదగును. ఏలాది గీత ప్రబంధ విశేషముల ప్రయోగ వైచిత్ర్యకము'' (ప్రథమ భాగము, పు. 215).

ఈ నిర్వచనము పరిశీలింపదగినదే! అయినను, పలు అభిప్రాయములవలె, ఈ నిర్వచనము కూడ అభిప్రాయ భేదములకు తా వొసగుచున్నది.

యక్షగాన నిర్వచనము 'స్థూలముగా' చేయబడుటచే కాబోలు, నాటకములు కూడ యక్షగానములుగా పరిగణింపబడినవి. ఇట్లెన్నర్చుట సరికాదని తోచుచున్నది. ఏలయన, కవులు తాము యక్షగానములు వ్రాయుచున్నామనియు, నాటకములు వ్రాయుచున్నామనియు స్పష్టముగా పేర్కొనగా, అవి యన్నియు యక్షగానములే యని నేడు మనము తలచుట సమంజసము కాదేమో! మన పూర్వులు రచించిన నాటకములు కూడ మనకు యక్షగానములుగా తోచవచ్చును. నేటి కాలపు పద్యమయ నాటకములను భావికాలపు విమర్శకులు, నాటకములు కావని పేర్కొనినచో, అది ఎంత అసమంజసముగా నుండునో, అటులనే ప్రాచీనులు తాము నాటకములని భావించిన రచనములను మనము నేడు నాటకములు కావనుట కూడ అంత అసమంజసముగ నుండునని సవినయమగు మనవి. మన ప్రాచీనులు వెలయించిన నాటక రచనలలో నాటకాంశము తక్కువగా నుండును గాక, లేదా నాటకాంశమే లేదని విమర్శకులు కొందరు నుడువుదురుగాక. దేశకాల పరిస్థితులలో మార్పు లేర్పడు కొలది, మన అభిరుచులలోను విలువలలోను మార్పులు తప్పక ఏర్పడుచునే యుండును. అంతమాత్రమున ఒకనాటి సత్యమును తారుమారు చేయుట భావ్యము కాదేమో? ఆ కాలపు వారికి అవి నాటకములుగా ఉండెను కాబోలు. లేకున్న, ఆ కవులు వానిని నాటకములనియు, యక్షగానము లనియు విడి విడిగా పేర్కొనరుగదా. కనుక సూక్ష్మముగా పరిశీలించినచో, ఆ నాళ్లలోనే యక్షగాన నాటకములు విభిన్న సాహిత్య ప్రక్రియ లనుభావము కవులలో వ్యాప్తమై యుండెనని స్పష్టమగుచున్నది. ఈ సందర్భమున మదరాసు విశ్వ విద్యాలయమువారు ప్రకటించిన దక్షిణ దేశీయాంధ్ర వాఙ్మయమునుండి కొన్ని వాక్యముల నిట నుదాహరించుచున్నాను. (కర్త: శ్రీ నిడుదవోలు వేంకటరావు, ద్వితీయ ముద్రణము, 1960) "యక్షగానము, నాటకము భిన్న రచనాప్రక్రియలైనను, దక్షిణ దేశమున, తంజావూరిలో నాయక మహారాష్ట్ర పరిపాలనలో యక్షగాన రచన యపారముగా నభివృద్ధి నందినదని సాహితీ చారిత్రక విమర్శకు లెల్లరును వ్రాసియున్నారు........దక్షిణాంధ్ర వాఙ్మయమునకు ప్రత్యేకత నాపాదించినవి దృశ్య కావ్యములైన నాటకములేగాని, శ్రవ్యములగు "యక్షగానము"లు కావని తేటపడుచున్నది....." (పుటలు:—18—40).

ఆచార్య పి. సాంబమూర్తిగారు యక్షగానములను గురించి ప్రస్తావించుచు **"Yakshaganas, Kuchipudi Natakas and Bhagavatamela Natakas are all Dance Dramas."** అని పేర్కొనిరి. (చూడుడు: **Play - Writing**, పుటలు:—13—16.)

కనుక కిరాత విలాసము, కృష్ణలీలా విలాసము, గంగా పార్వతీ సంవాదము మొదలగు నాటకములను యక్షగానములుగా శ్రీ జోగారావుగారు పరిగణించుటలోని సామంజస్యమును సహృదయులు పరిశీలింపగోరెదను. ఈ విషయము వారిదృష్టిని అంతగా ఆకర్షింపకపోవుట శోచనీయము. ఇది పరిశోధన గ్రంథమగుటచే దీనిని గురించి ఇంత వ్రాయవలసి వచ్చినది. మరి కొన్నిటిని కూడ మనవి చేయుచున్నాను.

(1) కొన్ని రచనలను గురించి గ్రంథకర్త తెలియజేసిన వివరములందు సమగ్రత లోపించినది. ఉదాహరణమునకు శహాజీకృతమగు శంకరపల్లకి సేవా ప్రబంధమును పరిశీలింతము. (ద్వితీయ భాగము, పు. 298—299). ఇది తొలుదొలుత క్రీ. శ. 1896 లో ముద్రణ భాగ్యము నందెను. సుప్రసిద్ధ వాగ్గేయకారులయిన సుబ్బరామ దీక్షితులు దీని పరిష్కర్తలు. అటుపిమ్మట 1955 వ సం. న ఆచార్య సాంబమూర్తిగారు దీనిని కడు రమ్యముగ ముద్రించినారు. ఇటుల ఈ రచనము రెండుసార్లు ముద్రింపబడినను, గ్రంథకర్త ఈ యంశముల నుదహరింపక, తంజావూరు సరస్వతీ మహలు కేటలాగు నెంబరునే పేర్కొనుటవలన ఇది అముద్రితమేమో అను సంశయము పాఠకునికి కలుగును.

(2) గోపాల విలాసము పాకనాటి గణపతిరెడ్డి రచన యని గ్రంథకర్త పేర్కొనుటలో తొందరపాటు కనిపించుచున్నది. బలమయిన సాక్ష్యము లభించునంతవరకు ఇది గణపతిరెడ్డి కృతమని నుడువుటకు వీలుపడదు. ముద్రితప్రతినిబట్టి గ్రంథకర్త గోపాల విలాసము గణపతిరెడ్డి రచనమని పేర్కొనెను. కాని ముద్రిత ప్రతిలో అవతారికా భాగములేదు. గ్రంథాంతమున కవి వంశావతార ద్విపద గలదని తెలియుచున్నది.

మదరాసు ప్రాచ్య లిఖిత పుస్తక భాండాగారమువారు ప్రకటించిన 'యక్షగానములు—దండకములు' కేటలాగులో (సంపు

టము 8) 2094—97 పుటలలో కృష్ణవిలాసమను రచనను (నెం. 1863) గురించి కొన్ని వివరములు తెలుపబడినవి. కొన్నిటిని మాత్రము ఇట ఉదాహరించుచున్నాను.

"అసమగ్రము. తుదిపట్టు కొంచెము తక్కువేమో! వ్రాత మంచిది. తప్పులున్నవి. శైథిల్యము కలదు. గ్రంథపాతము లంతగాలేవు.

కృష్ణ విలాసమని పేరుగల ఈ యక్షగానమున భాగవత దశమస్కంధమునఁ గల్గు కృష్ణలీలలు వర్ణితములైనవి. ఇందు ఏలలు, దరువులు, త్రిభంగులు, అర్ధ చంద్రికలు, అల్లో నేరేళ్లు, గొబ్బిళ్లు, వెన్నెల పదములు మొదలగు ఆంధ్రదేశ రచనలు కొన్ని గలవు. గ్రంథకర్త వెన్నముద్ద గణపతి పెద్దకవి......

క. నడవడి గలిగిన యప్పుడె
పడయఁగవలె విష్ణుభక్తి పదిలుఁడవైతే
విడువకు కృష్ణుని చరితలు
కడు వేడుక వెన్నముద్ద గణపతి పెద్దా—"

గ్రంథకర్త పేర్కొనిన గోపాల విలాసమునందలి విషయము (ద్వితీయ భాగము, పు. 94—95) కృష్ణ విలాస గ్రంథ విషయమునకు ఎంతమాత్రము భిన్నముగాలేదు. కనుక గోపాల విలాస మనునది కృష్ణవిలాసమునకు నామాంతరమనియు, కర్త గణపతిరెడ్డి కాడనియు, వెన్నముద్ద గణపతిపెద్ద అనియు తెలియుచున్నది. 'అసమగ్రము, తుదిపట్టు కొంచెము తక్కువేమో' అను వాక్యములనుబట్టి ముద్రిత ప్రతిలో చివరగల కవి వంశావతార ద్విపద ప్రక్షిప్త మనుటలో సందేహములేదు.

డా. జోగారావుగారు గణపతి పెద్ద విషయమై 'యక్షగాన కవులు—ఒక విమర్శ' అను నొక వ్యాసమును 1955 ఏప్రిల్ భారతిలో చర్చ చేసినారు. ఈ వ్యాసమును ప్రస్తుత గ్రంథమునందలి స్వీయ వ్యాసముల జాబితాలో ఉదహరించినారు. (పుట ద్వి. భా. 499) కాని గణపతిపెద్ద విషయమును గాని, కృష్ణ విలాస విషయమునుగానిగణపతిరెడ్డి కర్తృత్వమును నిర్ణయించునప్పుడు చెప్పకపోవుట శోచనీయము. ఈ విషయాదికము గ్రంథకర్తకు తెలియనిదికాదు. కనుక గోపాల విలాసము పాకనాటి గణపతిరెడ్డి రచన మనుట సమంజసము కాదు. మదరాసు ప్రాచ్య లిఖిత పుస్తక భాండాగారమువారి కేటలాగునుబట్టి చూచిన, ఇది గణపతిరెడ్డి రచన కాదనిమాత్రము స్పష్ట మగుచున్నది. దీనిని గ్రంథకర్త పరిశీలింపలేదేమో అను సంశయము కలుగుచున్నది.

(3) ఇటులనే 'రామాయణము' (బాలకాండము) కర్తృత్వ విషయమున కూడ గ్రంథకర్త తొందరపడెనని చెప్పవలసియున్నది. (ద్వి. భా. పుటలు 319—20.)

హొసూరు వాస్తవ్యులు, పరిశోధకులునగు శ్రీ కె. యస్. కోదండరామయ్యగారు పయి గ్రంథమును రచియించినది హొసూరి పాకమ్మ అనియు, అన్నదానము వేంకటాంబ ప్రకటన కర్త్రి అనియు ఒక వ్యాసమున నిరూపించినారు. కాని వేంకటాంబయే ఈ రామాయణమును రచియించెనని గ్రంథకర్త తెలియజేసిరి. ముద్రిత ప్రతులముఖ పత్రములమీద నున్న యంశములే సత్య సంపూర్ణము లనుకొనుటవలన దొరలిన పొరపాటిది! రంగనాథ రామాయణ కర్తృత్వ విషయమై పండిత లోకమున అభిప్రాయ భేదములుగలవను సంగతి గ్రంథకర్తకు తెలిసినదే. కనుక ప్రాచీన గ్రంథములను గురించి నిర్ణయములు చేయునప్పుడు తొందరపాటు తగదని మనవి చేయుచున్నాను.

(4) "యావదాంధ్ర వాఙ్మయమునను బహుముఖ వైవిధ్యమును, వైశిష్ట్యమును గలిగి విశాల సాహిత్య శాఖగా విలసిల్లిన ప్రక్రియ యక్షగాన మొక్కటియే". ఇది నిజమే. అయినను ఒక్క యక్షగానముతప్ప కడమ శాఖలన్నియు ఇతర భాషా వాఙ్మయములనుండి గ్రహింపబడినట్లు పేర్కొనుట సమంజసముగాదు. "ఉదాహరణ ప్రక్రియ గూడ నిందుల కపవాద మగునేమో!" అని గ్రంథకర్త తమ సంశయమును వెలిబుచ్చినారు. పండితులెల్లరు ప్రబంధము, ఉదాహరణము—ఈ రెండును తెలుగు సాహిత్యమున వెలసిన స్వతంత్ర శాఖలని అంగీకరించిన యంశము సర్వ విదితమే. కాగా, వీనివలె యక్షగానము కూడ స్వతంత్రమయినశాఖ అని పేర్కొనియున్నచో సముచితముగ నుండియుండెడిది.

ఇట్టివే మరికొన్ని కలవు.

ఇది పరిశోధన గ్రంథమగుటవలన ఈ విషయాదికము వ్రాయవలసి వచ్చినది. అంతేకాని 'హసించు' దృష్టితో మాత్రము కాదు. వీనిని సహృదయులు పరిశీలింప గోరెదను.

"నృత్య రత్నావళి"

శ్రీ నే. కృష్ణమూర్తి

కాకతీయ కాలమున ఆంధ్రదేశమున నాట్యకళ రాజపోషణచే వృద్ధి చెందెను. నాట్య మభ్యసించి అభినయించువారికి, వాద్యాది కుతప ప్రయోగవేత్తలకు భూ గృహదానము లిచ్చినట్లు, ధర్మసాగర, చేబ్రోలు, మల్కాపుర శాసనములే అక్షరమగు తార్కాణములు. ప్రతాపరుద్రకాలమున మాచల్దేవియను ప్రఖ్యాత అభినేత్రి యుండినట్లు క్రీడాభిరామ వీథి నాటకమున కలదు. కామ విభుని మాచెర్ల రాజ్యమున కంజలోచనయను నర్తకి నృత్య మొనర్చినట్లు పల్నాటి వీర చరిత్రమందు గలదు. నేటి విజయవాడలో శివాలయమున మాచల్దేవియను నర్తకియు, ఆమెకు నాట్యము నేర్పుచున్నట్లు నాట్యాచార్యుని ప్రతిమలతో నున్న శాసనము కలదు.

ఇట్టి కళాపోషణగల వాతావరణ స్థితులలో మహా సామ్రాజ్యాధిపతియగు గణపతిదేవుని * బావమరది, గజసాహిణియగు అయ్యవంశజుడైన జాయ సేనాపతి "నృత్య రత్నావళి', 'సంగీత రత్నావళి' యను పుస్తకముల వ్రాయుట సమంజసమగు కళావ్యాప్తి యయ్యెను. ఈనాటి కులీన కులస్త్రీలు ఈ విద్యను నేర్చుటయే కానవచ్చుచున్నదిగాని, పురాతన పుస్తకముల చదివి, అందు నిబిడీకృతమైన సంప్రదాయముల గుర్తెరిగి కళా వ్యాపకముచేయు యత్నములు మృగ్యములు. సరి రాలేని పాశ్చాత్య పోకడల నేటి కళాకారులు మిశ్రమముచేసి, సంకర యుతముగ నృత్య ప్రదర్శనముల విరివిగా లోకమున వ్యాప్తి చేయుచున్నారు. ఇందులకు ముఖ్య కారణము ప్రేక్షకులకు ఈ నృత్య శాస్త్ర మపరిచితముగా నుండుటయే! అక్షరాస్యులు హెచ్చుగుకొలది పురాతన శాస్త్రములు, కళా ప్రసంగ కావ్యములు విరివిగా చదువ వలసిన యుగ కాలమున మనమున్నాము. ఇట్టి శాస్త్ర పరిచయము నాగరికతా చిహ్నము. మాటుననున్న కళారత్న విషయముల వెలికిదీసి, ప్రభుత్వాధిపత్యమున స్థాపింపబడిన కళాసంస్థలు అనతి కాలముననే ఈ కళా విస్తారము చేయవలసియున్నవి. ప్రజలకు కళావిద్యయందు అభిమానము హెచ్చుగు కార్యక్రమముల పథకమార్గముల నడుపవలసియున్నది.

నృత్య రత్నావళి వ్రాత పుస్తకము తెనుగు, గ్రంథ లిపులలో రెండు ప్రతులు తంజాపురమున కలవు. దానిని పరిష్కరించి ప్రచురించు కాలము రానున్నది.

తెనుగు లిపియందు గల పుస్తకముల తప్పు లనేకములు కలవు. తప్పులన్నియు వ్రాయసగానివి, తాటియాకుల ధ్వంసము చేయు క్రిమి కీటకములవి.

గ్రంథారంభమున జాయసేనాని నృత్య ప్రయోగము చూడని నేత్రములు నిష్ప్రయోజనములని కవిత్వమున వర్ణించెను.

శ్లో. కల్హారై రనవాప్త చంద్ర కిరణాశ్లేషై రలబ్ధాంబుదైః
.....చాతకై రళికులై రప్రాప్త పుష్పాసవైః
సామ్యా పన్నదశా మమూని దధతే నేత్రాణియేషాంపురః
శశ్వన్నావ తరంత్యుదార సుషమాన్నృత్త ప్రయోగక్రమాః॥

(ఏ నేత్రముల ఎదుట తరచుగా నత్యధిక శోభావంతములగు నృత్య ప్రయోగక్రమములు భాసించవో, అట్టి నేత్రములు చంద్ర కిరణముల చూడని కలువలతోడను, మేఘములను చూడని చాతకములతో, అప్రాప్త పుష్పాసవములగు అళి కులములతో సామ్యమును చెందుచున్నవి.)

ఈ నృత్యమును పంచభూతముల యొక్క వ్యక్తరూపమైన స్పందనమని కవి ఉగ్గడించెను.

శ్లో. క్షితౌ రక్తం ఛాయా ఫలనముదకే పేశలితం
శిఖిన్యర్చిః ప్రేంఖా సహజగతి వైచిత్ర్య మనిలే
తటిత్క్రీడా వ్యోమ్నీత్యతుల సుభగః పంచ సుపరః
ప్రవిష్టో భూతేషు ప్రభవతిహి నృత్తస్య మహిమా॥

(సాటిలేని శోభగల నృత్యమహిమ పంచభూతముల యందును ప్రవేశించి యొప్పుచున్నది.)

ఎట్లన?

భూమియందు రక్తచ్ఛాయా ఫలన రూపముగను(?) ఉదకమున లలిత తరంగయుతముగను, అగ్నియందు జ్వాలా ప్రేంఖణ విధముగను, వాయువున సహజగతి వైచిత్ర్యముల తోడను, ఆకాశమున తటిత్క్రీడతోను నృత్యము భాసించుచున్నది.

శక్రుడు జయంతుని ఐరావతాది గజములపై యధికారిగ నుంచినట్లు, బావయగు శ్రీ గణపతి సార్వభౌముడు జాయ సేనానిని గజసాహిణిగా నియమించెను. జాయ సేనాని ఆకౌమారాది స్వామి భక్తి పరాయణుడు. రాజనకు చిత్త కైరవ కౌముదివలె ప్రకాశించునట్లు నృత్యరత్నావళిని రచించెను.

మునివాక్ నర్తకీ నూనం
వర్ణనాంగైః మనోహరైః
కరోతి శాస్త్రరంగేస్మిన్
పశ్య నృత్తమతిస్ఫుటం॥

(భరతముని వాణియను నర్తకి, మనోహరములగు వర్ణనాంగములతో శాస్త్ర (నృత్య రత్నావళి) రంగస్థలమున స్ఫుటముగ నృత్య మొనర్చుచున్నది. వీక్షింపుము!)

* * * *

---

* జాయప సేనాని తోబుట్టువులగు నారాంబ, పేరాంబలు గణపతిదేవుని భర్తగా చేకొనిరి.

ఈ నాట్యశాస్త్రము వైవస్వత మన్వంతరమున త్రేతా యుగ కాలమున పురందరాదులు పితామహునొద్దకేగి "దృశ్యం సర్వంచ సర్వేషాం ఇచ్ఛామి క్రీడనీయకం' అని ప్రార్థింపగా, ఆ నాల్గు మోములుగల విధాత సర్వవేద సారముగ, సార్వవర్ణిక మైన నాట్యవేదమును సృజించి, తన మనసిజుడైన భరతు నకు నేర్పెను. మానవులకు ఆంగికాదులయందుగల సౌష్ఠవ చాతుర్యములను తెలిసికొని, భరతముని శాండిల్యాది పుత్ర శతమునకు ప్రయోగార్హతను చేకూర్చెను. ఇంద్ర ధ్వజోత్సవ సమయమున రసాశ్రయంచతద్జ్ఞేయం, వాక్యార్థాభి నయా ర్థకమగు, ఈ కళ ప్రదర్శింపబడెను. అభినయము ప్రయోగ సమయమున అర్థమును సామాజికుల కభిముఖముగా తెచ్చు నదియై వర్ధిల్లుచున్నది. ప్రథమాధ్యాయమున శాఖా, అంకుర నృత్త, నేపథ్య (పుస్త, భూషణ, అంగరచన, సజీవ పరికల్పిత) సాత్త్విక లాస్యాంగముల(చిత్రపద భావికములతో చేర్చి) తాండవము లను విషయముల లక్షణములు తెల్పబడినవి. అంగ నిరూపణ మనునది రెండవ అధ్యాయము. ఇందు అంగములగు శిరస్సు, హస్త (అసంయుత, సంయుత, నృత్త)ములు, వక్షస్థలము పార్శ్వములు, కటి, పాదములును; ప్రత్యంగములగు, గ్రీవము కుక్షి, పృష్ఠ, ఊరువులు, జంఘ, జానువులును; ఉపాంగములగు విలోచన, భ్రూ, నాస, ఓష్ఠ, కపోల, చిబుకముల, వివిధభంగులు వాటి ప్రయోగములు వర్ణింపబడినవి. ఇంకను పాదాంగుళ ముల, అంగుష్ఠముల గూర్చి నిర్వచింపబడినది.

మూడవ అధ్యాయమున 'చారీ' (భూ, ఆకాశ) స్థానక, మండలములగూర్చి వర్ణనములు గలవు. ఈ అధ్యాయ ప్రారంభ మున చెప్పబోవు వస్తు వివరముల సూచించు ముద్రాలంకార శోభితమగు శ్లోకము శ్లాఘనీయమై యున్నది.

శ్లో. లీలోల్ల సచ్చాషగతి ప్రబంధా
మృగీప్లుతో ద్యద్భ్రమరీ మనోజ్ఞాం
నస్యం దితాబ్జాం జనితో రుశోభా
వక్ష్యామి చారీం వనరాజితుల్యాం॥

ఇందు చాషగతి, మృగప్లుత, ఉత్పందిత, జనిత మొదలగు భూచారీ ప్రశంస యున్నది. భ్రమరీయను ఆకాశచారీ సూచ నయు గలదు.

ఈ 'చారీ' ప్రసంగ కథనము వనరాజితో సమానమని కవి సంకల్పించెను. ఆ చారీవనము పాల పిట్టల (చాషగతి) గతుల తోను, మృగీప్లుతములచే చెదరిన తుమ్మెదల మనోహరతతోను, అచ్చటి సెలయేళ్లయందు తామర పుష్ప సంతతులతోను, కల్గి శోభను జనింపచేయుచున్నది.

ఈ చారీ ప్రశంస ముగించునపుడు కవి:—

శ్లో. చరిత మివ సురాజ్ఞాం యుక్త దండాభిరామం
గిరిజ మివభుజంగ త్రాసితా లోకనీయం
జలద మివచ విద్యుద్ భ్రాంత మత్రౌన్తలక్ష్మ్యై
వ్యరచయ దిహ చారీ లక్షణం జాయనార్యః॥

ఇందు ఆకాశచారులగు 'భుజంగ త్రాసిత, విద్యుద్ భ్రాంతములు సూచింపబడినవి.

ఈ చారీ లక్షణ కథనము ధర్మ పరిపాలనముచేయు రాజ చరితములవలె, గిరులపై పుట్టిన తరువుల చెంతనున్న భుజంగములు త్రాసమును గూర్చు రమ్యతను, మేఘములు విద్యుత్ర్భాంతమును గూర్చుచు, అత్రౌన్త లక్ష్మికి శోభాయ మానముగ నుండును.

*　　*　　*　　*

జాయ సేనుడు భరతుని నాట్య శాస్త్రమునకు ఆది గురువుగా స్వీకరించెను. నాట్య శాస్త్రమందలి శ్లోక ములు, తాను గ్రంథ రచన మొనర్చునప్పుడు చెంత నున్నట్లే విశదమగుచున్నది. భరతుడు చెప్పనివి కొన్ని తాను చెప్పెను. కొన్ని విషయములందు భరతు డట్లు చెప్పుటకు, చెప్పకుండు టకు కారణముల చెప్పెను. భరతుని నాట్య శాస్త్రమేగాక, కీర్తిధరుని కావ్యమునుగూర్చి, అందలి విషయములగూర్చి పలుమారు పేర్కొనెను.

ఈ గజసాహిణి 13 వ శతాబ్ది వాడగుటచే శారఙ్గ దేవునికి సమీప కాలమున నుండెను. కాని ఈతని కావ్యము వ్యాఖ్యా నములకు గురికాలేదేమో? ఇతని తరువాత వచ్చిన సింగభూపా లుడు, కల్లినాథుడు, సంగీత రత్నాకరమునే వ్యాఖ్యానించిరి. జాయ సేనాని కథనము శారఙ్గదేవుని విషయావిష్కరణము సామ్య మును బొందుచున్నవి.

జాయసేనాని సంస్కృతమందు సిద్ధహస్తుడగుటయే గాక, కవిత్వ పోకడలు పాటింపగల విద్వాంసుడు. ఇతని కాల మున నాట్యకళ విరివిగా రాజపోషణ కల్గియుండుట విదితము. సార్వభౌముని మెప్పించుటకే, ఆనాటి నృత్యకళా ప్రయోగము లను, శాస్త్రమున నిబంధించి కావ్యమును రచించెను. పూర్వ గ్రంథములందు పాటించని, వర్ణింపని నూతన విషయము లిందు గలవు. ఇతని గ్రంథమునగల నృత్త నృత్య భంగిమలు ఆనాటి శిల్పులకు దోహదమిచ్చి (motif) నర్తకీ బేర ముల సృష్టించుటకుపకరించి యుండును. రామప్ప దేవాలయ మందలి నృత్యప్రతిమలు ఈ కావ్యమందలి లక్షణ వర్ణములకు సరివచ్చు నను విషయము శోధింపతగిన కార్యా కావ్యాన్వేషణము. రామప్ప దేవళమేకాదు. కాకతీయ కాలమున ప్రతిష్ఠించి, జీర్ణో ద్ధరణ గావించిన దేవాయతనములందలి నృత్య ప్రతిమల నన్నిటిని అన్వేషించి, పరిశీలించి సమన్వయ మొనర్పదగును.

నృత్య రత్నావళియందలి వర్ణనములను ఈ క్రింది గ్రంథములతో పోల్చి చూడవలయును.

1. భరత నాట్య శాస్త్రము. 2. సంగీత రత్నా కరము. 3. భరతార్ణవము. 4. నాట్యశాస్త్ర సంగ్రహము. 5. భరతసారము. 6. హస్తముక్తావళి. 7. హస్త రత్నా వళి. 8. సంగీత నారాయణము. 9. హస్త అధ్యాయము. (7, 8, 9 అముద్రితములు.)

చారీస్థానక, మండలములు

నర్తకిగాని, నర్తకుడుగాని కేవలము అంగ ప్రత్యంగ ఉపాంగముల వివిధ భంగులందు ప్రసారించిన మాత్రమున

నృత్తముగాని * నృత్యముగాని పూర్ణముగ ప్రయోగింపబడదు. ఇవి చేయుటకు నర్తకి ఒకేచోటున యుండిన చాలును. కాని నృత్యమున శరీర చలన మావశ్యకము. ఈ చలనము తాళమాన లయములతో ఏక సూత్ర నిబద్ధ కార్యక్రమమువలె మేళ వింపవలయును. అంగముల విన్యాసములతో కలిసి పాదచలనమును, ముందునకో, వెనుకకో, ప్రక్కలకో, చరించుటచే రంగ స్థలమే స్పందించుచున్నదాయను భ్రాంతి సహృదయుల హృదయములందు కలుగును. ఈ ప్రయోగము చూచువారికి లోచనానందమేగాక, వాద్య ప్రసారములచే శ్రవణ సుఖమును గూర్చును. మానవుల శరీరావయవ సంపుటీకరణము పూర్వ వాసనల ప్రాతినిధ్యముచే నిబిడీకృతమైయున్న తత్త్వములు, 'సాధారణీ' కృతయుక్తమైన నృత్య ప్రయోగముచే రేకెత్తి ఆహ్లాద మోదములనందును. కేవల రూప శబ్దములు ఈ నృత్యమున పరాకాష్ఠ నొందును. అందుచేతనే భరతాచార్యుడు:—

తత్రోచ్యతే నఖల్వర్థం కంచి నృత్త మపేక్షతే
కింతు శుభం జనయతిత్యతో నృత్తం ప్రవర్తితుం
ప్రాయేణ సర్వ లోకస్య నృత్త మిష్టం స్వభావతః
మాంగల్య మితికృత్వాచ నృత్తమే తత్ప్రకీర్తితమ్.

భా. నా. శా. IV 269, 270.

ఈ నృత్త, నృత్య ప్రదర్శనము అనిర్వచనీయమగు శోభను మానసికానందమును గూర్చును. మంగళకరములగును.

'చారీ' విషయమును గూర్చి చెప్పుచు, భరతాచార్యుని వలెనే దీని లక్షణమును కటినుండి పాదములవరకుగల అంగ ఉపాంగ చేష్టలే, చారి యని జాయసేనాని చెప్పెను. ఇందు పాద జంఘ ఊరువుల విన్యాసములు స—మానముగా చేయవలయును.

పాదములతో భూమి ఎక్కువగా స్పృశించుచు, ప్రయోగించు విన్యాసములు పదియారు (16) భూచారులనియు, భూమికి పైన (తగలక) చేయునవి ఆకాశచారులు పదియారు (16) యని నృత్య రత్నావళియందు వర్ణింపబడినవి. భరతుని నాట్య శాస్త్రమున, శారఙ్గదేవుని సంగీత రత్నాకరము నను నిట్లే చారీ లక్షణములు వర్ణింపబడినవి. †

ప్రతి చారీ చలనమునకు పునాది వంటిది "సమపాద" భూచారి. ఇందు పాదములను ఒకటి తరువాత మరొకటిని పార్ష్ణి భాగములచేర్చి నిలచియుండవలెను. ప్రతి 'చారి' ప్రయోగించుటకుముందు ఈ సమపాద భూచారి చేయనగును. ఇట్లు పదియారు భూచారి వర్ణనములు కలవు. ఇతర గ్రంథములందు చెప్పని విశేషములు కొన్ని జాయసేనాని రచనయందు గలవు. జాయసేనాని 'నిత' యను భూచారికే "ముసలఘట్టికా" యను నామాంతరమున్నట్లు చెప్పెను. ఈ నామమును దేశీ నాట్యవిదులు పెట్టినట్లు తెలిపెను. కొన్ని చారుల పేరులకు అర్థమును నిర్వచించెను. 'శకటాస్య' మన బండిని ముందునకు జరుపుటయని శారఙ్గదేవుని నిర్వచనముతో జాయసేనాని యన్వయమును సరిపోవుచున్నది. అడ్డితయను భూచారి లక్షణమును చెప్పుచు, నర్తకి ముందు వెనుకలకు పోవలెనని కీర్తిధరుని వర్ణనమును స్వీకరించినట్లు తెలిపెను. సమోత్సారిత మత్తల్లియను భూచారినిగూర్చి చెప్పుచు జాయసేనాని దానికి మత్తపాదమను నామాంతర మున్నట్లు తెల్పెను. విద్యుద్భ్రాంతమను ఆకాశచారినిగూర్చి వివరించి, ఈ చారీ ప్రయోగము "లక్ష్యేఽతి దుష్కరా" యని వ్రాసెను. ఇందు పాదముయొక్క పృష్ఠమును వెనుకగా పైకెత్తి శిరస్సును స్పృశించి, ఆకాలిని వ్యావర్తము చేయనగును. సుశిక్షితులైన కుశలురే ఈ విద్యుద్భ్రాంతమును చక్కగా చేయుదురని జాయసేనాని మతము.

ఈ చారీ ప్రయోగములతో హస్తములను సుందరముగా చాలనము చేయనగును. పాదములు నేలపై స్థిరముగా నుండునపుడు హస్తములను అర్ధ చంద్రయుతముగా కటి భాగమున నుంచవలెను. ఈ రూపమున నర్తకి సుందరముగా నుండును.

స్థానకములు

చారీ ప్రయోగములు కొన్ని చేర్చి శరీరమును అంగ విన్యాసములతో చేర్చిన స్థానకములగును. ఈ స్థానకములు ‡ ఆరుగా విభజింపబడినవి. ఇవి దేవతాధిష్ఠానములు. ఇవిగాక, స్త్రీ స్థానకములని కొన్ని వర్ణింపబడినవి. భరతాచార్యుడు చెప్పనివి శారఙ్గ దేవుడు ఏడు స్త్రీ స్థానకములనే చెప్పెను. కాని, జాయసేనాని || ప్రోన్నసమను ఎనిమిదవ దాని గూర్చియు వర్ణించెను.

సమపాదతలాగ్రాభ్యా మంగుళీనాం తలైరపి
ఆయతీ కృత్యగాత్రం చేన్నిష్ఠే స్యాత్ప్రోన్నసం తదా
నాసికా ద్వయ సేతోచే దూర్ధ్వతా మంతరిక్షణే
ప్రాంశు ప్రాప్య ప్రమాణస్య ఫలాదేః గ్రహణాదిషు."

---

* నృత్తము, నృత్యములు సమానార్థకములుగా నెంచబడినవి.

† భూచారులు:—(1) సమపాద (2) స్థితావర్త (3) జనిత (4) స్యందిత (5) అపస్యందిత (6) బద్ధా (7) శకటాస్య (8) విచ్యవ (9) ఏలాకాక్రీడిత (10) చాషగతి (11) ఉత్స్యందిత (12) అడ్డితా (13) సమోత్సారిత మత్తల్లి (14) మత్తల్లి (15) అధ్యర్ధితా (16) ఊరూద్వృత్త.

ఆకాశచారులు:—(1) అతిక్రాన్త (2) అపక్రాన్త (3) పార్శ్వక్రాన్త (4) సూచీ (5) మృగప్లుత (6) భుజంగత్రాసిత (7) అలాత (8) నూపురపాదిక (9) ఆక్షిప్త (10) భ్రమరీ (11) దండపాద (12) విద్యుద్భ్రాంత (13) ఊర్ధ్వజాను (14) ఉద్వృత్త 15) దోలపాద (16) ఆవిద్దా.

‡ స్థానకములు:—(1) వైష్ణవ (2) సమపాద (3) వైశాఖ (4) మండల (5) ఆలీఢ (6) ప్రత్యాలీఢ.

|| స్త్రీ స్థానకములు:—(1) ఆయత (2) అవహిత్థ (3) అశ్వక్రాన్త (4) గతాగతం (5) వలితం (6) మోటితం (7) వినివర్తితం (8) ప్రోన్నసమ్.

సమపాద తలాగ్రములపై నిలచి శరీరమును పొడవు చేసిన ప్రొన్నస స్త్రీ చారీ లక్షణమగును. ముఖముపై కెత్తునపుడు నాసికా పుటముల (నాసికాద్వయ) పై నుండు సేతువు (Bridge of the nose) ను పైకెత్తుట. ఇది అంతరిక్షమును చూచుట, వృక్షాగ్రఫలముల కోయుటయందు ప్రయోగార్హము.

మండలములు

మండలముల విభాగమును వర్ణించుచు, నృత్య రత్నావళి రచించిన కవి శేఖరుడు ఈ క్రింది శ్లోకములతో ప్రారంభించెను.

విచిత్ర భూషా లలిత తాంగ యష్టి
 సావర్త ఫాల భ్రమరాల కా భా
సంక్రాన్త కాంతి ర్విహృతాభిరామ
 నిరూప్యతే మండల రాజి రామా.

మండల రాజి యను స్త్రీ వర్ణింపబడుచున్నది. ఆ సుందరాంగి విచిత్ర భూషణములచే, లలితమగు అంగయష్టి కల్గి, ఫాలమున సంక్రమించిన (వ్రాలిన) వంకరలుగల ముంగురుల కాంతి కల్గి విహారమున మనోహారిణిగా నున్నది. ఇందు 'విహృత' ప్రయోగముచే అభిసారిక సూచితము.

భ్రమర, దండపాద (అంగయష్టి) విహృత, సంక్రాన్తి మొదలగు పదముల లేక వాటి అర్థ సురఫణముతో పై శ్లోకమున ముద్రాలంకారము సంధింపబడినది.

మండలములును * భూమండలములు పదియుగా † ఆకాశ మండలములు పదియుగా విభజింపబడినవి. వీటి ప్రయోగములలో ఒక్కొక్కదానిలో వివిధ చారులు కలసి యుండును. దక్షిణ వామపాదములు క్రమముగా లక్షణ నిర్ణీతముగా ప్రసారితము లగును.

మండలముల ప్రయోగ మెల్లప్పుడును వాద్య శబ్దములతో లయ మొనర్చబడి, మనోహరమగు రూప శబ్దములు ప్రధానేంద్రియములకు, శ్రవణేంద్రియములకు మోదము గూర్చును. ఈ విషయ వర్ణనమునుకవి ఇట్లు పరి సమాప్తము చేసెను.

ఆవర్త క్రాన్తం లలితం విచిత్రం
ఆస్కందితం క్రాన్త విధిం దధానమ్
ఇత్య బ్రవీన్మండల లక్ష్మ సుశ్రీ
తురంగ తుల్యం గజసైన్యనాథః.

ఇందు శ్లేషయుతమగు ముద్రాలంకారము గలదు. చక్కని సుశ్రీయుతుడగు గజ సైన్యనాథుడు తురంగముల వంటి మండల లక్షణములను ఇట్లు ప్రవచించెను. గుర్రములు మంచి శుభ్రపదములగు సుడులుగల్గి, లలితమై విచిత్రముగా ఆస్కందన మొనర్చునవి. ఈ మండల లక్షణములును తురంగ గతులు గలవి.

దేశీ స్థానకములు
దేశీకరణములు : అంచిత, అలగ, స్పర్శ, లాస్యాంగములు

నృత్య రత్నావళీ కావ్యమందలి షష్ఠోమాధ్యాయమును ఆవిష్కరించుచు, జాయసేనాని దైవ ప్రార్థన మిట్లు చేసెను.

వందే శ్రీ కంఠ మంధారం
 యత్ర గౌరీ స్తనోద్గమః
ధత్తే విశ్వఫల వ్యక్త్యై
 ప్రథమ స్తబక శ్రియం.

అర్ధ నారీశ్వరుడగు (Concept of Biunity) శ్రీ కంఠుడను కోర్కెల తీర్చు మందార కల్పవృక్షమునకు నమస్కరించుచున్నాను. (ఆపుణ్య తరువున) గౌరీ స్తనోద్గమము విశ్వ ఫలాభివ్యక్తికొరకై ప్రథమమైన పూల గుత్తివలె శోభను ధరించును.

కావ్యకర్త తాను, జెప్పబోవు "దేశీనృత్య" వస్తువును ప్రౌఢవారాంగనవలె వర్ణించెను.

భాషావేష విభూషణై రనుగుణై స్సైన్తైర్మనోహారిభిః
నానా దేశ (వ) రుచీన్ విదగ్ధ పురుషా నావర్జయంతీ గుణైః
భూపాలై రుప లాలితా బహుకలైః ప్రౌఢేవ వారాంగనా
దేశీ సంప్రతి దంతి సైన్య పతినా సాంద్రాదరం వర్ణ్యతే.

అను గుణములును, మనోహరములునగు ఆ యా భాషా వేష, భూషణముల చేతను, గుణముల చేతను, వివిధ ప్రాంతములకు జెందిన విదగ్ధ పురుషుల నాకర్షించుచు, కళా కోవిదులగు భూపాలురచే లాలింపబడు ప్రౌఢ వారాంగనవలె దేశీ (నృత్యము) ఇపుడు గజసాహిణిచే నత్యాదరముతో వర్ణింపబడు చున్నది.

* * * *

జాయ సేనాని ఇట్లుపక్రమించి కావ్య రచనా కాలమును, కృతిపతినిగూర్చి రమణీయముగా వర్ణించెను.

ఇదానీం భారతే వర్షే
 కాలే వైవస్వతాంతరే

---

* భూమండలములు:— (1) భమర, (2) ఆస్కందిత లేక ఆస్పందిత (3) పిష్ఠకుట్ట (4) చాషగతి (5) అడ్డిత (6) ఏలకా క్రీడిత (7) అధ్యర్ధ (8) ఆవర్త (9) శకటాస్య (10) సమోత్సారిత.

† ఆకాశమండలములు:— (1) సూచీవిద్ధ (2) అతిక్రాన్త (3) దండపాద (4) అలాతక (5) విచిత్ర (6) విహృత (7), వామవిద్ధ—వామబంధ (8) లలిత సంచార (9) క్రాన్త (10) లలిత.

కలౌ యాతేషు వర్షేషు
      * భూత బాణాగ్ని సాగరైః
మితే ష్వానంద సముజ్జ్ఞేబ్దే
      జగదానందదాయిని
శశ్వత్కువలయోల్లాసి
      యశః ప్రాలేయరోచిషి *

క్రీ. శ. 1255 జగదానంద దాయకమగు ఆనంద సంవత్సరమున మహారాజాధిరాజగు ఈ గణపతి చక్రవర్తి సముద్రమునే మేఖలగాగల ఈ భూమిని బాహుబలముతో రక్షించుచుండగా

“యాదేశీ వర్తతే లోకే
సాస్మాభిః కథ్యతేస్ఫుటం.”

ఏ దేశీ నృత్యము లోకమున వ్యాప్తిగా నున్నదో, అద్దాని (ఈ కావ్యమున) నాచే స్ఫుటముగా వర్ణింపబడుచున్నది.

కృతిభర్త కాకతి గణపతి చక్రవర్తి. ఆ రాజన్యుడు

ప్రతాప తపన ప్రౌఢి
      తాపితా రాతి మానసే
శత్రు ప్రాణానిలాహార
      క్షీబ కౌక్షేయ కోరగే.
వి్రశాణన పయః పూర
      నిర్ధూత కలి కల్మషే
త్యాగధికృత రాధేయ
      కామధేను సురద్రుమే.
రూప లావణ్య సౌభాగ్య
      సప్రథ మకరధ్వజే
శౌర్య త్రితయ విజ్ఞాన
      మహత్త్వ విశారదే.
మార్గదేశీ విభాగ స్య
      వివేచన విచక్షణే
మహా రాజాధిరాజేస్మిన్
      గణపత్య వనీశ్వరే.
సముద్ర మేఖలా మేనాం
      బహు నా రక్షతి క్షమాన్
యాదేశీ వర్తతే లోకే
      సాస్మాభిః కథ్యతే స్ఫుటం.

(1) కువలయమునకు (భూమండలమునకు) ఉల్లాసకరమగు కీర్తియను వెన్నెల కలవాడు.

(2) ప్రతాప మనెడి సూర్యుని ప్రౌఢిమచే తపింపచేయబడిన శత్రు మానసము కలవాడు.

(3) శత్రువుల ప్రాణవాయువులను ఆహారము గొనుటచే మదించి ఖడ్గ మనెడి ఉరగము కలవాడు.

(4) దాన జలముచే కడిగి వేయబడిన కలి కల్మషము కలవాడు.

(5) త్యాగముచే ధిక్కరింపబడిన కర్ణ, కామధేను, కల్పవృక్షములు కలవాడు.

(6) రూప లావణ్య సౌభాగ్యములచే మన్మథుని పోలినవాడు.

(7) శౌర్యత్రితక మహత్త్వల నెరింగిన విశారదుడు.

(8) మార్గదేశీ నృత్య విభాగముల వివేచనమున విచక్షణుడు.

ఈ అష్ట గుణ సంపన్నుడగు కృతి భర్తను జాయసేనాని తన కావ్యమునకు చేకూర్చెను.

ఈ దేశీ నృత్య మనగా లక్షణ మిట్టిదని ఈ క్రింది విధముగ జాయసేనాని తెల్పెను.

భవంతి ధరణీపాలా:
      ప్రాయేణాభినవ ప్రియాః
అతస్తత్ప్రీతయేద్యాపి
      యద్య దుత్పాద్యతే నవం
నృత్త తత్త స్మృతం దేశీ
      తత్త దేశాను సారతః.
భూతవ్ శాస్త్రముఖాత్ జ్ఞేయం
      భవిష్యం నావగద్యతే
భవన్ని రూపణం (నై) యస్మాత్
      నృత్యం దేశీతి సంజ్ఞితం.

“ధరణి పాలురు సహజముగా అభినవ ప్రియులు. కావున వారి ప్రీతికై నేటికిని (1255 A—D) వివిధ దేశానుసారముగ యే యే నృత్యము నవ నవముగా నుత్పాదింపబడుచున్నదో అయ్యది దేశియని పిలువబడుచున్నది.

పూర్వమున వృద్ధి చెందిన నృత్యమును శాస్త్రములందు నిబంధింపబడినందున తద్వారా తెలిసికొనవచ్చును. రాబోవు కాలమునాటి కళను గూర్చి చెప్పుట సంభవింపదు. ఈనాడు (సమకాలిక ప్రపంచమున) దేశమున వ్యాప్తినొందియుండు దేశీ నృత్యమును నిరూపించెదను.”

ఈ కృతి విచ్చిన 1255 A—D ఆనంద సంవత్సరము కాకతి వంశ చరిత్రలో శ్రేష్మమైనది. చరిత్రకారులు 1254—1256 నాటి శాసనముల పరిశీలించి, గణపతిదేవుడు తన రాజధానిని హనుమకొండనుండి, ఏకశిలా నగరమునకు మార్చినట్లు తెల్పియున్నారు. ఆ శుభ సంవత్సరము 1255 A—D దిగా ఈ కృతి కాలమునుబట్టి దృఢ పరచవచ్చును. ఏకశిలా నగరమును సామ్రాజ్య ముఖ్య స్థానముగా స్థాపిత్తు మంగళ

* భూత=5 బాణ=5, అగ్ని=3, సాగరైః=4=5534. ఈ సంఖ్యను విధిదాయకముగా 4355 యని తెలిసికొనవలయును. నేటికి కలియుగము 5063 అనగా 708 సం. పూర్వము 1963—708=1255 A. D. కావ్య రచనా కాలము.

కరమగు సమయమున నృత్య రత్నావళికి రాజభర్తతో కళ్యాణము ప్రాప్తించెను.

* * * *

ఆ నాటికే (1210—1247 A-D) "సంగీత రత్నాకర" గ్రంథమును సోఢలుని తనయుడగు శార్ఙ్గదేవుడు రచించెనని తెలియుచున్నది. అందు ఏడవ అధ్యాయము నృత్య విషయా విష్కరణము. ఈ కవి దేవగికిరి యాదవుల ప్రభు పోషణ యందుండెను. జాయసేనాని సౌఢలుడును, భరతముని కీర్తిధరుల ప్రాచీన గ్రంథముల తరచి చూచినట్లు వారి కావ్య మందలి రచనయే తెల్పుచున్నది. దేశీ నృత్యమును గూర్చి శార్ఙ్గ దేవుడు విపులముగా వర్ణింపలేదు. స్థాలీపులాకముగనే క్లుప్తముగా స్పృశించినట్లు తెలియుచున్నది. గ్రంథ విస్తీర భీతిచే సంక్షిప్తము చేసితినని వ్రాసికొనెను, కాని సంగీత రత్నాకర మందలి దేశీ నృత్య విభాగమును చదివిన, గ్రంథకర్త తన జీవితమున పెక్కు దేశీ నృత్య ప్రదర్శనముల వీక్షించినట్లు లేదు.

కాని, కాకతి రాజ్య గజసాహిణి దేశీ నృత్య విశేషముల ఆసాంతముగ, విరివిగా, వీక్షించి, ముందు కాలమువారికి ఆదేశీ నృత్య వ్యాసంగముల కై వసము చేయుటకై ఆ కళాఖండముల, శాస్త్రమున నిబంధించినట్లు నృత్య రత్నావళి రచనచే దృఢమగు చున్నది. ఇంతయేగాక, నర్తకీ, నర్తక, సంగీత వాద్య విద్వాంసులకు భూ, గృహ దానము లిచ్చినట్లు శాసన లిఖితములున్నవి.

* * * *

ఈ పంచమాధ్యాయమున (1)* దేశీ స్థానకములు ఇరువదిరెండు. (2) అంచిత కరణములు పదునాలుగు. (3) అలగములు నాలుగు. (4) లోహడీలు ఎనిమిది. (5) దర్ప సరణములు మూడు. (6) కపాలాది స్పర్శములు నాల్గు (7) దేశీ లాస్యాంగములు ముప్పదిమూడు, (8) తాళయుక్తమగు గతుల గూర్చి వివరణోపేతమగు వర్ణనము గలదు.

దేశీ స్థానకముల వివరము రెండు రత్నాకరములందును, నాట్య శాస్త్ర సంగ్రహ గ్రంథమునందును సమానము. జాయసేనాని "వ్రాతప్రతి" యందు ఒకటినుండి పదివరకు లక్షణములు కానరావు.

1 అంచిత కరణములన నటిప్లుత మొనర్చుట. నర్తకి సమముగా నిలచి, ఎగిరి భూమిపై నిలచుట. ఈ ఉప్లుత కరణముల పదునాల్గును జాయసేనాని పూర్తిగా వర్ణించెను. (నేటికి లభ్యమైన తెనుగు లిపి ప్రతియందు (11) అంగుష్ఠ బద్ధాంచిత, లక్షణము లుప్తమైనది.) (9) లంకాదాహాంచిత, (12) బలబద్ధాంచితముల లక్షణములు వ్రాత లోపముచే నవ్యమగు వర్ణము నిచ్చుటలేదు. సోఢలుడు 1 నుండి 4, 6, 8; 10 అంచితములను మాత్రము, నూతనముగ సమపాదాంచితమును చేర్చి లక్షణముల పేర్కొనెను.

2 నాల్గు అలగములు.

ఎగురుట, కూర్చొనుట, మొగ్గ వేయుట మొదలగు విన్యాస పూరితములు. ఇరువది సంవత్సరములకు పూర్వము మేజువాణీలలో కళావంత కులజులు ఈ నృత్య ప్రయోగముల ప్రదర్శించు చుంచెడివారు.

3 ఎనిమిది లోహడీలు.

ఇందును మొగ్గవాలుట, ఎగిరి నలు దిక్కులకు తిరుగుట మొదలగు విన్యాసము లొనర్చు నృత్యము. ఇందు విక్రాంత లక్షణము వ్రాతప్రతియందు మృగ్యము.

4 దర్ప సరణములు మూడు, 5 స్పర్శములు నాలుగు లక్షణ రహితముగ నామమాత్రముగ సూచింపబడినవి. ఇవి 'సంగీత రత్నాకర'మందు గలవు. శార్ఙ్గ దేవుడు, అంచితముల, అలగముల, లోహడీల, సరణముల, స్పర్శల, కొన్నింటినే చెప్పి భ్రమరములచేర్చి ముప్పది యూరింటిని వర్ణించెను.

---

* (1) సమపాద, (2) పరావృత్త, (3) స్వస్తిక, (4) వృషభాసన, (5) బ్రాహ్మ, (6) వైష్ణవ, (7) శైవ, (8) గారుడ (9) సంహత, (10) స్వాస్తోనతం (లేదు), (11) వర్ధమాన,, (12) కూర్మాసన, (13) నంద్యావర్త, (14) చతురశ్ర, (15) పార్ష్ణిపార్శ్వగత, (16) ఏకజానువత, (17) పార్ష్ణివిద్ధ, (18) ఏకపాద, (19) నాగేబంధ, (20) సమసూచీ, (21) విషమసూచీ, (22) ఖండసూచీ.

1. అంచితం. (2) కర్తర్యంచితం. (3) భైరవాంచితం. (4) ఏకపాదాంచితం. (5) క్షేత్రాంచితం. (6) స్కంధాంచితం. (7) లోహిన్యంచితం. (8) దండ ప్రమాణాంచితం. (9) లంకాదాహాంచితం. (10) భ్రాంత పాదాంచితం. (11) అంగుష్ఠ బద్ధాంచితం. (12) బలి బద్ధాంచితం. (13) అలగాంచితం. (14) సమ కర్తర్యంచితం.

2. అలగములు (1) అలగం, (2) కూర్మాలగ, (3) ఊర్ధ్వాలగ, (4) అంతరాలగ.

3. (1) లోహడీ, (2) కర్తరీ లోహడీ, (3) సమ కర్తరీ లోహడీ, (4) బాహుబంధ (బద్ధా), (5) చిత్రాఖ్య, (6) ఏకపాద, (7) చతుర్ముఖ, (8) విక్రాంత.

4. (1) దర్పసరణ, (2) జలశయన, (3) నాగబంధ.

5. స్పర్శములు:—(1) కపాల స్పర్శన, (2) సూచ్యంతము, (3) మత్స్యకరణము, (4) కరస్పర్శ.

లేఖలు

పాంచాల బాభ్రవ్యుడు

శ్రీ శాస్త్రిగారి లేఖ ప్రచురణ ఆలస్యమైనది. అందువల్ల శ్రీ శర్మగారి సమాధానము తెప్పించి రెండూ ప్రచురిస్తున్నాము. —భా. సం.

"భారతి" సంపాదకులకు :

ఆర్యా!

1963 జనవరినెల భారతిలో పాంచాల—బాభ్రవ్యుడను వ్యాసమును శ్రీ దువ్వూరి జగన్నాథశర్మగారు వ్రాసినదానిని చూచి చాలా సంతోషించితిని. క్రొత్త విషయమును వెలువరించినందులకు శ్రీ శర్మగారభివందనీయులు. ముప్పురు బాభ్రవ్యులలో నీపాంచాల బాభ్రవ్యుని గుర్తించుటకు వలయు బాభ్రవ్య లింగ్స్తు ఇందులో లేకుండుట చాలా విచారమును కల్గించినది. ఆర్ష గోత్ర కర్తలలోనివాఁడే ఈ పాంచాల బాభ్రవ్యుడేల కారాదో నాకు బోధపడలేదు. హంస కిరణావళ్యాది గ్రంథ కర్తయగు బాభ్రవ్యుఁ డవధూతయై యుండియూ బాభ్రవ్య నామమునే ఏల స్వీకరించె ననుట మఱొక్క సందేహము. వామకేశ్వర తంత్రాంతర్గతముగా హంసకిరణావళీత్యాది గ్రంథకర్త యనుటయూ నొక విచిత్రముగానే యున్నది. వామకేశ్వర తంత్రము నీ బాభ్రవ్యుండు చేసెనా? అంతర్గత మనగా నర్థమేమి? 84 తంత్రములలో వామకేశ్వర తంత్రము అతి ప్రాచీనము, సుప్రసిద్ధము. అట్టి, దానిలో నీ బాభ్రవ్యుఁ డెక్కడ? మరియు చిత్పూర్యాలోక కార్యకర్తగా శ్రీ శర్మగారీ యవధూత బాభ్రవ్యుని పేర్కొన్నారు. ఆ కావ్య మచ్చుపడినదియూ లేనిదియూ తెలియదు. అది యెచ్చట దొరుకునో కూడ తెలుపరైరి. బాభ్రవ్యులు ముప్పురను నిరూపణమున పై విషయమును శ్రీ శర్మగారు తెల్పియుండినచో చాల బాగుండెడిది. దయచేసి తెల్పగలందులకు ప్రార్థించువాఁడ. శాక్తేయా పంచమకార ప్రవక్తగా నీయవధూత బాభ్రవ్యుని పేర్కొన్నారు. పంచమకారముల నీతఁడు ప్రవచించె ననుటయూ పొసగకున్నది. అందులకు త్రిపురోప నిషదాది వైదిక వాఙ్మయము వీరమ రామకల్ప సూత్రములు కౌళో ద్యుపనిషత్తులు తదితర తంత్రములు పెక్కు లున్నవి. వాని నీ యనధూత బాభ్రవ్యుడే ప్రవచించె ననుటయు యుక్తిసహముగా లేదు. "శబ్దాదీన్ విషయానన్యే ఇంద్రియాగ్నిషు జుహ్వతి" ఇత్యాది గీతా వాక్యములు పరశ్శతములైన ఋగ్యజారాదిశ్రుతిచయ నిగదితసూక్తములు పై విషయమును ప్రవచించినవి కాని అవధూతబాభ్రవ్యుడే ప్రవచించె ననుట వింతగా యున్నది.

ఇక పాంచాల బాభ్రవ్యుని కాల విచారము ఆకున కందక పోకకు పొందక అటు నవ్యముగాక ఇటు ప్రాచీనముగాక ఏదీ తేల్చక అయోమయములో పాంచాల బాభ్రవ్యుని కాలమును వదలినందులకు చింత గల్గినది. తార్తీయ పురుషార్థ ప్రతిపాదక గ్రంథము లెన్నియో నశించినవి. తత్సరణియూ సాంప్రదాయ భ్రష్టమైనది. ఉన్న గ్రంథములు నిరాదృతములై నశించుచున్నవి. ఇట్టి దుర్గతి ఆర్ష విజ్ఞానముకు పట్టి చిరకాలమైనది. పాశ్చాత్య పండితుల చరిత్రానుసరణము మనకు పరిపాటి యైనపుడు గోత్రకర్తలు కూడా చాలా అర్వాచీనులే యగుదురు. ఇట్టి సందేహము లెన్నియో ఈ పాంచాల బాభ్రవ్యవ్యాసమును చదివినవారికి కల్గునుగాక. శ్రీ శర్మగారు వాత్స్యాయనుఁడు స్మరించిన బాభ్రవ్యుఁడాది అవధూత బాభ్రవ్యుడి వరకుఁ గల త్రయముపై మఱొకతూరి విపులముగా వ్యాసమును వ్రాసి బాభ్రవ్యత్రయ నిరూపణ మొనర్చి లోకమున కుపకారము కల్గింపగలందులకై ప్రార్థించుచున్నాను. వ్యాస చతుష్టయము కాళిదాసాష్టదశము బాభ్రవ్యత్రయము ఇత్యాదులు వ్యాసరూపేణా రావలె. ఇంతకూ వీరి వ్యాసమువలన క్రొత్త విషయములు తెలిసినందులకు చాల సంతోషము. నా సందేహములు సరిగా యున్నచో భారతి లేఖలలో ప్రచురించ గోరెద.

(కల్యాణదుర్గం) గే. వాసుదేవశాస్త్రి,

"భారతి" సంపాదకులకు :

ఆర్యా!

శ్రీ గొల్లాపిన్ని వాసుదేవశాస్త్రిగారు భారతికి రెండు వ్యాసములను వ్రాసిరి. నే నొక వ్యాసమునందిచ్చినాను. మా ఇరువురి వ్యాసములందును గూడ విషయము—బాభ్రవ్యానుస్మరణమే! అయినను వయి రీతిగా—నా వ్యాసములోని వివిధాంశములను శ్రీ శాస్త్రిగా రధిక్షేపింపఁ బూనిరి. బాభ్రవ్యుని కాల విచారమును ఆకున కందక పోకకు పొందక అయి + ఏదీ తేల్చకఅయోమయముగా + వదిలినందులకు శ్రీ శాస్త్రులవారికి చింత కల్గినదట! బాభ్రవ్యుని గూర్చి వారు వ్రాసిన రెండు వ్యాసములలో కాల విచార ప్రసక్తి ఏల లేకపోయెనో! కొన్ని

యువవత్సలు నేను పలికి భారతాహవాత్పూర్వ మించుక—పూర్వుఁడయి యుండవలెను—ఈ పాంచాల బాభ్రవ్యుఁడని సూచింపఁ గల్గితిని. నేను వ్రాసినది సరికాదని వారు ఖండింప వచ్చును. క్రొత్త నిర్ణయము నైనను చేయవచ్చును. లేదా విపుల హృదయాభియోగముండి నేను వ్రాసిన దానిని బాగుగా పరకాయించి అవునని చెప్పవచ్చును. చింత కల్గినదని —ఆకాశం కిం ప్రయోజనమ్—

ఆర్షగోత్ర కర్తలలోనివాఁడే ఈ పాంచాల బాభ్రవ్యుఁ డేల కారాదో శ్రీ శాస్త్రిగారికి బోధపడలేదఁట ! గోత్రకర్త బాభ్రవ్యుఁడు విశ్వామిత్ర గణమువాఁడు. కామాగమ సూత్రకర్తయైన బాభ్రవ్యుఁడు కాశ్యప గణములోనివాఁడు. ఋగ్వేద మహర్షియగు పంచాలుఁడు ఋగ్వేదమందు ఆలింగనాది చతుష్షష్టిని పలికి యున్నాఁడు. పంచాల గోత్రికుఁడయిన బాభ్రవ్యుఁడు కూడ అదే చతుష్షష్టిని తన గ్రంథమందు విశదీకరించి యున్నాఁడు. ఈ పంచాల బాభ్రవ్యు లిరువురికిని గోత్ర సమైక్యత కలదు. ఇందుకు నేను నా వ్యాసములో—

1. పంచాలేన మహర్షిణా ఋగ్వేదే చతుష్షష్టి ర్నిగదితా—

2. బాభ్రవ్యేణా పి పాంచాలేన స్వకృతే సాంప్రయోగికాధి కరణే ఆలింగనా దయ ఉక్తాః—

3. ద్వయోరప్యేక గోత్ర నిమిత్త సమాఖ్యేన పాంచాలేన నిగదనాత్ సంబంధోస్తి—

ఇట్లు ఇంద్రపాదవివృత్తినుండియుగ్గడించిచూపితిని. ఐనను వైశ్వామిత్ర గణములోని బాభ్రవ్యుఁడే—కాశ్యప గణస్థ పాంచాల బాభ్రవ్యుఁడని యేల అనుకోరాదు ? అని శ్రీ శాస్త్రిగారు పలుకుచున్నారే—ఇదీ వింత ! ఇంతమాత్రము బోధపడకుండుటే కాదు—పాంచాల బాభ్రవ్యుని కామాగమసూత్ర గ్రంథము ఏ ప్రమాణములోనిదో కూడ శ్రీ శాస్త్రిగారికి బోధపడినట్లులేదు. "తదేవతు పునరధ్యర్థశతేన + పాంచాలః సంచిక్షేప" అని + "ఏబది అధ్యాయములచే డెబ్బది అధికరణముల క్రింద బాభ్రవ్యుడు కామ తంత్రమును రచించెనని వాత్స్యాయనుడు చెప్పియున్నాడు."— 18 పుట. 1962 మార్చి భారతి. అని శ్రీ శాస్త్రిగారు ప్రకటించినారు. వాత్స్యాయనుఁడు చెప్పినది—బాభ్రవ్య రచనము డెబ్బది అధికరణములని కాదు. ఏడే అధికారణములని—ఏబది అధ్యాయములని కాదు—నూట యేబది అధ్యాయములని.

ఇంక—కాశ్యప—విశ్వామిత్ర ఈ రెండు గణములలోని భిన్న పురుషులు—ఇరువురు బాభ్రవ్యు లుండుగా శ్రీ శాస్త్రిగారు—తమకు "దొరికిన హంస కిరణావళి యను ఒకానొక ప్రాచీన తంత్ర గ్రంథమునుండి ముప్పదిరెండు శ్లోకములు + బాభ్రవ్యునివిగా పేర్కొనబడినవి". "మూడు శ్లోకముల శైలి సరికొత్తగా గాన్పించుచున్నది గదా ! ఇంచుమించు వేదాంత శాస్త్రములోని పదములకు సాహిత్య రచనా రీతులకును ఇందులోని సూత్రీకృత పద్ధతికిని గల సామరస్యమును లాక్షణికు లగు పండితులు గమనింపగలరు"—అని వ్రాయుచు ఇంకొక నవీనుఁడు మూఁడవ స్మరదర్శన బాభ్రవ్యుని వారే బైలుపరచినారు. ఇందుమీఁదట నేను "ఇంకొక బాభ్రవ్యుఁడు స్మరదర్శనా నుష్టుప్ శ్లోక ద్వా వింశత్ కర్త. పాంచాలుడు కాడు. వామకేశ్వర తంత్రాగతముగ హంసకిరణావళీత్యాది ఖండకావ్య ప్రణేత, శాక్తేయ పంచ మకారాది ప్రవక్త, చిత్ సూర్యాలోక కావ్యకర్త ఒక యవధూత" అని వ్రాసినాను. "వామదేవాఖ్య మతంతూపాసనావిధౌ" అని స్మరదర్శనము. శాక్తము. పాంచాల బాభ్రవ్యుని గూర్చి నేను వ్రాసిన వ్యాసములో పాంచాలుఁడు కానట్టి బాభ్రవ్యుని గూర్చి ఇంతకంటె అధిక ప్రసంగ ముండుట వ్యాస ప్రౌఢిమను చెరచును. ఐనను ఇంచుక—వాఁగదల్తును. ఈ స్మరదర్శన బాభ్రవ్యుఁడు—అవధూత = విదండి—ఇంతియ కాదు. సదండియై తరువాత విదండియై మరల సదండియైన ధీశాలి. తురీయాశ్రమమునకుఁ బూర్వము—సుధాకర ద్వివేది ఇత్యాది పండితుల సన్నిధిని బోధశాలియై నాతఁడు—సర్వజ్ఞకల్పుఁ డనఁ బరగిన మహా పండితుఁడు—శాక్తేయ తంత్రములను అవలీలగా సమన్వయింపగల్గిన యాతఁడు—వివిధ సంప్రదాయ రహస్య వేత్త. ఇట్టి మహావిద్వాంసుని స్మరదర్శనముచేఁబట్టు వ్యాసద్వయ లేఖన మొనర్చియున్న శ్రీ శాస్త్రిగారికి—వామకేశ్వరము—చిత్ సూర్యాలోకము—మకార పంచకము ఇత్యాది నా యొక్క వివరణలేల ?, నా వ్యాసమునందలి ప్రధానాంశము—బాభ్రవ్య పాంచాలుడు—ప్రాసంగికము మాత్రమే. పాంచాలేతర బాభ్రవ్యుడు స్మరదర్శనకర్త. కనుక ఈ పాంచాలేతర బాభ్రవ్యుని స్మరదర్శనము—ఆ గ్రంథకర్తయొక్క ఆనుపూర్వికను దాఁచి వ్యాసలేఖన మనకు సిద్ధపడినవారు శ్రీ శాస్త్రిగారే! గనుక వారు వ్రాయఁ గోరిన రీతిగా లోకోపకారక వ్యాసములను శ్రీ శాస్త్రిగారే వ్రాయవలసి యుందురు. స్మరదర్శన బాభ్రవ్యుని కాలమాన చర్చను తాము ఎత్తరేల ? ఏ వాత్స్యాయనుని పేరో చెప్పి అభినవ ప్రబుద్ధులగు పాశ్చాత్య నిర్ణయానుసారులను శ్రీ శాస్త్రిగారు నిందింతురేల ? నేను బాభ్రవ్యుని కాలనిర్ణయముపట్ల అయోమయ కల్పన మొనర్చినదానిని సరియైన వెలుగులోకి శ్రీ శాస్త్రులుగారు దక్షులైతే తేవచ్చునుగాదా ? సంబంధములేని యితర విషయ చర్చ సారస్యమా ? నమోనమః—

ప్రాయో నిందతి కంచుక మేవ
వృథా శుష్కస్తనీ నారీ !—

"ఇంతకూ వాత్స్యాయనునిచే సంక్షేపింపబడిన కామాగమం మాత్రమూలము బాభ్రవ్యునిదని లోకమందరి యుద్దేశము. వాయుద్దేశము శ్రీ శాస్త్రిగారు వ్రాసిన బాభ్రవ్యవ్యాసములు రెండింటి తాత్పర్యము కూడను అదే! స్మరదర్శన రచనము ఆ పాంచాల బాభ్రవ్య రచనము కాదని నా ముఖ్యోద్దేశము. అధునా తన రచనమని—అదియు అవధూత పేరిటయని నావాదము. అందుకు నేను "పాంచాల బాభ్రవ్యుడు", అను శీర్షికతో వ్రాసిన ముఖ్యమయిన మూడు మాటలే చాలును. ఇంక స్మరదర్శనము పాంచాల భాభ్రవ్యకర్తృకమని శ్రీ శాస్త్రిగారు భ్రమించినది భ్రమకాదని, నిర్ధారించుకోగల కర్తలు శ్రీ శాస్త్రిగారే. ఇందుకు శ్రీ శాస్త్రిగారియొక్క పయిలేఖ—ఆ సందేహ ప్రణాళిక—స్మర దర్శన ప్రవేశికకు విషయ సూచికగా చర్చింపదగినట్లు (సమాధానింప దగినట్లు) అంశముల జాపితగా చాలవరకు ఉపయోగించును. పాంచాల బాభ్రవ్యేతర రచనముపట్ల అనగా స్మర దర్శనముపట్ల—తత్ప్రవేశికకు బాధ్యులు శ్రీ శాస్త్రిగారే అయియుండి వారు వ్రాయదగిన ఉపోద్ఘాతమును నేను వ్రాయ వలసినట్లుగా నేర్పుగా నాపయికి విమర్శన లేఖనంపిరో హా! స్మరదర్శన కర్తృకముం గూర్చి నేను వ్రాసినదంతయు సరి యైనదే! అథవా కాకపోవచ్చును. స్మరదర్శనమును నేను ప్రవేశ పెట్టిన వాడనుకాను! శ్రీ శాస్త్రిగారేకదా! నా వ్యాసమునకు ప్రత్యవాయమేమున్నది.

(రామచంద్రపురం) దువ్వూరి జగన్నాథశర్మ

ఆర్యా !

1963 జనవరి 'భారతి'లో శ్రీ వాత్సవగారు వ్రాసిన 1962 సాహిత్య సమీక్ష చూచాను. దానిలో గొల్లపూడి మారుతిరావు గారు రచించిన "నిజం నిద్రపోయింది" అనే నాటిక ప్రసక్తి తెచ్చి, అది తెలుగులో మౌలిక రచనగా ఆ విమర్శకులు అభిప్రాయ పడినట్లు తోచింది. అది భ్రాంతి!! ఈ నాటిక **Susan Glaspeal** వ్రాసిన **Suppressed Desires** అనే ఏకాంక నాటికకు అనుసరణ. ఎటొచ్చీ, ఈ తెలుగు సేతలో కొన్ని ఆడ పాత్రలు మగపాత్రలయ్యాయి. ఇంగ్లీషు మాతృకలో సున్నితమైన హాస్యంతో నేటి మానసికశాస్త్రంమీదను—స్వప్నాల పరీక్షమీదను చేసిన వేళాకోళం ఎంతో వినోదం కలిగిస్తుంది. మారుతిరావుగారి తెలుగుసేత అందులో మంచినంతా తుడిచిపెట్టి, స్వతంత్రంగా కల్పించిన పులుముడుతో మరింత పాడయింది. ఇలాగ అనుకరణ చేసినప్పుడు "మాతృక" మాట ఆ రచయిత చెప్పవలసింది. మరి ఇది మీదృష్టికి, మీ విమర్శకుని దృష్టికి తేవడమైనది.

ఒక పాఠకుడు,

ఆంధ్రపత్రిక శోభకృతు సంచిక ఉగాదినాటికి రాగలదు. కాబట్టి తమ రచనలను పంపవలసినదిగా రచయితలను, చిత్రములను పంపవలసినదిగా చిత్రకారులను కోరుచున్నాము. వ్యవధి తక్కువగా నున్నందున త్వరగా పంపవలసినదని ప్రార్థన.

—సంపాదకుడు.]

అముద్రిత ఆంధ్రనానార్థ నిఘంటువు

శ్రీ హస్నాబాద నాగలింగయోగి

మహాత్ములగు మన పూర్వ లాక్షణికు లాంధ్రమున నెన్నియో పద్యాత్మక నిఘంటువులను రచించిరి. అందు కొన్ని లభించినవి. మరెన్ని కాల గర్భములో గలిసి పోయినవో? మన మెరుంగముకదా! నాయొద్దగల తాళపత్ర సంచయములలో నొక యపూర్వమైన నిఘంటువు బయల్పడినది. అది ఆంధ్ర నానార్థ నిఘంటువు. ఇందు 51 ఆట వెలదులును, 294 కందములును గలవు. మొత్తము పద్యములు 345. ఇందిదివరకున్న నిఘంటువులలో లేని క్రొత్త పదములకు నానార్థము లున్నవి.

కీ. శే. సురవరము ప్రతాపరెడ్డిగా రన్నట్లుగా, బహు గ్రంథములలోగల చాలా పదాలు నేటి నిఘంటులలో లేవు. నిఘంటుల లోపము వలననే, కొన్ని గ్రంథములలోగల సలక్షణమైన పదములను ముద్రాపకులు, సంస్కర్తలు భ్రాంతిచే, నప శబ్దమనియో, శిథిల రూపమనియో, భావించి అనవసరమైన మార్పులు చేర్పులు జేసియున్నారు. ఉదా:—శాసన పద్యమంజరి పీఠికాకారులు, కల్హారగంధి—యనుటకు బదులుగా, కలావారగన్ధిగా, నుండవలెనని వ్రాసిరి.

ఇట్టి వెన్ని జరిగినవో? చూడవలసియున్నది. అట్టి పదముల పూర్ణమగు నర్థమునుగాని, పర్యాయ పదంబుల నెఱుగుటగాని, నానార్థంబుల నెఱుగుట యనిన, నిఘంటువులే యాధారములు. అట్టిలోప మీ నిఘంటువలన తీరవచ్చును. మచ్చునకు నట్టి శబ్దముల కొన్నింటిని సూచించు, పై నిఘంటులోని బద్యముల నుదాహరింతును.

కీ. శే. సురవరము ప్రతాపరెడ్డిగారు ఆంధ్రుల సాంఘిక చరిత్ర పుట 180 నందు సింహాసన ద్వాత్రింశిక యందలి నొక పద్యము నుదహరించుచు, నీ క్రింది విధముగా వ్రాసినారు.

సీ. "కేరిజంబులగోరి కేరుట నీరించి వూరేండ్ల బుడకల బూడ్దె కలిపి
పాల గుమ్మలనేల పాలుగా నొనరించి వెలిచల మెలకువ వెలితిచేసి
బెగ్గురు కదుపుల బెగ్గిల ప్రమగ్గించి కొంగల పొగరెల్ల ద్రుంగ ద్రొక్కి
కక్కెర నెత్తురు గ్రక్కించి కొక్కెర పిండు గుండియ లెల్ల బెండు పరచి
కారుకోళ్ళ వెండగారించి గోరువంక బంక మింకవాని పొంక మణచి
చెమరు బోతుగముల జమరి కౌజుఃజించి పాళువంబు జయపొలుజేరే"

చెమరుబోతు అనుదానికి శ. ర. నిఘంటులోలేదు. కాని చెమరు అనుదానికి చెమరుకాకి యని వ్రాసినారు. "ఈ పక్షి నీలము వన్నెకలదై కాకికన్న చిన్నదై, తోక పొడవుగా కలదై, ధ్వని కూడ కాకితో భిన్నించినదై పెద్ద రాళ్ళను గోడలు కట్టువారు మలిచి నప్పుడగు, కంగ్, కంగ్ అను ధ్వనిని బోలి' కూయునదై యుండును."

అని రెడ్డిగారు లిఖించినారు. వీరు ఈ పక్షియొక్క రంగును గురించి చేసిన వూహ నమంజసముగా లేదని తోచుచున్నది. కారణము సరియైన నిఘంటులు లేకకదా! ఉన్న వాటిలో గూడ నిట్టిచో, పక్షి విశేషము, వృక్ష విశేషము, జంతు విశేషము అని నిఘంటుకారులు తప్పించుకొని పోవుట సంభవించినది. ఈ నిఘంటువు పద్యాత్మక మైనప్పటికిని చక్కని వివరములతో నున్నది.

ఉదా:—'చమరి మృగము ననగ తెల్ల వెంట్రుకల మృగము
, చమరి మృగము ననగ తెల్ల నెమిలి
చమరి మృగముననగ నల్ల చీమలు యుర్రి
చమరి మృగము ననగ తెల్లకోతి'

పై నుదహరించిన సీస పద్యమున కవి కేవలము పక్షి వేటను గురించియే వర్ణించినందున—చమరి—తెల్ల నెమిలి, చెమరుబోతు—మగ తెల్లనెమిలిగా నోపు.

కీ. శే. నంగూరి సుబ్బారావుగారు, కవి చౌడప్పను గురించి శతక కవుల చరిత్రలో నిట్లు వ్రాసినారు.

"పాము శబ్దమునకు బర్యాయ పదమగు, కాకోదర శబ్దము నీత డిట్లుదహరించెను. కాకోదర కుందవరపు కవి చౌడప్పా!' అని కొన్ని పద్యముల మకుటముగా గనబడును. ఈ కాకోదర శబ్దమున కర్థ మూహ్యము. నన్నెచోడుని కుమారసంభవములో—

1. 'హర హాసాకాశగంగాత్యమల జలమరాళాబ్జ నీ హారధాత్రీ
ధర కర్పూరేందు కాకోదర వరపతి దిగ్దంతి పక్షీరనీరా

కరముక్తాహార కుందోత్కర రజత శరత్కౌముదీ ద్యోతకీర్తి
శ్వరు నాత్మారాము వాణీవరు వరగురు సర్వజ్ఞునజ్ఞాన దూరున్'

2. నారాయణ శతకమునందు—
'కడకుం బాయకవేయునోళ్ళుగల యాకాకో దరాధీశుడున్
కడ ముట్టన్వినుతింపలేక,

3. భారతమున—
'సర్ప యాగమున భస్మము సేయుము తక్షకాది కాకో దర సంహతిన్.'

కవి చౌడప్ప పలువుర దిట్టి కాకోదరు డయ్యెనా! వేరర్థమున్నదా? ఖగరాడ్పులుడు కావున, కాకోదరుఁడా? పండితులు చర్చించెదరుగాక—''

అని సెలవిచ్చినారు. సుబ్బారావుగారింత ప్రయాస పడవలసి వచ్చిన అర్థము సరిపడలేదు. కవి తనకు తానై 'కాకోదరుఁడ (పాము) నని చెప్పగలుగునా? అట్లు సమకూడదు. అప్పుడు వేరర్థముండవలెగదా! చూడుడు.

1. 'కాకోదర మన సర్పము
కాకోదర మనగ నెమలి పింఛము పేరున్
కాకోదరమన కోవెల
కాకోదరమనగ కందకాచును వినుడీ.

''రాజితోపాయ కుందవరంపు రాయ'' అను పద్య పాదము వలన కవి చౌడప్ప కుందవరపురాయుడు అనగా కుందరపు ప్రభుడనియో, కరణమనియో, తెలియుచున్నది. పలుతావులందు కవి ఆత్మ స్తుతి చేసికొన్నట్టుగా గమనింతుము'' భూసురవర్య! కుందవర భూషణ చౌడ కవీశ్వరోత్తమా! అను దానినిబట్టి నీతడు కుందవరము యొక్క భూషణు డనదగిన కవీశ్వరోత్తము డని దెలియుచున్నది. కుందవరపు కవులలో ప్రసిద్ధుడై భూషణు డనిపించుకొని యుండును. కనుకనే కవి తానే

'ముందు గ చను దినములలో
కందమునకు సోమయాజి ఘనుడందురు'నే
డందరు నను ఘనుడందురు
కందములకు, కుందవరపు కవి చౌడప్పా!

ఘనుడనని తెలియ జేయుచున్నాడు. కావున కుందవరపు ఘనుడను, భూషణుడను, అనుచు సంబోధించుకొనుట యతని యభిమతమే. పై మకుటములో కవి చౌడప్ప కుందవరపు కాకోదరము, అని కవి భావనయై యుండును. నెమలి పింఛమును భూషణముతో సమానముగా భావించుట యాచారమె గదా! శ్రీ కృష్ణుని శిరో భూషణ మీ నెమలి పింఛమే. అందుచేత నిట కాకోదరమన నెమలి పింఛము (భూషణము) అను నర్థమునే గ్రహించుట యుచితమని తోచును. అప్పుడు కవి చౌడప్ప కుందవరపు నెమలి పింఛము (భూషణము) వంటివాడని తేలును.

1962 డిసెంబర్‌నెల భారతిలో 'అర్జునుని శరీర వర్ణ మెట్టిది?' అను శీర్షిక క్రింద, అర్జున, అవదాత, పదముల కర్థమేమి? అను చర్చ సాగినది. వారి సందేహ నివారణార్థమై నిట రెండు పద్యముల నుదహరింతును.

1. అర్జునము మద్ది మారెడు
అర్జునమును తెలుపు నలుపు మరిపసరుపమీ
అర్జునము పసుపు వర్ణము
అర్జునమును రేగు మేటి మాధవ కృష్ణా.

2. అవదాత వర్ణమునకు అమరమునందును, ధనంజయ నిఘంటునందును, తెలుపనియే అర్థము గన్పట్టుచున్నది. శుక్ల, శుభ్ర, శుచి, శ్వేత, విశద, శ్యేత, పాండువు, అవదాత, సిత, గౌర, వళక్ష, ధవళ, అర్జున, శితి, పల్ల, శశి, ప్రభ మొదలగు శబ్దములును, తెలుపుయొక్క పర్యాయ పదములే. ''పై చర్చ''లో అందలి శుక్లమే ఇందలి అవదాత మన్నారు. అయితే ఆ అవదాతమే శ్వేతము గూడ నగునుగదా!

శ్వేతమనగ తెలుపును శ్వేతము యెరువును
శ్వేత మనగ తెల్ల గొడుగు పేరు
శ్వేతమనగ తెల్ల నాకాశమునునగు
శ్వేతమనగ గంగ తుంగయగును.

1. కల్హారంబన కలువలు
కల్హారమన కమలములును కలహంసంబుల్
కల్హార మన నురుగులునగు
కల్హార మనంగ పుప్పొడికిని పేరయ్యెన్

2. బరహియన నెమలి గానము
బర్హియనన్ కాకిగూబ మారెడు చెట్టున్
బరిహియన కోతి చీమయు
బర్హియనన్ శునక గర్ద భావజ్ఞునిధీ.

3. సౌదామిని యన మెరపును
సౌదామిని యగన ఇంద్ర సింగడిపేరున్

సౌదామిని యన ఉరుములు
సౌదామిని యనగ తెల్ల యేనుగుయొప్పున్

ఈ కల్హారము, బర్హి, సౌదామిని యను శబ్దముల తత్త్వమును గురించి పూజ్యులు శ్రీ నిడుదవోలు వెంకటరావు గారు (1958) పునర్ముద్రణ శ. ర. పుటలు—830 నుండి 866) సవరణలు: వివరణలు: అను శీర్షిక క్రింద చాల చక్కటి విమర్శన జేసినారు.

శ. ర. లో లేని నూతన పదముల, పద్యముల గొన్నింటి నుదహరింతును.

1. కురువకమన కురువిందయు
కురువక మన నేల తాటి కూకటియౌనా
కురువకమన చంపకమగు
కురువకమన ఎర్ర తుమ్మ కుంభిని బరగున్.

2. కురువక మన గోరంటయు
కురువక మన కుంట గలిజె కొడిసెయు ననగా
కురువక మన పెద గుమ్మడి
కురువకమన పెద్ద గురుగు కుంభిని యొప్పున్.

3. శశిబంధు డనగ కుందెలు
శశిబంధు డనంగ చంద్రకాంతికి పేరున్
శశిబంధు డనంగ పునుగును
శశిబంధు డనంగరాజా చూడు ధరిత్రిన్.

4. మాణవు డన బమ్మచారి
మాణవు డన భార్యలేని వానికి పేరున్
మాణవు డన చెవిటికి దగు
మాణవుడన కొంటెపేరు మాధవకృష్ణా.

5. హరులన గుర్రము లగునా
హరులన పగ్గముల పేరును హరులన శత్రుల్
హరులన రథములు కండ్లును
హరులన జనులకును పేరు హరిహరనాథా.

6. లాంశంబన చిరునవ్వును
లాంశంబన ఆట పాట లాడెటివారున్
లాంశమన వినోదంబులు
లాంశమనన్ నృత్యమునకు నటికుల పేరున్.

1. నా యొద్దగల వొకే వ్రాతప్రతిలో ఆంధ్ర నామ శేషము, షడ్రస నిఘంటువు, అమరము, ధనంజయ నిఘంటువు, ఆంధ్ర నానార్థ నిఘంటువు మొదలగు నిఘంటు లన్నియు చక్కని ముత్యములవంటి గుండ్రని అక్షరములతో సమగ్రముగా వ్రాయ బడియున్నవి. అయితే పొరపాటున లేఖకుడు ఈ ఆంధ్ర నానార్థ నిఘంటుయొక్క గద్యము వ్రాయ మరచినాడు. కాన నే కవి కృతియో? చెప్ప వీలులేదు. నిఘంటు అంత్యములో

1. "నానార్థ శబ్దములకును
నానార్థంబులును గాగ నయముగ దీనిన్
మానుగ జదివిన దీనిన్
మానుగ శబ్దార్థములును మరిదెలుసు సుమీ.

2. ఏ శబ్దములును వచ్చిన
యా శబ్దంబులును నన్నియంతయు దెలుసున్
వాసిగ చదివిన వారికి
ఏ శబ్దంబైన దోచు యంతయు తెలివిన్.

"ఇది ఆంధ్ర నానార్థ నిఘంటువు సంపూర్ణము. శ్రీ శ్రీ శ్రీ జేయును. ఆనంద నామ సం. బ. 10 నాడు వ్రాశినాము."

అని కలదు. ఇది క్రీ. శ. 1855 తో సరిపోవును. నేటికి 107 సం. ల క్రిందట వ్రాయబడిన ప్రతి యని తెలియు చున్నది. సీతా రామ సోమయాజి ప్రణీతమైన ఆంధ్ర నానార్థ నిఘంటు వొకటి ముద్రితమయినదని తెలిసినది. ముద్రిత ప్రతిలో 132 పద్యములు మాత్రమే కలవట. అవి కంద గీతములేనట. అట్టి ప్రతికి సరి చూచిన నిది సమగ్రమని చెప్ప నగునా? చూడవలసి యున్నది.

ప్రసన్నరాఘవ నాట్యప్రబంధము

శ్రీ నిడుదవోలు వేంకటరావు

"ప్రసన్న రాఘవ నాట్య ప్రబంధము"[1] సంస్కృతమున జయదేవకవి రచించిన ప్రసన్నరాఘవ నాటకమునకు పద్యానువాదము. గ్రంథకర్త బొడ్డుచెర్ల చిన తిమ్మయ[2]. ఆతడీ కావ్యమును నంద్యాల తిమ్మరాజున కంకితము గావించి యున్నాడు. సంస్కృత నాటకములకు పద్యానువాదములు తెలుగున నీ కావ్యమునకు ముందులేక పోలేదు. కాని, వానికంటె నీ కృతియందొక విశేషము గలదు. ఆంధ్ర ప్రబంధ సాధారణములగు కృత్యాది, ఆశ్వాసాద్యంత పద్య రచన, గద్య మున్నగునవి ఇందు లేవు. సంస్కృత మూలమునగల నాంది ప్రస్తావనలతో ప్రారంభము. ఆశ్వాసములకు బదులుగా అంక విభజనమున్నది. ప్రస్తావనలో. కవి తన కృతిపతి వంశ వర్ణన గావించి తన్ను గూర్చి యొక పద్యమును చెప్పి, యా వెనుక జయదేవ కవి రచనను యథామాతృకముగా ననుసరించినాడు.

పై విషయములు స్పష్టపడుటకు గ్రంథమునుండి యుదాహృతులు చూపుచున్నాను.

1. నాందియందలి మూడు పద్యములు:—జయదేవ కవి శ్లోకములకనువాదములైనను, తిమ్మనృపాలుని నామ మం దనుసంధింపబడినది.

2. నాంద్యంతమున సూత్రధారుడు తిమ్మరాజు కొలువు కూటమును తిమ్మరాజు ప్రశస్తిని కవిని గూర్చి తెలుపును. కవిని గూర్చి పద్య మొక్కటి గలదు. దానిని వేరుగా సందర్భపడినపు డుదాహరింతును.

3. కృతిపతి నంద్యాల తిమ్మరాజు వంశవర్ణన—8 నుండి 80 వఱకు గలదు.

4. జయదేవకవి కవితా ప్రశంస—నాటకారంభము.

5. ప్రథమాంకము చివర

క. నందేల తిమ్మరాజ పు
రందర చిహ్న ప్రసన్న రాఘవ నాట్యా
మంద ప్రబంధరాజము
నందున ప్రథమాంకమయ్యె నార్యస్తుతమై.

6. ఇట్లే నే డంకముల చివర నీ పద్యమే సంఖ్య మార్పుతో నున్నది.

7. అంక ప్రారంభము, సంస్కృత మూలము ననుసరించియే యున్నది.

8. ముద్రిత గ్రంథమున

ప్రథమాంకమున		328	గద్య పద్యములు.
ద్వితీయా	,,	183	,,
తృతీయా	,,	172	,,
చతుర్థ	,,	121	,,
పంచమ	,,	164	,,
షష్ఠ	,,	145	,,
సప్తమ	,,	258	,,
		1371	

ఇందలి వచనములన్నియు ప్రాయికముగా చిన్నవి. సప్తమాంకమున నొక పెద్ద వచనము గలదు. ఇది గ్రంథ స్వరూపము.

కృతికర్త తన్ను గూర్చి 3 చెప్పుకొన్న పద్య మీ క్రిందిది యొక్కటి మాత్రమే.

ఉ. ధీరుఁడు బొడ్డుచెర్ల చిన తిమ్మయ మంత్రి కుమారుఁడంబితా
కారుఁడు సత్కళావిదుఁడు, కౌశిక గోత్రుఁడు పద్మనేత్రసే
వారత బుద్ధి నందవర వంశ్యుఁడు ప్రాకవిలోకనాథుఁ డా
చార సమగ్ర వర్తనుఁడు పార వచోనిధియున్న వాఁడొగిన్.
(1—7)

ఇంకను తన కారాజు "ప్రవిమల ముక్తాఫలాత పత్రాందోళికాంగద పదక పదకటక హారా గ్రహార కర్పూర గంధ సారాదికంబులు తోదహత్తుగా మెచ్చి యిచ్చి" నట్లును చెప్పుకొన్నాడు.
(1—79)

ఈ కవినిగూర్చి కీ. శే. వేటూరి ప్రభాకరశాస్త్రిగారు తాము సంకలనము చేసిన చాటు పద్య మణి మంజరి ప్రథమ భాగమున "శ్రీ కృష్ణదేవరాయ"లను శీర్షిక క్రింద నిట్లు వ్రాసినారు.

---

1. ఆంధ్ర రచయితల సంఘము హైదరాబాదు వారు ప్రకటించినది. సంపాదకులు ప్రరోచనా రచయితలు డాక్టరు బి. రామరాజుగారు.

ఆంగ్ల పీఠికా రచయితలు ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనముగారు—గ్రంథము తే 3—10—1962 దిని ప్రకటితమైనది.

2. బొడ్డుచెర్ల చిన తిమ్మయ ప్రణీతము" అని యే ముద్రితము.

3. పుటలు 5—6.

"రాయలకుఁ జదరంగపు టెత్తులు వేయుటయం దత్యాసక్తి యుండెడిదట. బొడ్డుచెర్ల చిన తిమ్మనయను కొప్పోలు కరణము కవీశ్వర దిగ్దంతియను ప్రతిష్ఠగలవాఁడై శ్రీ కృష్ణదేవరాయలతోఁ జదరంగమాడుచుండెడివాఁడు. శ్రీకృష్ణరాయల పక్షమున నెంద రాలోచించి ఎత్తు వేయుచున్నను నీతఁ డొక్కఁడే ఎదురెత్తువేసి యాట గెల్చుచు వేయూర్ల పందెము గొనుచుండువాఁడట. అతని శక్తికి సంతోషించి కొప్పోలు గ్రామమునకుఁ గృష్ణరాయపురమను నామ మేర్పఱిచి రాయలు సర్వాగ్రహారముగా నాతనికి ధారవోసెను.

క. శత సంఖ్య లొక్కడైనను
సతతము శ్రీ కృష్ణరాయ జగతీ పతితో
జతురంగమాడి గెల్చును
ధృతిమంతుఁడు బొడ్డుచెర్ల తిమ్మన భళిరే!

ఉ. ధీరుఁడు బొడ్డుచెర్ల చిన తిమ్మన మంత్రి కుమారుఁడంచితా
కారుఁడు సత్కళావిదుఁడు కౌశిక గోత్రుఁడు పద్మనేత్ర సే
వారత బుద్ధి నందవర వంశ్యుఁడు సత్కవిలోకనాథుఁ డా
చార సమగ్ర వర్తనుఁడు చారువచస్థితి నొప్పువాఁడొగిన్.

పై నుదాహృతములైన రెండు పద్యములలో రెండవ పద్యము—"ధీరుఁడు బొడ్డుచెర్ల చిన తిమ్మన" అనునది కొలది మార్పులతో, ప్రస్తుత గ్రంథమున నున్నది. అయితే చాటు పద్య మణిమంజరిలో ప్రథమ పద్యమున, బొడ్డుచెర్ల తిమ్మన యని రెండవ పద్యమున చిన తిమ్మన యని యున్నది. దీనిని బట్టి కీ. శే. ప్రభాకరశాస్త్రిగారు వీ రిరువురును నొకే వ్యక్తులని, భిన్నులు కారని భావించినట్లు స్పష్టము.

ప్రరోచనాకారులు మాత్ర మట్టి యభిప్రాయముతో నేకీభవింపక ఇట్లు నిమర్శించియున్నారు.

"తిమ్మయ, చిన తిమ్మయలకుగల కొలది భేదము వలన కీ. శే. ప్రభాకరశాస్త్రిగారు పొరపడియుందురు. లేదా వా రీ సామగ్రి సేకరించిన రికార్డులందే ఈ పొరపాటు దొరలియుండును". ఇంతటితో చాలింపక, వెంటనే "ఇంటిపేరు, పేరు నొకటిగా నుండుటేగాక, వీ రిరువురు తాత మనుమలై యొకే గ్రామమున నధికారము నెఱపియుండిన కారణమున కాబోలు కాలక్రమమున నీ ఇరువురు వ్యక్తు లొక వ్యక్తిగా మారియుందురు. మన చరిత్రయం దిట్టి సంఘటనలు పెక్కులున్నవి." అని తిమ్మయ, చిన తిమ్మయలను తాతా మనుమలుగా నిర్ధారణ చేసిరి. తమ యభిప్రాయమును నిర్ణయమును సరియైనదో, లేదో పరిశీలింపకుండ కృతికర్త "పదునారవ శతాబ్దము చరమ పాదముననున్న వాడగును" అని తీర్మానించిరి. (పుట 6.)

ఈ సందర్భమున ప్రరోచనయందు వ్రాయబడినదెల్ల ఎంత నిరాధారము, నిష్ప్రామాణికమునై యున్నదో తెలియ జేయుటకు, నీ గ్రంథకర్త వృత్తాంతమునకు మూల భూతమైన కొప్పోటి గ్రామ వృత్తాంతము నిం దుదాహరించుచున్నాను.

కొప్పోలు గ్రామ వృత్తాంతము

ఇది మదరాసు ప్రాచ్య లిఖిత పుస్తక భాండాగారమున మెకంజీ సంపుటము 136 లో పుట 80 లో నున్నది. యథా మాతృకముగ నిం దుద్ధరించుచున్నాను.

"తరువాత ఈ నృసింహ దేవరాయలకుమారుండు శ్రీ కృష్ణదేవ మహారాయలు విజయనగరమందు వజ్ర సింహాసనారూఢుడై పృథివీరాజ్యం చేయుచుండగాను పైన వ్రాసిన గ్రామ కరణాలు బొడ్డుచర్ల పెద్ద తిమ్మన, చిన్న తిమ్మన అనే ఇద్దరు అన్నదమ్ములు. వీరిలో పెద్ద తిమ్మన అనే ఆయన గ్రామములో కరణీకం అనుభవిస్తూ ఉండెను. చిన తిమ్మన్న అనే ఆయన కవీశ్వర దిగ్దంతి అనిపించుకొని శ్రీ కృష్ణదేవరాయలవద్దపోయి రాయలతో చదరంగమాడుతూ ఉండేవాడున్నూ, ఆట గెలిస్తే వెయ్యూరుల వరకు పంద (దెము?) చేసి గెలుస్తూ ఉండేవాడు. అప్పుడు శ్రీ కృష్ణ దేవ మహారాయలు చాలా సంతోషించి కొప్పోలు గ్రామం సర్వాగ్రహారంగా ధారవోసిఇచ్చి కొప్పోల్కు ప్రతి నామం కృష్ణరాయపురం అని నామం ఏర్పరచిరి. ఈ చిన్న తిమ్మన్న అనే కరణం కవీశ్వరుడు చెప్పిన పద్యం

"శత సంఖ్య లొక్కటైనను
సతతము శ్రీ కృష రాయ జగతీపతితో
చదరంగ మాడి గెలిచెను
ధృతిమంతుడు బొడ్డుచర్ల తిమ్మన భళిరే.

ధీరుడు బొడ్డుచెర్ల చిన తిమ్మన మంత్రి కుమారు డంచిత
కారుడు సత్కళా విదుడు కౌశిక గోత్రుడు పద్మ నేత్ర
సేవారతబుద్ధినందవరవంశుజు (శ్యుడు?) సత్కవిలోకనాథుడా
చార సమగ్రవర్తను డుదా(చా?)ర వచోన్నతి నొప్పె వాడొగిన్.

అప్పుడు రాయలవారు కొప్పోలు గ్రామం సర్వాగ్రహారంగా ఇచ్చిరి గనుక ఈ కవీశ్వరుడు రాయలచేత అగ్రహారం దానం ప్రతిగ్రహం చేసి కొప్పోలు గ్రామానికి ప్రవేశించి కొప్పోలు గ్రామంలో ఎనిమిది వృత్తులు ఏరుపర్చుకొని నిశ్చయం చేసు కొన్న వివరం పద్యం

భువి విక్రమార్కుని బొంత యాచమనీషి
మంత్రి ప్రగ్గడ తిమ్మమంత్రి యతని
యగ్రజసుతు శింగయ తత్పుత్రు కొండయ
శ్రీ రాము రొఖ్ఖమ్మ? చెవ్వనార్చు
త్రిపురాంతకుని కాచధీమణి వృషభునకు
నందివర్గమ్ము చన్న సమాఖ్య
బొడ్డుచర్ల తిమ్మప్రభు కవి దిక్కరు
లగుచు కొప్పోలు గ్రహారమ్ము నొసగె
హయగజాధీశ ముఖ్య సింహాసనాది
రాజరాజ కిరీటాది రత్న సూత్న
కేసరి పరాగి తాంఘ్రి పంకేరు హుండు
నరస విభు కృష్ణ రాయాంక నరవరుండు.

ఈ ప్రకారంగా సర్వాగ్రహారంగా అనుభవిస్తూ ఉండిరి. ఈ వ్రాసిన పద్యములు గ్రామ కరణాలవద్ద వ్రాసిఉన్నదాని నకలుచూచి వ్రాసినాను."[1]

మెకంజీ సంపుటములలోని విషయము లిప్పటికి నూట ఏబది యేండ్ల క్రిందటివి. పై వృత్తాంతములో చివరనున్న పద్య మీవరకు లోక మెరుగదు. ఆ పద్య మున్నది యున్నట్లు గానే ఇందు వ్రాయబడినది.

పైని యుదాహరించిన పద్యములలో "శత సంఖ్యలు" అను కందము వెను వెంటనే "ధీరుఁడు బొడ్డుచర్ల చిన తిమ్మన" అను పద్యమున్నది. ఈ రెండు పద్యము లొక్క చోటనే యుండుటయేగాక, మీద నుదాహరించిన "భువి విక్రమార్కుని బోంత" యను సీస పద్యమును, వచన వివరణతో నా పద్యముల క్రిందనే యున్నది. అందు రాయలవలన సర్వాగ్రహారముగొన్న చిన్న తిమ్మయ, "బొడ్డుచెర్ల తిమ్మ ప్రభువు"గా వ్యవహరింపబడినాడు!

ఇవి యన్నియు మెకంజీ సంపుటములో నొకే పుటలో నున్నవిగాని, వేర్వేరుగా నెంతమాత్రమును లేవు.

మఱియు చిన తిమ్మన అనే కరణం కవీశ్వరుడు చెప్పిన పద్యం అని యున్నదిగదా. బొడ్డుచర్ల తిమ్మన భళిరే అని అతడు చెప్పిన పద్యములోనే యున్నప్పుడును అగ్రహారము కూడ తిమ్మన పేర నుండుట చేతను, తిమ్మనవేరు, చిన తిమ్మన వేరునని చెప్పుట ఎంత హాస్యాస్పదమో విజ్ఞు లూహింతురుగాక!

ఇక "ధీరుఁడు బొడ్డుచెర్ల" అను పద్యము నేటి ముద్రిత ప్రసన్న రాఘవమున నుండుట వాస్తవమే. కాని పాఠభేదములు కలవు.

1. "ప్రాకవి లోకనాథుఁడా చార సమగ్ర వర్తనుఁడు సారవచోనిధి యున్నవాఁడొగిన్ సత్కవి లోకనాథుఁడా" ముద్రిత పాఠము.

2. చాటు పద్యమణి మంజరి పాఠము

"సత్కవి లోకనాథుఁడా చార సమగ్ర వర్తనుఁడు చారువచస్థితి నొప్పు వాఁడొగిన్"

3. మెకంజీ సంపుట పాఠము.

"సత్కవి లోకనాథుఁడా చార సమగ్ర వర్తనుడు చార? (చారు) వచోన్నతి నొప్పె వాఁడొగిన్"

ప్రస్తుత ముద్రిత ప్రసన్న రాఘవ ప్రబంధ విలేఖకుఁడా పాఠముల నే తాళ పత్రములనుండి సేకరించెనో మనకు తెలియరాదు ఎట్లున్నను. "ప్రాకవిలోకనాథుఁడు" అను పాఠ మెంతమాత్రము సరికాదు—సత్కవి లోకనాథుఁడు అను మెకంజీ సంపుట పాఠమే సరియైనది.

పై మూఁడు పద్యములు నొక విషయము తెలుపుచుండుట చేతను, బొడ్డుచెర్ల తిమ్మనవంశీయులే వ్రాసి యుంచుకొనుట చేతను, నిచట బొడ్డు తిమ్మన్న, చిన తిమ్మనలు వేర్వేరని నిరూపించుట కెంతమాత్రమును నవకాశవం లేదు. ఇరువురు నభిన్నులని సిద్ధాంతము. కీ. శే. ప్రభాకరశాస్త్రిగారికన్న నిరువదేండ్లు ముందుగా, క్రీ. శ. 1893 లో గురజాడ శ్రీరామమూర్తిగారు తమ కవి జీవితములో కృష్ణరాయని చరిత్రమున నీ తిమ్మన వృత్తాంతము నిట్లు తెలిపియున్నారు (చూ. పుట 521)

> "కామలాపురమునకు రెండు పరువుల దూరమున నాగ్నేయమున కొప్పఁలూరను గ్రామము కృష్ణరాయలతో చదరంగమాడి గెలుచుకున్న తిమ్మన్న యను నాంధ్ర కవీశ్వరునకు బ్రాహ్మణునకు సర్వ మాన్యాగ్రహారముగా కాబట్టి కృష్ణరాయలతో చదరంగమాడి గెలుచుకొని నిచ్చెను".

అగ్రహారము బడసిన చిన తిమ్మయ్యయే, పద్యముననున్న తిమ్మనయని నిరువురు నొకరే యని డెబ్బదేండ్లనుండి వ్యవహారములో నున్నట్లు విశదమగుచున్నదిగదా.

పై చర్చనుబట్టి ప్రసన్న రాఘవ ప్రబంధకర్త బొడ్డుచెర్ల తిమ్మయగాని, చిన తిమ్మయగాడని సిద్ధాంతము.

పరిష్కర్తలు గ్రంథకర్తను గూర్చిన యే వర్తమానములను పరిశీలింపకయే ఇట్టి నిర్ణయ మొనర్చుట పరిశోధనా పద్ధతులకు నత్యంతము విరుద్ధము.

బొడ్డుచెర్ల తిమ్మయ శ్రీ కృష్ణదేవరాయల కాలము వాడగుటచే క్రీ. శ. 1500—1530 ప్రాంతముల నున్నవాడు. అష్ట దిగ్గజముల సమకాలికుఁడై యా వెనుక యచ్యుత దేవరాయల రాజ్య కాలమున, చింతలపూడి యెల్లకవి రాధా మాధవ కవివలె, కావ్య రచన గావించి యుండును. క్రీ. శ. 1550 వఱకు జీవించి యుండుటయు సంభవమే.

శ్రీ కృష్ణరాయ యుగమున పూర్వార్థమున వెలసిన తెలుగు కృతులు—పెద్దన—హరి కథాసారము, సత్యావధూప్రీణనము, నంది తిమ్మన—వాణీ విలాసము, త్రిస్థలీ దండకము, పింగళి సూరన—శ్రీ రంగ మహాత్మ్యము, గిరిజా కల్యాణము మొదలగునవి లభ్యములు కానేలేదు. ఉపలబ్ధములగుచున్న తిమ్మన్న తురంగ లక్షణ విలాసము, నారన సూరన ఉదయనోదయము, వనమాలి విలాసము, రాధా మాధవకవి తారక బ్రహ్మ మాహాత్మ్యము ముద్రితములు కానేలేదు. ఆనాటి కృతులలో నీ వర కపరిచితమైన ఈ ప్రసన్న రాఘవ నాట్య ప్రబంధమును నేకైక తాళ పత్రప్రతినుండి యుద్ధరించి పరిష్కరించిన గ్రంథ సంపాదకులభినందనీయులే. ఇక పరిష్కరణ విధానమును సమీక్షింతము.

గ్రంథ పరిష్కరణము

ప్రాచీన గ్రంథ ముద్రణము, పరిష్కరణము దుష్కరమగు కార్యము. అందును నొకే తాళప్రతి యున్నప్పుడు మరియును జాగరూకత వహింపవలెను. ప్రస్తుత ప్రసన్న రాఘవ గ్రంథ పరిష్కరణము పరిశీలించిన, నా గ్రంథమంతయు తిరిగి సంస్కరించి, ప్రకటితము చేయదగిన యావశ్యకత కన్పించినది.

---

1. పై పద్యములను సవరింపక యథామాతృకముగా వ్రాసితిని.

ఆంధ్ర కవితకు ముఖ్యాతి ముఖ్యములగు యతి, ప్రాస, గణ వివక్ష ఇందులేదు.

(1) యతి భంగములు.

1. ఉ. అనుటయు......చంచల చంచుకోటిజ
ల్లని వెంమించు (మంచు) రవలంజవి చూచు
చకోర దారకున్ (6—7.)

2. చ. మునులకు మీకు ధ్యానమును (హా) నము
దానము (4—88)
మూలమున నక్షరము లోపింపగా పరిష్కర్తల
పూరణ యిది. ము—మౌ—యతి గలదా?

3. ఆ. వె..........మండితం.
బైన జలధియౌల (ని)ం ద్ర చాప. ఇచట యతి
చూచుకొనలేదు. పూరణ (నై) యుండవలెను.
"ఇంద్ర చాపము" ఇంద్ర సంబంధమైనది

(2) ప్రాసభంగము

క. ఈ కళ నాచరింప
గావలసిన కర్మమేది
నీ విచ్చటి
నా విని...... (1—100)

(3) గణ భంగములు

1. మ. తన దోర్దర్పిత...........
..................విరో
చన పుత్రుం దలమెట్ట శీతకరు కన్పట్టన్ మెల
గింపగా (1—69)
2. గీ. జాళువ పసిండి పొడుల వసంతవాత (1—202)
3. ఆ. అనవు డాతని నను ననునూరకె (2—7)
4. క. గినియుడకొ దశల పనుఁడు
జనకజ మోహపు టురుల (2—33)
5. క. రసదాళి చెరుకు రసమున
బిసికిన శీతగుడము లింత బిగిసిన పదనున్ (2—73)
6. క. అనవిని రా
ముని తమ్ముఁడౌదు వనన
ల్లని నదిమాననజ నవ్వలఁ దెలుపు మనినన్ (5—59)
7. క. ఇవుడలమె........వే
శవయోనిధి వాలి రాజ్యము (5—153)
8. గీ. రత్నశేఖర నీ కళొంచనవు చూపు (6—26)
9. క. చేసె తన దీవన నుచి
తాననములు (3—57)

అర్థానుస్వారములు: శకటరేఫము

తెలుగు భాషకు ముఖ్య లక్షణము లర్థాను స్వార శకట రేఫములు. ప్రాచీనాంధ్ర గ్రంథ పరిష్కరణమున నివి యత్యావశ్యకముగా పాటింపదగినవి. కాని ఇందది విస్మృతమైనది.

ప్రథమావిభక్తి 'డు'—నరసింగయ నారడు (1—21)
వీరుం డున్నాడె (1—221) దివలేడె, దివలేడే
పూతవాడు (2—1) వింటొ గాడో (2—6) బోవు
వాడ (—2—23)
నీ వెవ్వడవు (2—23) సేయువాడ (7—29)
క్రియా రూపములు—మర్యాదం జెందుడు (1—305)
దివ్వుడు (7—22), ఘటించుడు (7—22)

అర్థాను స్వారములుగల మూడు, సోకు, మొదలగు శబ్దములలో నర నున్నలుంచలేదు. అర్థానుస్వారములేని చీకటి, తీగ, చొక్కపు మొదలగు వానిలో నుంచినారు. దీనినిబట్టి యర్ధానుస్వార పరిజ్ఞానము పరిష్కర్తలకు పూర్ణానుస్వార మని వ్యక్తమగుచున్నది.

శకట రేఫము—అరసున్న వలెనే ఇది దేశి పదముల వ్యుత్పత్తికి ప్రధానాధారము—సాధారణ విద్యార్థులకు గూడ తెలిసిన ఎఱుగు, మెఱుగు, తఱుగు, కొఱత మొదలగునవి గ్రంథమం దంతటను సాధురేఫములుగా ముద్రితములైనవి. కొన్ని శకట రేఫ శబ్దములకు రూపాంతరములున్నవిగాని—ఎఱుగు, మెఱుగు అను నిట్టి శబ్దముల కట్టి రూపాంతరములే మృగ్యములు గదా.

కొరత (1—227) కొఱత—యనుటకు
గురిచి (2—27) గుఱి—ఇది విభక్తి ప్రత్యయము
వీరడి (1—107) దీని యర్థమేమో.
'వీఱిఁడి యనవలెను.
వీఱిఁడియైన మానిసికి వెండి వివేకము గల్గ నేర్చునే
భార. ఉద్యో. 3—107.

"అక్కర కంఠ శిష్యుఁడై" (4—69) కరకంఠుఁడను పదము 'కఱకంఠ' అని బాలవ్యాకరణము చదివిన వారి కందరకు తెలియును. ఇందు సాధురేఫము.

ఇట్లే, చూపుచు బోయిన గ్రంథ విస్తరమగును.

ప ద ము లు

ప్రరోచనలో 19, 20, 21 పుటలలో నీ గ్రంథమునందలి 41 పదముల నిచ్చి, ఇవి శబ్దరత్నాకరమున గానరాలేదనియు తాము వానిని గుర్తించితిమని పరిష్కర్తలు వ్రాసియున్నారు. కాని పదస్వరూపమే సరిగా గుర్తింపని వారీ పదములను సరిగా నిచ్చిరా యను సందేహము. మరియొక విశేషము. వారు శబ్దరత్నాకరమునే చూచిరి—కాని సూర్యరాయాంధ్ర నిఘంటువను నిఘంటువును వారెన్నడును చూచియుండలేదేమో! ఆ వానికిఁ బ్రయోగములు చూపుట నాపనిగాదు. మచ్చున కొక్క పదము మాత్రము చూపుదును.

ఉజ్జని—ఈ రూపము కవి వాడినందులకు ప్రరోచన కారులు పెద్ద వ్యాఖ్యానము గావించిరి. (పుట 25) కాని దీనికి కవిప్రయోగము లున్నవని గ్రహింపలేదు.

ఉజ్జయిని శబ్దమునకు 'ఉజ్జేని' 'ఉజ్జని' అను యతి ప్రాస నిర్ధారక ప్రయోగము లివిగో.

ఉజ్జేని—

ఉ. ఉజ్జేనికిజేరఁ బోవుటయుఁ జెప్పి. దశ. 3. 59.

ఇది యాంధ్ర భాషాభూషణకర్త కేతన ప్రయోగము.

ఉజ్జని—

1. గీ......వీఁడేలు నుజ్జని వీటియందు-నైష. 5.83.

ఇది శ్రీనాథునిది.

2. మ ......తానేఁగెను, జ్జనికిన్ సమ్మతి పాడుకంబు వలనన్ సంతోషిత స్వాంతుడై—విక్ర. 2—48.

ఇది జక్కనది.

అనన్వయములు.

1. గీ. అందు బల్లాంబికకు రామయ క్కి తీశ్వ
రాదు లుదయించి వెలసిరి యబ్బలాంబ
గనియె నయశాలి సింగరయ్యను మనూప
సూను నౌబళ వసుమతీ జాని వరుఁడు. (12)

అబ్బలాంబ గనియె—వసుమతీ జాని 'మరుఁడు' అన యన్వయ మెట్లు? వసుమతీ జాని వరుని— అని ద్వితీయగా నుండవలెను.

2. మహిత శుభ వృత్తి సూక్తి సంపదలు గల్గ
పరుని కృతినైన సతినైనఁ ద్రాలుమారి
యపహరించిన దలఁపొకడంబురాశి
సొచ్చియైనను గాంచునే సుఖ మొకింత. (1—120)

వ్రాత ప్రతిలో 'తలపోక' యని క్రింద నిచ్చియు నన్వ యరహితమగు పై పాఠము మూలముగ నీయబడినది. 'అపహ రించిన తలపోక యంబురాశి' అనునది సరియైనది.

3. క. రావించి యెటులనైనన్
మేవించెదఁ జె(లి)సి కాన మేరు సునాభి(?) 1-309)

'మేరుసునాభీ' అని ముద్రించి ప్రశ్నార్థక చిహ్నమున్నది. ఏల? పదవిభజనము తెలియమి.

"మేవించెద జెలిమికా నమేరు సునాభీ"

నమేరు వనఁగా సురపొన్న—పొక్కిలిని పొన్న పూవుతోఁ బోల్చుట కవి సమయము.

4. కను కాంతి మెరుఁగు తెరఁగై (1—229)

ఇచట కనుకాంతికాదు. తనుకాంతి—రెండవ పాదములోనే కను చూపుల పసలు నల్ల కలువల చెలువై అని కలదు.

5. ఉ. ఓజమదగ్ని రాముకడనున్న కుఠారమ నీవు మాకు నే యోజల (3—139)

ముద్రణ సమయమున, పదవిభజనమేగాక, సంబోధ నాది చిహ్నముల పాటించుట పరిష్కర్తల పధాన కర్తవ్యము. కాని ఈ గ్రంథమం దెచ్చట నట్టి నియమమే మృగ్యము.

పై పద్య పాద మిట్లుండవలెను.

ఓ జమదగ్నిరాముకడ నున్న కుఠారమ!

ఇచట జమదగ్ని రాముఁడు పరశురాముఁడు—కాని యాతని వద్దనున్న కుఠారమునకే సంబోధన.

ఇది ప్రౌఢ వ్యాకరణమునందలి "ఓ తోయజనేత్రు గాంచిన వధూమణి"

అను సూత్ర లక్ష్యమునకు జక్కని మరియొక యుదాహరణము.

గీ. అతడు "వినిపాదశంకియై" చతుర మధుర(1—226)

ఆతడు "వినిపాత శంకియై" యని యుండవలెను.

సుప్రత్యానుండు(3—169). "సుప్రత్యాశుండు" అని యుండదగును.

మూల గ్రంథకర్తయగు జయదేవకవి కాలమునుగూర్చి ప్రరోచన(పుట 10—11)లో నిట్లు గలదు.

"ఈ జయదేవుని కాలమునుగూర్చి పెక్కు వివాద ములు కలవు. 13 వ శతాబ్దమునుండి పదునారవ శతాబ్దము మధ్యభాగమువరకు నీతని కాలమూగులాడుచున్నది". జయదేవుడు క్రీ. శ. 1500—1577 నడుమ నుండినట్లు సిద్ధాంతము చేసినారు. వారి సిద్ధాంతము మన ప్రసన్న రాఘవ నాట్య ప్రబంధము వెలువడుటతో పరాస్తమగుచున్నది".

ప్రరోచనకర్త లాంధ్ర సాహిత్యమును బాగుగ పరిశీ లించినచో నిట్టి వ్రాత వ్రాసియుండరు. చూడుడు.

భాస్కర రామాయణమున నరణ్య కాండమున నీ క్రింది పద్యము గలదు. రావణుఁడు సీత నెత్తి కొనిపోయిన వెనుక రాముడు విచారించు ఘట్టము.

చ. తపనుఁడు వేఁడెఁబొ చ్చెననుఁ తమ్ముఁడ! వృక్షముక్రిందఁ బెట్టు నా
తపనుఁడు రేయివేఁడు వసుధావర! చంద్రుఁడుగాని చంద్రునిన్
నృపసుత! యెట్లెఱింగితివి? నీవు మృగాంకము చూడ నున్కిహో
చపల మృగాక్షి చంద్రముఖి జానకి యెచ్చట నున్నదానవే?
ద్వితీయాశ్వాసము 2—263.

పై పద్యము సంస్కృత ప్రసన్న రాఘవములోని ఈ క్రింది శ్లోకమునకు తెనుఁగు.

శ్లో. సౌమిత్రే నను సేవ్యతాం తరుతలం చండాంశురుజ్జృంభతే
చండాం శోర్నిశికా కథా రఘుపతే చంద్రోఽయ మున్మీలతి
వత్సైతద్విదితం కథం ను భవతా ధత్తే కురంగం యతః
క్వాసి ప్రేయసి హా కురంగనయనే చంద్రాననే జానకి.
షష్ఠాంకము మొదటి శ్లోకము.

వాల్మీకి మూలమున నీ పట్టున నిట్టి భావములుగల శ్లోకములేలేవు. మరియు నిది సంభాషణ రూపమున నున్నది. కావున నారణ్యకాండ కర్తయగు భాస్కరుడు దీనిని ప్రసన్న రాఘవ నాటకమునుండియే గ్రహించె ననుట నిర్వివాదాంశము. తెలుఁగున కూడ పద్యము సంభాషణ రూపమున నుండుటయు పై విషయమునకుఁ బ్రోద్బలకమగు చున్నది.

భాస్కర రామాయణ కర్తృత్వము వివాదముగ నున్నను, నారణ్య కాండ రచన క్రీ. శ. 1300 ప్రాంతములకు ముందేయనుటలో విప్రతిపత్తి లేదు. కాబట్టి జయదేవకవి క్రీ. శ. 1300 ప్రాంతములకు ముందు వాడేగాని యా వెనుక వాడెంత మాత్రమును కాజాలడు. సంస్కృత కవుల కాల నిర్ణయమునకు తెలుగు గ్రంథము లెట్లు తోడ్పడునో చూపుట కిది యొక యుదాహరణము.

ప్రస్తుతము ముద్రిత గ్రంథమున పై శ్లోక మిట్లనువ దింపబడినది.

శా. మించెం జండ మరీచి మింట పద సౌమిత్రీ తరుచ్ఛా
యకున్
మంచుం జాయల వేల్పుగాఁ డితఁడు రామా! రాత్రి ప్రొద్దుం
డునే
చుంచుం (బాపఁ) డదెట్లొయింగితివిలోఁ జూడన్ మృగం
బున్కిహో
చంచద్బాల మృగాక్షి యెందరిగితే చంద్రాననా జానకీ.
షష్ఠాంకము 1 పుట 159.

చుంచుం (బాప) డదెట్లు—ఇచట "బాపఁ" డనునది సంపాదకు లట్లు పూరించినట్లున్నది. "బావడు" కన్న చుంచుం (దమ్మ)డ దెట్లు అని పూరించుట సరసము.

కొరవి గోపరాజు(క్రీ. శ. 1430)తన సింహాసన ద్వాత్రింశికలో నొకచోట ప్రసన్న రాఘవ శ్లోకము ననుసరించి యున్నాడు.

క. తిమిర సముదాయమునన
ర్థము నలుపై పూర్ణతుహినధామ ద్యుతిన
ర్థము తెలుపై యాకాశము
యమునా గంగాంబు సంగమాకృతి దాల్చెన్".
(4—110)

ఇది ద్వితీయాంకమునగల సంధ్యా రాగ వర్ణన శ్లోకము.

శ్లో. అర్ధ శ్యామోపలా ర్ధస్ఫటికమణి వివామంతరాళం
విధత్తే
కాళిందీ జహ్ను కన్యాజల మిళ దల స్యంద సందోహ
మైత్రీన్.

పై శ్లోకము చివర పాదమునకు తెలుగు పద్యమును కృతి.

అల్లసాని పెద్దనామాత్యుఁడును ప్రసన్న రాఘవ నాటకము నెరుఁగు ననుటకు నీ క్రింది యుదహరణము సాధకము.

ప్రసన్న రాఘవ నాటకము సప్తమాంకమున నీ శ్లోక మున్నది.

శ్లో. సమున్నత ఘనస్తనస్తబక చుంబి తుంబీ ఫల
క్వణన్మధుర వీణయా విబుధ లోక లోల భ్రువా
త్వదీయ ముపగీయతే హర కిరీట కోటి స్ఫుర
త్తుషార కరకన్యకీ కిరణ పూర గౌరం యశః. 69 శ్లో.

పై శ్లోకమున ప్రథమ పాదమును నీ క్రింది పద్యమున పెద్దన యనుసరించినాడు.

పెద్దన "సరస్వతిని" వీణ వాయించు నలువరాణిగా వర్ణించునపుడు—

"ఘనమైన రారాపు చనుదోయిరాయిడి
తుంబీ ఫలంబు దుందుడుకుఁజెంద. (1—5).

అని పై శ్లోక ప్రథమ పాదము నాంధ్రీకరించినాడు.

రెండును వీణ వాయించు ఘట్టమున నుండుట విశేషము.

ప్రస్తుత గ్రంథకర్త తిమ్మయకవి ని ట్లాంధ్రీకరించినాడు.

క. అలఘు కుచ చుంబి తుంబీ
ఫల విలసద్వీణపైఁ గపర్ది శిరముపై
నెలమంచు మించు నీకీ
ర్తులు దివి జాంగనలు పాడుదురు సతతంబునన్. (7-181)

జయదేవకవి స్తుతి తెలుఁగు కవులలో పదునాల్గవ శతాబ్ది నుండి కానవచ్చుచున్నది.

తిమ్మయ్య - నన్నెచోడ మహాకవి

ప్రసన్న రాఘవ గ్రంథకర్త నన్నెచోడ మహాకవి కుమార సంభవము నెఱింగినట్లుగా నీ క్రింది యుదాహృతులనుబట్టి యూహింపనగును. తిమ్మయ

1 క. రసదాళి చెరుకు రసమునఁ
బిసికిన శీతగుడము వింత బిగిసిన పదనున్
బసయును రా మధు సుధవిడి
బిసరుహ భవుఁడింతి కధర బింబము చేసెన్. (2—73)

నన్నెచోడకవి.

క. మానితమగు గుడ రసమున
నూనిన తుండీర ఫలమొ యొగితేనె తెలెన్
నాని మృదువైన పవడమొ
నానద్రిజ తోపుమో వినయమై యొప్పున్. (3–62)

రెండును యౌవన వర్ణనలే. ఒకటి సీత వర్ణన—ఒకటి గౌరి వర్ణన—రెండును కందములే—రెండును నధర వర్ణనలే. జయదేవకవి రచిత మూలములో ప్రత్యేకముగా నధర బింబవర్ణన లేదు. కావున తిమ్మయ దీనిని కుమార సంభవమునుండి గ్రహించి యున్నాడు.

పదములు.

పదువ—సమూహము.

చిలుక పదువలచేతన్ (2—2) తిమ్మయ్య
రాయంచ పదువ లిలియ (6—30) కుమార
తంతుర్పముల్. సంభవము.

పల్లవ కరోద్గీర్ణంబు తంతుర్పముల్ (6—48) తిమ్మయ్య పదముల పట్టికలో నీ పదములేదు. పరిష్కర్తల దృష్టి డలేదు కాబోలు.

నన్నెచోడుఁడు దీనిని ప్రయోగించి యున్నాడు.

సీ. ఎలమిలేఁ దరగలనెలయు తంతుర్పని
సదమల మౌక్తి కాక్షతలుగాగ. (9—92).

'తంతుర్పని' అనునది కన్నడ పదము—చల్లని నీటి బిందువులని యర్థము. 'తంతుర్పము' అని తిమ్మయ్య ఇట్టి మూలు మూల పదము—తెలుగు కవులు వాడనిది—వాడుటచే యాతడు నన్నెచోడ మహాకృతి నెరుగునని చెప్పవలసి యున్నది.

ఇంకను శ్రీనాథుని యనుసరించిన పట్టులు, పద, అర్థ విశేషములు—వ్యాకరణ సంప్రదాయములు—స్థానిక చిహ్నములు—(నిట్టాలకొండ—చాపరాళ్ళ) మొదలగు వానిని గూర్చి చెప్పవలసిన వెన్నియో మిగిలిపోయినవి. ఇప్పటికే ఇది పరిమితి మీరినది.

కేంద్ర ప్రభుత్వమువారు ద్విసహస్రరూప్యములీ గ్రంథ ముద్రణ కొసగినట్టు లాంగ్ల భూమికలో గలదు. ఆర్థిక సహాయమున్నను, గ్రంథ పరిష్కరణ విధాన సామర్థ్యము లోపించుటచే, నిదివర కాంధ్ర లోక మెరుగని ఈ కృతి ప్రశస్తి యెంత మాత్రము వ్యక్తము కాలేదని భావింపవలసియున్నది. సుసంస్కృతమైన ముద్రణ మీ గ్రంథమున కత్యావశ్యకమని వాఙ్మయ సాహితీ విమర్శకులకు వేరుగా విన్నవింప నగత్యములేదు.

గ్రంథ విమర్శనము

పోతన

(కర్త : పోలూరి యాంజనేయప్రసాద్, ప్రాప్తి స్థానము : పోతన గ్రంథమాల, కొల్లూరు. మూల్యము : రూ. 1—50.)

"పోతన" కవిస్వాతంత్ర్య భావనా ప్రధానమయిన కావ్యము. ఇందలి యితివృత్తము భాగవతాంధ్రీకరణమునకు సంబంధించినది. భక్తకవి శిఖామణియగు పోతన జీవితములో ముఖ్యఘట్టములు రెండుకలవు. అందొకటి భాగవతాంధ్రీకరణము. రెండవది రాచకొండ యేలికయగు ముమ్మడి సింగభూపాలుఁడు (క్రీ. శ. 1430—1475) భాగవతోత్పాదనమునకై కచ్చుపూనుట. భాగవతమందుఁ బండ్రెండు స్కంధములు గలవు. అందుఁ బంచమస్కంధమందలి ప్రథమద్వితీయాశ్వాసములు రచించినవాఁడు గంగన. షష్ఠశ్వాస కర్త యేర్చూరిసింగన. ఏకాదశద్వాదశస్కంధములు నిర్మించినవాఁడు వెలిగందల నారయ. శేషగ్రంథమును పోతనరచించెను. ఇన్ని చేతులమీఁదుగా నీ గ్రంథమేల రూపొందినది ? యనున దొక ప్రశ్న. ఈ ప్రశ్నకు సమాధానము చెప్పుటయందే రాజాచల దుర్గాధిపతియగు ముమ్మడి సింగభూపాలునకు, భాగవతాంధ్రీకరణోదంతమునకు ముడిపడినది. సర్వజ్ఞుఁ డయిన సింగభూపాలుఁడు భాగవతమును దనకంకితముగాఁ జేయఁ బోతనగారిని గోరెననియు, దానికి నా భాగవతోత్తముఁడు నిరాకరించెననియు, దానిమీఁద నా పద్మనాయక ప్రభువు కినుకపూని భాగవతమును గ్రొచ్చి పాతిపెట్టెననియు, నా భగవద్భక్తుల చరిత్రఖిలమై చనఁగా నితరులా యుత్సన్న భాగములు పూరించిరనియు నొక కింవదంతి యీ తెలుఁగుగడ్డలో బహు ప్రచలిత మయినది. ఇది చరిత్ర చెప్పని, బలవత్సాక్ష్యములేని కట్టుకత. "భాగవతమును రచించుచుండగనే పోతనామాత్యుడు లోకాంతరగతుడై యుండునని నాయూహ. ఏకాదశ ద్వాదశ స్కంధములు నాయన రచింపనే లేదనియు, అందువలననే భాగవత సంపూర్ణార్థము పోతనామాత్య ప్రియశిష్యుడైన వెలిగందల నారయ, తన గురువుగారిమీదగల భక్తి గౌరవములవలన వానిని రచించి యుండు ననియు ననుకొనుచున్నాను. మిగిలిన యాంధ్ర మహాభాగవతమును పోతనామాత్యుడే రచించియుండవలయును. దీనిలో పంచమ షష్ఠ స్కంధములు ఉత్సన్నములగుటకు ప్రాయకముగా ఆనాటి రాజకీయ పరిస్థితులే కారణమై యుండ వచ్చునని నే నూహించుచున్నా"నని క్రీ. శే. మల్లంపల్లి సోమశేఖర శర్మగారితీర్పు. ఈ గ్రంథరచనములో ననేక విధములుగా స్వాతంత్ర్యము వహించిన పోలూరి యాంజనేయ ప్రసాదుగారు చారిత్రక సాక్ష్యములేని కథతో నీ లఘుకావ్యమల్లిరి. చారిత్రక సాక్ష్యము లేనికథలో కావ్యము వ్రాయఁగాదని నేను శాసించుట లేదు. ఇట్టిచేత దోషమని నా యభిప్రాయమునుగాదు. ఇతివృత్తము పరామర్శించుటలో నిట్లు వ్రాయవలసివచ్చెను.

"మారినదృష్టితో ప్రగతిమార్గమునన్ పయనింప రారహో!" యని యెలుఁగెత్తి చాటు నీ గ్రంథకర్త యీ కావ్యము రచించుటలో వింతలేదు. ఇది నవయుగము రాజన్యంతము గానిది. ప్రజాస్వామ్య వ్యవస్థను వలచునట్టిది. రాచఱికపుఁ బొత్తు లేవగింపు కల్గించు గడియలివి. అట్టియీ యుగజీవియగు పోలూరివారు పుష్కలముగా నున్న సమదృష్టి, అచంచలమగు సమచిత్తము గలవారు. అట్టివారీనాఁడరిదిగా నున్నారు. రాచఱికముపట్ల రోయింపుగల వీరికిఁ గలకండ ఖండమువలె లభించినది పోతనకు సంబంధించిన కట్టుకత. ఆ కథలో సామాన్య పౌరుఁడగు నొక మహాకవి చక్రవర్తి నెదిర్చి నిలిచినాఁడు. స్వేచ్ఛను ప్రకటించినాఁడు. ఈ తత్త్వమే యాంజనేయ ప్రసాదుగారి నతి మాత్రముగా నాకర్షించినట్లున్నది. అదియునుగాక పోతనపట్ల నీ నవీన కవికిఁ బ్రగాఢాభిమానమున్నదని యీ కావ్యమునందలి ప్రత్యక్షరము ప్రత్యక్షసాక్ష్యముగానున్నది. ఆ యాకర్షణ, మీ యభిమానము నీ కావ్యనిర్మాణమునకు మూల ద్రవ్యములు. పోతన, సింగభూపాలుఁడు, పోలూరి యాంజనేయ ప్రసాదుగారు సమకాలీనులయినచో నెట్లుండెడిదో ! ప్రసాదుగారు పోతనపక్షము వహించి, ఫ్రెంచి సార్వభౌముని బదునారవ లూయీని నా దేశస్థులు శిక్షించినట్లుగా శిక్షించెడివారని నా యనుమానము. ఈ యనుమానము బలపడునంతగా నున్నవి యీ కవిగారు పలికిన పలుకులు, పోతన నోటఁ బలికించిన మాటలు. "ఉత్తిష్ఠ" యందలి పద్యద్వయ మీ కవియందలి నూతన చైతన్యమును వెల్లడించుచున్నది.

"పోతన" కావ్యములో ప్రతిజ్ఞ, కైవారము, ప్రతీక్ష, స్వప్నము, నిరాకృతి, ప్రతీకారము నను ఖండములు గలవు. ప్రతిజ్ఞ యందలి పద్యములు మూఁడు. "ఇది వెలిగింతు నా హృదయ మెత్తిన దీపిక", "ఇది వినిపింతు", "కళామయ మూర్తుల ధర్మఘోషమున్", "ఇది ఝుళిపింతు నా కరమదెత్తిన ఖడ్గము", "తన్మహాకృతుల్ మొదలుగ పూడ్చిపెట్టు నరపుంగవ మస్తము లెల్ల ద్రెళ్లగన్"—అని చాటిరీ కవిగారు. పుంగవ శబ్దము శ్రేష్ఠతా వాచకమయిన నిట్టి యభిధార్థము చెప్పుకొనవలయు ననుకొనుచున్నాఁడ. లేక వ్యాజస్తుతి యగునేమో ? "కైవారము" లో "వేగుజుక్క", "దవార్చి ప్రళయోగ్రకీల", "దివ్య మందాకిని", "శైవశుక్క" "ప్రభంజనము", "విచ్ఛేదిత దాస్య శృంఖలమునౌ హస్తమ్ము"

మున్నగువాని గుణములు పోతనలోఁ బోతన కావ్యములో దర్శించినవారీ కవిగారు. "ప్రతీక్ష" విచిత్ర రమణీయ భావ మయమయినట్టిది. పోతనకై కవి ప్రతీక్ష సేయును. భాగవత కథా దృశ్యములు పోతన కనులముందు జరుగుచుండును. ఆ సన్నివేశములందుఁ బోతన గూడ నొక పాత్ర. పోతన పాత్రతో ననుగమించువాఁడీ కవి. ఇది యంతయు నొక రమణీయోహ. ఇట్టి యూహతో జంధ్యాల పాపయ్యశాస్త్రిగారి వంటి కవులు "సతీ సావిత్రి" మున్నగు నొక కొన్ని కావ్య ఖండములు చేసినారు. శ్రీరామచంద్రుఁడు కలయందుఁ గన్పించి భాగవతానువాదార్థము పోతనను ప్రబోధించుట "స్వప్నము." శ్రీనాథుడు భాగవతమును సింగ భూపాలున కర్పింపుమని పోతనను గోరును. పోతన నిరాకరించును. నిరాకరించుటయే కాక చక్రవర్తుల సామ్రాజ్య కాంక్షను, నిరంకుశ ప్రవృత్తిని దెగనాడును. ఇది "నిరాకృతి". సింగభూపాలుఁడు పగవూని, సేనను బంపి, బలాత్కారముగా భాగవతము తెప్పించి "దీని నొకచోట లోతుగ పూడ్చి రం" డని రాజదూతల కాజ్ఞాపించును. ఇది "ప్రతీకార" మను ఖండము. ఈ ఖండాంతము నందీ కావ్యకర్త యనుభవించిన యావేదనము ప్రపంచింపఁ బడినది.

కావ్యకారణములు మూఁడు. అవి ప్రతిభ, వ్యుత్పత్తి, యభ్యాసమును. ఈ లఘు కావ్యము నిర్మింపఁగా నెట్టి ప్రతిభా వ్యుత్పత్త్యభ్యాసములు వలయునో వానిని గలవారు పోలూరి వారని పాఠకులకు గోచరమగును. అంతేకాదు. ప్రతిభాంగ మగు కవితావేశము కొన్ని చోటులలో నితరాంగముల, నితర హేతువులలోఁ గొన్నదనియు దేటతెల్లమగును. పోలూరివారిలో భావుకత యెక్కువ. ఊహ వైచిత్రి కలదు. కవితాశక్తి యున్నతము. కుంటువడని శయ్య ప్రసాదుగారి సొత్తు. ప్రతిజ్ఞ, కైవారము, ప్రతీకార ఖండాంతము—వీనిలోఁ బద్యము లొకే పదముతో మొదలగును. "ఇది వెలిగింతు, ఇది వినిపింతు, ఇది ఝుళిపింతు" నను వానితోఁ బ్రతిజ్ఞ యందలి పద్యములు ప్రారంభమగును. "అదె" యను పదముతోఁ గైవార పద్యములు, "ఇక" యను పదముతోఁ బ్రతీకార ఖండాంత పద్యములు మొదలగును. ఈ రీతిగా రచించుట నవీన కవుల లక్షణము. జాషువా మున్నగు నవ కవుల వలన సీసాది పద్యరచన మీనాఁడెన్నో సొగసులు పోవుచున్నది. ఆ సొగసులను, బద్యపు బెత్తుగడ, పద సంయోజనము, సమత మున్నగువానిని వెలయించిరి ప్రసాదుగారు. చక్కని తలఁపులను జిక్కని బాసలో వెల్లడించు దిట్టతనము గలవాఁడీ కవి.

"కంచెగుమ్మడిపువ్వు పొంచి నవ్వినదేమొ" (పుట. 12) యను పద్యములో లౌకిక ప్రకృతి దృశ్యములందుఁ బోతన యలౌకిక భగవల్లీలలను సాక్షాత్కరింపఁ జేసికొనినట్లు వర్ణింపఁ బడినది. ఇది యొక రమణీయమయిన యూహ. "తొలుతగా తెలుగు కైతల పాలు పిండించి, పలవించు చంటిబిడ్డలకుఁ బోసి" (పుట. 15) యను సీసపద్యము ప్రసాదుగారి యూహా వైచిత్రికిఁ దార్కాణము. "ఆగిపోదును కొంత సాగిపోదును చక్రవాకినై వెన్నెల బయలు కొరకు" (పుట. 31) యను పద్యము మనోహర రచనా కళతోఁ గూడినట్టిది.

"అంకితమిత్తు భాగవత మభ్యుదయాంధ్ర వినోదికిన్, నిరా
తంక భుజ ప్రతాప సమధర్మహిత ప్రతిపాదికిన్, నిరా
శాంకిత లోక దుఃఖ పరిహార విధాన నివేదికిన్, ధను
ష్టంకృతి ముక్తరావ ప్రకటస్ఫుట శాత్రవ కర్ణభేదికిన్.',
(పుట. 24)

అని పోతన శ్రీనాథునితో వచించును. ప్రకరణోచితమయిన పద్య మిది. పోతన కవన మచ్చు గ్రుద్దినట్లున్నది. శబ్దాలంకార ప్రియుఁడగు పోతన యిట్లు వచించుట చమత్కారావహము. కావ్యగత శిల్ప రహస్య మెరిఁగి చేసిన రచన యిది. కాని "అభ్యుదయాంధ్ర" యని యనుటకు మారు "ఆంధ్రాభ్యుదయ" యని యనుట యుచితము. ఏలయన "అభ్యుదయము" విశేష్యముగాని విశేషణము గాదు." తుది యీ కంఠమె పాంచజన్యమయి ఉద్ఘోషించు కర్తవ్యమున్" (పుట. 48) అని పోతన చెప్పును. కంఠమును శంఖముతోఁ బోల్చుట కవి సమయము. ఆ శంఖము సాధారణ శంఖము గాదు. అది పాంచజన్యము. పాంచజన్య మనునది ధర్మరక్షణము, అధర్మ నాశనము పొనర్చు విష్ణుమూర్తిది. ఆ విష్ణుమూర్తి భక్తుల చరిత్రయే భాగవతము. ఆ భాగవతమును గానము చేసిన కంఠము పోతనది. ఈయొక్క పాదమునందీ సర్వ రమణీయ భావముల నిమిడ్చినవారు ప్రసాదుగారు. ఇట్టివి యనేకము లున్నవి. "అద్వైతామల పుష్పగుచ్ఛ భరమై" (పుట. 8) యను పద్యము "లలితస్కంధము కృష్ణమూల" మను భాగవత పద్య సౌందర్యము పుణికి పుచ్చుకొన్నది. సింగభూపాలుని సేనా నిర్గమన వర్ణనము కేవలము మాత్రాచ్ఛందస్సులో బిగింపఁ బడినది.

పోలూరి యాంజనేయ ప్రసాదుగారియం దావేశ మధికము. భావావేశము మితి మీరినది. భావములు నిరాటంకముగా దొరలినవి. ఆవేశబాహుళ్యమువలన నొక కొన్నిచోట్లనీ భావము లస్థాన పతితములయినవి. ఇట్లనుటకుఁ బోతన పాత్రపోషణమే నిదర్శనము. భాగవతము పఠించినవారికిఁ బోతన సత్త్వమయ మూర్తిగా, మహా భక్తుఁడుగా, నాత్మ ప్రశంసా విముఖుఁడుగాఁ గన్పట్టును. కాని యాంజనేయ ప్రసాదుగారి కావ్యమందలి పోతన మనకిట్లు కన్పడడు. భాగవత రచనమును గూర్చి పోతన చెప్పుట (పుటలు. 28, 29, 30, 31, 32), శ్రీనాథుడు కోరిననాఁడు సింగభూపాలునకు

భాగవత మంకితము సేయుమని నిరాకరించి రాజ చిత్తవృత్తిని నవీనముగా నిరూపించుచు సంభాషించుట యంత యుచితములుగా లేవు. ఇట పోతన ప్రజానాయకుఁడుగా రాజుల సామ్రాజ్య విస్తరణ కాంక్షను ఖండించును. "కానగరాదు జన ప్రసక్తి, ఈ నిజ మొక భూమిపాలుని మనీషకు తోచదు" "గతించినట్టి పాలితుల సమాధులం దిడగలే దెపుడైనను బాష్ప దీపికల్" మున్నగు భావములు పోతన నోటఁ బలికించుట సమంజసముగా లేదు. అట్లే ప్రతీకార ఖండాంతమందు "రాజుల దుశ్చరిత్రముల్ విపులముగా స్వనిశ్చయము వెల్లడి చేయుచు", "సత్కవి వతంసుడు" పోతన సలుకుట (పుటలు. 46, 47, 48) యాయన శక్తికి మించిన పని. ఈ కావ్యమునందలి పోతన యుద్ధ విముఖుఁడు. సామాన్య ప్రజాదైన్య సంతప్తచిత్తుఁడు. ఇట్లు పోతన రూపాంతరావతార మెత్తుటకుఁ గారణమేమి ? దానికి సమాధాన మాంజనేయ ప్రసాదుగారి వ్యక్తిత్వమే. వారి వ్యక్తిత్వము నుండియే యీ కావ్యగత పోతన యావిర్భవించినాఁడు. అనఁగా నీ కావ్యమునందుఁ బోతన నవయుగ పరిణామమును సంభావించు ప్రసాదుగారి భావములు ప్రపంచించు పాత్ర యయినాఁడు. సహజసిద్ధమగు తన వ్యక్తిత్వమును త్యజించినాఁడు. "ప్రజలే నీవు, నీవె యీ ప్రజలుగా భావించి నిర్మించికొన్న జగత్కావ్యము సుమ్మ నీ రచన" యని శ్రీనాథుఁడు పోతనతోఁ బల్కెను. కాని కావ్యగత విషయమునుబట్టి చూచిన నీ పోకడలు రుచికరములు గావు. నవకవి నిర్మించు ప్రాచీన కథా కావ్యమునం దొక కొంత నవీన ముద్ర యుండుట తథ్యము. కాని యా ముద్రయే ప్రధానము గారాదు. పోతన వ్యక్తిత్వమునకు భంగము కల్గింపని రీతిగా నవయుగ సందేశము భంగ్యంతరముగా గౌణముగాఁ జెప్పుట వేరు. పోతన తత్త్వము మరుగుపడి పోవునంతగా నతని నోట నవీన భావములు వాచ్యముగాఁ బ్రధానముగాఁ జెప్పించుట వేరు. ఈ ద్వితీయ పద్ధతి యితివృత్తమునుబట్టి యుదాత్తముగాదు. కాని నవీన కవు లీ పద్ధతినే బహుళముగా సమాదరించుచున్నారు. అట్లయినఁగాని ప్రజా కవిత్వము, నవ్యాంధ్ర కవిత్వము గాదా ?

జాషువా రచించిన "పిరదౌసి" కావ్య రచనమునకు నాంజనేయ ప్రసాదుగారి "పోతన" కావ్యమునకుఁ దత్త్వమునందుఁ బద్య రచనా కళయందు నొక కొన్ని పోలికలు కలవు. పిరదౌసి షానామా రచనా పతనములను, పోతన భాగవత రచనా పతనములు బోలును. కాని జాషువా ప్రసాదుగారల రచనా వ్యవసాయము భిన్నమను విషయము మనము విస్మరింపరాదు. ఇందలి కొన్ని పద్యములు దేహాంతర తుల్య సంవాదములై యితర నవీన కవికృత పద్యములను జ్ఞప్తి కెలయించును. "చెడుగుడులాడు మా బుడుతల కూతలో, కనుగొంటివో నుడికార సరణి" (పుట. 10) యను పద్యము విశ్వనాథవారి "వేగి రాజ్యపుఁ బల్లె వీథుల చెడుగుళ్ల రిపుల కవ్వించు నేరుపులు తెలిసి" యను "ఆంధ్ర ప్రశస్తి" పద్యమును బోలును. •"కలియుగమందు .... యెటు బోయిరో జాడలు లేవు వేటికిన్" (పుట. 47) అని యనుట రామిరెడ్డి "పానశాల" చ్ఛాయ. "ముదురు తమస్సులో మునిగిపోయిన" (పుట. 4) యను పాదము జాషువా "శ్మశాన వాటిక" యందలి "ముదురు తమస్సులో మునిగిపోయిన కొత్త సమాధిమీద" యను పద్య పాదమున కాలేఖ్యాకార సంవాదము. "నీచపు దాస్యవృత్తి మననేర్చి" (పుట. 46) యను పాదము వేదుల సత్యనారాయణ శాస్త్రిగారి "కాంక్ష" యందలి "నీచపు దాస్యవృత్తి మననేరని" యను పద్య పాదమును గూడఁ బోలుట యిట్టిదే.

వ్యాకరణ చ్ఛందో విషయములలో నతి స్వాతంత్ర్యము వహించినవారు పోలూరి యాంజనేయ ప్రసాదుగారు. పద్య సర్గము నియమబద్ధము. అట్టిచో గణయతి ప్రాసాది నియమములు పాటించిన ప్రసాదుగారు ద్రుత కార్యాది సంధి విధానములకు స్వస్తి చెప్పిరి. ఖండ బిందువుల నుజ్జగించిరి. పద్యార్థ సద్యస్స్ఫూర్తికి భంగకరములని వానిని వీడి రనుకొనుచున్నాడను. తెనుఁగు బాసయం దుత్వసంధి నిత్యము. అది భాషా సంప్రదాయ సహజము. పోలూరివా రొక పదిచోట్లఁ బ్రయత్నపూర్వకముగా నుత్వ సంధిని జేయలేదు. ఇది యంత యుత్తమముగా నుండదు. తలూచి (పుటలు. 28, 35, 50) సంప దొకటే (పుట. 47) పిడికిలి పరితృప్తులు (పుట. 52) మున్నగుచోట్ల సంధులు శ్రుతి కటువులు.

కావర మెక్కినట్టి నరకాసురునిన్ (పుట. 9), మానవులెందరో పయనమై వే, చాంత రహస్య సంపద బుధ ప్రకరంబు (పుట. 33) వీనిలో నఖండయతు లున్నవి. వేదాంత శబ్దము నప్పకవి నిత్య సమాస విశ్రాంతుల కుదాహరణములుగా నిచ్చిన వానిలోఁ జేర్చిన మంచిదేమో ! విద్వాంసు లాలోచింతురుగాక ! ప్రసాదుగా రొక పదునాల్గుచోట్ల ర—ల యతి నుపయోగించిరి. కొన్ని పద్యములలో రెండు పాదములందు సైత మీ యతిని వాడిరి. అప్పకవి యగ్రాహ్య విరామముల క్రింద నీ యతిని గూర్చి చెప్పుటయేకాక నైషధ వసుచరిత్ర ప్రయోగములను దిద్దెను. కస్తూరి రంగకవి యభేద యతి క్రింద ర—ల యతిని గూర్చి చెప్పెను. అఖండ యతులకు, నభేదయతులకు లక్ష్యములు పూర్వ కవి ప్రయోగము లున్నవి. వీలున్నది గదా యని యిట్టి వళ్లను బిట్టుగా నుపయోగించుట సరసముగాదు.

"సంస్కృతి ప్రదములు బాటలందు నడవన్" (పుట. 5) "నా సకలమున్ మన మావరించినది" (పుట. 7) ఒక సమస్తమ్ము లోకమ్ము (పుట. 27)— ఇట్టి పట్టులలోఁ గారకము విచిత్రము. "అర నవ్వైనట్లు లేనట్లు" (పుట. 28) వంటి పదబంధ మర్థమును స్పష్టముగా నొసగదు. అభ్యుదయ పంథా (పుట. 1) వుడాయించు, కౌశిని (పుట 11) సవా లొనరించి (పుట. 22) మున్నగు పద ప్రయోగములు విషయ గాంభీర్యమునకు వన్నె తెచ్చునవి గావు. "మంచీ చెడ్డ చూడంగరాని" (పుట. 50) యనునట్టి దిట్టిద. "అందున" యని యీ కవిగారు సప్తమ్యర్థకములో

బహు వారములు ప్రయోగించిరి. "అందునన్" (పుటలు. 46—49) అని ద్రుత ప్రకృతికము గూడ నుపయోగించిరి. పూర్వ కావ్యములలో (రామాభ్యుదయము, విప్రనారాయణ చరిత్ర, దశావతార చరిత్ర) నిది సప్తమ్యర్థమందుఁ దచ్ఛష్ఠ్యర్థ మందుఁ బ్రయోగింపఁబడుట స్పష్టము. ఒకే పద్యములో రెండు చోట్ల నైతము దీనిని వాడిరి ప్రసాదుగారు. ఈవిధముగా నిది యనుప్రయుక్తమయిన రచనలో బిగింపుండదు. ఇందున (పుట. 20) అనియు వా రుపయోగించిరి. "నా విరచిత కావ్య" (పుట. 28) మను సమాస నిర్మాణము దోష సహితము.

దరిద్రబాధ (పుట. 13) మహదాశయమ్ము (పుట. 19) అసాధువులు. దారిద్ర్యబాధ, మహాశయమ్మని యుండవలయు. "ధాత్రిన్ ధర్మ సంరక్షకై కలమున్ బట్టితి వీ"వని కవి పోతన నుద్దేశించి పలుకును. పోతన పట్టినది కలమును గాదు. మరి గంటమును. "పగర నెత్తురు నూనె లగలించి ప్రమిదలో తేజమ్ముగల యట్టి దివ్వెపెట్టి" యని ప్రసాదుగారి రచన. "అగలించు" అను క్రియకు భేదించు, పగులుగొట్టు, ఉన్మూలించు, పెల్లగించు, పెరుకు (చూ. సూర్యారాయాంధ్ర నిఘంటువు) అను నర్థము లున్నవి. కాని యీ యర్థములా పద్యపాదమునట్లఁ జెల్లవు. ప్రకరణోచితమగు నర్థ మా క్రియకు లేదు. "అగుపడు" అనునది సాధు క్రియా స్వరూపము గాదు. ఇది ముద్రణ దోషము కావచ్చును. "అగపడు" అనునది సాధువు. "కదిపి" యను క్రియ వ్యవహార బలమున వాడిన క్రియ. అది మన యాంధ్ర నిఘంటువుల కెక్క లేదు.

పోలూరివారి వ్యక్తిత్వమే పోతనను, శ్రీరామచంద్రుని నావరించినదని చెప్పవచ్చును. "స్వప్నము" లో శ్రీరామచంద్రుఁడు, పోతన భావకవులవలె, నవీన ప్రపంచ దుస్థితిని జూచి యావేదనము పొందినవారివలెఁ గన్పింతురు. "మహిమాన్వితు" డైన పోతన స్వప్నమునుండి మేల్కొని "కోకిల గొంతులో నెలవుగొన్న మరందము చిందదేమి ?" యని భావించుట మొదలిడును. "పరదా తీసిరి నాదు జీవితము, చెప్పన్ కానివా రెవ్వరో, తెరలో నృత్యము కొంత నేర్పితివి" యని యూహించును. "లెమ్మ విశాల విశ్వమున రెక్కలు విచ్చిన దుష్టశక్తు లంతమ్మ నొనర్చి జీవిత విధానము చక్కగ దిద్ది తీర్చ" "వినబడు నల్లవే గగనవీథుల దీనుల రోదన ధ్వనుల్" "పద పద వోయి ముందుకు నవా లొనరించి ప్రతిపక్షశక్తులన్"—అని శ్రీరామచంద్రుఁడు పల్కును. పురాణ పాత్ర లిట్లు పల్కునా ? ఇట్లు పలుకుట యుచితమే యని నవీనుల విశ్వాసము. మరియొక విషయము. "పరేతరాణ్మహిషహేష" ని ప్రసాదుగారి ప్రయోగము. హేష గుర్రము సకిలింపునకుఁ బేరు. అది మహిషమునట్లఁ జెల్లదు. "కశ్యంత మధ్యమాశ్వానాన్ హేషా హ్రేషాచ నిస్వనః" అని యమర కోశము. "అశ్వహేషలు" (పుట. 42) నని ప్రసాదుగారే యుపయోగించిరి.

"పోతన" కావ్యమును జదువునపుడు పాఠకుని బరవశింపఁ జేయునవి నవయుగ ముద్రగల, మనోహరములు తరంగ ప్రాయములు నైన భావములు. కవితానై చెప్పునపుడు, కథను నడుపునపుడు భావములకే విశేష ప్రాధాన్య మున్నది. అవి యస్థాన పతితము లగుట వేరు. ఈ కావ్యము విలక్షణమయి భావకవితా ప్రధానముగా భాసించుచున్నది.

మాస్వామి; మంజరి

కర్త : కొత్త సత్యనారాయణచౌదరి. ప్రాప్తిస్థానము : కొత్త సత్యనారాయణ చౌదరి. లెక్చరర్, పి. బి. ఎన్. కాలేజి, నిడుబ్రోలు, గుంటూరుజిల్లా. వెల : మొదటి కావ్యము మేలు ప్రతి 3—00, సాదా ప్రతి : 2—8—0; ద్వితీయ గ్రంథము 2—0—0)

"మా స్వామి" యనునది యేడు వందల తేటగీతులు గల కావ్యము. "వేగరావయ్య తిరుమల వేంకటేశ" యనునది మకుటము. "కళౌ వేంకటనాయకః" అని సూక్తి. చౌదరి గారికి వేంకటేశ్వరస్వామి యెడ భక్తి ప్రపత్తులు మెండు. కానిచో వా రిట్లేల వ్రాయుదురు ?

"ఈ ప్రసంగంబులోఁ గలమెత్తి వ్రాయఁ
బూనినప్పుడ యుత్సాహబుద్ధి పొడమి
యొడలు సివమెత్తి యేమేమొ యుద్భవించు."
(ప. 192)

"నిన్నుఁ బేర్కొన్నచోఁ జాలు నాకున్న బలము
పెరిగి కలమును జెరచెరఁ బరుగులెత్తు
నిది మహాభాగ్య మనియె నే నెంతునయ్య."
(ప. 427)

ఈ కావ్యము భక్తియోగమును బ్రతిపాదించునట్టిది. అట్లని జ్ఞానకర్మయోగములను ఖండించు సిద్ధాంత గ్రంథము గాదిది. వయః పరిణామము పొందిన గ్రంథకర్త స్వానుభవమును బురస్కరించుకొని, భక్తి భావము నాలంబనముగాఁ గొని యీ కావ్యమును రచించెను. "భక్తి లేనట్టి మతమున ముక్తి లేదు" "భక్తితో మెలఁగువారి కందెదవు స్వామి ! నీలో మహత్త్వ మిదియె" యని చౌదరిగారు చెప్పిరి. కావున "మాస్వామి" సిద్ధాంత ఖండనములతోఁ గూడిన వేదాంత గ్రంథము గాక నైయుక్తిక భక్తి తత్పరతగల యాత్మాశ్రయ కావ్య మగుచున్నది.

"మాస్వామి" రచనా తత్త్వమునందు సంప్రదాయ ఫక్కి ననుసరించినది. సామాన్యముగా భక్తి ప్రబోధకులు మానవుని యాతనలు, భగవంతుని యమానుష శక్తులు, భగవల్లీలలు, సంసార శూన్యత, యరిషడ్వర్గ ప్రకోపనము, భక్తియోగ ప్రభావము మున్నగువానిని గూర్చి వర్ణింతురు. చౌదరిగారా పోకడయే పోయిరి. (గ్రంథకర్త) కాలభేదము గోచరించుచు విశేషించి చౌదరిగారి యుగలక్షణమగు హేతువాదమును విరసించిరి. చూడుఁడు.

"చెట్టునకుఁ బుట్టకును మ్రొక్కు లెట్టు చెల్లు
నంచు వాదించి సందేహ మందనేల ?
అవియు నీ రూపమేయని యన్వయింతు."
(ప. 77)

"మనసు నిశ్చలమై యొక మార్గమందు
నిలుచుటకు నీదుఁ గోవెల నెలవుగాని
నీవు లేనట్టి చోటుఁ గన్పించునయ్య." (ప. 78)

"గుడులు గోపురములు గట్టి కొంత సొమ్ము
వమ్ముచేయుట బుద్ధి లోపమ్మటంచు
హేతువాదమ్ము పల్కుట నీతిగాదు." (ప. 79)

"హేతువాదమ్ముచే నిర్ణయింపరాని
పెద్దపెద్ద సమస్యలే ప్రిదిలిపోవు
నిన్ను ధ్యానింపగా మేము నేర్చికొన్న." (ప. 609)

సరళమయిన పద్యరచనముగల కావ్య మిది. పద్య 488 నుండి పద్య 492 వరకు వేమన పోకడలు కలవు. చౌదరిగారి భావనా శక్తి కీ క్రింది పద్యము తార్కాణము.

"విషమయంబగు స్తన్యంబుఁ బీల్చి యవల
శేషఫూత్కార విషముతోఁ జెలిమిచేసి
యమృతమయుఁడవు కావుట యబ్బురంబు.'
(ప. 366)

ఇట యమృతమునకు విషమను వర్ణము చెప్పరాదు. అట్లు చెప్పుట చమత్కార భంజకము.

చౌదరిగా రొక రెండు చోట్ల "భక్తు లింటెల్లిపాది" (ప. 3) "పిల్ల జెల్లలు కలసి యింటెల్లిపాది" (ప. 173) యని యన్నారు. "ఇంటెల్లిపాది" యనునది గ్రామ్యము. "ఇంటి యెల్లపాదు" అనునదే సాధువు.

"నాదు చిత్తము భ్రమరమై నీదు పాద
పద్మములలోన వ్రాలి తపస్సు చేయు
భాగ్యమును బొందు తరుణ మెప్పటికి వచ్చు."

నని చౌదరిగా రొక రూపకాలంకారమును సృష్టించిరి. "తపస్సుచేయు" నను పద సంయోజన ముచితముగా లేదు. ఆనంద మరందము గ్రోలుట కని యనుట యుచితము. భ్రమరముపమాన మగునపుడు తత్సహజ ధర్మమగు మరందపానము గూడ వర్ణితము గావలె. భక్తులయినవారు చదివి యానందింపఁ దగిన కావ్య మిది.

"మంజరి" యనునది సంస్కృత వాఙ్మయమునందలి నీతి ప్రబోధకములయిన శ్లోకముల తెనిగింపు.

నాకు నచ్చిన సంస్కృత శ్లోకములను
మనసులో నెంచుకొని యతి మధురమయిన
కవితలోఁ జాటువులు మనోజ్ఞములు కొన్ని
వ్రాసి నా బాస కుపదగాఁ జేసికొంటి."

యని చౌదరిగారు చెప్పిరి. సరళానువాదముతో నొప్పు కావ్య మిది. విద్యార్థులు సైతము దీనిని జదివి యానందింపఁ గల్గుదురు. మచ్చున కొక పద్యము :—

కారణము లేకపోవచ్చుఁ గయ్యమునకుఁ
గాలు దువ్వుట మూర్ఖుని వాలకంబు
నష్టమునకైన మిక్కిలి యిష్టపడుచు
సజ్జనుఁడు పోరు కోరఁ డెచ్చటను గాని.

—నాగళ్ల గురుప్రసాదరావు.

ఆంధ్ర సామ్రాజ్యము

రచయిత : జంధ్యాల సుబ్రహ్మణ్యశాస్త్రి. వెల : రు. 6—25. 2—1—471, నల్లకుంట్ల, హైదరాబాద్ 20 (ఆం. ప్ర.)

ఈ గ్రంథము 2122 పద్యములు గలది. ఆంధ్ర విష్ణువు దగ్గర నుండి కాకతీయ సామ్రాజ్య పతనము వరకు గల ఆంధ్ర రాజుల చరిత్రము ఈ గ్రంథమునందు వర్ణింప బడినది. గ్రంథ రచయితయైన శ్రీ సుబ్రహ్మణ్య శాస్త్రి గారు ప్రధానముగా చారిత్రకులు కారు. కావున ప్రసిద్ధులైన చారిత్రకులు నిర్ణయించిన కాలమును బట్టియే వీరాయా రాజుల చరిత్రమును వ్రాసిరి. పురాణములయందున్న ప్రకారము ఆయా రాజుల కాలమును వీరు గ్రహింపలేదు. సరికదా పురాణములందున్న రాజుల నందరను కూడ వీరు గ్రహింప లేదు. పురాణములందున్న ప్రకారము శాతవాహన వంశీయులు ముప్పది యిద్దరు క్రీ. పూ. 833 నుండి క్రీ. పూ 327 వరకు 506 సంవత్సరములు పాలించిరి. తర్వాత ఆంధ్ర భృత్యు లనబడు గుప్త వంశము మొదటిరాజు గుప్త చంద్ర గుప్తుడు చివరి ఆంధ్రరాజులగు చంద్రశ్రీ, పులోముల సంహ రించి క్రీ. పూ. 327 లో రాజ్యమునకు వచ్చెను. అలెగ్జాండరు దండయాత్రా కాలమున పాటలీపుత్రమును పాలించినది గుప్త చంద్రగుప్తుడు కాని మౌర్య చంద్రగుప్తుడు కాదు. పాశ్చాత్య చరిత్రకారులు వారి ననుసరించి భారత చరిత్రకారులు అలె గ్జాండరు దండయాత్ర కాలమున నున్నది 'మౌర్య చంద్ర గుప్తు'డని సరిపెట్టి చరిత్రకాలము 1212 సం. లు తగ్గిం చిరి. ఈ ఆంధ్ర శాతవాహన వంశీయులు తర్వాత 12 విభా గము లైనారు. పల్లవ, చేత, సేన, కదంబ, రాష్ట్రకూట, విష్ణుకుండిన, బృహత్పలాయన, బాణ, గాంగ, హొయిసల, రాజ పుత్ర, శాలంకాయన, వాకాటక, వల్లభి, వైదుంబ, నోలంబ వంశము లన్నియు ఆంధ్ర శాతవాహన వంశమునుండి విడి వడిన బంధు వంశములు. శ్రీ సుబ్రహ్మణ్యశాస్త్రిగారి గ్రంథమునందు పురాణములలో కన్పించు ఈ వివరము లేమియు లేవు. అందుచే ఈ గ్రంథము చారిత్రకాంశములను తెలిసి కొనుట కెక్కువగా ఉపయోగించునది కాదు. కాగా కావ్య మార్గమున వ్రాసిన చరిత్ర గ్రంథ మిది. చారిత్రకమైన ప్రయోజనము దీనియందు తావన్మాత్రమే.

చారిత్రకులు గీసిన గీతలను దాటకుండ కావ్య సాధా రణమైన కథా విషయక కల్పనములు లేకుండ వ్రాయ బడిన గ్రంథ మిది. ఆ హద్దులలో మాత్రమే కవితా చమ త్కారము చూపించుటకు కవిగారు నిర్ణయించుకొని యుండ

వచ్చును. శ్రీ గడియారం వేంకట శేషశాస్త్రిగారు వ్రాసిన శివభారతమును ఈ విషయమున కవిగారు దృష్టిలో నుంచుకొన్నారేమో యన్పించును. అయితే శ్రీ శాస్త్రిగారు గడియారమువారి వలె ఫుట్‌నోట్సులో చారిత్రకుల వ్రాతల నుటంకింపలేదు. అందుచేత కొన్ని వంశముల చరిత్రములు పద్యానువాదముగా తయారైనవి. కావ్యత్వము సంతరించుకొనలేకపోయినవి. శాతవాహన వంశ చరిత్రము, పల్నాటి వీరుల చరిత్రము, కాకతీయుల చరిత్రము మొదలగునవి కొన్ని చరిత్రములిందు కపవాదము. ఇవి కావ్యత్వమును పూర్తిగా సంతరించుకొన్నవి. కవిగారు చేసిన నూత్న కల్పన మేమియు లేకపోయినను ఆయా చరిత్రలయందు స్వతస్సిద్ధముగానున్న కథా సంవిధానమే ఇందుకు కారణ మనవచ్చును.

ఇతిహాసమునకు కావ్యత్వము సంక్రమింపజేయుట మహాకవి లక్షణములలో ప్రధానమైనది. ఆపని చేయగల్గినవారిద్దరే ఇద్దరు—వాల్మీకి వ్యాసులు. ఇతిహాస మనగా నీరసమైన దినచర్య గాదు. విశేషములేని రాజుల చరిత్రలను అనవసరముగా వివరింపక రసవంతమైన చరిత్రలను మాత్రమే ప్రపంచించి వ్రాయుటవల్ల ఇతిహాసమునకు కావ్యత్వము పట్టును. భారత భాగవతములందున్న చంద్రవంశ రాజ చరిత్రములు ఇందుకు నిదర్శనము. శ్రీ శాస్త్రిగారు ఆ మార్గమును పట్టి నడచినచో గ్రంథ విస్తారము తగ్గుటయే కాక కావ్య గౌరవము పెరిగెడిది.

కాని శ్రీ శాస్త్రిగారు చారిత్రకుల అడుగుజాడల ననుసరించుటయే ప్రధానముగ పెట్టుకొని స్వేచ్ఛను సంకుచిత పరచుకొనిరి. ఐనను యున్న యవకాశములోనే మంచి పనితనము చూపించిరి. వర్ణనా విషయమునను, పద్య రచనా విషయమునను శాస్త్రిగారు అందె వేసిన చేయి.

"పండువెన్నెల నైన నిండు చీకటి సేయు
మై చాయ నలుదెసల్ మసలుకొనగ
అట్టహాసమువేళ నాకసం బంటెన,
పలుచాయ నెల మచ్చ తెలుపు సేయ."

ఇది కాణభూతి వర్ణనములోనిది. శాస్త్రిగారి వర్ణనము లన్నియు నిట్లే శ్రీనాథ మహాకవిని తలపింపచేయుచున్నవి. ఒక్క వర్ణనములే కాదు. పద్యరచనయందు కూడ నన్నయ శ్రీనాథుల అక్షర రమ్యత, మాధుర్యము వీరి కవితలో అచ్చు పోసినట్లుండును. శాస్త్రిగారు పంచ సహస్రావధాని బిరుదాంకితులు. అందుచే శతావధానము, అష్టావధానములలో కూడ వీరు చతురులని వేఱచెప్పనక్కఱ లేదు. 'పద్యము మొదలుపెట్టినచో, సమాసము మొదలుపెట్టినచో, దాని యంతట నది కడముట్ట పర్వెత్తుటయే కాని మధ్య ఆగుట యుండదు. కవిగా రాపదలుచుకొన్నను అది తుదిదాక ప్రవహించి పోవునే కాని ఆగదు. పద్యముపైన పద్యము ఏకధారగా కవిగారి కలము నుండి ప్రవహించినట్లు గ్రంథపఠన సమకాలమున మన కన్పించుచుండును. పాఠకుని మహా ప్రవాహము కాలూది నిలువనీయక లాగికొని పోవుచుండును. ఇంత ప్రావాహికముగ వ్రాసికొని పోవు రచనయందు ఇంత రచనా ప్రౌఢి, వర్ణనా ప్రౌఢి ఎట్లు కుదురుకొన్నవా యని మన కాశ్చర్యము కల్గును. ఏ అలంకారము పట్టుకొన్నను అది శ్లేష కాని, రూపకము కాని, ఉత్ప్రేక్షాతిశయోక్తులు కాని నిరాటంకముగ దాని యంతట నది కుదురుకొను చుండును.

విబుధేంద్ర సంచార విభవమ్ము త్రిదివమ్ము
విబుధేంద్ర సంచార విభవ మిద్ది
భోగీంద్ర బాంధవ స్ఫురణమ్ము త్రిదివమ్ము
భోగీంద్రబాంధవ స్ఫురణ మిద్ది.'

అలంకారము లన్నియు నిట్లే అతి స్వాభావికముగా వీరి రచనయందనగి పెనగి యుండును. పద్యము ఎత్తుకొన్న ఎత్తుగడకు తగినట్లు నిర్వహించుట యనగా వీరికి హేలాప్రాయము.

నన్నున్ గన్నమనాయ డందురు జనుల్ నానా సమీకాంగణా
సన్నారి ప్రతిశాసనక్షముడనై సత్కీర్తి నార్జింతిన్.

నన్నున్ గన్న మనాయ డందురు జనుల్—ఇక్కడకు పద్య మాగినది కదా. ఈ ఎత్తుగడకు తగినట్లుగా తర్వాత ఏమి వ్రాయవలె ననుట ఎంత చేయి తిరిగిన కవి కైనను ప్రశ్నయే. అచట నానా సమీకాంగణోత్యాది సమాసము వేయుట కెంత పిండి యుండవలయునో, ఎంత రచనా కౌశల ముండవలెనో అనుభవముచే తెలిసికొనవలసినదే. ఈ రచనాప్రౌఢికి తోడు శాస్త్రిగారి వాక్కునందు మాధుర్య మవధి భూతముగా నున్నది. ఈ గ్రంథ మంతయు మాధుర్యము, అక్షర రమ్యత కరువున బోసినట్లున్న దన్నచో నతిశయోక్తి గాదు.

స్వప్న శీతాచలము

(రచయిత: రాచమల్లు భైరవ కొండారెడ్డి. ప్రాప్తిస్థానం: విద్యోదయా పబ్లికేషన్సు, కడప. వెల : రు. 2—00.)

ఇది రెండాశ్వాసముల పద్యకావ్యము. మొదటి ఆశ్వాసము పార్వతీపదాంక మన్నది. రెండవది విస్మృత తాటంక మన్నది.

గ్రీష్మర్తువు నెల జ్యేష్ఠమో, ఆషాఢమో తెలియదు· శుద్ధ పంచమినాటి రాత్రి కవిగారు మంచముపై పండుకొని యున్నారు. ఎంత ప్రయత్నించినను 'బుర్రలోపల భావములు 'అసంస్కృత భంగిని' సాగి సంచరించుటవల్ల నిద్ర పట్టలేదు. పట్టక బాధపడుచుండగా భార్య వచ్చినది. ఆమెను కవిగారు కొంత వర్ణించుటయు, దనిపించి ఆమె అలసాని పెద్దనామాత్యుని మనుచరిత్రము కవిగారి కందించుటయు జరిగినది. కవిగారి మనస్సు మనుచరిత్రముపైకి మళ్ళి "గుబ్బమెరుంగు చన్గవ గగుర్పొడుచన్ మదిలోని కోరికల్, గుబ్బటిలంగ (వరూధిని ప్రవరుని) చూచు" వరకు సాగి ఆ చూపులో మునిగినది. తర్వాత పొత్తము రొమ్ముపై కొరిగినది. అది నిద్రయో, నిద్రవంటిదో తెలియదు. దానిలో కవిగారికి స్వప్నము వచ్చినది. కవిగారు ఒక త్రోవను బట్టి పోవుచున్నారు. ప్రచండమైన యెండ. దానిని వర్ణించుచు కవి

గారు నడుచుచుండగా సీసములో నిముడు వేసము కట్టిన యోగి కవిగారికి కన్పించుటయు, కవిగారు హిమాలయమునకు దారి అడుగుటయు, యోగి హిమాలయమును భయంకరముగా వర్ణించి చెప్పియు కవిగారు పదములపై పడుటవల్ల చేయునది లేక యొక హారము నిచ్చి అంతర్ధాన మగుటయు సంభవించినది. యోగి ఇచ్చిన హార ప్రభావమువల్ల కవిగారు హిమవత్పర్వతము చేరిరి.

అచట ఒక నెలరాలతిన్నె, దానిపైన లత్తుకతోడి పాదముల ముద్రలు, దాని ప్రక్కన ఇక్షు కుంజము కవిగారు చూచిరి. చూచి హారమును స్తుతింపగా కవిగారికి ఆ సందర్భ మంతయు పొడకట్టినది. అది పార్వతీపదాంకము కథ.

తర్వాత కవిగారికి కన్పించినది పార్వతీ పరమేశ్వరుల శృంగార క్రీడ. వారి శృంగారము నేబది పద్యములలో కవిగారు ప్రపంచించిరి. పరమేశ్వరుని తలపై .చంద్రరేఖ సోకి చంద్రకాంతశిల కరగి పార్వతి పాదముద్రలు దానియం దంటుకొన్నవి. అరుగు కరుగుటతో పార్వతీ పరమేశ్వరులు త్వరపడి దిగిపోయిరి. అరుగు మరల గడ్డకట్టు కొన్నది. వారు లేచి పోయిన తర్వాత మన్మథు డేమి చేయును పాపము. చెరకు విల్లును విరిచి పారవేసి పోయినాడు. అది భూమిలో నాటుకొని పెద్ద పొదగా పెరిగినది. కవిగారు ఆ శిలకు వలగొని మ్రొక్కి నిలువెత్తుపాటి చెరకుగడను విరచి నమలుకొనుచు బోయిరి.

ఇది పార్వతీ పదాంకము. మొదటి ఆశ్వాసములోని కథ రెండవ ఆశ్వాసము కథ కూడ ఇట్టిదే.

కొన్ని దృశ్యములు వర్ణించుకొనుచు కవిగారు స్వప్న విహారము చేయుచుండగా ఒక పెద్ద సరస్సు, దాని కద్దరి పర్వతశిఖరమున నుండి దానిలోనికి దూకు ఒక నది, ఆ పడెడు నీటి చాయల పారుచున్న హంసశ్రేణి, ఆ అంచలయందు వింత కాంతులు ప్రతిఫలించుట, అంచలు పోయిన తర్వాత చూడగా ఆ పడుచున్న నీటిలో రథచక్రమంత మేర బహువర్ణ కిర్మీరిత కాంతి చక్రము కవిగారు చూచి హారమును దానిని గూర్చి ప్రశ్నించిరి. వెంటనే కవిగారికా కథా సందర్భ మంతయు దృష్టి గోచరమైనది.

తారకాసురుడు స్వర్గముపైకి దండెత్తుట—దేవాసురుల యుద్ధము, తారకున కోడి ఇంద్రుడు పారిపోవుట మొదలైన సందర్భములు తొంబది పద్యములలో సాగినవి. ఇంద్రుడు శచీదేవిని తీసికొని రాయంచల వేసముతో హిమాలయమునకు వచ్చి ఆ గిరి కందరము చొచ్చెను. ఆ కందరమందు కొన్ని బొమ్మ లున్నవి. అవి యన్నియు వారికి పరిచర్యలు చేసినవి.

తర్వాత శచీ శుక్రుల శృంగారము. ఒక మధ్యాహ్నమున ఆ బిలంబొరసి క్రింద పడుచున్న నిర్ఝరమునందు స్నానమాడుటకు రమ్మని శచీదేవిని ఇంద్రుడు పిలిచెను. ఆమె స్నానమాడినప్పుడు తన రత్న కుండలములు పోవునేమో యను భీతితో ఒక చెవి కుండలము తీసి బొమ్మ చెవిని పెట్టునంతలో మరల తారకుడు హిమవత్పర్వతముపైకి దాడి వచ్చుటయు, మాగధుడు చేసిన తారక ప్రస్తుతి విని శచీశక్రులు భయపడి రాజహంసలై పారిపోవుటయు జరిగినది. ఆ గుహాముఖమునకు పైగా నిర్ఝరధారలు పడుటవల్ల నీటి తెర వెన్క బొమ్మ తాల్చిన రత్న కుండల కాంతి రథచక్రమంత మేర కిర్మీరితమై కవిగారికి కన్పించినది.

ఇది విస్మృత తాటంకము కథ.

ఈ గ్రంథమందలి ఇతివృత్త మిది. చంద్రకాంతపు తిన్నెమీద పార్వతి పాద ముద్రలు, దర్శించుట—నీటి జాలున కాంతి చక్రము చూచుట సొగసైన కల్పనలు. ఆ కల్పనలకు కవిగారు సంపాదించిన పూర్వ రంగ కల్పన మంత సుందరముగా లేదు.

పార్వతీపదాంక మనగనే మన హృదయములు భక్తి వినతము లగును. కవిగారికి నట్లే హృదయము వినతమైనది. కాని దాని వెనుక వర్ణించిన పార్వతీ పరమేశ్వరుల శృంగారమునకీ భక్తిభావము పరిపోషకముగా లేదు. అందువల్ల ఇది కల్పనాగతమైన పెద్ద దోషము. ఆ పాదముద్రలకు అమ్మవారి దయను వ్యాకరించు కథ ఏదైన జోడింపబడ్డచో ఇంత సొగసైన పదాంక కల్పనకు తళుకు వచ్చెడిది.

అట్లే నీటిజాలుపైన శబలితప్రభాచక్రము రమణీయమైన కల్పన. శృంగార రసమునకు సముచితమైనది. కాని దీనికి వెనుకనున్న పూర్వ రంగము కూడ అనుచితముగా నున్నది. తారకాసురుని భీతివల్ల పరచి వచ్చుట నాయికానాయకుల రీతికి అపకర్షాధాయకము గాని పోషకము కాదు.

కావ్యమందు రసము కథ నాశ్రయించి యుండును. కథాసంవిధానము రసానుకూలముగా లేనిచో అది ఆ కావ్యమునందు పెద్ద దోషమే యని చెప్పవలయును. దీనిని వదలి పద్య రచనను చూచినచో ఈ కవి మంచి శక్తి కలవాడనిపించి తీరును. ఎత్తుగడలు, సమాస గ్రథనము, తెలుగు పలుకుబడులు, వూహా సంపద ఈ కావ్యమునందు సమృద్ధిగా నున్నవి. కవి భాషా పాండితి, భావనాశక్తి కలవాడని చెప్పుటకు గ్రంథమునందు సాక్ష్యము సమృద్ధిగా నున్నది. ఆకసమున పారుచున్న రాయంచ మిథునము

"శివజటా జాహ్నవీ శిథిల డిండీర ఖం
డములాడి గాలిలో నడచినట్లు'న్నవట.

హిమాలయము—

"శేషాహి విప్పిన పడగలట్లొప్పు మిగిలె" నట.

ఈ కవి వూహాశక్తికివి మచ్చుతునకలు.

ఈ కవికి శ్రీనాథుడు, పెద్దన, రామరాజ భూషణుడు నన్నచో మిక్కిలి మక్కువ. వారి యనుకరణములు గ్రంథమునందు సమృద్ధిగా నున్నవి. ఐనను ఈ కవి శైలియందు ప్రత్యేక వ్యక్తిత్వము కలదు.

పద్య రచనకు కావలసిన ప్రశస్త గుణము లన్నియు ఈ కవియం దున్నవి. ఐనను ఈయన రచన పాకాన పడలేదు. ఆ లోపము మాత్రము గ్రంథమునందు స్పష్టముగా కన్పించుచున్నది.

గ్రంథవిమర్శనము

రాయలసీమకు చెందిన ముగ్గురు ప్రసిద్ధ కవులు తమ అభిప్రాయముల నొసంగుట ఈ గ్రంథమునందున్న మరియొక విశేషము.

శ్రీ గడియారము వేంకటశేష శాస్త్రిగారు ఈ కవి తెలుగు ప్రబంధములందలి శృంగారరస ఘుటికలను ఒకటి రెండు చుట్లెక్కువ త్రిప్పి నా డనిపించుననియు, ఈనాటి కావ్య రసికుల కిది మోదావహము కాకపోదనియు చెప్పగా శ్రీ రాళ్లపల్లి అనంతకృష్ణశర్మగారీ కావ్యమందలి పార్వతీ పరమేశ్వరుల శృంగారము, శచీశక్రుల శృంగారము సామాన్య మోహపు టంచులు దాటలేదని భావించుచున్నారు. శ్రీ పుట్టపర్తి నారాయణాచార్యులవారు 'సామాన్య పాఠకుల కీయన గ్రంథమందు శృంగారము కొంచె మెక్కువ మోతాదులో నున్నట్లగపడును. దానిని నే నొక దోషముగా చెప్పలేను. మన కృత్రిమ నాగరకత మన రసానుభూతి నంతయు చంపివేసిన,' దన్నారు. పార్వతీ పరమేశ్వరుల శృంగారమును వర్ణించినందుకు కవి విమర్శనీయుడు కావచ్చును. ఈ విషయమున ఆలంకారికులు కాళిదాసును దుయ్యబట్టిరి. శచీశక్రుల శృంగారము కవి వర్ణించుట ఉచితమే యని చెప్పవచ్చును.

పెద్దన్నగారు శృంగారము ననుచితముగా విస్తరించినారని శ్రీ అనంతకృష్ణశర్మగా రొక అభిప్రాయమును వెలిబుచ్చిరి. శ్రీ కొండారెడ్డిగారి కాదర్శముగా నుండుటకు పెద్దన్నగారు చాలరనిరి. పెద్దన్నగారి ననుకరించిన తారాశశాంకు లవతరింతు రనిరి.

వీరి యీ అభిప్రాయములను సహృదయలోక మెంతవరకొప్పుకొనునో చెప్పజాలము. ప్రతి నాయకాలంబకమైన రతియందు వ్యభిచారి భావ సంపుటి యొనర్చి తిక్కనగారు చేసిన శృంగార విస్తర ముదాత్తతాపాదకమై, సామాన్య నాయికాగతమైన రతియందు వ్యభిచారి భావసంపుటిచేసి పెద్దన్నగారు చేసిన విస్తర మనుచితమై, అనుదాత్తతాపాదక మగుట చిత్రమే. శ్రీ శర్మగారు కవిగారి ప్రయోగములందు కొన్ని తప్పులు చూపించిరి. అవిగాక ఒకటి రెండు నా దృష్టికి కూడ కన్పించినవి. 'షడ్జమ' మొదలైనవి.

కాని ఇట్టివి చాలా చెదరుగా నున్నవి. ఈ కవి వ్యుత్పత్తికివి వ్యపకర్షకములు కావు. ఐనను ఇట్టివి లేకుండ చూచుకొనవలసినదే. "ఈయనకు చక్కని వ్యుత్పత్తి యున్నది. భావ ప్రౌఢిమ యున్నది. శబలత యున్నది. రచనలో మరికొంత నైగనిగ్యము సంపాదించుకొన్నచో గడచిపోయిన ప్రబంధ యుగమును మరల మన కనుల యెదుట సాక్షాత్కరింప చేయగలడు." అని శ్రీ పుట్టపర్తి నారాయణాచార్యులవా రనుచున్నారు. ఈ నైగనిగ్యముతోబాటు ప్రబంధకవుల కథా రచనా శిల్పమును కూడ ఈ కవి సంపాదించుకొనవలసి యున్నది. ఏమైనను ఈ గ్రంథము సహృదయులు చదివి యానందింపదగ్గది.

— ధూళిపాళ శ్రీరామమూర్తి.

కవిసార్వభౌముడు

(రచన : కవిసమ్రాట్ నోరి నరసింహశాస్త్రి. ప్రతులకు : నోరివారు, రేపల్లె, గుంటూరుజిల్లా. మూల్యము : ఐదు రూపాయలు.)

ఆంధ్రుల చరిత్రలో కొందరు ప్రముఖ వ్యక్తుల గాథలను చక్కని నవలలుగా రచించిన కవిసమ్రాట్ శ్రీ నోరి నరసింహశాస్త్రిగారు కవిత్వ వైభవమునందును, జీవిత వైభవమునందును ఆంధ్రమహాకవులలో ఒక ప్రత్యేకత గలవాడై ఆంధ్రసాహిత్య చరిత్రలో తన పేరిట ఒక యుగానికి నాయకుడైన శ్రీనాథుని గూర్చి ఈ నవల రచించారు. అయితే ఇది ఆ కవి సార్వభౌముని జీవిత చరిత్ర కాదు. శ్రీనాథుని జీవిత చరిత్ర వ్రాయడమంటే పదిహేనవ శతాబ్ది ఆంధ్రదేశ చరిత్ర వ్రాయడమని కీ. శే. చిలుకూరి వీరభద్రరావుగా రొక సందర్భమున అన్నారు. శ్రీనాథునిగూర్చి తెలియవచ్చినంత అధికముగా మనకు ఇతర కవులను గూర్చి తెలియదు. ఈ నవల శ్రీనాథుడు కొండవీటినుండి విజయ యాత్రకై విద్యానగరము జయలుదేరడంతో ఆరంభమై, రాయల విద్యాధికారియైన డిండిముని జయించి ఆతని కంచుఢక్క పగులకొట్టించి, శతావధానము చేసి ముత్యాల శాలలో కనకాభిషేకము పొంది, కవిసార్వభౌమ బిరుదమును స్వీకరించి, రాచకొండ నుండి కొండవీటి ప్రభువుల కులదేవతను తెచ్చి, రాజాశ్రయం లభింపక పోగా శ్రీనాథుడు కాంచీ నగరము చేరుకోవడంతో ముగుస్తుంది. కథాకల్పనలో శాస్త్రిగారు అనుకూలంగా కొన్ని మార్పులు చేసుకున్నారు. కొండవీటిరెడ్డి రాజ్యము అస్తమించిన పిమ్మట శ్రీనాథుడు రాజాస్థానాలను దర్శిస్తూ విద్యానగరమున కేగినట్లు కొన్ని సాహిత్య చరిత్రలు తెలుపగా, నోరివారు కొండవీడును పెదకోమటి వేమారెడ్డి పాలిస్తూవున్న సమయానే శ్రీనాథుడు విద్యానగరమునకు విజయయాత్ర చేసినట్లూ, ఆతడు తిరిగి వచ్చుసరికి పెదకోమటి వేమారెడ్డి వీరమరణం పొంది, రెడ్డిరాజ్యం క్షీణదశలో నున్నట్లూ వ్రాశారు. పోతనను శ్రీనాథునికి బావమరిదిగానే పేర్కొన్నారు కాని చిన్న కుర్రవాడిగా చూపెట్టారు. శ్రీనాథుడు పాకనాటి నియోగ బ్రాహ్మణుడని కొన్ని చరిత్రలలో ఉండగా ఆతని రచనలే అతడు భోగ పరాయణుడనీ, రసికావతంసుడనీ నిరూపిస్తూవుండగా శాస్త్రిగారు అతనిని ఈ నవలలో శుద్ధ శ్రోత్రియుడుగా, నిష్ఠాపరుడుగా, సాంప్రదాయకుడుగా, చతుష్షష్టి కళలలో ప్రవేశం కలవాడుగా చిత్రించి, అందుకు తోడు పలుచోట్ల 'వైదిక వైభవము' అన్న మాటను ఆప్యాయంగా ప్రయోగించడంచేత శ్రీనాథుని కవితా వైభవము కంటె ఆతని శ్రోత్రియత్వమే హెచ్చుగా వ్యక్తమైంది. పైగా నవల చివర పోతన, దుగ్గన, నారణప్పల సంభాషణలద్వారా శ్రీ నాథునికి భాషాపాండిత్యము, శాస్త్రపాండిత్యము వున్నాయి గాని, వారివలె వీరివలె వ్రాయగలడు కాని, తనది అని చెప్పుకొనేట్టు రచనచేయలేని వాడన్నట్లు ధ్వనింపజేశారు. అందుకు

బదులు కవిగా అతనికిగల వ్యక్తిత్వ మెట్టిదో, అతని పేరిట ఆంధ్ర సాహిత్య చరిత్రలో వ్యవహరింపబడుతూవున్న యుగానికి కర్త ఎలా అయినాడో, అతని గుణవిశేషములేమిటో విశదపరచి వుంటే Monograph వలెవున్న ఈ నవలకు మరింత సార్థకత చేకూరివుండేది.

శ్రీనాథుని జీవితఘట్టాలు అతని చాటుపద్యములవల్ల మనకు విదితమవుతాయి. శాస్త్రిగారు ఈ గాథలో అచ్చటచ్చట తగు సన్నివేశాలను కల్పించి ఆ సందర్భాలలో శ్రీనాథుడు ఆ పద్యాలను చమత్కారంగా చెప్పినట్లు వాటిని యథాతథంగా ఉదహరించి ఆసక్తి కలిగించేవిధంగా రచనచేశారు. అంతేగాక ఆ కాలపు రాజకీయ సంప్రదాయాలను, సాంఘికాచారాలను, సాంస్కృతిక విశేషాలను ఉచితరీతిని పేర్కొంటూ, ఒక్కొక్క దృశ్యంలో పాత్రల వైఖరులను, చర్యలను, వారుపాటించిన విధులను మర్యాదలను వ్రాసిన వైనాన్ని గమనిస్తే ఔచిత్యమును దృష్టియం దుంచుకొని కడుజాగరూకతతో రచన చేసినట్లు అవగతమవుతుంది. రెడ్డి వెలమరాజుల రాజకీయ స్పర్థలనేగాక సాంస్కృతిక స్పర్థలనుకూడా తడివారు. నవల భాష గ్రాంథికము, కాని సంభాషణలను శిష్టవ్యావహారికములో వ్రాశారు.

ఆంధ్ర సచిత్ర వారపత్రికలో సీరియల్‌గా మొదట ప్రచురితమైన ఈ నవల ఒకమహాకవి జీవితంలో ముఖ్య ఘట్టానికి సంబంధించినదై యుండుటయేగాక ఆంధ్రుల చరిత్రలో దాదాపు ఆయిదున్నర శతాబ్దాల క్రిందటి మూడురాజ్యాల గాథను, అప్పటి ఉదంతాలను స్పృశించి ఉండుటచే ఆంధ్ర చారిత్రక నవలల్లో పేర్కొనదగివుంది.

నదీనదాలు

(రచయిత : బి. నాదమునిరాజు. ప్రచురణ : విద్యోదయా పబ్లికేషన్స్, కడప. వెల : రూ. 3.)

ప్రేమికుల జంటలు రెండింటి ప్రణయగాథలు ఇతివృత్తంగా గల నవల ఇది. కుమార్ సౌదామినిని ప్రేమించుతాడు. ఆమె అంగీకరించదు. సూర్యం అహల్య ఒకరినొకరు గాఢంగా ప్రేమించుకుంటారు. కాని వారివివాహంకాదు. అహల్యవివాహం కుమార్‌తో అవుతుందిగాని మొదటిరాత్రి గడచిన ఉదయమే వారిద్దరూ మరణిస్తారు. చివరకు సూర్యం వివాహం సౌదామినితో అవుతుంది. నవలలో రచయిత చేసిన కథాకల్పన సంభావ్యంగానూ లేదు, కమనీయంగానూలేదు. కాకపోతే వాస్తవిక జీవితాన్ని ఎదుర్కొనవలసి వచ్చేసరికి నేటి యువతీయువకులు పొందే వైఫల్యాలనూ, అసంతృప్తినీ వేదనా భరితంగా వెలిబుచ్చడం జరిగింది. అంతకుమించిన లోతులకు రచయిత పోలేదు.

సాధారణంగా నేటి మననవలా రచయితలలో రచనరీత్యా, శిల్పంరీత్యా కానవచ్చేలోపాలు ఈ నవలలో వున్నాయి. ఉదాహరణకు ఇందులో ప్రేమించుకున్న జంట వీథిలో కలుసుకొన్న ఘట్టంలో ఆ పరిసరాలలో వారిని పట్టించుకునేవా రెవరూ లేరని చెప్పదలచుకున్న రచయిత అనవసరంగా, అప్రస్తుతంగా. అనౌచిత్యం ప్రదర్శించినట్లుగా ఆ దారినిపొయ్యే బురదకొట్టుకున్న పందులను ప్రస్తావిస్తాడు ! అలాగే మరొకచోట సూర్యం అహల్య మొట్టమొదటిసారి ఒకరినొకరు చూచుకొని ఘాఢమైన ప్రేమలోపడ్డ శుభక్షణాన రచయిత ఆమె అందాన్ని వర్ణిస్తూ మొదట "దానిమ్మ గింజల్లాంటి పలువరుస" అని ఎత్తుకుంటాడు. కళ్ళుయినాకాదు మొదట కన్పించేది ! పళ్ళ వరుసట ! ! రచయిత మరొకసారి తన వ్రాత ప్రతిని సరిచూచుకొని ఈ నవలను ప్రచురించివుంటే బాగుండేది.

శతపత్రము

(రచన : సన్నిధానము సూర్యనారాయణశాస్త్రి. వెల : 75 నయాపైసలు. ప్రాప్తిస్థానము : గ్రంథకర్త, 44, జీరా, సికింద్రాబాదు.)

ఇది రవీంద్రుని 'గీతాంజలి'కి అనుకరణ రూపమనీ, గీతాంజలియందు భావాస్పష్టత కలదనీ, దాని అనువాదాలను పఠించి తాము ఆనందింపలేక పోతిమనీ, భావం స్ఫుటంగా గోచరింపకున్నా మొత్తముమీద గీతాంజలి నామరూప శూన్యుడైన పరమేశ్వరుని గురించి భక్తితో పాడిన పాటలని గ్రహించి ఆట్లేతాము వ్రాయనుత్సహించితిమనీ గ్రంథకర్త చెప్పుకున్నారు. ఈ కావ్యము గీతాంజలిలోని ప్రతిఖండికకూ వరుసవారీగా యథాతథ అనుకరణముకాదు. ఆ ధోరణిలో భక్తిభావములను వెలిబుచ్చవలెనని చేసిన ప్రయత్నము. అక్కడక్కడా రవీంద్రుని భావాలు ఛాయామాత్రంగా గోచరిస్తాయి. మచ్చుకు ఒకపద్యం :

గీ. నీ మహామందిర ద్వారభూమి కడకు
వచ్చి గొంతెత్తి పిలిచితి బలుతడవలు
'ఓ' యనెడుమాట వినబడకుండె, భటులు
ఉంటె వందురు, నాస్తి ప్రత్యుత్తరంబు.

కవి హృదయ తటాకము నుండి ఉద్భవించిన ఈ శతపత్త్రము మనోజ్ఞమైన భక్తికవితల సంపుటి.

రామిరెడ్డి

(రచన : కుంటిమద్ది శేష శర్మ. వెల : రెండు రూపాయలు. దొరుకుచోటు : కె. సదానంద, మెడికల్ హాలు, ధర్మవరం, అనంతపురంజిల్లా.)

గ్రామాధికారి బంధువు ఒకడు ఆ గ్రామానికి కొత్తగా కాపురానికి వచ్చిన సెట్టి కోడలిపై చేసిన దురాగతం, అందు కాతడు అనుభవించిన శిక్ష ఇతివృత్తంగా గల పద్యకావ్య మిది. దుష్టుడైన కథానాయకుని పేరే కావ్యానికి పెట్టబడింది. గ్రామాలలో అక్కడక్కడా కన్పించే ఆదర్శాలను చూచి కవి పొందిన ఆవేదన భావావేగంతో ఈ చిన్న కావ్యంగా రూపొందింది. కవి ముఖ్య కథతోపాటు నేటి గ్రామాల తీరు తెన్నులను, గ్రామీణుల మనః ప్రవృత్తులను వ్యంగ్యంగా చిత్రించారు. కావ్యం చదివితే ఒక వూరును చూచి దాని విశేషాలు తెలుసుకొని వచ్చినట్లనిపిస్తుంది.

— డి. రా.

భారతీనీరాజనము

(విమర్శ వ్యాససంపుటము)

(కర్త : విద్వాన్ బులుసు వేంకటేశ్వరులు. ఎం. ఏ. ప్రకాశకులు : బి. వి. అండ్‌సన్సు, రామారావుపేట, కాకినాడ. క్రౌనుసైజున 156 పుటలు. మూల్యము : మూడురూపాయలు)

ఇందు మొత్తము పదునాల్గు వ్యాసములున్నవి. బద్దెన నీతిశాస్త్ర ముక్తావళి— రేకపల్లి సోమనాథకవి రుక్మవతీ పరిణయము— అడిదము సూరకవి కవిజనరంజనము— చింతలపూడి ఎల్లన (?) విష్ణుమాయా నాటకము— ప్రౌఢకవి మల్లన రుక్మాంగద చరిత్రము—ఈ యైదును కావ్య పరిశీలనమను శీర్షిక గలవి. బద్దెన కాలమును గూర్చి గాని, నీతిశాస్త్ర ముక్తావళి— సంస్కృత నీతిసారముల సంబంధమును గూర్చి గాని, నన్నయగంధవారణ యను బద్దెనకు గల బిరుదు ఆంతర్యమును గూర్చి గాని, విష్ణుమాయా నాటక కర్తృత్వ విషయమును గూర్చి గాని నూతనాంశములేవి చెప్పబడినవో అని చూడబోయినచో ఆయా వ్యాసము లాశాభంగమునే కలిగించుచున్నవి. ఇక విమర్శన మంతయు 'అద్భుతము', 'అనుపమానము', 'అత్యుత్తమము' ఇత్యాది విశేషణములతో పద్యము లుదాహరింప బడుటగా—'స్వాభావిక వర్ణనలకు సోమకవి పెట్టినది పేరు', 'సంక్షేపశక్తిం బ్రదర్శించుటలో నీతని కితడే సాటి'. 'ఈ విషయ మింత మనోహరముగా దెలుపుట ఎల్లనకు దక్క నొరుల కెట్లు సాధ్యమగును ?', 'ఎల్లన కవిత.... అ సదృశము, అద్భుతము, వర్ణనాతీతము' ఇత్యాది వాక్యములతో సాగినది. ఈ కోవలోనిదే పిసుపాటి చిదంబరశాస్త్రి కృతము పద్మపురాణమును గూర్చిన వ్యాసము కూడ.

విమర్శ వివేకమను శీర్షిక క్రింద నున్న మూడు వ్యాసములును కట్టమంచి రామలింగారెడ్డిగారు రంగనాథ రామాయణ పీఠికలో రామాయణ కథను గూర్చి శంకించిన అంశములకు సమాధానములుగా, రెడ్డిగారి అప్పకవి నిందకు సమాధానముగా, రెడ్డిగారి 'నవయామిని' ఖండనముగా నున్నవి. సంప్రదాయా నభిముఖులైన రెడ్డిగారి నూతనాభిప్రాయములు సోపపత్తికముగా, సముచితముగా త్రోసివేయబడిన వ్యాసములా మూడును.

భావ సమాలోచన మను శీర్షికను గల అయిదు వ్యాసములలో 'ఆముక్త మాల్యద'ను గూర్చినది నిశిత పరిశీలనముతో గూడినది. 1—15, 2—40, 3—23, 4—141, —183 పద్యముల యర్థము విచారింపబడి పాఠభేదములు, శబ్ద స్వరూపములు సమంజసములైనవి చూపబడినవి. ఆ సామంజస్య మింకను విచారింప దగినది. 'వసు చరిత్రను' గూర్చిన వ్యాసమున రెండు మూడు పద్యముల యర్థము విచారించి వ్రాయబడి, అనుకరణముల విషయమునను ప్రకృతి వర్ణనముల విషయమునను రామరాజభూషణుని శక్తిని నిరూపించు ప్రయత్నము జరిగినది. 'తేట తెనుగు—జాను తెనుగు' అను వ్యాసము చిలుకూరి నారాయణరావుగారి పండితారాధ్య చరిత్ర ఉపోద్ఘాతము 115 వ పుటలోని పదునొకండు పంక్తుల యర్థము వివరింపబడియైనది. ఇక మిగిలిన 'సౌందర్య స్వరూపము', 'విమర్శ' అను రెండును సామాన్యము లైనవి.

—క్షేమేంద్ర.

అల్పజీవులు

(నవల: రచన: వా. స. మూర్తి. తెలుగు వెలుగు ప్రచురణ. ⅛ క్రౌనుసైజున 346 పుటలు. వెల: అయిదు రూపాయలు. పుస్తకములు దొరకుచోటు: తెలుగు వెలుగు పబ్లికేషన్స్, వారణాసివారిఇల్లు, కూచిమంచి అగ్రహారం, అమలాపురం, తూర్పు గోదావరిజిల్లా).

'బ్రతుకలేక బడిపంతులు' అన్నట్లు ఇంకే ఉద్యోగమూ దొరక్క బడిపంతులుగా బ్రతుకు ప్రారంభించిన ఒక పేద కుటుంబీకుని జీవితము ఈ నవలకు ఇతివృత్తం. రాచకొండ విశ్వనాథశాస్త్రిగారు స్వగత రూపంగా ఇంప్రెషనిష్టుపద్ధతిలో రచించిన "అల్పజీవి"కి ఇది బహు వచన ప్రయోగమైనా కాని—దానిలోను దీనిలోను బడిపంతులు కథా నాయకుడుగా ఉండి, తీరని కోరికలతోను, కోరని తీరికలతోనూ మిగిలిపోతా డనేది తప్ప, దానికీ దీనికీ ఏమంత సామ్యంలేదు; పోలికలేదు. రచయిత "ముందు మాట"లో "ఇది డాక్యుమెంటరీ (వార్తాచిత్రపు) టెక్నిక్‌తో సాగిన రచన. అంటే ఒక నిమ్న మధ్యమ వర్గ కుటుంబ జీవితం యథాతథంగా చిత్రించడానికి ఇందులో ప్రయత్నం జరిగింది. సహజంగా ఇందులో ప్రత్యేకంగా కథకోసంగాని, పాత్ర చిత్రణకుగానీ, ఒక సమస్యా సిద్ధాంతం ప్రతిపాదించడానికిగానీ కృషి జరగలేదు. ఇది ఒక మాదిరిగా తెలుగు నవలా రచనలో క్రొత్త ప్రయోగమే", అంటారు.

డాక్యుమెంటరీ టెక్నిక్ విషయంలోకాని తెలుగు నవలా రచనలో క్రొత్త ప్రయోగం మాటకాని అటుంచి, ఈ నవల మొదలు పెట్టితే 346 పుటలూ చదివించి తీరుతుంది. నిమ్న మధ్యవర్గ కుటుంబానికి(లోయర్ మిడిల్ క్లాస్ అని అభిప్రాయం కాబోలు) చెందిన బడిపంతులు సంసారాన్ని వర్ణించినప్పటికీ, దీనిలో కథా, ఇతివృత్తం, సంఘటనలూ లేకపోలేదు. చాలీ చాలని రాబడితో స్కూలు మాష్టరుగా పనిచేసే కథా నాయకుడు శ్రీహరి నిండు సంసారంతో ఎలాగ గడుపుకొని వచ్చిందీ ఆతని జీవిత నాటకాన్ని రచయిత చక్కగానే ప్రదర్శించారు. అందులో నవ రసాలూ ఉన్నాయి. కరుణరసప్రధానమైన విషాద ఘటనలతోపాటు, కొంత నవ్వు పుట్టించే హాస్య సన్నివేశాలు కూడ వచ్చి పచ్చిపులుసులో పచ్చ మిరపకాయలులాగ చవులూరిస్తూ ఉంటాయి. ఈ నాటకం జరిగిన స్థలం—ధనవంతుడైన రామలింగంగారి మేడకు చెందిన వెనుకవైపు వాటాలో అద్దెకొంప. కాలం—ఒకటి రెండు సంవత్సరాలు. పాత్రలు—శ్రీహరి, ఆతని భార్య వరలక్ష్మి, తల్లి సూరమ్మ, తమ్ముడు రాధాకృష్ణ—ముద్దుకి 'రాధ', పిల్లలు—వేంకటరమణ, సూర్యావతి, బాబు. సమయాను

కూలంగా ప్రక్కవాటాలలో అద్దెకున్న బిల్లు కలెక్టర్, ప్లీడరు గుమాస్తా, స్కూలులో పనిచేసే ఇతర మేష్టర్లూ, హెడ్ మేష్టరూ, తారాశశాంకంలో తలంటు స్నాన ఘట్టం చదివి విని పించే తెలుగు మేష్టారు ఆచార్యులుగారూ, కమ్యూనిస్టులను వెనుక వేసుకునివచ్చి, ప్రభుత్వాన్ని విమర్శిస్తూ స్టేఫ్ రూమ్ లో వాదించే సుబ్బారావు, లాటరీ టిక్కెట్లు అమ్మే నరసింహా రావు—మొదలయిన మేష్టర్లూ, ఇతరులూ—తరుచు వస్తారు.

శ్రీహరి ఈ తక్కువ జీతంతోను ప్రయివేటు ట్యూషన్ల తోను తట్టుకోలేక, బి. యే. ప్యాసయి యమ్. ఏ. ప్యాసయి ఏవేవో చెయ్యాలనుకొంటాడు, ఏమీ చెయ్యలేడు. తమ్ముడ్ని కాలేజీలో బి. కామ్. చదివిస్తున్నాడు. పిల్లలకి రోగాలువస్తే డాక్ట ర్లకి పోస్తున్నాడు. చెల్లెలు కోపగించి ఇంటికివస్తే చీరెలు పెట్టి పంపిస్తున్నాడు. ఇంతచేసి తల్లినిమాత్రం దక్షిణాది యాత్రకి పంపించలేకపోయాడు. తల్లి బెంగపెట్టుకొని మంచం పట్టుంది. ఆమెను ఓదార్చి తోడి పంతులు సుబ్బారావు సర్దుతాడు. ఇలాగే వాళ్ల సంసార నౌకలో ఏ ఒడి దుడుకులు వచ్చినా ఈ సుబ్బారావు చుక్కాని పట్టుకుని ఒడ్డున చేరు స్తాడు.

ఇంతకీ వాళ్ల యింటి కుల దీపమనుకొన్న "రాధాకృష్ణ" ముందు తనతో చదువుకొంటున్న భాగ్యవంతుల పిల్ల "వాసంతి"నీ తర్వాత మరొక కులంవాళ్ల పిల్ల "లక్ష్మి"నీ తర్వాత పెళ్లిలో కలుసుకొని ఉప్మా విందు చేసిన "రాధ" నీ ప్రేమించి, వాళ్లె వరినీ అందుకోలేక—గంతకు తగిన బొంత తనకు సరిపోయిన "ఇందిర"ను పెళ్ళి చేసికొని, ఆమెతో ఫరవాలేదని తృప్తిపడ తాడు. బి. కామ్. ప్యాసయిన ఈ ఇంగ్లీషు తమ్ముడు భీమా కంపెనీలో నెలకో నూట యాభై రూపాయల జీతం ఉద్యో గంలో కుదురుకొంటాడు.

ఇందిర కాపురానికి వచ్చి కుటుంబం వాళ్లకు కాఫీ నేర్పించి, కిరసనాయిల్ స్టౌతో వంట ప్రవేశపెట్టి, రిబ్బన్లు కొన్న బేరంలో జగడాలు వేసి విందు సంసారం రెండు చేస్తుంది. అద్దె యిల్లు మారి తమ్మునితోఉన్న శ్రీ హరి, సంసారం ముక్కలు కాగానే కాపురం మార్చి తిరిగి రామలింగంగారి వెనుక తోటలోకి వస్తాడు. కథ కంచికీ, కాపురం ఇంటికీ వెళ్తాయి. రామలింగంగారి ఇంటి వర్ణనతో ప్రారంభమైన కథ అదే ఇంటి వెనుక భాగంలోచేరి, బయలు దేరినచోటికే వస్తుంది.

ఈ రచయిత కథచెప్పే పద్ధతిలోను, పాత్రచిత్రణం లోను, సంభాషణలు నిర్వహించడంలోను నేటి మధ్య తరగతి కుటుంబాలలోని వాస్తవికత యధాతథంగా చిత్రించారు. "కథకోసంకాని, పాత్ర చిత్రణకుకాని ఒక సమస్య, ఒక సిద్ధాంతం ప్రతిపాదించడానికి కృషి జరగలేదు" అని రచయిత చెప్పిన ప్రకారం, అలాంటి కృషిలేని కారణం చేతనే ఒక వాస్తవిక గాథ, ఒక పేద సంసారి కుటుంబ తాపత్రయం, ఒక నిస్వార్థ జీవిత నిత్య జీవిత సంఘర్షణ కన్నులకు కట్టినట్లు ఈ నవల సాక్షాత్క రింప చేసింది.

—శ్రీ వాత్సవ

గ్రంథ పరిచయము

1. త్యాగరాజు : అభినవ జయదేవ కీ. శే. కవిసామ్రాట్ చల్లా పిచ్చయశాస్త్రి రచితము. 20 పుటలు అభి ప్రాయములు. మరి 30 పుటలలో త్యాగయ్య జీవి తము సులభ పద్య రూపమున గలదు. ప్రచురణ— రాజ్యశ్రీ కల్చరల్ బుక్ రైటర్స్ పబ్లికేషన్స్, పొన్నూరు. వెల : రూ. 1—50 న. పై.
2. భిన్నధృవాలు : మురళీధర్—వచన పద్యాల నవ్యకావ్యం. పుటలు 45. ప్రతి పుటలో 'గొంతు' వినిపించును. ప్రాప్తిస్థానము—ఎ. మురళీధర్ 3—4—424, శివనిలయము, నారాయణగూడ, హైదరాబాదు–29, వెల : 1—50 న. పై.
3. ఆత్మరక్ష. తుది విజయం మనది నిజం —"కాళోజీ" ప్రస్తుత చీనా యుద్ధమును గూర్చిన గేయము. 32 పుటలు. కాళోజీ నారాయణరావు, పోస్టు హన్మ కొండ, వరంగల్. ప్రతులకు 8 న. పై. పోస్టే జికి పంపవలెను.
4. అద్దంలో నీడలు—మాదిరాజు రంగారావు. 12 నవ్య కవితా శీర్షికలు. పుటలు 33. రసధుని ప్రచురణ, హైదరాబాదు. వెల : ఒక రూపాయి.
5. ఆదిరాజువారి జీవిత చరిత్ర—పుల్లాభొట్ల వెంక టేశ్వర్లు, ఎం. ఏ. తెలంగాణాలో ప్రసిద్ధ భాషా, చారి త్రక, సాహితీ సేవకులు. శ్రీ ఆదిరాజు వీరభద్రరావు గారి జీవిత చరిత్ర. వచనము. 98 పుటలు. ప్రతు లకు: పుల్లాభొట్ల వెంకటేశ్వర్లు, ఎం. ఏ., బి. ఇడి., ఖమ్మం—మూల్యము : 1—75 న. పై.
6. కాలం గీస్తున్న గీతలు. అరపిరాల విశ్వం. నవ్య కవితా గీతులు. పుటలు 32. ప్రతులు: అరిపిరాల విశ్వం, 3—4—424, శివనిలయము, నారాయణగూడ— హైదరాబాదు—29. వెల : ఒక రూపాయి.
7. శబ్దోత్పత్తి శతకము:—కోగంటి దుర్గా మల్లికార్జున రావు. నూరుకంద పద్యములలో శబ్దార్థములు వివ రింపబడినవి. కోగంటి దుర్గా మల్లికార్జునరావు, పామర్రు. వెల: 0—50. న. పై.
8. రంజని—ఇనుకపల్లి దక్షిణామూర్తి. ఇందులో గేయము, కవిత, స్కెచ్, గల్పిక, వ్యాసము మొదలైన 24 శీర్షికలున్నవి. పుటలు 61. రిపబ్లిక్ దినోత్సవ సంచిక. వెల తెలియదు. **Ramjani Ag. office— Hyderabad**లో లభించును. (రంజని, ఏ.జి.ఆఫీసు, హైదరాబాదు).
9. సౌందర్య పత్రిక, ఫిబ్రవరి 1963 సంచిక. స్త్రీలకు, పిల్లలకు సంబంధించినది. పుటలు 66. ప్రతులకు మహంతి—సంపాదకుడు, అత్తిపట్టన్ వీధి, మద రాసు—2.

భారత్ - పాకిస్తాన్ సంబంధాలు

'పరిశీలక్'

భారత ఉత్తర సరిహద్దులలో 1963 ఫిబ్రవరి—మార్చినెలలలో సంభవించిన పరిణామాలలో పాకిస్తాన్—చైనాలమధ్య జరిగిన సరిహద్దుల ఒడంబడిక ప్రధానమైనది. సైనిక చర్యల ద్వారా కమ్యూనిస్టుచైనా కొనసాగించిన దురాక్రమణకంటె, కుటిల రాజనీతిద్వారా పాకిస్తాన్ చేసుకున్న ఈ ఒప్పందం భారతదేశాన్ని మానసికంగా గాయపరచింది. ఈ ఒప్పందం రాజ్యాంగరీత్యా పాకిస్తాన్‌కు చెందిన భూభాగాలను గురించి జరగలేదు. రాజ్యాంగరీత్యా భారతదేశానికి చెందిన జమ్మూ—కాశ్మీర్‌లో పాకిస్తాన్ దురాక్రమణ చేసిన భాగాలను గురించి జరిగింది. ఐక్యరాజ్యసమితిముందు వివాదాంశంగావున్న ప్రాంతాన్ని గురించి, ఐక్యరాజ్యసమితిద్వారా యుద్ధ విరమణశ్రేణి ఏర్పడి, దాని పరిశీలకులు ఉంటున్న ప్రాంతాలను గురించి జరిగింది. సమాలోచనల ద్వారా జమ్మూ—కాశ్మీర్ వివాద పరిష్కారానికి భారత—పాకిస్తాన్‌లమధ్య బ్రిటన్, అమెరికాల ప్రోత్సాహంతో చర్చలు ఇంకా కొనసాగుతూవున్న సమయంలో జరిగింది. కనుకనే ఈ ఒడంబడికవల్ల పాకిస్తాన్ నిజాయితీని, స్నేహభావాన్ని భారతదేశం ఇంకా శంకించేందుకు అవకాశమిచ్చింది.

పెకింగ్‌లో సంతకాలు జరిగిన ఈ ఒడంబడికలో ఏడు సూత్రాలు ఉన్నాయి. నదీ ప్రవాహ మార్గాలనుబట్టి, ప్రకృతి సహజమైన గుర్తులనుబట్టి, సాంప్రదాయ పూర్వకమైన రేఖలనుబట్టి, సరిహద్దులను విభజించుకోవాలని చైనా—పాకిస్తాన్‌లు అంగీకారానికి వచ్చినట్టు మొదటి సూత్రంలోవుంది. దీని ప్రకారం ఈ సరిహద్దురేఖ వివరాలు రెండవ సూత్రంలో ఉదాహరించారు. దాని ప్రకారం చైనాకు చెందిన సింకియాంగ్ రాష్ట్రం, ఆఫ్గనిస్తాన్, జమ్మూ—కాశ్మీర్‌లు కలుసుకునే చోటునుంచి ఈ రేఖ తూర్పుగా నదీ ప్రవాహ మార్గానవచ్చి, కిలికీ కనుమ, మన్‌పక కనుమ, కర్‌చనాయ్ కనుమ, కుటిజిల్గా కనుమ, పార్‌పిక్ కనుమలగుండా ఖుంజిరాడ్ కనుమను చేరుతుంది. అక్కడనుంచి కొస్త దక్షిణంగా బయులుదేరి నదీ ప్రవాహ మార్గాన్ని అధిగమించి, వోవరంగ్ లోయనుంచి షీమ్‌షల్ కనుమకు తూర్పు దిశగా దర్వాజ్ ప్రాంతాన్ని చైనా వైపు ఉంచుతూ, కిందుగావచ్చి కారకోరం పర్వత శ్రేణులలోని నదీ ప్రవాహ మార్గాన్ని అందుకుంటుంది. ఇలా రావడంలో తూర్పుముస్తాగ్ కనుమనుంచి, బష్రీడం కొండ శిఖరం, తిరంకంగ్రీ కొండ శిఖరంనుంచి కారకోరం కనుమ ఈశాన్య కొనకు చేరుతుంది. ఇలా వచ్చే సరిహద్దు రేఖను సర్వే చేసి, గుర్తులు నిర్ణయించడానికి, వివరంగా సరిహద్దు భాగాలు స్థిరపరచి, అధికారపత్రాలు సిద్ధపరచడానికి ఒక సరిహద్దుల కమిషన్ సంయుక్తంగా ఏర్పడాలని నాల్గవ సూత్రం నిర్దేశిస్తున్నది. ఇలా సర్వే చేసి, గుర్తులు నిర్ణయించడంలో వచ్చే వివాదాలు స్నేహపూరితమైన సంప్రతింపుల ద్వారా పరిష్కరించుకోవాలని అయిదవ సూత్రం కోరుతూవుంది. ఇప్పటి సరిహద్దు ఒడంబడిక తాత్కాలికమైనదని, కాశ్మీర్ వివాదం పరిష్కారమై, దాని రాజ్యాధికారం ఎవ్వరి దనేది నిర్ణయమైన తర్వాత, ఆ అధికారి ఈ సరిహద్దు విభాగాన్ని గురించి కమ్యూనిస్టు చైనా ప్రభుత్వంతో తిరిగి సమాలోచనలు కొనసాగించాలని ఆరవసూత్రం ఆదేశిస్తున్నది. ఒకవేళ పాకిస్తాన్‌కు అలాంటి రాజ్యాధికారం ఈ భాగంమీద సంక్రమిస్తే, ఇప్పుడు జరిగిన ఒడంబడికకు అధికార పూర్వకమైన తుది రూపమిస్తారు. సంతకాలు జరిగిన తేదీనుంచి ఈ ఒడంబడిక అమలులోకి రాగలదని, దీనికి వేరుగా ధృవీకరణ పత్రాలు అవసరం లేదని ఏడవ సూత్రం స్పష్టపరుస్తున్నది.

అసలు ఈ ఒడంబడిక ఎందుకు జరగవలసి వచ్చిందనే అంశాన్ని గురించి ఈ సందర్భంలో కొంత పూర్వ గాథను తెలుసుకోవలసి వుంది. అసలు పాకిస్తాన్‌కు కమ్యూనిస్టు చైనాతో సరాసరి సరిహద్దు అనేదిలేదు. కాగా, జమ్మూ—కాశ్మీర్ భాగాలను పాకిస్తాన్ ఆక్రమించినందున, ఆ భూభాగంలో సుమారు 300 మైళ్ళ పొడవున పాకిస్తాన్—చైనాలమధ్య సరిహద్దు అనేది ఏర్పడింది. అందువల్లనే ఇది వివాదాస్పదమైన భూభాగమని, దీని రాజ్యాధికారం ఎవ్వరిదనేది ఇంకా నిర్ణయం కావలసివుందని, ప్రస్తుతానికి ఈ భాగం పాకిస్తాన్ రక్షణక్రింద ఉన్నందువల్ల ఈ ఒడంబడిక తాత్కాలికమైనదని ఉదహరించడం జరిగింది. ఇక్కడఉన్న 300 మైళ్ల పొడవు సరిహద్దు రేఖను గురించి చైనా కోరినదానికి, పాకిస్తాన్ సూచించిన దానికి మధ్య 3,400 చదరపు మైళ్ళ వ్యత్యాసంవుంది. ఇప్పుడు జరిగిన ఒడంబడిక ప్రకారం, ఇందులో 2050 చదరపు మైళ్ళు చైనాకు చెందగా, 1350 చదరపు మైళ్ళు పాకిస్తాన్‌కు వచ్చింది. ఇందులో గమనార్హమైన విశేషం ఒకటివుంది. లడక్‌లోని అక్సాయ్ ప్రాంతాన్ని ఆక్రమించినప్పుడే, పాకిస్తాన్‌వైపునవున్న హుంజా, గిల్గిత్ సమీపాలలో తనకు రావాలనుకున్న ప్రాంతాన్ని కూడా కమ్యూనిస్టుచైనా ఆక్రమించింది. అలా ఆక్రమించిన దానిలో 700 చదరపు మైళ్లనుమాత్రం ఈ ఒడంబడిక ప్రకారం పాకిస్తాన్‌కు వదలివేయడమే ఆ విశేషం.

మరొక విశేషం. హిమాలయ రాజ్యాలు (నేపాల్, భూటాన్, సిక్కిం, టిబెట్) జమ్మూ—కాశ్మీర్‌లలో కమ్యూనిస్టు చైనా ఇప్పటికి సుమారు 20 వేల చదరపు మైళ్ళను (టిబెట్‌కాక)

స్వాహా చేయడం. ఇందులో 12,000 చదరపు మైళ్లను భారతదేశంతో స్నేహం నటిస్తూ, 1962 సెప్టెంబరు 8 కి పూర్వం ఆక్రమించింది. ఆ తేదీ తర్వాత సైనిక చర్యల ద్వారా మరి 2,500 చదరపు మైళ్ళు స్వాహా చేసింది. నేపాల్‌తో, బర్మాతో, పాకిస్తాన్‌లతో సరిహద్దు ఒప్పందాల ద్వారా మిగిలిన భాగాలను దత్తం చేసుకొని చొచ్చుకు వచ్చింది. గత మూడు సంవత్సరాలుగా హిమాలయ సరిహద్దులలో సంభవించిన పరిణామాల సారాంశం ఇది.

ఇలా ఆసియా ఖండానికి కమ్యూనిస్టు చైనావల్ల ముప్పు కలదని అమెరికా, బ్రిటన్‌లు ఆదినుంచి చెబుతున్నాయి. భారత్—పాకిస్తాన్‌ల సమైక్యత ద్వారా ఈ ముప్పును తప్పించవచ్చునని ఆరంభదశనుంచి అవి నమ్ముతున్నాయి. కాని, కాశ్మీర్ వివాదమనేది ఈ సమైక్యత కుదరకుండా చేసింది. ఐక్యరాజ్య సమితిద్వారా ఈ వివాద పరిష్కారానికి జరిగిన ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి. కాని, యుద్ధ విరమణ శ్రేణి అనేది స్థిరపడిపోయింది. భారతదేశానికి ప్రధమ శత్రువు పాకిస్తాన్ అనే ధోరణిలో వ్యవహారాలు నడిచాయి. భారత సైనిక బలాన్ని కూడా పాకిస్తాన్ సరిహద్దులలోనే హెచ్చుగా మోహరించి ఉంచడం జరిగింది. ఇలా పాకిస్తాన్‌తో పెరిగిన శత్రు భావ వాతావరణంలో కమ్యూనిస్టు చైనా చేసిన నమ్మక ద్రోహం, సైనిక విజృంభణ ఫలితంగా హిమాలయ సరిహద్దుల్లో అటు పాకిస్తాన్‌ను, ఇటుకమ్యూనిస్టు చైనాను భారతదేశం ఎదుర్కోవలసి వచ్చింది. అంతేకాదు. పాకిస్తాన్— చైనాలమధ్య స్నేహ సంబంధాలుకూడా పెరుగుతూ వచ్చాయి. కాశ్మీర్ వివాదం కారణంగా భారత్—పాకిస్తాన్‌లమధ్యవున్న విభేదాలను ఆధారంగా తీసుకొని కమ్యూనిస్టుచైనా రాజకీయవ్యూహంతో, పాకిస్తాన్‌ను ఒక పాచికగా నియోగించుకున్నది, భారతదేశాన్ని ఏకాకిని చేసింది. ఈ పరిస్థితులలో అమెరికా, బ్రిటన్‌లు ముందుకువచ్చి పాకిస్తాన్— భారతదేశాలమధ్య సామరస్య సాధనకు కృషిచేశాయి. ఇరువురిమధ్య వివాదాస్పదంగావున్న కాశ్మీర్ సమస్యపై చర్చలు కొనసాగేటట్టు చేసి పాకిస్తాన్ సరిహద్దులలో అప్పటికి మోహరించివున్న భారత సైన్యాలు చైనా సరిహద్దులకు తరలించే అవకాశాన్ని కలిగించాయి. ఆ విధంగా నీఫారంగంలోను, లడక్‌లోను భారత సైనిక పాటవం పెరిగింది. ఆ తర్వాత కమ్యూనిస్టు చైనావల్ల ఆసియా ఖండం మొత్తానికి ముప్పుకలదనే గుర్తింపు పాకిస్తాన్‌కు కలిగించాలన్న ప్రయత్నంచేశాయి. కాని కమ్యూనిస్టు చైనాతో జరిగిన సరిహద్దు ఒడంబడిక ఫలితంగా ఆ ప్రయత్నం ఫలించలేదనే చెప్పుకోవచ్చు. అమెరికా, బ్రిటన్‌ల సలహాలను చిరకాల స్నేహాన్ని, సైనిక సహాయాన్ని కాదని పాకిస్తాన్ కమ్యూనిస్టు చైనాతో స్నేహంకట్టింది. దానిఫలితంగా పాశ్చాత్య రాజ్యాలకు— పాకిస్తాన్‌కు మధ్యవున్న సంబంధాలు ఏ విధంగా పరిణామంచెందగలవో ఇక చూడవలసివుంది.

పోతే భారత్— పాకిస్తాన్‌ల మధ్య సామరస్య సాధనకు అమెరికా, బ్రిటన్‌లు ఆరంభించిన కృషి ఇంకా ఒకకొనకు రాలేదు. చైనా— పాకిస్తాన్‌ల మధ్య జరిగిన ఒడంబడిక ఫలితంగా పాకిస్తాన్‌తో చర్చలు విరమించాలన్న సూచనలు భారతదేశంలోని కొన్ని రాజకీయ వర్గాలనుంచి వినవచ్చినా, అనుకున్న ప్రకారం చర్చలు కొనసాగగలవని ప్రధాని నెహ్రూ ప్రకటించడంతో ఇందుకు సంబంధించిన అనుమానాలు తొలగిపోయాయి. కాని కాశ్మీర్ వివాదాన్ని భారత—పాకిస్తాన్‌లు ఏ విధంగా పరిష్కరించుకొని సామరస్యాని సాధించగలవనేదే పరిశీలనాంశంగా వుంది.

అమెరికా, బ్రిటన్‌ల ప్రోద్బలంతో భారత — పాకిస్తాన్ ప్రభుత్వాల ప్రతినిధులు రావల్పిండిలోను, ఢిల్లీలోను, కరాచీలోను సమావేశమై కొనసాగించిన చర్చలకు మాత్రం ఇదే ప్రాతిపదికగా వుంది. ప్రథమంగా రావల్పిండిలో సమావేశమైనప్పుడు కాశ్మీర్‌ను గురించి ఇన్ని సంవత్సరాలుగా ఎవరుచేస్తున్నవాదనలను వారు పునశ్చరణ చేశారు. జనవాక్యం (ప్లెబిసైట్) ద్వారా జమ్ము—కాశ్మీర్ భవితవ్యం నిర్ణయించాలని పాకిస్తాన్ కోరింది. దానికి గట్టిగా భారతదేశం వ్యతిరేకించింది. కాశ్మీర్‌లో జనవాక్యానికి అంగీకరిస్తే, హిందూ ముస్లిం అనే మత సూత్రాల ప్రకారం కాశ్మీర్ విభజనకు సమ్మతిస్తే భారతదేశంలో హిందూ ముస్లిం వర్గాలమధ్య కుదురుకున్న సామరస్యానికి భంగం కలుగుతుందని, భవిష్యత్తులో అల్పసంఖ్యాక వర్గాల సమస్య అనేది తీవ్రమౌతుందని వాదించింది. ఇలా వాదోపవాదాలు సాగుతూ ఉండగానే, ఆక్రమిత కాశ్మీర్‌కు (అజాద్ కాశ్మీర్‌కు) చైనాకు మధ్యగల సరిహద్దుల నిర్ణయానికి సంబంధించిన సూత్రాలమీద ఒప్పందం కుదిరినట్టు పాకిస్తాన్—చైనాలు ప్రకటించాయి. ఇందుకు భారతదేశం తన నిరసన తెలియ జేసింది. ఇలా అయితే పాకిస్తాన్‌తో ఇక చర్చలు అనవసరమనే నినాదం భారతదేశంలో బయలుదేరింది. కాని, తిరిగి బ్రిటన్, అమెరికాల జోక్యంతో చర్చలు కొనసాగించే నిర్ణయం జరిగింది. ఆ ప్రకారం ఢిల్లీలో పాకిస్తాన్ భారత ప్రతినిధులు, సమావేశమై కాశ్మీర్ వివాదాన్ని గురించి "రాజకీయమైన ఒప్పందానికి" రావాలనే నిశ్చయానికి వచ్చారు. ఇందుకుగాను ఉభయ పక్షాలు కొన్ని సూత్రాలను సిద్ధపరచుకొని, సమాలోచనలద్వారా పరస్పరామోదం పొందిన ఆ సూత్రాలను ఆచరణలో పెట్టాలనే నిర్ణయానికి వచ్చారు. ఆ ప్రకారం పాకిస్తాన్ (1) జనాభానుబట్టి (2) నదులమీద కంట్రోలును బట్టి (3) రక్షణావసరాలనుబట్టి (4) ప్రజామోదాన్నిబట్టి కాశ్మీర్ అంతర్జాతీయ హద్దులను నిర్ణయించాలని కోరింది. దీనికి ప్రత్యామ్నాయంగా భారతదేశం (1) భౌగోళిక స్వభావం (2) పరిపాలనా సౌలభ్యం (3) ప్రజలకు కనీసమైన చిక్కులు అనే సూత్రాల ప్రకారం నిర్ణయం కావాలని కోరింది. ఈ సూత్రాలలో కూడా ప్లెబిసైట్ అనే పదాన్ని వాడాలని పాకిస్తాన్ ప్రయత్నించింది. కాని, భారతదేశం గట్టిగా దానిని ప్రతిఘటించడంతో దానిని ఉపసంహరించుకున్నది. కాని "ప్రజామోదం పొందాలి" అనే సూత్రాన్ని చేర్చింది. ప్రజాభిప్రాయం తెలుసుకొనడానికి సర్వత్రా అంగీకారయోగ్యమైన ఏదో ఒక పద్ధతిలో అనే అర్థంలో ఈ మాటను ప్రయోగించింది.

భారత్ - పాకిస్తాన్ సంబంధాలు


ఇలా ఢిల్లీ చర్చలలో నిర్ణయించుకున్న ఈ సూత్రాల ఫలితం ఆచరణలో ఎలా ఉండేదీ కరాచీ చర్చలలో పరిశీలించారు. పాకిస్తాన్ సూత్రాల ప్రకారం చిత్రపటాన్నిగీస్తే జమ్ము—కాశ్మీర్‌లోని కటువాజిల్లా, జమ్ము ఆగ్నేయ కోనమవున్న ఉద్దాన్‌పూర్ జిల్లాలోని సగ భాగం మినహా మిగిలిన భాగాలన్నీ పాకిస్తాన్‌కు చెందగలవని తేలింది. రాజకీయ పరిష్కార మనేది జరగాలనుకున్నప్పుడు, తన వాటాను గురించి సాధ్యమైనంత ఎక్కువగా ఎందుకు కోరకూడదనేది పాకిస్తాన్ భావంగా కానవచ్చింది. ఇక భారతదేశంమాత్రం కాశ్మీర్‌లో యుద్ధ విరమణశ్రేణిని స్వల్పంగా సర్దుబాటుచేసి, దానిని శాశ్వత సరిహద్దుగా అంగీకరించడానికి సంసిద్ధత తెలియజేసింది. ఈ ప్రకారం అయితే సరిహద్దురేఖకు నైసర్గిక సరిహద్దులకు మాత్రమేకాక, భాషా విషయకంగాను, యుద్ధ విరమణశ్రేణివల్ల విభజించబడిన పూంచీ వాసుల సమైక్యతకు అనువుగా ఉంటుంది. అంటే పూంచీ ముజఫర్‌బాద్ జిల్లాలలోని హెచ్చు భాగాలను బారాములా జిల్లాలో ప్రస్తుతం భారత ఆధిపత్యం క్రిందవున్న కిషన్‌గంగ, దక్షిణతీర ప్రాంతం ఆదనంగా పాకిస్తాన్‌కు అప్పగించవలసి ఉంటుంది. ఇది పాకిస్తాన్‌కు సంతృప్తి కలిగించలేదు. భారతదేశం తనకు ఇచ్చేభాగం ఇంతే అయితే ఇంకా సమాలోచనలు అనవసరమనే ధోరణిని పాకిస్తాన్ వ్యక్తం చేసింది. కాని, చివరకు మార్చి 12 వ తేదీన కలకత్తాలో సమావేశమై, సమాలోచనలు కొనసాగించడానికి అంగీకరించింది. భవిష్యత్తులో భారత్—పాకిస్తాన్ సంబంధాలు ఎలా రూపొందగలవనేది కలకత్తా సమాలోచనలమీద ఆధారపడి ఉండగలవని పరిశీలకులు భావిస్తున్నారు.

కాని, అజాద్ కాశ్మీర్—చైనా సరిహద్దులను గురించి పాకిస్తాన్—చైనాలమధ్య కుదిరిన ఒడంబడికపై మార్చి 3 వ తేదీన సంతకాలు కూడా జరగడంతో పాకిస్తాన్ నిజతత్వం బయట పడింది. కమ్యూనిస్టు చైనా ప్రమాదాన్ని గురించి భారత దేశానికి, పశ్చిమ రాజ్యాలకుగల అభిప్రాయం, పాకిస్తాన్‌కు లేదని ధృవపడిపోయింది. అందువల్లనే పాకిస్తాన్ చేసిన ఈ పని "అకాలంలో" జరిగిందన్న ఆందోళనను అమెరికా, బ్రిటన్‌లు, పాకిస్తాన్‌కు తెలియజేశాయి. ఇది "అమిత్ర చర్య" అని భారతదేశం తన తీవ్ర నిరసన పత్రాన్ని పాకిస్తాన్‌కు అందజేసింది. చైనాతోపాటు పాకిస్తాన్ కూడా భారతదేశాన్ని అది చిక్కులలోవున్న సమయం చూచుకొని పరోక్షంగా దెబ్బతీసి, జమ్ము—కాశ్మీర్‌లో తన మాట నెగ్గించుకొన చూస్తున్నదనే ఆరోపణలు బయలుదేరాయి. అయినప్పటికీ పాకిస్తాన్‌తో స్నేహ సాధన, వివాద పరిష్కారం తన లక్ష్యమని ప్రధాని శ్రీ నెహ్రూ స్పష్టంగా ప్రకటించారు. కనుక కాశ్మీర్ వివాద పరిష్కార ప్రయత్నంలో భారత వైఖరిలోకాని, దాని లక్ష్యంలో కాని ఎలాంటి మార్పు లేదన్నమాట. ఆక్రమిత కాశ్మీర్ (అజాద్ కాశ్మీర్‌తో)పాటు మరికొన్ని భాగాలను పాకిస్తాన్‌కు కైవశం చేయడానికి భారతదేశం అంగీకరిస్తున్న దన్నమాట. ఈ విషయంలో రాజకీయంగా భారతదేశానికి తీవ్రమైన చిక్కులులేవు.

కాని, పాకిస్తాన్‌లో పరిస్థితి అదికాదు. ఇస్లాంమతం, ముస్లింలు అధిక సంఖ్యాకులు నివసించే ప్రాంతాలు అనే సూత్రం మీద పాకిస్తాన్ అవతరణ జరిగింది. దీనికే మరొకమాట ప్లెబిసైట్ అంటే జనవాక్యం. అందుకే ముస్లింలు అధిక సంఖ్యలో వున్న జమ్ము—కాశ్మీర్‌లో ప్లెబిసైట్ ద్వారా వివాద పరిష్కారం జరగాలని పాకిస్తాన్ కోరుతున్నది. దానిని కాదని భారతదేశం సూచిస్తున్న రాజకీయ పరిష్కారానికి సమ్మతించడమంటే పాకిస్తాన్‌లో రాజకీయ జీవితమే కష్టం. అందువల్ల భారత వ్యతిరేకత అనేది పాకిస్తాన్ రాజకీయ జీవనాడిగావుంది. పాకిస్తాన్ అధ్యక్షుడు శ్రీఆయూబ్‌ఖాన్ సైనిక నియంత అయినప్పటికి, దీనిని కాదని వ్యవహరించగల స్థితిలోలేడు. అయితే అమెరికా టెల్విజన్ గోష్ఠిలో ఆయ నొక కొత్త సూచన చేశాడు. దాని ప్రకారం కాశ్మీర్ లోయకు సంబంధించిన వివాదాన్ని ప్రస్తుతానికి మినహాయించి, మిగిలిన జమ్ము—కాశ్మీర్ భాగాలను గురించి ఇప్పుడే ఒప్పందం కుదుర్చుకొనడం మంచిదనేది ఆ సూచన సారాంశంగా ఉంది. పాకిస్తాన్‌కు ఏదో విధంగా కాశ్మీర్ లోయ కావాలి. దానినుంచి వచ్చే జీలం, చీనాబ్ నదీ జలాల వినియోగం అనేది పూర్తిగా పాకిస్తాన్ ఆధిపత్యం క్రింద ఉండాలి. అంటే కేవలం ముస్లిం మెజారిటీ అనే దృష్టితో కాక, భవిష్యత్తులో పాకిస్తాన్ ఆర్థికాభివృద్ధికి అవసరాలు అనే అభిప్రాయంతో అధ్యక్షుడు అయూబ్‌ఖాన్ వ్యవహరిస్తున్నాడు. ఇది పాకిస్తాన్‌లో వచ్చిన గమనీయమైన మార్పు. బహుశా ఈ దృష్టితోనే చైనాతో చేసుకున్న సరిహద్దు ఒప్పందం ద్వారా కారకోరం శ్రేణులవద్ద చిక్కులు లేకుండా చేసుకున్నాడు: దానితో ఆసియా ఖండం సంగతి ఎలాఉన్నా చైనావల్ల పాకిస్తాన్‌కు ప్రమాదం లేదన్న వాతావరణం సృష్టించాడు. ఇప్పుడు భారత్‌తో కొనసాగించే చర్చలలో ముస్లిం మెజారిటీ వర్గాల రక్షణ, పాకిస్తాన్ ఆర్థికాభివృద్ధి కృషి అనేవి రెండూ లక్ష్యంగా ఉంచుకున్నాడు. ఇవి రెండూ పాకిస్తాన్‌కు తక్షణావసరాలు. ఇందులో ఒకటి రాజకీయం. రెండవది ఆర్థికం. కనుకనే భారత్‌తో సమాలోచనలు కొనసాగించడం ఆయనకుకూడా రాజకీయంగా అవసరమౌతున్నది.


మొత్తంమీద చెప్పుకోవాలంటే, భారతదేశం ఇప్పటికి పొందిన అనుభవాలనుబట్టి, కొన్ని కొత్త రాజకీయ నిర్ణయాలకువచ్చి, దేశ భద్రతకు అనువైన రాజకీయ విధానాలను దూరదృష్టితో అనుసరించడం అవసరమని తేలిపోయింది. ఉత్తర సరిహద్దుల్లో భద్రత లేకుండా పోయింది. కమ్యూనిస్టు చైనా స్నేహ సుహృద్భావ సాధనకు ప్రయతిస్తూ, టిబెట్ దురాక్రమణను సహించినందునే, సరిహద్దులకు దురాక్రమణ ప్రమాదం సంభవించింది. అంతేకాదు. చివరకు ఉత్తర సరిహద్దుల్లోవున్న నేపాల్, బర్మాలకు భారతదేశంమీద సానుభూతి లేకుండా పోయింది. ఇలాంటి రాజకీయ విపత్కర పరిస్థితి భారతదేశానికి ఈనాడు ఎందువల్ల ఏర్పడిందని ప్రశ్నించుకొని, పరిశీలించుకొంటే భారత ప్రభుత్వ రాజకీయ విధానాలలో కొంతవరకైనా లోపం కలదని అంగీకరించవలసి ఉంటుంది.

మా వ్యాసకర్తలు



శ్రీ ఆదివిష్ణువు

1940 సెప్టెంబరులో కృష్ణా జిల్లా బందరులో జన్మించారు. తండ్రి శ్రీ లింగయ్యగారు. తల్లి శ్రీమతి లక్ష్మీ నరసమ్మగారు. బందరు హిందూ కళాశాలలో 1960 లో బి. కాం. లో ఉత్తీర్ణులయ్యారు. రెండు మూడుచోట్ల తాత్కాలిక ఉద్యోగాలుచేసి, చివరకు స్టేట్ ఆర్. టీ. సి. లో ఆడిట్ అసిస్టెంటుగా స్థిరపడ్డారు. ఉద్యోగరీత్యా ప్రస్తుత నివాసం విజయవాడ. నాటకాలంటె అభిమానం హెచ్చు. విద్యార్థిగా ఉన్నప్పుడే కళాశాలలో ఉత్తమ నటుడుగా ఎన్నికైనారు. అదే నాటక రంగంతో వారికి గల పరిచయం. మనసుకు నచ్చిన మిత్రులతో కులాసాగా గడపాలనే అభిలాష హెచ్చు.



శ్రీ ఆర్. ఎస్. సుదర్శనం

జన్మస్థానం చిత్తూరు జిల్లా, మదనపల్లి. జననం 13—12—1927. మదనపల్లి దివ్యజ్ఞాన కళాశాల, మద్రాసు క్రైస్తవ కళాశాలలో చదివి, మద్రాసు విశ్వవిద్యాలయంనుంచి 1947 లో ఆంగ్లంలో పట్టభద్రులయ్యారు. అనంతపురం ప్రభుత్వ కళాశాలలో ఆంగ్ల శాఖలో ప్రధానోపన్యాసకులుగా 12 సంవత్సరాలు పని చేసి, 1961 నుంచి నల్గొండ కళాశాలలో అదే పదవి నిర్వహిస్తూ ఉన్నారు. "సుదర్శన" అన్న పేరుతో అనుబంధాలు, మళ్లీవసంతం, అసురసంధ్య అను నవలలు, పద్యాలు, భారతిలో కథలూ, వ్యాసాలు రచించారు. ఇప్పుడు ఆంగ్లంలో D. H. Lawrence and Blake అన్న విమర్శ గ్రంథ రచనలో ఉన్నారు. వీరికి ఆంధ్రాంగ్ల సాహిత్యాలు తత్వశాస్త్రం మీద అభిలాష మెండు.

Printed & Published For Nageswara Rao Estates (Private) Ltd., by S. Radhakrishna, at The Andhra Patrika Press, 6 & 7, Thambu Chetty Street, Madras—1. Editor: S. Sambhu Prasad.